స్వాతంత్ర్య స్థాపన కొరకు శక్తివంతమైన పోరాటము అవసరమైనది. బ్రిటీషు ప్రభుత్వం నెదిరించి స్వాతంత్ర్యం సాధించాలంటే సమిష్టి శాసనోల్లంఘనమే శరణ్యము. జలియన్ వాలాబాగ్ దురంతాలకు ప్రతిక్రియగా 1920 సం। ఏప్రిల్ 6వ తేదీన దేశమంతటా ఉప్పుసత్యాగ్రహము ప్రారంభించుటకు గాంధీగారి ఆదేశమైనది. కృష్ణాజిల్లా వారు బందరు, చిన్నాపురం, తాళ్ళపాలెంలో ప్రత్యేక శిబిరములు ఏర్పాటుచేసి, జట్లు జట్లుగా శాసనోల్లంఘ నమునకు పంపబడిరి. నిర్ణీత స్థలమునకు వెళ్ళకముందే ప్రభుత్వం అరెస్టు చేసినది. ఊరూర పట్టణముల, సత్యాగ్రహులు గేయాలు పాడుచు జండాలతో ఊరే గింపులు, సభలు జరిపిరి. ఆ సమయములో శ్రీశర్మగారు

1. "వింటివా! బ్రిటీషు వీరుల ధైర్యము - తంటాలు పడి
పట్టిరంట - బాపూజీని! అర్ధరాత్రి - ఒంటి గంటకు
- - - - - - - - - - - - - - - - - -
- - - - - - - - - - - - - - - - - - అనే గేయం
॥వింటివా॥

2. పడలేమి సైతాను బాధ
- - - - - - - - - - - - - - - - - - ॥పడలేమీ॥

3. ఉప్పుచేద్దాము పదండి
ప్రాణమర్పించియైన, స్వరాజ్యమిచ్చునట్టి ఉప్పు
॥నడుములు॥

వంటి గేయాలు వ్రాసి పాడుతూ ప్రజల నుత్తేజితు లనుజేసిరి. సంద్రపు నీళ్ళు తెచ్చి కాచి వండినందుకు బ్రిటీషు ప్రభుత్వం తొమ్మిది నెలలు జైలు శిక్ష విధించినది. బందరు సబ్‌జైలులో పెట్టిరి. 1930 ఏప్రిల్ ఆరవ తేదీన ఉప్పు సత్యాగ్రహ కారణముగానే తోట నరసయ్య నాయుడుగారిని కూడా శర్మగారున్న జైలునకు తీసికొని వచ్చిరి. కాంగ్రెస్ సత్యాగ్రహ శిబిరమునకు తమ భవనము నిచ్చినందులకు ఆరుమాసాలు కఠినశిక్ష విధించి పురాణం సూరి శాస్త్రిగారిని కూడ శర్మగారున్న గదిలోనే పెట్టినారు. ఆ రాత్రి జైల్లో మండు వేసవికాలం. దుమ్ము, ధూళి పురుగుపుట్ర ఏమున్నదో భగవంతునికే తెలియాలి. కటికరాత్రి గడిచి తెల్లవారినది. పగలు ఉప్పుసత్యాగ్రాహిగా కోర్టులో సబ్ మెజిస్ట్రేటు అడిగిన ప్రశ్నలకు వీరు ఎంతో ఆవేశంగా, శ్రావ్యంగా పాడుచు ఇట్లా సమాధానం చెప్తారు

ప్రశ్న : "రాఘవశర్మ గారూ! మీరున్న పదిమంది కలిసి బందరు కరగ్రహారమున ఉప్పు చేశారట. నిజమేనా?

సమాధానము : ఎక్కడ పదిమంది అండీ?

పల్లె పట్టణముల - పిల్లాజల్లా కలిసి బందరు రేవున మేము
ఉప్పు! కొల్లగ వండ జేరాము
సంద్రపు! నీళ్ళు తెచ్చికాచినాము

ప్రశ్న : శాసనధిక్కారము కాదా?

సమాధానము : చట్టముల్లంఘించియే కాచినాము

కాని చల్లని ఈ ప్రభుత్వము
సైపనొల్లక పడ ద్రోసి - నోరు కట్టెనయ్య
ఉప్పు సేయుట మానమింక (దాన)
చప్పన రాజ్యమస్తంగతము పొందు
- - - - - - - - - - - - -
- - - - - - - - - - - - -
గాంధీ పన్నిన త్రోవిదియజనుము
దాన గూలు బ్రిటీషు పాలనము
- - - - - - - - - - - - -
- - - - - - - - - - - - -
గడియసై పగలే మింగ్లాండు ప్రభుత్వము

ఈ గేయ వాఙ్మూలమునకు బహుమానం తొమ్మిది మాసాలు జైలుశిక్ష విధించి, బందరు జైలులో పెట్టి మర్నాడు ఏపూరు రైలుస్టేషన్‌కు (ఇప్పటి నూజివీడు

స్టేషన్) తరువాత రాజమండ్రి జైలుకు అక్కడ నుండి రాయవేలూరు జైలుకు తరలించిరి. ఆ జైలులో ఖాళీగా కూర్చోలేదు. బ్రిటీషు ప్రభుత్వం పెట్టిన బాధలను, అనుభవించిన కష్టములను కళ్ళకు కట్టినట్లు వర్ణించిరి.

"ఇదిగో దివాలా ప్రభుత్వం
వ్రేళ్ళతో - కదలి కూలిం దిదిగో
కనుము - దీనిసత్త్వం
- - - - - - - - - - - - -
కుళ్ళిపోయిన చచ్చు-కూరలు - ముల్లంగి
ఉల్లిపాయలు, గలిజేరు -
వంగవేళ్ళు, చీడతోటకూర
చిరివేళ్ళు, వెంపాలి, గోంగూర
పెద్ద పల్లె కూడు, బూజు మామిడి
టెంకల్, వెల్లుల్లి పచ్చిబొప్పాయి
ఉప్పగల్లు చిటికెడు - తెల్లకారం
చిన్న పల్లెకుడు - నూరుడుపప్పు
తలప యెళ్ళు - ఝల్లని నీళ్ళుగారు
పుచ్చు నల్లచింతపండు శేరు
కలిపి నీళ్ళు జేర్చి, యిట్టిసారం
ఇనుప కళ్ళాల గాచి యాధరు
వుగనిచ్చు దేవతా పులుసు - యితని శక్తి దెలుసు
॥ఇదిగో॥

ఇట్లాంటి తిండి తిని వారు పెట్టే బాధలన్నింటిని భరించి ఎందుకు దేశానికి స్వాతంత్ర్యం తీసికొని రావాలను కున్నారో వారే తన మనస్సులోని భావాన్ని ఈవిధంగా

"కట్టుకొనంగబట్ట, తినగా సరిపట్టెడు కూడులేదె! యి
ప్పట్టున భారతీయులకు, బ్రాణపదంబగు, నిన్ను బాసి యీ
కట్టడి బందెకాన జొరగా దలకొందునె। భారతావనిన్
బుట్టితి మాతృదేశ ఋణమున్ సరితీర్పగ। గంకణమ్ము జే
గట్టితి గాన నిట్లువడిగా దొరకొంటిని, మాతృసేవకున్"

చెప్పారు. భారతదేశములో పుట్టడమే అదృష్టము. భారతీయుడిగా పుట్టినందుకు మాతృదేశం ఋణం తీర్చుకోవాలి. అనే వారి దేశభక్తి అజరామరము.

ది. 06-05-1930 తేదీన కాంగ్రెస్ వారి ఆదేశాను సారము బందరు రాబర్ట్‌సన్‌పేట కుండుపై జెండా ప్రతిష్ఠించుటకు పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ తత్వానంద స్వామిని గురుజాడ రాఘవశర్మను నియమింపగా, వీరు ఇంకొంతమంది వాలంటీర్లతో కలసి గీతాలాపన చేయుచు జాతీయజెండా చేతిలో పట్టుకొని వెడుతుండగా కుండు దగ్గర చేరియున్న జన సమూహమును లాఠీలతో బాదుచున్నారు. గురుజాడ రాఘవశర్మగారు తత్వానంద స్వామి మెట్లెక్కి కుండుపై జండా ప్రతిష్ఠించారోలేదో పోలీసులు వచ్చి వీరిని మోది జెండాలాగి క్రిందికి త్రోసి బంధించినారు. ఇంతలో ఏనుగుపై లంఘించు ఉగ్ర సింహమువలె తోటనరసయ్య నాయుడుగారు గబగబా నిచ్చెనమెట్లెక్కి జాతీయజెండా ప్రతిష్ఠించినాడు. 16 మంది పోలీసులు లాటీలతో బాదితే రెండు చేతులతో జెండా పట్టుకొని, భుజదండాల నుండి నెత్తురు కారుతున్నా జండా విడిచిపెట్టలేదు. నోట 'బాపూజీ' అనే నామస్మరణ తప్పవేరేమీ లేదు. అయినా జాలిపడని పోలీసులు వారిని చితకబాదితే స్పృహ తప్పి పడి ఉన్నాడు. చుట్టు మూగిన జనం చూడలేక హాహాకారాలు చేసారు. ఆ ఘోష పట్టణమంతా వ్యాపించి ఆనాటి పురపాలక సంఘాధ్యక్షుడు బారిష్టరు శ్రీశీలం జగన్నాధరావు నాయుడు గారు ఈ వార్త విని మున్సిపల్ పాలకవర్గ సమావేశమేర్పరచి, కుండుపై జాతీయజండా ప్రతిష్ఠించు టకు తీర్మానం చేస్తే మరునాడు బ్యాండుమేళముతో కుండుపై జాతీయజండా జయప్రదముగా ప్రతిష్ఠింప బడినది. ఆ సందర్భములో శ్రీశర్మగారు

కుండుపై జాతీయజండా ప్రతిష్ఠింప
రండోయి! రండు! రారండు!
జండా యెత్తర - జాతికి ముక్తిర
నిండుగ శక్తిర - నిల్పర కీర్తిర
దండిగవైరులు, గుండులు పేల్చిన ॥జండా॥
చెండుచు - నెత్తురు కండలు రాల్చిన
జండా యెత్తర! జాతికి ముక్తిర

ప్రాణముండి యాభిమానముండి, నిజ
ప్రాణములైనన్ బలియొసంగి - మన ॥జండా॥

అని జాతీయజెండాపై ఎన్నో గేయాలు వ్రాసి స్వయంగా పాడారు. ప్రాణములు తెగించియైనా సరే తనకప్పచెప్పిన పని నిర్వహించాలి. జండా తెలుగుజాతికి ముక్తి కలిగించునని తన దేశభక్తిని వెల్లడిచేసారు.

గాంధీగారి ఆదేశానుసారము శ్రీశర్మగారు నిరంతరము రాట్నం వడకనిదే భోజనం చేసేవారు కాదు. తాను రాట్నం వడుకుతు తన తోటివారు ఆ వ్రతదీక్ష బూనునట్లు ఎంతో శ్రమపడిరి. ఆ సందర్భంలో కూడా వారి కలం నుండి ఎన్నో గేయాలు జాలువారినవి.

"వడకుమురా! వడుకుమురా
నీ దేశోద్ధరణకు - తెరగదిరా!
కలిమి, బలిమి - యీకదురే గదరా!
- - - - - - - - - - - - - - - - వంటి ఎన్నో గేయాలు కలవు. కట్టుకోవటానికి బట్ట, తినడానికి తిండిసరిగా లేని పేద కార్మిక కర్షక జనము తరతరాలుగా మద్యపానరతులై యిల్లు, ఒళ్ళు గుల్లచేసికొని దానికోసం కోట్ల కొలది ధనము దుర్వ్యయమగుట చూచి

త్రాగుడు పిశాచమా! ఇంక తరలిపొమ్మా
ఎంతమాయా స్వరూపిణి విపుడు తెలిసె
నౌరనీగుట్టూ, మా పొలిమేర విడచి
వెడలు మిట నుండి యింక త్రాగుడు పిశాచ
మా నిశాచర! పెనుభూతమా! వెడలుమ"2 అని ఎన్నో పద్యాలు వ్రాసిరి. మద్యపానము మనిషికెంత అనర్థము దానివలన దేశం ఎంత నాశనం అవుతుందో అని వారుపడిన ఆవేదన పద్యాలు చదువుతుంటే స్పష్ట మగును.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని దేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు గాంధీజివలె ఒంటి మీద చొక్కాలేకుండా ధోవతి ఉత్తరీయంతోనే ఉద్యమాన్ని వాడవాడలా ప్రచారం చేసారు. నవకాళికి అహింసాయాత్రకు వెళ్ళిన మహాత్ముని రూపం ఇట్లా వర్ణించారు.

"బలహీనంబుగ దోచుమేను మొల। ద్రిప్పంజాలు వస్త్రమ్ము
నా మొలపైనన్ గడియార, మొప్పగు నురమ్మున్, దాల్చక పాదర
క్షలు; చేగఱ్ఱయు। గళ్ళ జోడుగని సాగన్ వచ్చెనాజాను బా
హుల నవ్మోహన విగ్రహుండు కనముహో! బ్రహ్మతేజోనిధిన్.

ఇట్లా బొమ్మగీసినట్లు వర్ణించగలగడం సామాన్య కవులకు సాధ్యంగాదు

అని శ్రీ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మగారు తమ వ్యాసంలో పేర్కొని యుండిరి

హిందువులైనా, ముస్లిములైనా అందరు భరతమాత ముద్దుబిడ్డలె అనే, భావన గొప్పది. ముస్లిముల మధ్య తిరుగుతూ వాళ్ళతో ఉంటూ వాళ్ళిచ్చినదే తింటూ శాంతి సందేశం ఇచ్చిన గాంధీజీని

"వైరి గృహాల రాత్రుల నివాసము వారలొసంగు పండ్లెయా
హారము - - - - - - - - - - - - - - - -
- - - - - - - - - - - - - - - - - - - -
- 1 అని వర్ణించిరి.

అడుగడుగున దేశ సైనిక సహాయము నొసంగెద మన్నగూడ" అంటూ ప్రభుత్వం రక్షణ కల్పిస్తానన్నా వద్దని ధైర్యంగా గాంధీజీ జనం మధ్య తిరిగారు.

"భయము రవంతలేదు మరి దుర్గమంటన్న యళంకు లేదు, ని
శ్చయములవంత వీడదు ప్రశాంత ముఖమ్మది మారబోదు, సం
శయమదిలేనేలేదు, తన సాధనలన్ సడలింపలేదు, ని
ర్భయముగ శాంతిదూతగ। బురమ్ములు బల్లెలు జొచ్చియేగెడిన్

అని చెప్పటయేగాక జనం మధ్య ప్రభుత్వరక్షణలో తిరిగేవారు నాయకులు కాదన్న గాంధీ సిద్ధాంతం కవియైన శర్మగారిచ్చట చక్కగా వర్ణించారు.

ప్రతిమనిషి తానుచేసే పని లోకహితం కోసం చెయ్యాలని, మనలో ఉండే అహంకారాన్ని విడచి స్వార్థం లేకుండా లోకరక్షణ విధియని భావించాలని తన రచనలో ఉద్బోధిస్తారు. తాను రచించిన ''నవకాళి'' ఖండికలో,

''సంజనొకనాడు బయట, వృక్షంపునీడ
శాంతరస ముట్టిపడ నహింసావ్రతుండు
పన్యసింపంగ విని, యొక బాలకుండు
కన్ను గవనగ్రులొల్కగా గదలకచట
నిలచి తలపోయ దొడగె, నంజలి ఘటించి

అని వ్రాశారు. ఇందు చెప్పిన బాలకుడు శ్రీ శర్మ గారేనేమో. ఆయన మహాత్ముడు కాలుమోపిన ఈ భూమి పవిత్రస్థలము, ఆయన నిర్మలామయమూర్తి. వారి దృష్టి సోకి తన జన్మ సార్థకమైనదని భావించి, ఆ మహాత్ముని పాదరజము శిరస్సున దాల్తునని, గాంధీ పాదము మోపిన స్థలములో నున్న మట్టిని పై వస్త్రములో కట్టుకొని, ఇంటికి వెళ్ళి అమ్మా! మహాత్ముడట! హైందవులను బ్రతికించ డానికి దైవము పంపెనట పల్లెపల్లెకు సంచరించుచు ఇట కేతెంచెను. ఇదిగోవారి పాద ధూళి తీసికొనివచ్చితిని శిరమున దాల్చుము అని పలుకు పుత్రుని కౌగలించుకుని, ప్రేమతో శిరమ్ము మూర్కొనుచు హృదయ ముప్పొంగ, ఆ మహాత్ముని చూసే భాగ్యమబ్బినదని పాదధూళి శిరమునందు దాల్చెను.

మహాత్ముని హితబోధతో శాంతిని చెందగా హిందువులు, మహమ్మదీయులు మరల స్నేహముతో నౌకాళిలో కలిసి జీవించిరి అని శర్మగారు 'నౌకాళి' కావ్యానికి చక్కని పరిష్కారము నిచ్చిరి. మహాత్మాగాంధీ ఒక మతోన్మాది గుండునకు గురియైన నేలకొరిగిన సమయములో భారతీయులు గుండెలు బ్రద్దలగునట్లు శోకించిరి. ఆసమయంలో శ్రీ శర్మగారు "సత్యస్మృతి" అను శీర్షికతో వ్రాసిన పద్యాలు మనోహరములు. లారీ దెబ్బలకు అలసిసొలసినవారు. 1947 సం॥ ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యం రాగానే సేదదీరిన వైనం ఎన్నో పద్యాలలో వర్ణించిరి. మన భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను చక్కగా పాటించేవారు. చనిపోయినవారిని స్మరించడం - శ్రద్ధాంజలి ఘటించడం వంటివి.

గీ॥ విమల విఖ్యాత కవుల గేయముల నుండి
యేర్చికూర్చిన యట్టి జాతీయ గీత
ముల సమర్పింతు సద్భక్తి పూర్వకముగ
పొందుగా మాతృపాదార విందములకు

అని మారుమూల నుండి పడియున్న గేయాలను ఎంతోమంది కవులు వ్రాసినవాటిని "జాతీయగీతాలు" అనే పేరుతో వెలువరించినారు. శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పక్షమున అచ్చువేసి వారుచేసిన కృషికి బహుమానంగా రూ.3,000/-లు ఇచ్చి సన్మానించిరి. ఆల్ ఇండియా రేడియోవారు మా ఇంటికి వచ్చి జాతీయగీతాలు ఏబాణీలో పాడాలో వారితో పాడించుకొని రికార్డు చేసికొనివెళ్ళిరి. ఈనాటికి ప్రసారము లగుట జగద్విదితమే. ఇంతటి దేశభక్తుని భారతదేశానికి ఇచ్చిన భరతమాతకు వందనములు.

❖❖❖

స్త్రీల సాహిత్యంలో దేశభక్తి

– డా॥. జంధ్యాల కనకదుర్గ , గుంటూరు.

స్వాతంత్ర్యంవచ్చి 75 ఏండ్లు గడిచినా దేశభక్తిని గురించి చెప్పుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దేశభక్తి అంటే దేశానికి సేవచేయటం. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుష్యులోయ్ అని గురజాడ చెప్పింది గుర్తుచేసుకంటే దేశప్రజలకు సేవ చేయటం అని అర్థమౌతుంది. ఎటువంటి సేవ అని ప్రశ్న వేసుకుంటే ప్రజలందరూ సమానమని భావించి, వారి వారి ఆర్థిక, సామాజిక - సాంస్కృతిక, రాజకీయ హక్కులను వారు స్వేచ్ఛగా స్వాతంత్ర్యాన్ని అనుభవించగల వాతావరణంలో ఉండేటట్లుగా సమైక్యంగా ప్రతియొక్కరు బాధ్యతాయుతంగా భాగస్వాములు కాగలగటమే. ప్రజలందరి స్వతంత్ర జీవన విధానానికి సమైక్యత దోహదం చేస్తుంది. దానికై జాతీయాభిమానం కలిగి ఉండటం అవసరం. అదే దేశభక్తి. అప్పుడే దేశానికి స్వాతంత్ర్యరక్షణ ఉన్నట్లుగా భావించాలి. ప్రపంచీకరణ సందర్భంలో దేశాస్వాతంత్ర్య రక్షణ తక్షణకర్తవ్యం. నేడు దేశభుక్తి కనపడుతోందిగాని దేశభక్తి మృగ్యం. కాబట్టి అటువంటి అరాచకత్వం నుండి దేశస్వాతంత్యాన్ని కాపాడుకోవాలంటే జాతీయాభిమానం అందరిలో పెరగాలి. దానికై జాతీయోద్యమసమయంలో ఆనాటి దేశభక్తుల స్ఫూర్తిని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందుకోసం జాతీయోద్యమసమకాలీన సాహిత్యాన్ని తెలుసుకొని స్ఫూర్తిపొందాల్సిన సమయమిది. విస్తృతంగా ఉన్న తెలుగు సాహిత్యంలో స్త్రీల సాహిత్యానికి పరిమితం చేసుకోవటం జరిగింది. వ్యాస నిడివిని కూడా దృష్టిలో పెట్టుకొంటే సంబంధిత సాహిత్యాన్ని స్పృశించటం మాత్రమే జరుగుతుంది.

దేశ స్వాతంత్ర్యసాధనకై గాంధి జాతీయోద్యమాన్ని స్త్రీలు ముందుండి నడిపించాలని కోరటంజరిగింది. నాడు ఉద్యమ సమయంలో స్త్రీపురుషులు తమ బిడ్డలను, మాన ప్రాణాలను పణంగా పెట్టి, భారతీయులందరి స్వతంత్ర జీవన హక్కులను కాపాడిన ఆ నాటి దేశభక్తుల ఆలోచనలను నిత్యం గుర్తుచేసుకుంటూ దేశాన్ని సంరక్షించుకోవటమనేదే నేటి దేశభక్తి. కాబట్టి ముందుగా స్వాతంత్ర్యోద్యమ ఆశయాలను తెలుసుకొనే క్రమంలో ఆనాటి స్త్రీలు తోటిస్త్రీలను చైతన్యపరచటానికి సృజించిన సాహిత్యాన్ని పరిశీలించి తెలుసుకోవాలి. స్త్రీలందరు దేశ స్వాతంత్ర్య సాధనలో భాగస్వాములు కావటానికై వారిలో దేశభక్తిని, రాజకీయపరిజ్ఞానాన్ని కలిగించే క్రమంలో స్త్రీలు వ్యాసాలు, కథలు, కవిత్వం, నాటకాలను రాసి ప్రజలలో దేశభక్తిని నింపారు. ఆ దేశభక్తి సాహిత్యాన్నితెలుసుకోవాలి. స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన జాతీయాభిమానాన్ని పుణికి పుచ్చుకొని దేశసంరక్షణకై పూనుకొవాలి.

వ్యాపార నిమిత్తం వచ్చిన బ్రిటిష్ వారి వ్యాపారానికి గండికొడితేనే వారిని పలాయనం చిత్తగించేటట్లు చేయవచ్చని భావించిన భారతీయులు మొదలుపెట్టిన సత్యాగ్రహోద్యమ నిర్మాణ కార్యక్రమాలలో ఖద్దరు ఉద్యమం ప్రముఖమైంది. ఎంతోమంది స్త్రీలు ఖద్దరు ఉద్యమ భాగస్వాములవుతూ నూలువడికి, ఖద్దరు వస్త్ర తయారీ చేసి అమ్మటంలో నిమగ్నులై ఉద్యమాన్ని నడిపించారు. అలా అందరు స్త్రీలు పాల్గొనటానికై తోటి స్త్రీలను చైతన్యపరిచేందుకు స్త్రీలు రాసిన సాహిత్యాన్ని అవలోకించి స్ఫూర్తిని పొంది, దేశభక్తిని రగిలింప చేసుకొవాలి.

కనుపర్తి వరలక్ష్మమ్మ 'స్వారాజ్యలక్ష్మి' (నవంబరు 1923 అనసూయ) అనే తన కవితలో - "ఖద్దరు వసనమే సదా గట్టుకొనియు - పేరు ముద్దు స్వరాజ్యగా బెట్టుకొనియు - సరసగాంధీ సందేశంబు సారమేదో-యదియ బోధించే నీ బాల నతివ చూడు" అని స్వరాజ్య లక్ష్మికి కవితా తోరణం కట్టింది.

కాకినాడలో జరిగిన 'అఖిల భారత మహిళా మహాసభ'లో పులుగుర్త లక్ష్మీనరసమాంబ చేసిన ఉప న్యాసంలో (ఆంధ్రపత్రిక సౌజన్యంతో 'ఆంధ్రసర్వస్వము' అనే పత్రికాప్రచురణ, జనవరి1924) భాగంగా స్త్రీలు అబలలు కారనీ, స్వాతంత్రోద్యమంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చింది.. జాతీయ వస్త్రధారణలలో భాగంగా రాట్నంతిప్పి నూలు వడికి, ఖద్దరు వస్త్రాలను తయారుచేయాలనీ, విదేశీవస్త్రాల కొనుగోళ్ళవల్ల మనడబ్బు విదేశాలకు వెడుతోందనీ,దాన్ని అడ్డుకోవటానికిగాని దారిద్రాన్ని తగ్గించుకోవటానికిగాని ఖద్దరు వస్త్రధారణ ముఖ్యమని తెలిపింది.

భారతదేశానికి స్వయంప్రతిపత్తిని యివ్వటానికి అంగీకరించని బ్రిటిషు ప్రభుత్వానికి చెంపచెట్టుగా గాంధి - స్వరాజ్య- నినాదాన్ని ముందుకు తెచ్చాడు. దానితత్వాన్ని ప్రజలకు అర్థమవటానికి వీలుగా 'స్వరాజ్య సంపాదన యందు స్త్రీల విద్యుక్త ధర్మం' (ఆంధ్రపత్రిక వార్షిక సంచిక మార్చి1925) అని పులవర్తి కమలావతిదేవి రాసిన వ్యాసంలో 'స్వరాజ్యమం'టే ఏమిటో స్త్రీలే తెలుసు కోవాలనీ, భారతీయులచే ఎన్నుకోబడిన వ్యక్తికి కోశాధి కారమును ఇవ్వమని అడగటమే స్వరాజ్యమనీ, ఆ స్వరాజ్యాన్ని పొందటానికి సహాయనిరాకరణోద్యము మొదలు పెట్టారని చెప్పింది.

ఇందిరాదేవి వ్రాసిన 'మానవసంఘం' (ఏప్రిల్ 1930 వాసవి) అనే వ్యాసంలో దేశానికి పాటుపడేవాళ్ళు తమకున్నదాంట్లో కొద్దిగా బీదలకు పెట్టాలనీ, గ్రామాలలో అన్ని కులాల,మతాలవారు ఐకమత్యంగా ఉండాలని చెలిపింది. గాంధి ఆదర్శాన్ని పాటిస్తే దేశోద్ధరణకై కృషి చేయటమే మానవ సంఘసేవ అని చెప్పింది. వారిలో మానవసేవ యొక్క ముఖ్యోద్దేశ్యాన్ని చెబుతూ, దేశోద్ధరణలో మానవసేవ ముఖ్యమని తెలియజేసింది.

గాంధి నిర్ణయించిన సత్యాగ్రహోద్యంమంలో హరిజనోద్ధరణ కూడా ముఖ్యమైన విషయం. స్వాతంత్ర్య పోరాటంలో వాళ్ళను కలుపుకొని ఐకమత్యంతో ప్రజలు ఉద్యమాన్ని సాగించటానికై స్త్రీలు సాహిత్య సృజన చేసారు. చిలకపాటి భారతీదేవి వ్రాసిన 'అస్పృశ్యత' (జనవరి 1933 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో దేశారిష్టాలు తొలగాలంటే అస్పృశ్యత పోవాలనీ, లింగ వివక్షతో స్త్రీలు, సామాజిక వర్గదృష్టితో హరిజనులు బాధితులుగా ఉన్నారనీ, వారి అభివృద్ధి ఉంటేనే స్వాతంత్ర సాధన మరింత సులభతర మవుతుందని తెలియ జేసింది. దేశస్వాతంత్ర్యోద్యమ సాధనలో హరిజనోద్ధరణభాగంగా ఉండాలనీ తెలియజేసింది.

హిందూ ముస్లిముల మధ్యన చిచ్చుపెడుతూ వారి మధ్యన తమ ప్రభుత్వాన్ని సజావుగా సాగించాలనుకొన్న బ్రిటిషువారి కుట్రను భంగంచేయటానికే గాంధి హిందూ ముస్లిముల మధ్యన సఖ్యతను పెంపొందిచాలను కొన్నాడు. దాని ఉద్దేశ్యాన్ని స్త్రీలందరికి తెలియ చేయటానికై స్త్రీలు తమ వ్యాసాల ద్వారా ప్రజలను చైతన్య పరచారు. వెలిదండ చూడికుడుత్తమ్మ వ్రాసిన "హిందూ-మహమ్మదీయ సఖ్యత"(అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య హిందూ మహమ్మదీయలకు మధ్యన సామరస్యం లేకపోవటం అని చెప్పింది.

ఉప్పు సత్యాగ్రహోద్యమ సమయంలో చాలామంది స్త్రీలను చెరసాలలో పెట్టారు. జాతీయోద్యమ భాగ స్వాములుగా దేశంకోసం పోరాడే స్త్రీలను చెరసాలలో బంధించినా అధైర్యపడక భారతదేశ విముక్తి కోసం సబలలయ్యామనే వారిఆత్మవిశ్వాన్ని ప్రకటింపచేస్తూ తల్లాప్రగడ విశ్వసుందరమ్మ వ్రాసిన కవితలో ("ఆంధ్ర కవయిత్రులు" - ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ) "కఠిన కారాగారలంకాపురమున - బంధితులమయి యున్నాము భయములేడి - 'అబలలముగాక యెంతయు సబల లమయి - భారతదేశ విముక్తిని బడయునొరన్" అని శాసనోల్లంఘనానికై భారతాంబ బిడ్డలుగా స్త్రీలు విజయమో వీరస్వర్గమో పొందటానికి సిద్ధపడమంటూ వీరమాతల ఉద్యమ స్ఫూర్తిని కొనియాడినది. ఈమె

సూచించిన బ్రతుకో/చావో అనేదే నినాదమై 1942లో చేసిన క్విట్ ఇండియా ఉద్యమంలో మారుమ్రోగింది.

ఓలేటి నిత్యకల్యాణమ్మ వ్రాసిన 'ప్రబోధము'-అనే ఇంకొక కవితలో (గృహలక్ష్మి-ష్టెంబరు,1931)"కటకటా! నేడు దాస్యశృంఖలులజిక్కి-శ్వేత జాతులచేత కృశించి, శల్య - మగుచు దుర్భరదుఃఖార్తి బొగులుచుండె - భవ్యగుణ యశోపేత శ్రీభరతమాత - దాస్యాంధకారంబు తఱిమివేయుటకునై...దేశవస్తులదీక్ష దెల్పరమ్మ-మనభాష మనజాతి మనదేశమభివృద్ధి-నెనయుమార్గముల నూహింపరమ్మ-మనము పూర్ణ స్వతంత్రత గనెడు వరకు-తీరబోదమ్మ మనపని తెరవలార !-మాతృసేవాపరాయణ మహిత దివ్య-కంకణము దాల్చి రారమ్మ గరిత లార!"అని అహింసాయుతంగా బ్రిటిషువారిని ఎదుర్కోవటంలో సత్యాగ్రహోద్యమంలో ప్రముఖపాత్ర వహించింది ఈ ఖద్దరు ఉద్యమం.

తెలుగు స్త్రీలు ఉద్యమాన్ని కథలుగా చెప్పుకొంటూ నిరక్షరాస్యులు కూడా దేశస్వాతంత్ర్యోద్యమ భాగస్వాములయ్యే చైతన్యం తెచ్చుకోవటానికి రచయిత్రులు కథలు రాసారు.

మైదవోలు పద్మావతి వ్రాసిన 'త్యాగిని' (మార్చి 1930 గృహలక్ష్మి పత్రిక) అనే కథలో ఆబాలగోపాలం సత్యాగ్రహ పోరాటంలో పాల్గొంటుంటే తన కొడుకు స్వరాజ్య ఉద్యమంలో పాల్గొనటానికి అతని తల్లి తనకంటే దేశ మాతయే ముఖ్యమని కొడుకుకు చెబుతుంది. మాతృదేశ స్వాతంత్ర్యం కోసం ఆ మాతృమూర్తి చేసిన 'ప్రాణత్యాగం' స్వరాజ్యరథానికి కందెనగా మారిందని అర్థంకాక తప్పదు.

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసి, 'ఐదుమానములు యిరువది దినములు' (అక్టోబరు 1931 గృహలక్ష్మి పత్రిక) అనే కథలో ఖద్దరు వస్త్రములు ధరించటం ఇష్టంలేని భార్య, భర్త ప్రేరణతో స్వదేశీ ఖద్దరు ధరించలేని తన యొక్క అస్వతంత్రత, బానిసత్వం గ్రహింపుకు రాగా, ఆమె తన భర్తకిష్టమైన ఖద్దరు ధరించి, ఖద్దరు వడకటం నేర్చుకోవటమే కాక తోటిస్త్రీలు కూడా ఖద్దరును ధరించే విధంగా చేసిన కథ తాడి నాగమ్మ వ్రాసిన - కథగాదు - (సెప్టెంబరు1935 భారతి)అనే కథలో ఉద్యమ భాగస్వాములైన స్త్రీలు భయపడకుండా వీధుల్లో తిరుగుతుంటే ఎదురయ్యే లైంగిక వేధింపులను తెలియజేస్తూ అటువంటి సమస్యలు ఎదురైనపుడు స్త్రీలు యుక్తిగా ఎలా ఎదుర్కోవాలో తెలియచేసే కథయిది.

ఆచంట సత్యవతమ్మ వ్రాసిన 'దసరా బహుమానం' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే కథలో వర్గభేద దృష్టిపోతే, స్త్రీలలో సమైక్యత, దేశభక్తి ఇనుమడిస్తుందని, దేశభక్తికి బీద,ధనిక భేదాలు ఉండకూడదని భావించింది.

ద్వితీయ ప్రపంచయుద్ధానంతరం బ్రిటీష్ వాళ్ళు గెలిచినా బ్రిటీష్ సైన్యానికి ఎక్కువ నష్టం జరిగింది. యుద్ధానంతరం సంపూర్ణ స్వరాజ్యం ఇస్తామని చెప్పి సహాయంపొందినా పట్టించుకోనందుకు, భారతీయులను విభజించాలని చూస్తున్న "బ్రిటీష్ వారికి చెంపపెట్టుగా వాళ్లని దేశం నుండి పారద్రోలేందుకు, చావో బ్రతుకో తేల్చుకునే విధంగా 1942 లో 'క్విట్ ఇండియా ఉద్యమం వచ్చింది. ఆగష్ట్ లో విప్లవంగా విజృంభించింది. ఆ సందర్భంలో లలిత వ్రాసిన 'మనది భారతదేశం' అనే కవితలో (ప్రజాశక్తి ప్రచురణయైన 'స్త్రీల పాటలు' అనే పుస్తకం) భారతదేశంలో బ్రిటీష్ వాళ్ల అణచివేతను ఎదుర్కొవాలనీ, స్వపరిపాలన కావాలని భావించి స్వతంత్రం కోసం ఆధునిక తుపాకులు, మరఫిరంగులు లేకపోయినా బ్రిటీష్ వాళ్లను ప్రజలు ఎదుర్కోవాలంటూ, మరొక ప్రక్క అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం చేయాలంటూ - స్వాతంత్ర్యకాంక్షతో చావునకు తెగించి, యుద్ధతంత్రమ్ము నేర్చి యుద్ధభూమికి రమ్మా.. ప్రజల శక్తిని చూపుదాము.-మనది భారత దేశమమ్మా .... అంటూ కవయిత్రి ఆధునిక ఆయుధాలు లేకపోయినా గెరిల్లా దాడితో వారిని మట్టుపెట్టవచ్చని నాటి స్త్రీలను ప్రోత్సహించటం జరిగింది.

వట్టికొండ విశాలాక్షి వ్రాసిన 'అభ్యుదయగీతాలు' అనే కవితా సంపుటి (1943లో స్వీయ ప్రచురణ)లోని

'ప్రబోధ'మనే గీతంలో ఐకమత్యమే మంచిఆయుధమ్మని నమ్మి మనము-సమర రంగమున చంపేసి, పరుల-స్వాతంత్రమును సాధించిశాంతి నెలకొల్పాలి" అనితన గాఢమైన సంపూర్ణ స్వాతంత్ర్య కాంక్షను వెలిబుచ్చి నేటి వారికి కూడ గగుర్పాటును, స్ఫూర్తిని కలిగించింది.

చేబ్రోలు సరస్వతీ దేవి వ్రాసిన (1940 అక్టోబర్ గృహలక్ష్మి) 'అంజలి' అనే కవితలో భారతమాతను స్తుతిస్తూ - ఖద్దరుపై లక్ష్యాన్ని మాతృభాష, ఆరోగ్యబోధన, అస్పృశ్యతా నివారణకుస్త్రీజనోద్ధరణ దీక్షనుచేపట్టటానికి తగిన ధీశక్తినిమ్మని భారతాంబకు అంజలి ఘటించటం లోనే స్త్రీల స్వాతంత్ర్యదీక్షలోని దేశభక్తి, స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు అర్థమౌతాయి.

వల్లభనేని సీతామహాలక్ష్మి యం.యల్.ఎ. వ్రాసిన 'స్వతంత్ర భారతం' (ఆగష్టు 1947) అనే వ్యాసంలో ఆగష్టు 15 న తేదీ భారత దేశంలో నూతన శకారంభమనీ, విదేశీ ప్రభుత్వం పోయినా దేశములో ప్రతివారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యములు లభించినట్లు కాదనీ, భారతదేశ స్వాతంత్ర్యంతో పాటు దేశం విభజింపబడిన సంగతి స్త్రీ పురుషులు విస్మరింపరాదని తెలిపింది. పాకిస్థాన్ ఇండియా ఐక్యభారతంగా ఉండే రోజులకు భారత సంతానం నిరంతరం కృషి చేయాలనీ, పల్లెలో అంటరాని తనం సమస్యతీరకపోతే ఐక్యత ఉండదని తెలియ జేసింది. స్త్రీ పురుష వివక్షలేకుండా, బీద, ధనికుల మధ్య అంతరాలు లేకుండా సామ్యవాద సిద్ధాంతంగా ప్రజాస్వామ్యం రాజ్యాంగ శాసనం ద్వారా నిర్మింపబడా లనీ, అప్పుడుగానీ వర్గ పోరాటాలు తగ్గవనీ, భారత దేశంలో ప్రధాన సమస్యలు పరిష్కరింపబడినప్పుడే ప్రతి వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందినట్లుగా భావించాలని తెలియజేసింది. దీన్ని సాధించటమే నేటి దేశభక్తి.

కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన మహోదయం అనే కవితలో (ఆగస్టు 1947 గృహలక్ష్మి) స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటానికి ప్రజల కర్తవ్యాన్ని తెలియచేస్తూ-కులతత్వభేదంపు కుటిలత్వములు లేక-మతవిభేదంబుల మాటలేక - రాష్ట్రాభిమానంపు రగడలు లేకుండ-భాషా విభేదంపు పట్టులేక-ధనిక దరిద్రుల తారతమ్యము లేక-అధికారమోహపుం టాశలేక - వ్యవసాయ కార్మిక వ్యత్యస్తములు లేక - స్త్రీ పురుషవిభేద రీతి లేక - భారతాంబ స్వాతంత్ర్యంబు బడయుకొఱకు-శాంతి సమరంబు పూన్కిమై సలిపినటులే-భరతదేశాభివృద్ధికై పాటుబడగ-దీక్షగొనవలెనింక నీదేశప్రజలు- అనిదేశభక్తిని ప్రవచించింది.

కడప రామసుబ్బమ్మ (మాజీ కడపజిల్లా బోర్డు అధ్యక్షు రాలు) 'స్వాతంత్ర్యము-మనకర్తవ్యం' (ఆగష్టు 1947 గృహలక్ష్మి) అనే శీర్షికన స్వతంత్ర సంపాదనతో భారతీ యుల బాధ్యత పెరిగిందనీ, మాతృదేశ సంరక్షణకు నిర్మాణాత్మక పనులు చేయాలనీ, జాతీయ సంపదల అభివృద్ధికి నిరంతరం కృషిచేయాలనీ, ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక, పారిశ్రామిక, నైతిక, ఆధ్యాత్మిక సంపదలను అభివృద్ధిపరచాలి. నేటికీ యిటువంటి దేశభక్తిభావాలతో ప్రజలు పునరుత్తేజం పొందాల్సిన అవసరం ఉంది.

దేశసరిహద్దుల రక్షణకై సైన్యం ప్రాణాలకు తెగించి యుద్ధం చేయటం అనేది స్వాతంత్రం వచ్చినప్పటి నుండి నేటి వరకూ జరుగుతున్నదే.'దేశగౌరవాన్ని కాపాడే సిపాయి' శక్తియే, దేశభక్తియే భారతీయులందరినీ కాపాడుతోందని, సిపాయి భార్యల వేదనలోనూ దేశభక్తి ఎంత ఉందో తెలియజేస్తూ 'పెళ్ళైన మూడోరోజే యుద్ధానికి బయలు దేరిన సిపాయితో అతని భార్యకు దేశ సైనికుడి గురించిన భావనను, అరెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి అనే కవయిత్రి 'సిపాయి భార్య అనే కవితలో-"మరలి వచ్చినా రాకున్నా-వేచియుంటాను మరోజన్మకైనా -మరవకోయి నీ కర్తవ్యం-తీర్చుకోవోయి నీ జన్మభూమి ఋణం" అంటూ దేశరక్షణకై సిపాయి భార్య యుద్ధభూమిలో ఉన్న సిపాయిలో నైతిక శక్తిని పెంపొందించితే, దేశభక్తి ప్రజల దృష్టిలో వారిని కాపాడేది 'సిపాయి' అన్న భావన ఏర్పడుతుంది.

స్వతంత్రభారతమాతను వేడుకొంటూ స్వరాజ్యసంపద నిలుపుకోవటానికి నిరంతర దేశభక్తి అవసరమని, అది

లేకపోతే అరాచకత్వం, అమానవీయత చోటుచేసు కుంటోందని శారదా అశోకవర్ధన్ రాసిన ఆరవవేదం అనే కవితలో-వర్ణభేదం, "ధనిక స్వామ్యం-నల్లబజారులో కుళ్ళ లోగిళ్ళూ-దానవత ఇనుప చట్రాల కింద-మానవత నలిగి పోతోంది" అంటూ, ఆనందాన్ని అందరికీ పంచమని,అదే ఆరవవేదం' కావాలంది.

స్వాతంత్ర్యానంతరం పెరిగిన వర్గ పోరును కోకా విమల కుమారి పేర్కొంటూ- ''స్వతంత్ర భారతి వేడుకుంటున్నా నిన్ను - ఈ అకృత్య ప్రజా జీవనం వద్దని- నిస్వార్థపు నీడలో సేదదీర్చు -మరో మంచి స్వతంత్ర భారతిని దరి జేర్చమనివేడుకొంది. కె. వి. 'ధర్మభూమి' కవితలో-స్వాతంత్రానంతరం దేశస్థితికి దుఖించి దేశాన్ని గురించి ఆలోచించటమే దేశభక్తి అని అసమానతలున్న మాతృభూమిని గురించి చెప్పిన కవిత.

దేశాల యొక్క జాతీయ ఆర్థిక వ్యవస్థలను, మార్కెట్లను ప్రపంచ ప్రాతిపదికన ఏకీకరణం చేయటమే ప్రపంచీకరణ. ఈ పరిస్థతులలో దేశభక్తిని మరింతగా పెంచుకుంటేనే ఈ ప్రపంచీకరణకు ఎదురొడ్డి నిలబడ గలుగుతాము. కొండేపూడి నిర్మల రాసిన మల్టీనేషల్స్ ముద్దు అనే కవితా సంకలనంలో కుట్రదారుని రచన పేరు నాగరికత అనే కవితలో-''అకలి తీరని పిల్లా జల్లా ముసలీ ముతకా తప్ప-రాజ్యాంగం మిగిల్చిందేమిటో తెలీదు- శ్రమజీవన సౌందర్యం వాళ్ళ పాలిట 'ఓ వెక్కిరింత మాత్రమే' అనీ ప్రైవేటీకరణలో శ్రమ దోపిడి ఎక్కువై బీదలు మరింతగా చితికిపోతున్నారని భావించటమే దేశభక్తి అని భావించాలి.

సాహితీ సుమాలు అనే సాహిత్యసంకలనంలోని 'వాణిజ్య గణతంత్రం' అనే జె.కనకదుర్గ రాసిన కవితలో- ప్రపంచీకరణ సందర్భంలో స్వదేశీయతా భావం ఉం డటమే దేశభక్తి అని - ''వాణిజ్యం వెసులుబాటుకై- తప్పనిసరి చుట్టమైంది ఒప్పందాలపత్రం - వనరుల వినియోగపు హక్కులను - కాలరాచే వాణిజ్యాల ముసాయిదా - విషణి వ్యవస్థలో విలువలను నేలరాస్తుంది - మానవులను స్వార్థపరులుగా మారుస్తూ - మనిషి మనిషికీ మనసులు కలవకుండా చేస్తుందని"గమనించాలి.

ఈ సందర్భంలోనే ఓల్గా, కుప్పిలిపద్మ, యలమంచిలి రాధ, గీతాంజలి వంటి రచయిత్రులు దేశపరిస్థితులు తెలిసేవిధంగా రాసిన అనేక కథలను దేశభక్తికి ఉన్న విలువలు అర్థమౌతాయి. స్త్రీల సాహిత్యాన్ని పరించి ప్రజల తమ శరీరంలోని ప్రతి రక్తపుచుక్కలో దేశభక్తి నింపుకొని నేడు దేశాన్ని రక్షించుకొనటమే దేశభక్తి. జాతీయామానాన్ని పెంచుకొని ప్రజలందరు స్వతంత్ర జీవనాన్ని గడపటమే దేశభక్తికి గీటురాయి.

❖❖❖

తెలుగు పత్రికలలో స్త్రీల వ్యాసాలు - దేశభక్తి

- డా॥. లింగాల మంగమ్మ, పోస్ట్ డాక్టరేట్ ఫెలో ఫర్ ఉమెన్, యు.జి.సి., తెలుగు విభాగం,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ప్రాథమికంగా విద్యావంతులు కాగలిగిన స్త్రీలు, స్త్రీవిద్య, స్త్రీల స్వతంత్ర జీవనావశ్యకతను గుర్తించి, స్త్రీ పురుష సమానత్వాన్ని కోరుకుంటూ స్వేచ్ఛా కాంక్షను పెంపొందించుకుంటూ భారతదేశ స్వాతంత్ర్యానికై అంచెలంచెలుగా కృషిచేసిన విధానం తెలుగులో 1900 నుండి వచ్చిన స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. సమాజంలోని కొంతమంది స్త్రీలు నాటి స్త్రీలలో కలగాల్సిన దేశభక్తి, సాంఘిక, ఆర్థిక, రాజకీయ చైతన్యాన్ని ప్రతిఫలింపజేసిన స్త్రీల సాహిత్యాన్ని పత్రికలలో ప్రచురించిన నాటి 'హిందూసుందరి', 'సావిత్రి', 'అనసూయ', 'ఆంధ్రలక్ష్మి', 'గృహలక్ష్మి', 'ఆంధ్రపత్రిక' (వార్షిక సంచిక), 'భారతి', 'వాసవి', 'కలావతి', 'శారద', 'సరస్వతి', 'వివేకవతి', 'ఆంధ్రభూమి', 'స్త్రీధర్మ', 'సువర్ణలేఖ', 'జనానా', 'సమదర్శిని', 'బాలసరస్వతి', 'రూపవాణి' మొదలగు తెలుగు పత్రికలలో స్త్రీలు వ్యాసాలు, ప్రచురింపబడిన ఉపన్యాసములు, కథలు, కవితలు, నాటకాలు, శతకాలు, నవలలు, స్వీయచరిత్రలు, జీవిత చరిత్రలు, పాటలు, నవలానువాదాలు, గల్పికలు, జానపదగేయాలవంటివి స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీల స్వతంత్ర కాంక్షయే వారిని దేశస్వాతంత్ర్యంవైపు అడుగులు వేయించిన తీరుకు అర్థంపడుతున్నాయి.

స్త్రీ విద్య, స్త్రీ వ్యక్తి స్వాతంత్ర్యం, ఉన్నత విద్య, శాస్త్రపరిజానం దిశగా, స్త్రీ-పురుషులు సమానులు అనే భావన అభివృద్ధి చెందటానికి తగినట్లుగా సంస్కృతిలోని లోపాలను సరిదిద్దుకోవాలని స్త్రీలు వ్యాసాలు రాశారు. సమాజ మానవ జీవిత సత్యావిష్కరణకు నిబద్ధతతో కూడిన విమర్శలతో వ్యాసరచన సాగి స్త్రీలలో అవగాహనను మరింతగా పెంచగలిగింది. దేశ, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపట్ల అవగాహనను కలిగిస్తూ, కులమతాల సామరస్యంతో కూడిన సమాజ స్థాపనను ప్రబోధిస్తూ, స్త్రీలు తమ ఆర్థిక దుస్థితిని, అస్వతంత్రతను గుర్తించగలిగేట్లు చేశారు. స్త్రీలు దేశ స్వాతంత్ర సాధన దిశగా చైతన్యవంతులు కావటానికి వ్యాసరచన విషయ పరిపక్వతను పొందింది. వ్యాసరచన ప్రారంభం, విషయ ప్రతిపాదన, ఆ విషయాలను పెంచి ఆలోచింపజేసి ఆ విషయాన్ని పాఠకుల మనస్సులో నాటుకునేటట్లు చేసి అవగాహనను పెంచి, ఆలోచింపజేసి చైతన్య స్పృహను కల్గించే విధంగా 1900 నుండి వ్యాసరచన సాగింది. నాడు ఘనత వహించి స్ఫూర్తినిచ్చి, చైతన్యపరిచ్చే విషయ ప్రాధాన్యతగల కొన్ని వ్యాసాలలోని దేశభక్తి, స్వాతంత్ర్య కాంక్ష మొదలైన విషయాలను తెలియ జేయడం ఈ పత్ర ఉద్దేశం. స్త్రీ వ్యక్తి స్వాతంత్ర్య సాధనకు, దేశ స్వాతంత్ర్యానికి తగిన చైతన్యాన్ని స్త్రీలలో కలిగించటానికి, స్త్రీల అభివృద్ధిని కోరుకుంటూ వచ్చిన స్త్రీల వ్యాసాలు ఈ పరిశోధన వ్యాసానికి ముడిసరుకు. స్త్రీల స్వీయ సంస్కరణలో భాగంగా స్త్రీలు తోటిస్త్రీలలో చైతన్యం కలిగించేవిధంగా అనంతమైన సాహిత్యసృష్టి చేశారు. అందులో భాగమే స్త్రీల సాహిత్య వ్యాసాలు.

స్త్రీల వ్యాసాలు-దేశభక్తి :

కొలిచిన కాంతమ్మ రాసిన 'దేశాభిమానం'(ఏప్రిల్ 1905, హిందూసుందరి పత్రిక) అనే వ్యాసంలో స్త్రీవిద్య వల్ల స్త్రీలకు జ్ఞానాభివృద్ధి కలిగి తాము చేయవలసిన యోగ్యమైన అర్హకృత్యములు తెలుసుకోగలని, దేశాభిమానం కలిగి దేశమునకు మేలుచేయు పనులు చేయగలరనీ, ప్రాణములు ధారపోసియైన దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందనీ తెలియజేసింది. కందుకూరి విరేశలింగం స్త్రీవిద్యకు పాటు పడ్డారని, విద్యావంతులైన స్త్రీలుగా భండారు అచ్చమాంబ,

కొటికలపూడి సీతమ్మ, మొసలికంటి రామాబాయమ్మ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ మొదలగువారు దేశాభివృద్ధికి పాటు పడుతున్నారని ఈ వ్యాసంలో ఉదాహరించారు.

స్త్రీలను ప్రోత్సహిస్తూనే స్త్రీవిద్యా జ్ఞానానికి, దేశాభిమానానికి, దేశరక్షణకు ఉన్న సంబంధాన్ని అవగాహనకు తేగలిగింది. స్త్రీలు తమ విద్యాజ్ఞానంతో దేశాభిమానాన్ని పెంచుకొని దేశాన్ని బాగుచేసుకోవాలని చెప్పటంతో స్త్రీల విద్యాభివృద్ధి కొరకేకాక పరతంత్ర పాలనలో మగ్గుతున్న దేశాన్ని గురించిన ఆలోచనలు పెంచుకోవడం, దేశాభివృద్ధిలో స్త్రీల కర్తవ్యాన్ని సూచించడం జరిగింది. స్త్రీవిద్యకు దేశ స్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని కొలిచిన కాంతమ్మ పై వ్యాసంలో తెలియజేశారు.

జూలూరు తులశమ్మ - 'విద్యామూల్యత' :

(ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, ఏప్రిల్ 3వ తేదీ,1916) అనే వ్యాసంలో స్త్రీలు పురుషుని వలె విద్యను ఆర్జించితే స్వతంత్ర జీవనాన్ని సాగించగలరనీ, స్వదేశాభిమానం, స్వజన సంఘీభావం, ధైర్యస్థైర్యాలు వారిలో పెరిగితే దేశం స్వాతంత్ర్యం నుండి విముక్తి పొందాలనే ఆలోచనలు వారికి వస్తాయని తెలియజేశారు. విద్యతో స్త్రీలు వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పొందాలనీ, స్త్రీల స్వతంత్ర తయే దేశస్వాతంత్ర్య సాధనకు ప్రథమ సోపానం అని ఆనాటి రచయిత్రిగా ప్రజలలో చైతన్యం కలిగించారు. 1916 నాటికే స్త్రీలలో అభివృద్ధికావల్సిన భావజాలాన్ని తెలియజేయటం తులశమ్మగారి కాంతా దర్శనానికి నిదర్శనంగా భావించవచ్చు.

కొలకపూడి సీతమ్మ -'స్త్రీ ఉన్నత విద్య' :

(ఏప్రిల్,1911, హిందూసుందరి) ను గురించి రాస్తూ, ఐహిక సంబంధములైన గృహకృత్య నిర్వహణ, శిశు పోషణం, బంధుప్రీతి వంటి ధర్మాలను నెరవేర్చాలంటే స్త్రీలకు ఉన్నత విద్య అవసరమనీ, దానికై ఉన్నత విద్యాలయాలు స్థాపించాలని తెలిపారు. ఉన్నత విద్య వల్ల ఐకమత్యం, పరోపకారం, శిశుపోషణ, దేశపరిశ్రమలు, కాలవినియోగం వంటి విషయాలపై స్త్రీలకు గౌరవము కలుగుతుందని, అప్పుడే వారిలో దేశాభివృద్ధి, స్వజాత్యభి వృద్ధివంటి భావాలు పెరుగుతాయనీ, బాల్య వివాహ నివారణయే దేశోన్నతికి బాటలు వేస్తుందని తెలియ చేశారు. అలాగే స్త్రీల కుటుంబ ధర్మ నిర్వహణకు ఉన్నతవిద్య అవసరమనీ, అదే దేశోన్నతికి కారకం అవు తుందనీ స్త్రీల కుటుంబధర్మాలను తెలియజేశారు.

గూడిపాటి లక్ష్మీనరసమ్మ రాసిన 'హైందవ యువతీపతనము' :

(సెప్టెంబరు 1911, హిందూసుందరి)అనే శీర్షికన వ్యాసం రాస్తూ, పూర్వకాలంలో స్త్రీలు విద్యావంతులుగా ఉన్నారనీ, బాల్యవివాహాల వల్ల స్త్రీలకు విద్యావికాసం కలగటంలేదనీ, బాల్య వివాహాలను మాన్పించి విద్యార్జన చేసేటట్లుచేసి రజస్వలానంతర వివాహాలు చేయాలని తెలిపింది. అప్పుడే దేశం, సంఘం బాగుపడుతుందనీ, దానికై బాలికా పాఠశాలలు ప్రతిగ్రామాలలో పెట్టాలని కోరారు. స్త్రీల విద్యాభివృద్ధి జరగాలంటే రజస్వలానంతర వివాహాలు జరిగే వైవాహిక సంస్కృతి ఉండాలని భావించింది. రజస్వలానంతర వివాహాల ప్రాచుర్యంతో పాటు, ప్రౌఢవివాహాలను గురించిన ఆలోచనలు కలగటం అర్థమవుతుంది. స్త్రీల వివాహానికి, స్త్రీవిద్యకు, దేశాభివృద్ధికి ఉన్న లంకెను గూడపాటి లక్ష్మీనరసమ్మ తెలియజేశారు.

దేవరకొండ వెంకటసుబ్బమ్మ రాసిన 'మన అభివృద్ధియెట్లు' :

(సెప్టెంబరు 1913, హిందూసుందరి) అనే వ్యాసంలో పూర్వకాలమందు హిందూస్త్రీలలో విద్యావంతులు, పరాక్రమవంతులు ఉన్నారనీ, కాని నేడు స్త్రీలు ఇంటిలో బానిసలుగా ఉన్నారనీ, స్త్రీజాతి అభివృద్ధి చెందితేనే సంఘము, దేశము అభివృద్ధి చెందుతుందని తెపిపారు. సమాజంలో స్త్రీవిద్య, స్త్రీకి స్వాతంత్ర్యం ఉండాలని సంఘసంస్కర్తలు కృషి చేస్తున్నారనీ, స్త్రీలు వైద్యగ్రంథాలు, గృహనిర్వాహకత్వం, శిశుపోషణ, పాకశాస్త్రం, ఆరోగ్య శాస్త్రంతో పాటు గృహాదాయవ్యయములను చక్కని

గణితశాస్త్రాన్ని అభ్యసించాలని చెప్పారు.రాజకీయవిద్య కాబట్టి ఇంగ్లీషు నేర్చుకోవాలనీ, బాల్య వివాహాలు కన్యాశుల్క,వరశుల్కాలను నిర్మూలించాలనీ, బాలికాపాఠశాలలో స్త్రీలను ఉపాధ్యాయినులుగా ఉంచాలని ప్రభుత్వాన్ని కోరాలనీ, స్త్రీ జాతి అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించారు ఈ వ్యాసంలో.

యం.సుశీల- 'ఆంధ్రోద్యమం' :

(ఏప్రిల్,1914, ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) అనే శీర్షిక వ్యానంలో ఆంధ్రదేశోద్యమం అంటేనే ఆంధ్రజాతీయతనుద్ధరించే సాధనం అనీ, హైందవ జాత్యోద్ధరణకు ఆంధ్రోద్యమం ముఖ్యమనీ, దత్త మండలంలో కళాశాలలు, పత్రికలు లేవనీ ఉన్నత విద్య నభ్యసించిన యువకులు పోరాడుతున్నారని తెలిపారు. వ్యవసాయానికి ఉపయోగపడే పారిశ్రామిక విద్యలు అవసరమనీ, మసరీన్ (మచిలీపట్నం) వస్త్రాలతో పరదేశాలకు వ్యాపారాభివృద్ధి జరగాలనీ, ఆంధ్రభాష గొప్పతనాన్ని గుర్తిస్తేనే విద్యావంతులు కాగలరని సమగ్ర మానవ జాతీయోద్ధరణానికి 'ఆంధ్రోద్యమము' మార్గదర్శకం కావాలని తెలియజేశారు.

జాతి ఉద్ధరణకోసం ఆంధ్రోద్యమం సాగాలనుకోవటంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికిగల చరిత్ర ప్రారంభమైందని అర్థమవుతుంది. 1911 నుండి కొనసాగుతున్న ఆంధ్రోద్యమం స్వాతంత్ర్యోద్యమానికి సమాంతరంగా జరుగుతూనే ఉంది.

చట్రాతి లక్ష్మీనరసమ్మ 'స్త్రీ స్వతంత్ర జీవనావశ్యకత' :

అనే (ఏప్రిల్ 1916, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో) వ్యాసంలో విద్యావంతులైన స్త్రీలు తమబిడ్డల విద్యాభివృద్ధికై ప్రోత్సహిస్తున్నారనీ, స్త్రీలు గృహకృత్య నిర్వహణలో సమర్థులుగా ఉన్నారుగాని వారికి స్వతంత్ర జీవనం అవసరమని వారు భావించటం లేదని తెలిపారు. పూర్వము స్త్రీ, పురుషులు కలిసి వృత్తులు చేసుకునేవారనీ ఇప్పుడు స్త్రీలు నవీన విజ్ఞానాన్ని పొంది వ్యాపారవేత్తలై జీవించాల్సిన అవసరముందని అందరూ గుర్తించాలని తెలియజేశారు. ద్రవ్యము పదార్థముగా మారినప్పుడే అభివృద్ధి అనేది జరుగుతుందనీ ఆర్థికాభివృద్ధి లేనిదే దేశాభివృద్ధి జరగదనీ, స్త్రీలు పురుషులతోపాటు విద్యలు నేర్చితే వారికి స్వతంత్ర జీవనం ఉంటుందనీ, అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. స్త్రీలకు ఆర్జనావకాశం యిచ్చి వారికి స్వాతంత్ర్యం ఇస్తేనే ఐకమత్యం పెరిగి వారిలో దేశాభిమానం పెరుగుతుందని పేర్కొన్నారు.

స్త్రీల స్వతంత్రజీవనావశ్యకతను గుర్తించటమే వారి స్వేచ్ఛకు చిహ్నంగా భావించారు. దేశ ఆర్థికస్థితిని పెంచగలిగే మార్గాలను రచయిత్రి ఒక ఆర్థికశాస్త్రవేత్తగా తెలియజేస్తూ స్త్రీలు వస్తూత్పత్తి రంగానికి ఉపయోగపడే వివిధ విద్యలు నేర్చుకొని నాటి కాలానుగుణంగా స్త్రీలు వ్యాపార వేత్తలుగా ఎదగగలిగితేనే స్త్రీలకు స్వతంత్రజీవనం ఏర్పడుతుందని భావించారు. అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని తెలియజేస్తూ స్త్రీవిద్యకు, స్వతంత్ర జీవనానికి, జాతీయ అభిమానానికి ఉన్న లంకెను చట్రాతి లక్ష్మీనరసమ్మగారు నాడే పట్టుకోవడం గొప్ప విషయం.

పెండ్యాల బాలాత్రిపురసుందరమ్మ 'దేశభక్తి' :

(అక్టోబరు,1914, హిందూసుందరి) అనే వ్యాసం రాస్తూ, దేవభక్తి మనస్సును పరిశుద్ధం చేస్తే దేశభక్తివలన దేశము అభివృద్ధి చెందుతుందనీ, స్వదేశాభిమానం కలిగిన దేశభక్తి, దైవభక్తి కంటె గొప్పదని తెలిపారు. దేశభక్తి విలువైనదనీ ఆంగ్లేయులు వ్రాసిన ప్రతి పుస్తకంలో దేశభక్తిని గురించిన అంశముంటుందనీ, ఆంగ్లేయుల దేశచరిత్రలు చదవటం వల్ల భారతీయులలో కూడా దేశభక్తి కుదురుకుంటోందని తెలియజేశారు. దైవభక్తి కంటె దేశభక్తి గొప్పదని భావించారు పెండ్యాల బాలాత్రిపుర సుందరమ్మ.

ఎమ్.ఎన్.కమల రాసిన 'హైందవ స్త్రీలు - దేశసేవ':

(ఏప్రిల్,1917,ఆంధ్రప్రతిక ఉగాది వార్షిక సంచిక)

అనే వ్యాసంలో దేశాభివృద్ధికై రాజకీయ, సాంఘిక, నైతిక విషయాలలో స్త్రీల సహాయం అవసరమనీ, స్త్రీలు దేశ సేవకు అర్హులని గుర్తించాలనీ, స్త్రీవిద్యాభివృద్ధి జరగాలని తెలిపారు. అహల్యాబాయి యొక్క రాజ్యమునందలి స్త్రీలు పాటుబడిన సంఘసేవ, దేశసేవ చేశారనీ, స్త్రీలు ఔనత్యమే దేశాభ్యుదయం కాబట్టి దేశభక్తులెల్లరు స్త్రీ జనులకు ఉన్నత విద్యను నేర్పి దేశసేవకు వారిని అర్హులుగా చేయాల్సిన కర్తవ్యం ఉందని తెలియజేశారు. స్త్రీలు తమ ఇంటిలోని వారికి సేవ చేయటమేగాక దేశానికికూడా సేవ చేయాల్సిన కర్తవ్యాన్ని ప్రబోధించిన వ్యాసమిది.

కనుపర్తి వరలక్ష్మమ్మ - 'స్త్రీ స్వాతంత్ర్యం' :

(సెప్టెంబరు,1918, అనసూయ పత్రికలో) అనే శీర్షిక కింద వ్యాసం రాస్తూ స్త్రీలు పురుషుల క్రింద బానిసలు కారనీ, వివాహం ఆమరణాంతపు బీగమని స్త్రీలకొకింత స్వేచ్ఛ ఉండాలనీ, స్త్రీలు పురుషులవలె సమానంగా పుట్టారనీ, స్త్రీలకు బుద్ధి, మనసు, జ్ఞానం యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం ఉన్నా కూడా బలవంతమగు జాతి బలహీనమగు జాతిని కించపరచుట స్వాభావికమేనని చెప్పారు. (ఇక్కడ పాఠకులకు 1938 లో శ్రీశ్రీ రాసిన 'దేశచరిత్రలు' అనే గేయం గుర్తుకురాక మానదు.) పురుషులు స్త్రీలను అణగద్రొక్కుతున్నారనీ, స్త్రీలు విద్యావంతులైతే లోకజ్ఞానం ఏర్పడి స్వాతంత్రకాంక్ష ఉదయిస్తుంది కాబట్టి స్వాతంత్రవాదులు స్త్రీలను స్వతంత్రులుగా భావించటమేగాక రాజకీయ స్వాతంత్ర్యానికి కూడా స్త్రీలు అర్హులని భావించమని ఈ వ్యాసంలో తెలియజేశారు. స్త్రీల పుట్టుక, ఎదుగుదల, స్వేచ్ఛవంటి విషయాలలో స్త్రీలు పురుషులతో సమానమనే భావన ఏర్పడాలనీ, అదే సమాజాంతర్గత సంస్కృతిగా స్వాతంత్ర్యాన్ని ఇస్తుందని తెలియజేశారు.

పురుషాధిక్యతను పేర్కొని స్త్రీల స్వాతంత్ర్యానికి అది అడ్డుగా ఉందనీ, స్త్రీలు స్వతంత్రులైతేనే రాజకీయ స్వాతంత్ర్యాన్ని అనుభవించగలరనీ, అప్పుడే దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని భావించారు. పితృసామ్య సంస్కృతి స్త్రీల స్వాతంత్ర్యానికి దేశస్వాతంత్ర్య సాధనకు గొడ్డలిపెట్టువంటి విషయమనీ, దానిని విమర్శకు పెట్టిన తొలివ్యాసమిది. దేశానికి స్వాతంత్ర్యం కావాలనుకుంటే పురుషులు ముందుగా స్త్రీల రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఒప్పుకోవాలనీ చెప్పిన తొలి మహిళ కనుపర్తి వర లక్ష్మమ్మగారు.

'బాలికలు - లోకసేవ' :

(జూన్,1927, భారతి) అనే వ్యాసంలో రొట్టెకల్ సుబ్బమ్మ భారతదేశంలో కూడా 'గరల్ గైడింగ్' ఉద్యమం బాలికలలో ప్రచారం కావాలనీ, దాని ప్రకారం స్త్రీలు లోకమునకు, తమ స్వదేశమునకు, ప్రజాకోటికి సేవచేసే విధంగా బాలికా వ్యవస్థలోనే శిక్షణ పొంద గలుగుతారనీ, దేశానికి వారి అవసరముందని తెలియజేశారు. దేశసేవను బాలికా విద్యలో భాగంగా పాఠ్యాంశ శిక్షణారూపంలో పెట్టాలనుకోవటమే నాటి బాలికలను భవిష్యత్తులో దేశపౌరులుగా తీర్చిదిద్దాలనుకోవటంగా అర్థమై, ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇది నేటి జాతీయసేవా పథకం వంటిది.

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు 'నన్ను మఱచినను దేశమును మఱవవద్దు' (అక్టోబరు,1929,భారతి) (స్వ.స్వా.పు.144) అనే వ్యాసంలో స్త్రీలకు దేశసేవ ఉంటే తప్పా దేశస్వాతంత్ర్యం సిద్ధించదని భావించారు. గాంధీ మాటల్లో స్వాతంత్ర్యోద్యమ సాధనలో స్త్రీల భాగస్వామ్యానికి ఎక్కువ ప్రాధాన్యతవుందని అర్థమవుతుంది. అలాగే కొత్తపల్లి కౌసల్యాదేవి - 'స్వయంకృషి - స్వతంత్ర జీవనము' (డిసెంబరు, 1929, గృహలక్ష్మి పత్రిక) (స్వ.స్వా.పు.151) వ్యాసంలో నత్యాగ్రహ ఉద్యమంలో ఖద్దరు తయారీ, ఖద్దరు వస్త్రధారణకై ప్రచారం జరగటం ముఖ్యం. స్త్రీల స్వీయశక్తి వినియోగం వారి స్వతంత్ర జీవనానికి బాటలు వేస్తుందనీ, అదే దేశ స్వాతంత్ర్య సాధన అనీ, రెండింటికి వున్న అనుబంధాన్ని స్పష్ట పరిచింది.

పాలపర్తి సరస్వతి-'జాతీయారోగ్యము-స్త్రీల కర్తవ్యం' :

(మే, 1932, గృహలక్ష్మి) (స్వ.స్వా.పు.192) వ్యాసంలో పోషకాహార విలువలను స్త్రీలు గుర్తించి తమ పిల్లలను ఆరోగ్యవంతులుగా పెంచగలిగితే దానంతటదే దేశం మానవాభివృద్ధి సూచికలో ఉన్నతస్థానంలో ఉంటుందనీ అదే దేశప్రగతి అనీ, పిల్లలందరూ శక్తియుక్తులైన పౌరులై స్వాతంత్ర సమరోద్యమంలో నిలబడుగలుగుతారనీ భావించారు.

చిలకపాటి భారతీదేవి 'అస్పృశ్యత' :

(జనవరి,1933,గృహలక్ష్మి) (స్వ.స్వా.పు.201) వ్యాసంలో సమాజంలో స్త్రీలు, హరిజనులు సమాన బాధితులేనని భావించారు. దేశ స్వాతంత్ర్యోద్యమ సాధనలో హరిజనోద్ధరణ భాగంగా ఉండాలని తెలియ జేశారు.

'స్త్రీ మహిమ' :

(జనవరి, 1934, గృహలక్ష్మి) (స్వ.స్వా.పు.209) వ్యాసంలో చిక్కపాటి సీతాంబగారు స్త్రీల విద్య కుటుంబా నికి, దేశానికి కూడా అవసరమనీ, వారు విద్యనేర్చి జ్ఞానవంతులైన తర్వాత ఆ జ్ఞానాన్ని దేశభవితకు, దేశదాస్య విముక్తికి ఉపయోగించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. గ్రామీణుల, పట్టణవాసుల దేశభక్తికి సంబంధించిన విషయాలలోని ఆంతరాలను కూడా ఈ వ్యాసంలో తెలియజేశారు.

యార్లగడ్డ చిలుకమ్మగారు 'దేవీజోన్' :

(జనవరి,1935,గృహలక్ష్మి) (స్వ.స్వా.పు.257) వ్యాసంలో ఫ్రాన్సు యువతి యొక్క స్ఫూర్తిని ఆంధ్రస్త్రీలు పొందేవిధంగా రాస్తూ, 15వ శతాబ్దానికి చెందిన ఆమె మగ వేషమును ధరించి, సైన్యంలో చేరి ఆంగ్లేయుల ఆక్రమణలో దాస్య శృంఖలా బద్ధమైన ఫ్రాన్సును విముక్తి చేసి జన్మభూమికోసం జైలులో కష్టాలుపడి జీవితాన్ని త్యాగం చేసిన సబలఅంటూ, స్త్రీలు అబలలుకారనీ, స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనాలనే స్ఫూర్తిని కలిగించ డానికి రాసిన వ్యాసమిది. దీనికిముందే 'జోన్‌ఆర్క్' అనే పేరుతో 1900సం॥ నాటికే భండారు అచ్చమాంబ కూడా ఈ విషయాలతో కూడాన వ్యాసాన్ని రాశారు.

డి.ఎస్.రాజేశ్వరమ్మ రాసిన 'అస్పృశ్యతా నివారణ మవసరమా' :

(మార్చి,1936, గృహలక్ష్మి) అనే వ్యానంలో స్వప్రయోజనమైన వర్ణ భేదాలవల్ల సుహృద్భావం తగ్గి స్వరాజ్య సంపాదనకు అవరోధంగా ఉన్నదనీ, విజ్ఞానం ప్రబలటంతో స్వతంత్ర ఆలోచనలపై ఆధారపడి పరాధీనతను రూపుమాపాలనుకుంటున్నారని భావిం చారు.....హరిజనలను కలుపుకుంటూ స్వతంత్రోద్యమం సాగితేనే భారతదేశానికి స్వాతంత్ర్యం సులభతర మవుతుందని భావించారు.

జ్ఞానాన్ని ప్రసాదించగలిగేది, జాతికి జీవకళను ఇచ్చేది సాహిత్యమే. ఇతర దేశాల సాహిత్యం సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలలో గొప్ప మార్పును కలిగించి, ఆత్మస్వాతంత్ర్య బీజాన్ని నాటగలిగింది. అటువంటి స్వతంత్ర బీజాలు నాటగల తెలుగు సాహిత్య సృజన ఆధునిక కాలంలో అవసరమని తెలుస్తుంది. అటువంటి సాహిత్యాన్ని స్త్రీలు సృజించగలిగి నాటి స్త్రీలలో ఆత్మ స్వాతంత్ర్య బీజాన్ని నాటగలగడం చేతనే స్త్రీలు వ్యక్తి స్వాతంత్ర్యంతో దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగ స్వాములు కాగలిగి, తమ దేశభక్తిని చాటుకున్నారని పై వ్యాసాల వల్ల తెలుస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. కనకదుర్గ, జంధ్యాల.స్వతంత్రత నుండి.....స్వాతంత్ర్యానికి (తెలుగులో స్త్రీల సాహిత్యం క్రీ.శ.1900-1947). జంకదు ప్రచురణలు, గుంటూరు,జులై,2021.

2. లావణ్య సరస్వతి,ఎమ్. రాయప్రోలు రచనలు-తత్వవివేచన. ఆంధ్రసారస్వత పరిషత్తు. ఫిబ్రవరి,1988.
3. పద్మావతి,డి. తెలుగులో స్త్రీల పత్రికలు - ఒక పరిశీలన (1883-1947). హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎం.ఫిల్,ముద్రితం. చంద్రశేఖర ప్రింటింగ్ వర్క్స్, సికింద్రాబాదు. ఏప్రిల్,1989.
4. రామమూర్తి, కలువగుంట. తెలుగులో మహిళా పత్రికలు - మహిళాభ్యుదయం. వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఎంఫిల్ పట్టాకొరకు సమర్పించిన లఘుసిద్ధాంత వ్యాసం,1984.
5. కుటుంబరావు,కొడవటిగంటి. వ్యాస ప్రపంచం-2, చారిత్రక వ్యాసాలు. విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్, అక్టోబరు, 1999.
6. మాలకొండారెడ్డి,ఉండెల. వెండివెలుగులు -యువభారతి రజతోత్సవ సంచిక. యువభారతీ సిల్వర్ జూబ్లీ పబ్లికేషన్, ఆంధ్రసారస్వత పరిషత్తు,హైదరాబాదు, జూన్,1992.

❖❖❖

దువ్వూరి రామిరెడ్డి గారి 'స్వాతంత్ర్య రథము' - దేశభక్తి ప్రబోధం

– డా॥. పట్నపు శివకుమార్, తెలుగు ఉపన్యాసకులు, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల, తి.తి.దే., తిరుపతి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో దువ్వూరి రామిరెడ్డి గారు అనర్ఘరత్నం. దువ్వూరి రామిరెడ్డి గారు భావ కవితా యుగంలో వికసించిన విశిష్ట పుష్పం. తెలుగు సాహిత్య లోకంలో 'కర్షకకవి'గా ఎంతో గొప్ప ప్రశస్తిని పొందిన రామిరెడ్డి గారు ప్రసిద్ధ భావ కవులైన కృష్ణశాస్త్రికి, అబ్బూరి వారికి సమకాలికులు. దువ్వూరి రామిరెడ్డి గారు నెల్లూరు జిల్లా గూడూరులో 09-12-1895 సంవత్సరంలో జన్మించారు. రామిరెడ్డి గారు పాఠశాలకు వెళ్లి చదివిన చదువు తక్కువ. అయినప్పటికీ ఆయన తన స్వయం కృషితో తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచి, బెంగాలీ, సంస్కృతం, జర్మన్, పర్షియన్, ఉర్దూ, తమిళ భాషలలో పాండిత్యము సంపాదించిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపును పొందారు. చిత్రలేఖనము, శిల్పకళలలో కూడా రామిరెడ్డి గారికి ప్రవేశం కలదు. తెలుగు చలన చిత్రనిర్మాణం ప్రాథమిక దశలోనే 'చిత్రనళీయము' అనే చలన చిత్రానికి రామిరెడ్డి గారు దర్శకత్వం వహించారు.

దువ్వూరి రామిరెడ్డి గారి రచనలు :

1. కృషీవలుడు, 2. జలదాంగన, 3. నలజారమ్మ అగ్నిప్రవేశము, 4. నక్షత్రమాల, 5. నైవేద్యము, 6. వన కుమారి, 7. పానశాల (ఉమరు ఖయ్యాం 'రుబాయీల' అనువాదం), 8. గులాబి తోట, 9. పండ్ల తోట మొద లైనవి ప్రసిద్ధమైనవి.

కవితా ప్రశస్తి :

''ప్రస్తుతము నా ముందు మాటలు దువ్వూరి రామి రెడ్డి శతజయంతి ఉత్సవమునకు సంబంధించినవి. వీరు కాలేజీలో చదవలేదు. కవితా ప్రతిభనంతా స్వయంకృషితో ఆర్జించుకున్నారు. ఇంగ్లీషు బాగా చదివి తాను రచించిన కొన్ని తెలుగు ఖండికలను తానె ''వాయిస్ ఆఫ్ ది రీడ్'' పేర ఇంగ్లీషులో కవితల సంపుటిని రచించి వెలువరించి నారు. వీరు చాలా చిన్న వయస్సులోనే దివంగతులగుట శోచనీయమైన విషయము.... వీరు ముఖ్యముగా వ్యవసాయ కుటుంబములో జన్మించినవారై గ్రామీణ ప్రజల సుఖ దుఃఖములను తమ కావ్య వస్తువులుగా గ్రహించినారు. అది వీరి ప్రత్యేకతయేమోనని నా యభిప్రాయము.'' అని ప్రసిద్ధ సాహితీకారులు బెజవాడ గోపాలరెడ్డి గారు దువ్వూరి వారిని 'కవికోకిల గ్రంథావళి'కి రాసిన ముందు మాటలో ప్రశంసించినారు.

''స్వచ్ఛంద ఆశయాలు, స్వేచ్ఛానురక్తి, నిర్మల జాతీయతా దువ్వూరి వారికి కవితా ఆవేశాన్నిచ్చాయి. ఈయన ఆంగ్ల ఫారసీ వ్యామ్యాల్లో నుండి పలుకుబడిని గ్రహించాడు. నూతన భావాలకు కూడా తెలుగు జాతీయతను అద్ది నిర్దుష్టంగా - స్పష్టంగా చెప్పగల కవితా చేవ వీరికుంది. పూర్వ పద్ధతుల మీద అభిమానం మెండయినా అభిసారిక వంటి క్రొత్త రచనా పోకడలు సాహిత్యంలో వీరు ప్రవేశపెట్టారు. నగర విజ్ఞానాన్ని చవిచూసినా జీవితాన్ని పొలం గట్టుకే మరలించి కర్షక కవిగా ఖ్యాతిని పొందాడు. వాల్మీకి మహాకవి కళా సంపత్తిని అనుభవింపగలడు. గరిక పోచ కదలికతో హృదయం శ్రుతి కలిపి విశ్వవ్యాప్త జీవిత రహస్యం గ్రహించగలడు.'' అని 'వైతాళికులు' కవితా ఖండికల సంకలన కర్త ముద్దుకృష్ణ దువ్వూరి రామిరెడ్డి గారిని గురించి పేర్కొన్నారు.

దేశభక్తి కవిత్వం :

తెలుగులో దేశభక్తి కవిత్వమును గురించి పేర్కొంటూ, ''దేశభక్తికి స్వధర్మము, ఋతము మూల భూతములైన విషయములు. దేహ సౌష్ఠవము ప్రత్యంగ వికాసము పై ఆధారపడియున్నది. అట్లే దేశము యొక్క సర్వాంగీణస్ఫూర్తి ఆ దేశములోని నదులు, కొండలు,

చెట్లు, మృత్తిక మున్నగు వానిపై ఆధారపడియున్నది..... భారతదేశము కర్మభూమి. కర్మాచరణమునకు దేశభక్తి మూలసత్త్వమని వారు గమనించిరి. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్న ప్రాచీనసూక్తి ఈ విషయమునే అభివ్యక్తము చేయుచున్నది. ఆధునిక కవులు గానమొనర్చిన దేశభక్తి మాత్రము జాతీయతా భావన నుండి పుట్టినదే." అని ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు భావించారు.

ఆధునికాంధ్ర కవిత్వంలో దేశభక్తి ప్రధానంగా రెండు మార్గాలలో వెలువడింది. ఒకటి జాతీయాభిమాన సంబంధమైనది. రెండవది ఆంధ్రాభిమాన సంబంధమైనది. 1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ ను రెండు ముక్కలుగా చేయటంతో భారతీయుల గుండె భగ్గు మన్నది. దీనికితోడు ఆంధ్రదేశంలోని రాజమండ్రి, విజయవాడ, బందరు, నెల్లూరు మొదలైన పట్టణాలలో బిపిన్ చంద్రపాల్ చేసిన ఉపన్యాసాలు కూడా తోడై, అంతవరకు ఆంధ్రుల మనస్సులలో అంకుర ప్రాయంగా ఉన్న జాతీయాభిమానం ఒక్కసారిగా ప్రజ్వరిల్లింది. ఆ సంఘటన కలిగించిన స్ఫూర్తితో తెలుగులో దేశభక్తి కవిత్వం వెలువడింది. తెలుగు దేశభక్తి కవిత్వంలో రాయప్రోలు వారి తర్వాత 'ఆత్మ విశ్వాస సూర్యోదయ' కాంతులతో భారత జాతీయ ప్రబోధ గీతములు ఆల పించిన కవి దువ్వూరి రామిరెడ్డి గారు.

స్వాతంత్ర్య రథము :

ఈ కవితా ఖండిక దువ్వూరి రామిరెడ్డి గారు స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో రాసినది. 'స్వాతంత్ర్య రథము' ఆనాటి ఆంగ్లేయుల పరిపాలనలో అనేక బాధలను అనుభవిస్తూ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేక అలమటించే భారతీయులను ఉద్దేశించి ప్రబోధిస్తుంది. ఆనాటి సమాజంలో ఉన్న అవిద్య, అజ్ఞానము, అనైక్యత, కక్షలు, కార్పణ్యాల మూలంగా సతమతమవుతూ, శాంతికి కరువై దుర్భర జీవనమును గడుపుతున్న ప్రజలను చూసి, వారిలో ఉన్న అనమానతలు తొలగి పోవాలని, అన్యాయాలు అంతరించి సమ సమాజ స్థాపన జరగాలని, అందరు సమైక్యమై స్వాతంత్ర్యమును సాధించుకోవాలని, విశ్వవ్యాప్తంగా ఉన్న మానవులు అందరు సమానమేనని, అందరి శాంతిని కోరవలెనని ప్రబోధం చేస్తూ దువ్వూరి రామిరెడ్డి గారు రాసిన పద్య కవితా ఖండిక 'స్వాతంత్ర్య రథము'.

''వీరు జాతీయతకు అస్థిపంజరములను సైత మాడించు శక్తి యున్నదని యీ శతాబ్ది రెండవ పదిలోనే గుర్తించినారు. 'అంబుదంబుల అమృత పూరంబు లొలుక'గా 'ఇంద్ర చాపంపుతో రణమింపు గులుక'గా వినువీధిలో వెడలు స్వాతంత్ర రథమును దర్శించి అద్భుతావృతులైనారు. నిజమే. అప్పటికి స్వాతంత్ర్య భావస్యందన మింకను గగన వీధుల లోనే యున్నది. క్రిందికి దిగలేదు. అది ఆకాశ వీధులలో నున్నను, దాని సత్వమును గమనించిన ద్రష్ట రామిరెడ్డి గారు.'' అని ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు తమ 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు: ప్రయోగములు' అనే పరిశోధక గ్రంథంలో దువ్వూరి రామిరెడ్డి గారి 'స్వాతంత్ర్య రథము' కవితా ఖండికను గురించి ప్రస్తుతించినారు.

''అదిగో అందరు ఎదురు చూచుచున్న
స్వాతంత్ర్య రథము బయలు దేరినది ...''

అని అంటూ రామిరెడ్డి గారు 'స్వాతంత్ర్య రథము' కవితను మొదలు పెట్టినారు. ఈ కవితలో దువ్వూరి రామిరెడ్డి గారు వారి భావాలను దేశభక్తి ప్రబోధాత్మకంగా ప్రకటించారు.

'మేఘాలలో సుధలు జాలువారుతుండగా, ఇంద్ర ధనుస్సు తోరణమై పులకరింపగా, నీలాల కాంతులు నలు దిక్కుల వ్యాప్తిని పొందగా వినువీధిలో స్వాతంత్ర్య రథము వెడలుచున్నది.' అని దువ్వూరి వారు తమ స్వాతంత్ర్య రథమును ముందుకు నడిపించినారు.

మేఘమాలలలో బయలుదేరిన స్వాతంత్ర్య రథము తన దివ్య కాంతితో మేఘ మండల అగ్ర భాగమును చీల్చుకొని, ఆకాశమంతా వ్యాపించిన చీకటులను

పారద్రోలినది. ప్రదేశాలన్నింటినీ నూతన కాంతులతో మొలకెత్తింప జేస్తున్నది. అరుణోదయ సూర్యబింబము వలె శోభలు విరజిమ్ముచు విశ్వమంతటను సమస్త సృష్టిలో నవీన సహానుభూతిని కలిగించినది. అంటే ఆ స్వాతంత్ర్య రథము అప్పటివరకు లోకంలో ఉన్న కష్టాలనే చీకట్లను తొలగిస్తూ, అందరిలోనూ సహానుభూతి అనే సోదరభావాన్ని కలిగించినది అని కవి భావన.

'ఆ దివ్య స్వాతంత్ర్య రథములో మహా తేజస్సుతో దుర్నివారమై వెలిగిపోతూ మహాప్రభావ సమగ్రయై ఒక పవిత్ర మూర్తి కన్నుల పండుగ చేస్తూ ఉన్నది. రూపము తాల్చిన ధర్మమూ, కంటికి కనిపించు శాంతి చంద్ర బింబమో, నిర్మలమైన నిత్యమునకు ఆలయమో, సంసార ఫల స్వరూపమో అన్నట్లుగా ప్రజా హృదయములో వెలుగుచుండెను.' అని అనటం ద్వారా, ఆనాటి ప్రజా హృదయమే ఆ రథము నందు దీప్తిమయమై కనిపించినదని, అదే దేవీ రూపములో ఉన్నదని కవి భావన. ఆ శాంతిదేవి (స్వాతంత్ర్య దేవి) ఒక చేతిలో రుధిరపు పాత్ర, వేరొక చేతిలో పీయూష పాత్ర తీసుకొని, కరుణా వేశము దీపింపగా,

"పచ్చినెత్తురు నమృతంపు పాత్రబోసి
దివ్యదుగ్ధంబుగా . . . . . "

మార్చినదని రామిరెడ్డి గారు అభివర్ణించినారు. అంతే కాకుండా సభ్యతామిషతో దేశములను అస్వతంత్రంగా చేసి పీడించే పాలకుల అన్యాయం ఇకముందు చెల్లదని, పచ్చినెత్తురు, అమృతము కలవటం అనగా పారతంత్ర్యం నశించి స్వాతంత్ర్యం ప్రాప్తించటమే అని రామిరెడ్డి గారు తమ కవితలో భవిష్యత్తును ధ్వనింపజేసినారు. మరొక భావనలో ఆ శాంతి దేవి తన దివ్య మహిమతో పచ్చి నెత్తురును కూడా అమృత పాత్రలో పోసి పవిత్రముగా మార్చెను అని గ్రహించవచ్చు. అయితే శాంతి దేవి ఈవిధంగా చేయటం ఎందుకనగా, 'హాలాహలము లోపల నుండి అమృతము పుట్టును' అనే సత్యాన్ని ఈ లోకంలో తెలియజేయటానికి కాబోలు! అని భావించవచ్చు.

ఆకాశ మార్గంలో బయలుదేరిన ఆ రథము ఎక్కడా ఆగటం లేదు. దిక్కులేని అనాథల బాష్ప జల బిందువు లను చూసి కాని, ప్రజలను అనేక విధాలుగా బాధిస్తూ దండనీతితో ధరణిని పాలిస్తున్న పల్లపు నేల ఉన్న చోట కాని ఆగటం లేదు. మోసాలు చేస్తూ, దుర్మార్గముగా ప్రవర్తించు దురాత్ముల వద్ద కూడా ఆ స్వాతంత్ర్య రథము ఆగటం లేదు. ఆ రథము అనర్గళమయిన వేగంతో కన్ను లకు కానరాని చోటికి వెళ్లుతున్నది. వేగంగా వెళుతున్న స్వాతంత్ర్య రథ చక్ర సంస్పర్శతో, రాపిడిలో, పూర్వ సింహాసనములు, ప్రకాశించే మణిమయ కిరీటాలు మొదలైనవన్నీ నలిగిపోయి గుర్తించుటకు వీలులేని విధంగా రూపు మాసి పోయినవి.

"పూర్వసింహాసనంబులు, ప్రోజ్జ్వలంపు
మణిమయకిరీటములు భోగమందిరములు
చక్రసంఘర్షణంబున జదిసిపోయి
యవియివియనంగరాక రూపఱెడు"

అని వర్ణించారు దువ్వూరి రామిరెడ్డి గారు.

అయితే 'ఆ దేవి అధిరోహించిన రథమునకు దివ్య తురంగాలు లేవు. ఏనుగులు కూడా లేవు. ప్రజలే ఆ రథానికి మోకులను పట్టుకొని, ఎన్నో వందల ఆటం కాలను అన్నింటినీ అధిగమించి వాయు వేగముతో తారావీథిలో ఆ రథమును నడిపిస్తున్నారు.' అని కవి చెప్పటంలో, ఆ రథపు మోకులను పట్టి లాగునవి ఏనుగులో, గుర్రములో కాకుండా ప్రజలే అని, ఆ చక్రనేములు తాకిన స్థలములన్నీ సస్యలక్ష్మికి కళ్యాణ శాలలు అవుతాయని, స్యందనాసీన అయిన ఆ దేవి శాంతి గానము చేసినదని, ప్రజాచైతన్యమునకు, స్వాతంత్ర్య భావనకు ఒక మూర్తిని, స్ఫూర్తిని కలిగించి నారు రామిరెడ్డిగారు.

'రథము పయనించిన మార్గాలన్నింటిలో నెత్తురు ఏరులు పారి పారి బంగారు పంటలు పండించినది.

చక్రపు ఇరుసులు ఒరుసు కొనిన ప్రతిచోట సస్యలక్ష్మికి కళ్యాణ మండపాలు నిర్మాణమయినవి. రథము పై కూర్చున్న ఆ శాంతి దేవి ప్రజలందరికి 'శాంతి - శాంతి' అనే మంజులు గానము వినిపించి, సంతోష పరచి తనను చూస్తున్న ప్రజలందరు ఆశ్చర్యపడుతుండగా ఒక నవ్య నక్షత్ర వీణా స్వనములో కలిసి అంతర్ధానమయినది.' అని రామిరెడ్డి గారు కవితను ముగించినారు. అనగా స్వాతంత్ర్య సముపార్జనతో ప్రజలు ప్రశాంతచిత్తులై నక్షత్ర మండలంలోని ఒక లోకంలో ఉన్న అనుభూతిని పొంది నారని కవి వర్ణించాడు.

ఈకవితా ఖండికలో దువ్వూరివారు స్వాతంత్ర్యమును ప్రజలందరు సమైక్యతలో సాధించ వలెనని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మానవుడికి తప్పని సరిగా ఉండాలని ఆశించారు. విశ్వ శాంతిని మదిలో తలచి రామిరెడ్డి గారు ఈ కవితను రచించారు అని చెప్పవచ్చు.

ముగింపు :

''ఇది ఒకవైపు భారత జాతీయోద్యమద్యుతులను వెలిజిమ్ముచున్నను, ఇంకొకవైపు సామ్యవాద స్ఫులింగములను వెలార్చుచున్న రచన. 'జగన్నాథ రథచక్రాలను శ్రీశ్రీ గగనవీధి నుండి మరలించక పూర్వము, రామిరెడ్డిగారు అక్కడ స్వాతంత్ర్య రథాన్ని ప్రజలు మోకులతో లాగుతుంటే చూశారు. రాయప్రోలు వారి 'అహంకార దర్శనము' రామిరెడ్డి గారిలో 'ఆత్మ విశ్వాస సూర్యోదయము'గా మారినది. రామిరెడ్డి గారి వలె జాతీయ భావనకు, సంఘచైతన్యము నద్దినవారు భావకవులలో లేరని చెప్పవచ్చును.'' అని ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు తమ సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు. ఈ ప్రశంస దువ్వూరి రామిరెడ్డి గారి 'స్వాతంత్ర్య రథము' కవితా ఖండికలోని దార్శనికతకు నిదర్శనమని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. కవికోకిల గ్రంథావళి (1, 2 సంపుటములు) - దువ్వూరి రామిరెడ్డి
2. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు: ప్రయోగములు - డా. సి. నారాయణ రెడ్డి
3. తెలుగు సాహిత్య సమీక్ష - డా. జి. నాగయ్య

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సింహపురి మణి దీపిక జమీన్ రైతు పత్రిక

– డా॥. ఎస్. కమత, అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగువిశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.

పరతంత్ర పాలనలో అస్తిత్వాన్ని కోల్పోయిన భరత జాతికి వైభవాన్ని తెచ్చే ప్రయత్నంలో ఎందరో దేశభక్తులు తమ జీవితాలనుతృణప్రాయంగా భావించి స్వాతంత్ర్యం కోసం, పరతంత్రపాలనలో కోల్పోయిన తమ వారి నైతిక హక్కుల కోసం పోరాటం చేసారు. ఎన్నో బలవంత విధానాలను ప్రవేశపెట్ భారత దేశ ప్రజలు తమ అస్తత్వాన్ని కోల్పోయే స్థితిలో పోరాటకారులు వీరిలో చైతన్య స్ఫూర్తిని నింపేందుకు అనేక రకాల ప్రయత్నాలు సాగించారు. తమ రచనల ద్వారా ప్రజలలో దేశభక్తి ప్రభోదించిన వారు, సాయుధ పోరాటం గావించిన వారు, సత్యాగ్రహ మార్గంలో ప్రయాణించిన వారు.. ఇలా ఎందరో సమరయోధులు తమ తమ పరిధుల్లో స్వాతంత్ర్య లక్ష్య సాధనలో పాల్గొన్నారు.

తమ ఉద్యమాలతో, పోరాటగానంతో స్ఫూర్తి కలిగించిన వారు కొందరైతే పత్రికల ద్వారా ప్రజలలో చైతన్యం రగిల్చినవారు మరికొందరు. ''నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను'' అన్న శ్రీశ్రీ మాటలకు అక్షరరూపంగా నిలబడ్డ వారే జమీన్రైతు పత్రికా వ్యవస్థాపకులు శ్రీ వెంకట్రామానాయుగారు. సమాజంలో సంఘంలో నేటి ప్రజల ఈ రకమైన జీవనస్థితి ఎన్నో సంస్కరణల ఫలితం.ఈ సంస్కరణలు ఏవీ వాటంతట అవి జరగలేదు. వీటి వెనుక ఎందరో సంస్కర్తలకృషి, నిబద్ధత, దేశభక్తి ఉంది. ఈ చైతన్యమే వారిని ముందుకు నడిపించింది. ఇటువంటి త్యాగధనుల వల్లే నేడు మనం స్వేచ్ఛా గాలులను పీలుస్తున్నాము.

స్వాతంత్రోద్యమం కోసం, దేశపరిరక్షణ కోసం యుద్ధంలో పాల్గొనడం మాత్రమే కాదు. అందుకు సహకరించే ఏ పని చేసినా, పోరాటస్ఫూర్తిని కలిగించడంలో కార్యోన్ముఖులను చేసిన వారే అసలైన, నిజమైన యోధులు. అటువంటి వారే వెంకట్రామానాయుడుగారు. రైతుకు వెన్నెముకలా నిలబడిన వ్యక్తి, జమీందారీ వ్యతిరేకఉద్యమాలు, స్వాతంత్రోద్యమం రెండింటికీ విశేష ప్రచారం కల్పించి ప్రజలను చైతన్యవంతులను చేయడం కోసం తన జీవితాన్ని త్యాగం చేసారు. జమీన్ రైతు వ్యవస్థాపక సంపాదకుడై, విమోచనోద్యమానికి పత్రికలను అంకితం చేసాడు.

నాయుడు గారు 1891 మే 28న ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలో జన్మించారు. అచ్చమ్మ, రాఘువులునాయుడు వీరి తల్లిదండ్రులు. ప్రాధమిక విద్యాభ్యాసం స్వంత గ్రామంలో పూర్తి చేసారు. అప్పట్లో ఆంగ్ల విద్యపై అపవాదులున్నందువలన 1903లో ప్రైమరీ పరీక్షతో విద్యను ఆపేశారు. 1905లో మైకా గని వద్ద పనిచేస్తుండగా భాగవతం మీద ఆసక్తి కలిగింది. ఇదే ఆయనకు తెలుగును పరిచయం చేసింది. పద్యాలు, జావళీలు చక్కగా రాసేవారు. ఈయన కవిత్వం చాలా సరళంగా ఉండేది. తరువాతి కాలంలో తన స్వంత గ్రామంలోనే కరణంగా పనిచేసే సమయంలో కొన్ని విధానాల ప్రభావంతో ఈయనలో పోరాట పటిమ మేల్కొంది. భారత దేశంలో జమీందారి విధానాన్ని ఆంగ్లేయులు అమలుపెట్టడంతో జమీందారీ రైతుల పరిస్థితి బానిసలకన్నా హీనంగా మారింది. వెంకటగిరి జమీందారి రైతుల సమస్యలు, జమీందార్ల నుండి వారు ఎదుర్కొంటున్న నిరంకుశత్వం కళ్ళారా చూసి చలించి పోయారు. ఇదే వారిని పోరాటం వైపు నడిపింది. 1913లో జమీందారీలునశించాలంటూ కృష్ణా పత్రికలో వ్యాసాలు రాశారు. '' ఉలిపిరి కాగితంలో చుట్టిన ఉక్కుముద్దలు'' గా పేర్కొన్న కృష్ణా పత్రికలో వెలువడిన వీరి వ్యాసాల రూపంలో జమీందార్ల దౌర్జన్యాలు రాష్ట్రంలోని ప్రజలలోకి

వెళ్ళాయి. భారత దేశంలో రైతుకు ఒక వ్యక్తిత్వం ఉండాలని కోరుకున్న తొలినాళ్ళ వ్యక్తి రామానాయుడు.

1933 డిశంబర్లో గాంధీజీ వెంకటగిరిని సందర్శించారు. అదే సమయంలో ఎన్. జి.రంగా గారి ద్వారా రామ నాయుడు గురించి గాంధీ విన్నారు. భారతీదేవి, గాంధీజీకి రామానాయుడిని పరిచయం చేసారు. అదే సమావేశంలో తుమ్మెదా.. మాకొద్దీ జమీందారుపొద్దు అనే పాటలు పాడారు. గాంధీకి తెలుగు రాకపోయినా ఈయన భావం గాంధీజి హృదయాన్ని తాకింది. ఈ ప్రభావంతో ఆయన కూడా పోరాటానికి మద్దతు తెలిపారు. జమీందారీ వ్యతిరేఖ ఉద్యమానికి రంగా, రామానాయుడు రూప ప్రాణాలు గా నిలిచారు. పోరాటం రంగా గారిది, రైతు సమీకరణ నాయుడు గారిది. అప్పట్లో ఉద్యోగాలు చేసే యువకులు కటికినేని కళ్యాణరావు, వెంకట్రామారావు, ఆ గ్రామ మునసబు వారి ఉద్యోగాలకు రాజీనామా చేసి వీరి పోరాటాలకు జత కలిపారు.

వెంకటగిరి జమీందారీ క్రింద అనేక కష్టనష్టాలకు గురైన రైతులలో పొణకా కుటుంబం ఒకటి. 1918 నుండి పొణకా కుటుంబ వ్యవహారాలు చూస్తున్న రామా నాయుడు చూసేవారు. 1930లో మునగాలలో జమీన్ రైతు మహాసభ జరిగింది. ఈ సభకు ప్రకాశం పంతులు గారు వస్తానని రాకుండా ముగించారు. కాళేశ్వరరావు లాంటి పెద్దవారు, రైతులకు వ్యతిరేఖంగా జమీందారు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటువంటి పరిస్థితుల ప్రేరణతో ఒక పత్రిక ఉంటే కానీ ప్రజల కష్టాలు లోకానికి తెలియవనే అభిప్రాయలతో మొదలైనది జమీన్ రైతు పత్రిక. రెబ్బాప్రగడ మండేశ్వర వర్మ, విశ్వనాధదాసులు తప్ప మరెవ్వరూ రైతు సమస్యలపై కలుగజేసుకోలేదు. వెంకటగిరిలో రాజా గోపాలకృష్ణ యాచేంద్ర చనిపోవడం, కుమారుడు గోవిందకృష్ణ చిన్న వయస్సు కావడంతో పరిపాలనా వ్యవస్థ అస్తవ్యస్థంగా మారి రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. 1929, అక్టోబరు 19న జిల్లా జమీన్ రైతు సంఘ స్థాపన జరిగింది. తర్వాత 1930 మార్చి 7న ప్రథమ సంచిక వెలువరించారు.

ఆ తర్వాత ఎన్నో జాతీయ ఉద్యమాలకు ఈ పత్రిక కేంద్రమయ్యింది. ఇందులో జాతిని ఉత్సాహపరిచే అనేక పాటలు, పద్యాలు, వ్యంగ్య రచనలు ప్రచురించే వారు. రామిరెడ్డి , సుబ్బకవి, బెజవాడ గోపాలరెడ్డి, రాయప్రోలు సుబ్బారావు, ఆత్రేయ, గుర్రం జాషువా, స్థానం నరసింహా రావు, చంద్రశేఖర కణ్వశ్రీ, చుండి జగన్నాధం, వెంపటి సత్యం, నాదెళ్ళ, మరుపూరు కోదండరామిరెడ్డి, ఉండేల మాలకొండారెడ్డి, ఎస్.వి. భుజంగరాయశర్మ, వల్లభనేని కాశీవిశ్వనాధం, పురిజాల వెంకటప్పారావు, నారిశెట్టి ఇన్నయ్య, అక్కిరాజు రమాపతిరావు వంటి వారి రచనలు ప్రచురింపబడ్డాయి.

పత్రికలో ప్రచురింపబడిన స్వాతంత్రోద్యమ గేయాలు..

రామానాయుడు రాసిన జమీన్దార్ల పొందు అనేది అప్పట్లో బాగా వ్యాప్తి చెందింది.

జస్టిస్ పార్టీపై ధ్వజమెత్తి...జస్టిస్ పార్టీ అంత్యక్రియల పాటను రాసారు.

''ఎత్తరమ్మా జస్టిస్ హరతి విధవలందరూ
కొత్త కుండలకు నిప్పులు పోసి
చెత్తవాళ్ళు ఉగగ్గం వేసి
చిత్తక్షోభ చేసి తీడుద
ఎత్తరమ్మా జస్టిస్ హరతి'' అనే పాట ప్రజల నాలుకమీద కదలాడేది.

ఈయన సింహపురి స్వరాజ్య శంఖం అనే ఒక సంకలన గ్రంధాన్ని వెలువరించారు. ఇది ప్రభోధాత్మక కీర్తనల సంకలనం. 1930లో బ్రిటీష్ ప్రభుత్వం గాంధీని బంధిస్తే వ్యంగ్య రీతిలో విమర్శించాడు.

విదేశీ వస్త్ర బహిష్కరణ ను ప్రభోధిస్తూ

''పెట్టరే రాటము బెట్టరే
స్వరాజ్యం, స్వారాజ్యం
గుడ్డలోయమ్మ గుడ్డలో
నా తల్లి రాటమా
వడుకు వడుకు కదుర
కట్టకుమా సీమబట్ట '' అంటూ ధ్వజమెత్తారు.

1930లో ప్రారంభమైన జమీందారీ రైతు 1934 లో జమీన్ రైతుగా రూపాంతరం చెందింది. ఇది ఎన్నో ఆటుపోట్లను, లావాదేవీలను, పోలీసు దౌర్జన్యాల కేసులను ఎదుర్కొన్నది. ఈ పత్రిక మూసివేత కోసం పలు దుష్టపన్నాగాలు జరిగాయి. ఇలాంటి ఎన్నో అవాంత రాలను ఎదుర్కొని విజేతగా నిలబడింది. అన్నీ దాటినా ఏకంగా సంపాదకుడు రామానాయుడు మీదే వ్యక్తిగత దాడికి దిగారు. దీనిపై కూడా ఆయన " నన్నుకొట్టుట" అనే శీర్షికతో సంపాదకీయం రాసుకున్నారు. పత్రికలో చాలా మంది కవుల ప్రభోద రచనలు ప్రచురించినా వారి పేర్లు బయటపెట్టేవారు కాదు. పత్రిక ఏ ఉద్దేశంతో ప్రారంభమైనదోఆ ఉద్దేశాన్ని నెరవేర్చుకున్నది. 1949లో మనరాష్ట్రంలో జమీందారీ విధానం రద్దయ్యే వరకు జమీన్ రైతు పత్రిక నిద్రపోలేదు.

1930 ఉప్పుసత్యాగ్రహ వివరాలు, మైపాడులో అరెస్టయిన వారి జాబితా, ఖాసా సుబ్బారావుపై పోలీసుల దౌర్జన్యం, పాణకా కనకమ్మ కారాగారంలో బంధింపడిన సంగతులు... ఇలా అన్నింటినీ ప్రచురించి ప్రజలను కార్యోన్ముఖులను చేసారు. స్వాతంత్ర్యం తరువాత కూడా అనేక సామాజికాంశాల కోసమే పత్రిక నిలబడింది. నేటికి డోలేంద్ర ప్రసాద్ గారి ఆధ్వర్యంలో సజీవంగా సాగుతూనే ఉంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. జమీన్ రైతు పాతసంచికలు, ప్రత్యేక సంచికలు
2. ఆనాటి నెల్లూరోళ్లు, ఈతకోట సుబ్బారావు, 2014, డిసెంబరు
3. తెలుగు సాహిత్యంలో దేశభక్తి, డా. తుమాటి సంజీవరావు, అక్టోబరు 2017.

❖❖❖

ఆధునిక తెలుగు కవిత్వం - దేశభక్తి

– డా॥. వి. గోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

సాహిత్యం భావప్రకటనకూ, ప్రచారానికీ సాధనంగా వాడబడడమనేది కనీసం వేదకాలం నుండి మనం చూస్తాం. భావ ప్రకటనకు ఇతర కళారీయలు కూడా దోహదం చేసినప్పటికీ సాహిత్యానికున్నంత విస్తృత పరిధీ, మన్నికా వాటికున్నట్లు కనబడదు.

తెలుగు సాహిత్యం వయస్సు సుమారు వెయ్యి సంవత్సరాలుటుందేమో.. అందులో ఒకటీ - ఒకటిన్నర శతాబ్దాలకు పూర్వం తెలుగులో వెలువడ్డ సాహిత్యమంతా అనువాద సాహిత్యమే. చాలా సందర్భాల్లో అది భాషాను వాదం కాగా, కొన్ని సందర్భాల్లో మాత్రం భావానువాదం. అంటే నిన్న మొన్నటిదాకా తెలుగు వారికి కాదు, ఒక్క తమిళులకు తప్ప మిగతా ఏ దేశీయ భాషలవారికీ స్వతంత్ర సాహిత్యమున్నట్లు లేదు. స్వతంత్ర భావాలుంటే కదా సాహిత్యం ఉండడానికి ఆధునికతలో మనస్సును స్పృశించే ఆకర్షణ ఉంటుంది. ఎందుకంటే మనిషి తన సమకాలీన స్పృహలో ఎక్కువగా నిమగ్నమవుతాడు. అది కవిత్వంలో కనిపిస్తే సహజంగానే ఆ కవితా వస్తువుతో ఏకీభావన పొందుతాడు. మౌనం నుంచి జనించి, మాటల లోని మాధుర్యాన్ని తెలిపి, ప్రతి హృదయాన్ని తట్టిలేపి చివరకు మౌనం వైపు ప్రయానించేలా చేయగల అద్భుతమైన శక్తి కవిత్వానికుంది. అందుకే కవి కాలం లోని ప్రజలకు ఎక్కువ స్పందననిచ్చిన కవిత్వం మారిన వ్యవస్థలోని వారికి అంత అనుభూతిని ఇవ్వకపోవచ్చు. కానీ కాలంతో సబంధం లేకుండా మానవానుభూతుల లోని సాధారణాంశాలు చెప్పే విధానంలో ఉన్న శక్తి ఎప్పటి కవిత్వాన్నైనా ఆస్వాదించగల లక్షణాన్ని కలిగి ఉంటుంది.

ప్రాచీన కాలం నుండీ నేటి వరకు కవిత్వంలో విభిన్నమైన పోకడలు మనం గమనిస్తూ ఉన్నాం. పద్యాలు కంఠస్థం చేశాం, నోరు తిరగనంత కష్టమైన వచన భాగాన్నీ చదివాం, గేయ కవిత్వాన్ని ఆలపించాం, వ్యావహారిక భాషా విన్యాసాలూ తిలకించాం, మరొక్క అడుగు ముందుకేసి హైకూలు, నానీలు అంటూ స్వేచ్ఛా రీతు లను ప్రోత్సహించాం. అన్నిటి ఉద్దేశమేమిటి అని ఆలోచిస్తే కనిపించే సమాధానమొక్కటే. సమాజాన్ని ఎప్పటికప్పుడు చైతన్యపరుస్తూ, సర్వతోముఖాభివృద్ధిని కాంక్షించటం. మరి నిజానికి ఉద్దేశమిదే అయినప్పుడు సులభశైలిలో చెప్పవచ్చు కదా, ఇన్ని రీతులెందుకు అన్న సందేశం కలుగవచ్చు. స్థాయి తగ్గేకొద్దీ కవిత్వం మామూలు మాటలుగా మిగలిపోతుంది. సమాజ చైతన్యం ఎంత అవసరమో, భాషా వికాసం కూడా అంతే అవసరం. అందుకే పైన చెప్పుకున్న కవితా రీతులలో హైకూల నుంచీ పద్యాల వరకు ఒక్కొక్క స్థాయిని దాటుతూపోతే, స్థాయి పెరిగే కొద్ది భాష యొక్క సౌందర్యం ఇనుమడిస్తూ ఉంటుంది. ఇంకా కొత్త పదాలు నేర్చుకోవాలన్న తపన కవులలో తీవ్రమవుతుంది. తద్వారా భాష యొక్క వినియోగం పెరిగి, ఆ భాషకు సంబంధించిన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేకమైన గుర్తింపు సంతరించు కుంటుంది. ఒకానొక కాలంలో పోతన భక్తి తత్వాన్ని ప్రబోధించినా, కృష్ణశాస్త్రి భావ కవిత్వాన్ని ప్రవచించినా 'పదండి ముందుకు...' అంటూ శ్రీశ్రీ చైతన్యాన్ని ప్రవ చించినా అన్ని రీతుల్లోనూ సమాజాన్ని అత్యున్నత స్థితిలో నిలబెట్టాలన్న సందేశం అతి సున్నితంగా, సుందరంగా కనిపిస్తుంది. ఆయా రీతులకు తగ్గట్టుగా భాషా వినియోగం సరేసరి.

ఆధునికత వేరు, గొప్ప కవితా శక్తి వేరు. ఆధునిక మైనదంతా గొప్ప కవిత్వం కాదు. కవి కాలంలో తాను అనుసరించిన ఆధునికత, అనుభూతికి కొత్త ద్వారాల్ని

తెరచి ఉండవచ్చు. కాలం మారిపోయినప్పుడు ఆ కవితలోని గొప్పతనం మనకు అవగాహనమవుతుంది గానీ, ఆనాటి ఆధునికత, ఈనాటి ఆధునికత కాదని వెంటనే గుర్తించగలం. ఉదాహరణికి శ్రీశ్రీ, లయబద్ధశైలి, సంస్కృత భాషా వినియోగం మొదలైనవి ఈనాటి కవితా శైలికి విభిన్నమైనవి. ఈనాడు ఆ శైలిలో రాస్తే వెంటనే అది ఆధునికం కాదని చెప్పవచ్చు. కానీ అతని కవిత్వంలోని వస్తుబలం గానీ, దాన్ని పూర్తిగా ఆవిష్కరించే అభివ్యక్తి శక్తిగానీ మనం అవగాహన చేసుకోగలం.

ప్రాచీన కవిత్వంలోనూ ఎప్పటికప్పుడు ఏదో ఒక స్థాయిలో మార్పు వస్తున్నా, ఆధునికత అనేది ఒక దృక్పథంగా వచ్చింది మాత్రం 20వ శతాబ్దం ప్రారంభం నించే. దీనికి కారణం ఇంగ్లీషు వారు ఈ దేశాన్ని పాలించడం, మన వ్యవస్థ వేగవంతంగా కదలబారడం. పాతలో ఉన్న లోపాల్ని తొలగించుకోవాలనే తీవ్రమైన తపన, ప్రపంచ సాహిత్యం మన కవిత్వాన్ని కొత్త మార్గాల్లోకి నడిపించడం. ఈ కారణాల వల్ల ఆధునికత ఎప్పటికప్పుడు పట్టించుకుని, నిర్వచించుకుని అనుసరించవలసిన ఒక కొత్త నేపథ్యమయింది. అందుకే శ్రీశ్రీలోనూ, అతని సమకాలీనుల్లోనూ, ఆధునికత మీద ఒక ప్రత్యేకమైన తపన కన్పిస్తుంది.

ఆధునికతలో చాలా అంశాలున్నాయి. వీటిలో అత్యంత ప్రధానమైనది వ్యవస్థలో వస్తున్న మార్పుని అంచనా వేసి ఏ మార్గాన్ని అనుసరిస్తే పురోగమించగలదో గుర్తించి అవి రచనలో ప్రతిబింబింప చేయడం. ఆధునికత అనగానే ముందు మనకు స్ఫురించే మహాద్రష్ట గురజాడ. ఆధునికత, ఆధునిక సమాజ నిర్మాణ లక్ష్యం మీద ఆధారపడి ఉంది. ఆనాడు తనకు ముందున్న సమాజంలోని ప్రగతి నిరోధక భావాల్ని గమనించి వాటిని తొలగించి మానవతా పరిపూర్ణమైన సమాజాన్ని తయారు చేసే స్పృహ ఆయన సాహిత్యంలో అడుగడుగునా ఉంది. పాతలో ఉన్న మంచిని ఆయన ద్వేషించలేదు. కొత్తలో ఉన్న చెడునీ ఆహ్వానించలేదు. పైగా కొద్ది కొద్దిగా తలెత్తుతున్న పాశ్చాత్య సంస్కృతిని కొనసాగాలనీ ఆయన కోరలేదు. అందుకే పాశ్చాత్యుల సంస్కృతి మనకు అనుసరణీయం కాదని చెప్పాడు. అనేక మంది ఉన్నత స్థాయి ఆలోచనలు కలిగి ఉన్నా కొన్ని అంశాల్లో ప్రగతి శీలతనీ మరికొన్ని అంశాల్లో తిరోగమన లోపాల్నీ కలిగి ఉండటం సహజం. కానీ గురజాడ ఏ సామాజికాంశాన్ని చెప్పినా అన్నింటిలోని నేపథ్యమూ ప్రగతికి దారితీసేదే అవుతుంది. వందేళ్ళ క్రితం ఇలా ఆలోచించగలిగిన వ్యక్తి మరెవరూ లేరు. గురజాడకు ముందుగానో సమకాలంలోనో ప్రగతిశీల భావాల్ని చెప్పినవారు లేకపోలేదు. అయితే సమాజానికి పనికి వచ్చే అన్ని అంశాల్నీ తీసుకొని అన్నిటిలోనూ ఏక సూత్రమైన, చెక్కుచెదరని పురోగమన దృక్పథాన్ని ఇచ్చిన వారు గురజాడ మాత్రమే.

భారతీయ సమాజంలో పాశ్చాత్య భావ ప్రభావంతో ఆధునికత వైపు దృష్టి మరలినప్పుడు సమాజ పురోగమనానికి అవరోధంగా నిలిచిన దురాచారాలన్నీ నశింపజేసి సరికొత్త సమాజాన్ని నిర్మించాలనే స్పృహ వ్యాపించినప్పుడు 20వ శతాబ్ది ప్రారంభం నుండి సంస్కరణవాదం వేళ్ళూనుకుని ఆధునికత వైపు ఆచరణ ప్రబలంగా ప్రారంభమైంది. సాహిత్యమంతా ఈ ఆధునిక చైతన్యంతో నిండిపోయింది. ఈ సర్వ ఆధునిక భావాలకు, సమగ్ర సాహిత్య ప్రాతినిధ్యం వహించిన మహా రచయిత గురజాడ అప్పారావు. అన్ని రంగాల్ని ప్రజా ఉద్యమ దృష్టితోనే ప్రభావితం చేసి తన ఆధునిక భావాలన్నింటినీ కవిత్వం, కథ, వ్యాసం, నాటకం డైరీలు మొదలైన అనేక ప్రక్రియల్లో ఏ చిన్న తడబాటూ లేకుండా లోతైన ఆలోచనా ధారతో నింపిన సాహిత్య స్రష్ట, సమాజ ద్రష్ట గురజాడ అప్పారావు. పాతకొత్తల మేలుకలయిక ఆయన సిద్ధాంతాలన్నిటిలోని అంతస్సూత్రం. పాతలోని మంచి అంతా నిలబెట్టుకుంటూనే, ఆధునికత ముందుకు సాగాలని, లోపాలన్నిటిని నరిచేసుకోవాలనీ, ఆయన సందేశంలోని ప్రధానాంశం.

తెలుగు కవిత్వ చరిత్రను ఒక పెద్ద మలపు తిప్పిన

కవితా సంపుటి శ్రీశ్రీ మహాప్రస్థానం. ఇందుకు ప్రధానమైన కారణాలు ఏవి అని అన్వేషించాలి. ఒక సామాజిక వ్యవస్థా పురోగమనంలో సకల జన సంతృప్తి కరమైన జీవితానికి ఆటంకంగా నిలచే వైరుధ్యాలు విస్పష్ట రూపాన్ని పొందినప్పుడు పాత సమాజ చట్రాన్ని మార్చి లోపాల్ని అధిగమించే దృష్టితో సంస్కరణలు ప్రారంభ మవుతాయి. సమాజ పురోగమన నిర్దేశకులైన మేధావులు సృజనకారులు, ఉద్యమకారులు, ఒక సమిష్టి భావ ప్రపంచాన్నీ, ఆచరణ విస్తరణనీ వ్యాప్తి చేసి మార్పుకి దోహదపడతారు.

19వ శతాబ్ది చివరి భాగం నుండీ ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేసి, చైతన్యవంతమైన అనేక దేశాల్లో భవిష్య దాశని మేల్కొలిపి సామాజిక పురోగమన సిద్ధాంతాల్లో సమగ్రమైన దిశానిర్దేశం చేసి ఆచరణ ప్రధానం కొన సాగింది మార్క్స్ సామ్యవాద దృక్పథం. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక రాజకీయాది విషయాల్లో సరికొత్త ఆచరణకి దారి తియ్యడమే కాక ప్రపంచం మొత్తం మీద ఒక ప్రత్యామ్నాయ సాహిత్య సృష్టికి మూలకారణ మయింది.

సంస్కరణ వాదానికీ, సామ్యవాద సిద్ధాంతానికీ ఉన్న ప్రధానమైన భేదం ఏమంటే సంస్కరణ అంతకు పూర్వపు వ్యవస్థ చట్రాన్ని మార్చదు. ఉన్న లోపాల్ని తొలగించే ప్రయత్నం మాత్రమే చేస్తుంది. కాని సామ్యవాద వ్యవస్థ చట్రాన్ని పూర్తిగా మార్చే ఉద్యమం చేస్తుంది. ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పరచడం, సామ్యవాదంలోని మౌలికమైన అంశం. ఇది వ్యక్తి మీదకంటే సమాజం మీద తన దృష్టిని కేంద్రీకరిస్తుంది. వ్యక్తి గుణగణాలన్నీ వ్యవస్థా ఫలితమే అని ప్రబోధిస్తుంది. వ్యక్తుల సమూహం కాకుండా సామాజిక వ్యక్తుల సమిష్టి ఉద్యమాలే వ్యవస్థను మార్చగలవని నిర్దేశిస్తుంది. అసమానతలు తొలగనిదే న్యాయమైన సకల జన ఆనందకరమైన సమాజం సిద్ధించదనీ, అది మరి ఏ సిద్ధాంతాల మీద ఆధారపడిన ప్రయత్నంతోనైనా సమగ్రం కాదనీ సామ్యవాదం మాత్రమే ఆర్థిక పునాదుల్ని మార్చివేసి వినూత్న వ్యవస్థను నిర్మించగలదనీ నిరూపిస్తుంది.

సామ్యవాదాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ఆధునిక సాహిత్యం అభ్యుదయ సాహిత్యం పేర 1936 నుండి రచయితల సంస్థకు పునాదులు వేసినా, 1920ల నుండే సామ్యవాద ఆచరణ మన దేశంలో ప్రారంభమయింది. మార్క్సిస్టు సిద్ధాంతం నుంచే తాను కవితా రూపుదిద్దు కోకపోయినా, మన సమాజ సంచలనాల్ని హృదయానికి పట్టించుకుని ఇంగ్లీషు భాషలోని సమస్త ఆధునికతచే తను ప్రభావితుడై శ్రీశ్రీ సృష్టించిన కవిత్వం మరో అధునాతనమైన మలుపుకి పునాది రాయిగా నిలిచింది. అతని కవితా సంపుటి మహా ప్రస్థానం కొత్త తరమంతటిపై చెరగని ముద్ర వేసింది.

శ్రీశ్రీకి ఇక్కడి అట్టడుగు వర్గాల ఉద్యమాల అవ గాహన మాత్రమే గాక, ప్రపంచ సాహిత్య ప్రభావం చేత అన్ని ఆధునిక మార్గాల పట్ల ఇష్టం ఉంది. మన ప్రాచీన సాహిత్యం వల్ల భాష, శైలి మొదలైన వాటి ముద్ర ఉన్నట్లే పాశ్చాత్య సాహిత్యం వల్ల ఆయా శిల్పాల ప్రభావం కూడా తీవ్రంగా ఉంది. అంతేగాక శ్రీశ్రీ ఒక ప్రత్యేకమైన మానసిక లక్షణం ఉంది. అతనిపై పడిన అన్ని ప్రభావాల్నీ, చివరి వరకూ గౌరవంగానే చూశాడు. ఎప్పుడడిగినా ప్రాచీన సాహితీపరుల్ని అలంకారిక సూత్రాల్ని గూర్చి మాత్రమే గాక, అధివాస్తవికత మొదలైన వాటిని గూర్చి కూడా ప్రేమగానే మాట్లాడాడు. ఎంతగా అతడు మార్క్సిజాన్ని, విప్లవాన్ని గూర్చి చెప్పినా తనపై ప్రభావం చూపినా వాటినన్నిటినీ చివరి వరకూ తన చైతన్యంలోని భాగంగానే చూసుకున్నాడు. అందుకే మహాప్రస్థానంలో అనేక ప్రభావాల్ని గమనించకపోతే సమగ్రంగా విశ్లేషణ చేసినట్లు కాదు.

దేశభక్తి :

ఆధునికాంధ్ర కవిత్వంలో దేశభక్తి భారత జాతీయోద్యమంలో చిలకమర్తివారి "భరతఖండంబు" అన్న పద్యము తెలుగులో భారత జాతీయోద్యమ

నంబంధమైన తొలి రచనయని చెప్పవచ్చు. ఈ పద్యముతో జాతీయోద్యమ కవిత్వమునకు బీజాలు పడగా రాయప్రోలు వారు చేసిన దోహదంతో అది వర్ధిల్లింది. 1905కు ముందు భారతదేశములో జాతీయోద్యమం బలపడలేదు. ఆంధ్రదేశీయుల మనస్సుల్లో జాతీయాభిమానం అంకుర స్థితిలో మాత్రముండెడిది. 1905లో ఆంగ్ల ప్రభుత్వము వంగదేశమును రెండుముక్కలు చేయుటతో భారతీయుల గుండె భగ్గుమంది. అటు వంగదేశములో చెలరేగిన ఆందోళనాగ్ని శిఖలతో ఇటు ఆంధ్రదేశ ముట్టడికిపోయింది. బిపిన్ చంద్రపాల్ గారు కలకత్తా నుండి బయలుదేరి బరింపురం, విశాఖపట్టణాల్లో మీదుగా, ఆంధ్రదేశములోని రాజమండ్రి, బెజవాడ, బందరు, నెల్లూరుమున్నగు ముఖ్య పట్టనములలో తెల్లదొరల దౌర్జన్యకాండకు వ్యతిరేకంగా ఇచ్చిన ఉపన్యాసాలు, వాటి తెలుగు అనువాదాలు ఆంధ్ర ప్రజల్లో అంతవరకే రగులుతున్న జాతీయోద్యమ వైశమ్యాలకు మరింత ప్రజ్వలింపజేశాయి. రాజమహేంద్ర వర సభలో చంద్రపాల్ గారి ఉపన్యాసమిని ఉదేకులైన చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు రాసిన

"భరతకండంబు చక్కని పొడియావు
హిందువులు లేగదేడలై యేడ్చు చుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితకుచున్నారు మూతులు బిగియబట్టి"

అను పద్యము సభను ఉత్సాహ తరంగతమొనర్చినది. ఆ పద్య ప్రభావమంతటితోనే తీరిపోలేదు. ఆంధ్ర దేశములో ఆనాడు వ్యాప్తిలోనన్న అన్ని పత్రికల్లో, హరికథల్లో చేరింది. ఆంధ్రుల జిహ్వాగ్రములపై తాండ వించింది. బంకించంద్రుడు పూరించిన "వందేమాతరం" నినాదం చంద్రపాల్ గారి పర్యటనతో ఆంధ్రదేశమంతట ఉద్యమస్ఫూర్తితో వ్యాపించింది. అలాగే మిల్లుగుడ్డల బహిష్కరణ, నేత బట్టల స్వీకారం ఎక్కువయింది. దేశంలో నలుమూలల దేశభక్తి ప్రపూరితములైన పాటలు, నాటకాలు, హరికథలు వ్యాపించాయి. స్త్రీ, పురుషులే కాదు చిన్న పిల్లలు, తుదకు గోరువంకలు కూడా "వందేమాతరం, మనదే రాజ్యం" అని పలుకుట పరిపాటిగా మారింది.

భారత జాతీయోద్యమం నవ్యకవుల్లో దేశభక్తి భావాలను బహుముఖంగా ప్రభావితుల్ని చేసింది. 1916-20 మధ్య జరిగిన హోంరూలు ఉద్యమం మవ కవుల్లోని జాతీయ భావ ప్రకటనకు నాంది అయింది. రష్యాను ఎదిరించి దిగ్విజయాన్ని సాధించిన జపాను ఆనాటి తెలుగు యువకుల్లో నవోత్తేజాన్ని నింపింది. యువ కవులు ఆంగ్ల విద్య నభ్యసించడం వల్ల అమెరికా, రష్యా దేశాలు స్వాతంత్ర్యం కొరకు జరిపిన ఉద్యమాల గురించి చదివి తమలోని జాతీయ భావాలను పదునపెట్టారు. భారత జాతీయోద్యమం పాశ్చాత్య చరిత్ర చదవడం ఒక బలమైన కారణంగా అంగీకరించక తప్పదు.

"వస్తువు లేక ఇతివృత్తం" ఎన్నుకోవడంలో తత్‌వస్తుగత మైన భావజాలంతో, భావ వ్యక్తీకరణశైలీ శిల్పంలో, పద్యగేయ, వచన, కవితా ప్రక్రియల్లో ఇరవయ్యో శతాబ్దపు కవులు ప్రదర్శించిన ప్రయోగశీలత, స్వేచ్ఛా ప్రియత్వం, సామాజిక చైతన్య, ఆత్మాశ్రయ తాత్విక చిందన, రాజకీయ, ఆర్థిక, శాస్త్ర విజ్ఞాన ప్రభావాలు కులమతతత్వాలకు అతీతమైన జాతీయ, అంతర్జాతీయ దృక్పథం, దేశభక్తి, దైవభక్తి మొదలైన మానవ జీవితానుభవాలను, అనుభూతులను, ఆశయాలను, ఆకాంక్షలను చిత్రించే వైవిధ్యభరిత కవితా సృష్టి జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. నారాయణరెడ్డి, సి. - ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, 4-1-433, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001.

2. శ్రీశ్రీ - మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001.
3. యాదగిరి, కె (సం) - ఆధునిక తెలుగు కవిత్వం - భారతీయ సంస్కృతి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ - 2005.
4. నారాయణరావు, వెల్చేరు - కవితా విప్లవాల స్వరూపం, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 3-6-687, 10వ వీధి, హిమాయత్ నగర్, హైదరాబాద్ - 500 029.
5. పద్మావతి, ఎస్. ఆధునికాంధ్ర కవిత్వ కావ్యబింబ పరిశీలన, సమన్వయ ప్రచురణలు, 64, ఓంనగర్, లంగర్‌హౌస్, హైదరాబాద్ - 500 008.
6. సంపత్కుమారాచార్య, కోవెల - పూర్వ కవుల కావ్య దృక్పథాలు, అభినవ ప్రచురణ, వరంగల్లు, ప్రథమ ముద్రణ - 1990.

❖❖❖

పానుగంటి వారి సాక్షి - దేశభక్తి ప్రస్తావన

– డా॥ వి. కె. టి. మహాలక్ష్మి, తెలుగు ఉపన్యాసకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మర్రిపాలెం, అల్లూరి సీతారామరాజు జిల్లా.

కవిశేఖర పానుంటి లక్ష్మీనరసింహారావు గారు రచించిన సాక్షివ్యాసాలను సాహిత్యాభిలాషులకు ప్రత్యేకించి పరిచయం చేయనక్కరలేదు. వీరు ఆంధ్రా ఎడిషన్, ఆంధ్ర షేక్స్పియర్, అభినవ కాళిదాసు బిరుదాంకితులు. సాక్షివ్యాస కర్తగానే కాకుండా రాధాకృష్ణ, పాదుకా పట్టాభిషేకం, కంఠాభరణం వంటి అనేక నాటకాలు రచించి నాటకకర్తగా కూడా ఎంతో పేరుప్రతిష్టలు పొందారు.

పానుగంటి వారు సాక్షివ్యాసాలలో సమాజంలో కనిపించిన సమస్త చెడును తన అక్షరాయుధంతో చీల్చి చెండాడారు. సమకాలీన సమాజంలోని సమస్త విషయాలను, వాటిలో అవకతవకలను ఈ వ్యాసాలలో హాస్య, వ్యంగ్యధోరణిలో చర్చించారు. తన భాషా వైదుష్యంతో గోరంత విషయాన్ని కొండంతగా వర్ణించారు. చిత్రవిచిత్రమైన కల్పనలద్వారా ఆ వ్యాసాలకు వన్నెలద్దారు. తెలుగుభాషలో పట్టు సాధించాలనుకునే వారికి సాక్షివ్యాస పఠనం ఎంతగానో ఉపకరిస్తుంది. సాక్షి వ్యాసాలలో ''దేశభక్తి ప్రస్తావన'' గురించి చర్చించటం ప్రస్తుత వ్యాసోద్దేశం.

సాక్షివ్యాసాలు 1913లో సువర్ణలేఖ పత్రికలో ప్రారంభమై కొంతకాలం తర్వాత ఆగిపోయి, మళ్ళీ 1920లో ఆంధ్రపత్రికలో ప్రారంభమై కొనసాగాయి.

ఈ వ్యాసాలలో అలనాటి స్వాతంత్ర్యోద్యమంలో భాగమైన స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తు భహిష్కరణ, దేశభక్తి ముసుగులో స్వార్థ పరత్వం, గాంధీజీ ఖద్దరు నిధికి స్త్రీలు తమ నగలను సమర్పించుట, ఇత్యాది అనేక విషయాలు చోటుచేసుకున్నాయి.

సాక్షివ్యాసాలలో వ్యక్తి విమర్శ ఉండదు. తత్వవిమర్శ మాత్రమే ఉంటుంది. మంచిని మెచ్చుకోవడం కంటే చెడును తూర్పారబట్టడమే ఈ వ్యాసాల ధ్యేయం. దేశభక్తి విషయంలో కూడా పానుగంటి వారు దొంగ దేశభక్తిని, దేశభక్తి ముసుగులో స్వార్థ పరత్వాన్ని ఈ వ్యాసాలలో ఎత్తిచూపారు.

పానుగంటివారి దృష్టిలో దేశభక్తి అంటే కేవలం దేశంమీద భక్తి ఒక్కటే ఉంటే అది నిజమైన దేశభక్తి కాదు, దేశాన్ని దైవంగా భావించడం, సత్ప్రవర్తన, నిస్వార్థం, ఇంద్రియ నిగ్రహం మొదలగు గుణాల సమాహారమే దేశభక్తి.

''దేశభక్తి - స్వార్థపరిత్యాగం'' వ్యాసంలో రచయిత ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ వ్యాసంలో నిజమైన దేశభక్తుల నిగ్గు తేల్చడానికి ఒక గమ్మత్తయిన కల్పన చేశారు.

దేశభక్తులున్న ఒక సభలో భూమిని పెకలించుకుని ఒక నవరత్న ఖచిత సింహాసనం భూమిపై నిల్చింది. ఆకాశం నుండి ఒక పురుషుని శిరస్సుమాత్రం ఆ సింహాసనం మీద పడింది. ఆ శిరోమాత్ర పురుషుడు ఆ సభలోని వారినుద్దేశించి, ''మీరంతా దేశసేవకై ఇక్కడకు చేరిన దేశభక్తులనుకొనుచున్నారు. ఇది భారతమాత పీఠం. కాబట్టి మీరు ఒకరి తర్వాత ఒకరువచ్చి ఈ పీఠాన్ని స్పృశించండి. దేశమాత సర్వదా మిమ్మల్ని రక్షిస్తుంది'' అన్నాడు.

ముందుగా ఒక న్యాయవాది ఆ పీఠాన్ని తాకటానికి ప్రయత్నించి విఫలుడౌతాడు. అప్పుడా శిరోమాత్ర పురుషుడు ''నీది నిజమైన దేశభక్తి కాదు. నీ తల్లిదండ్రులు భిక్షమెత్తి వారి కడుపు మాడ్చుకుని నిన్ను చదివించారు. నీవు సంపాదన పరుడవయ్యాక, మాతాపితల ఋణం తీర్చుకోలేదు. మాతాపితల యందు భక్తి లేనివారికి దేశభక్తి కలుగుటకల్ల'' అన్నాడు.

మరొకవ్యక్తి ఆ సింహాసనాన్ని తాకటానికి ప్రయత్నించి సఫలం కాలేకపోతాడు. అప్పుడా శిరోమాత్ర పురుషుడు ఆ వ్యక్తితో ''నీవు చపల చిత్తుడవు. నీకు ధనం, కీర్తి ప్రధానాలు. నీది నిజమైన దేశభక్తి కాదని'' తెలియజేశాడు.

ఒక ఉపాధ్యాయుడు ఆ శిరస్సుతో ''నేను బీదవాడినైనా, ఉపాధ్యాయ పదవిని వదులుకుని దేశసేవ చేస్తున్నానని'' పలికెను. అప్పుడా శిరోమాత్ర పురుషుడు ''నీవు రాబోయే జాతీయ పాఠశాలలో అధిక వేతనాన్ని ఆశించి, ఇప్పుడీ ఉపాధ్యాయ వృత్తిని వదిలి దేశభక్తిలోకి దిగావు. నీకు ఆశపోయినప్పుడు గాని దేశభక్తి కలగదని'' పలికాడు. కొందరు విద్యార్థులు ముందుకువచ్చి తాము దేశసేవ చేయాలనే ఉద్దేశంతో పాఠశాలలను పరిత్యజించామని పలికారు. అపుడాశిరస్సు ''దేశభక్తి అనగా ప్రజాభక్తి, సర్వప్రజలలో మాతాపితలు ఉత్తములు. మీరు మీ ల్లిదండ్రుల మాట దాటారు. కన్న తల్లిదండ్రులకు సుతులు కానివారు దేశమాతకు సుతులు కాలేరని'' పలికింది.

మరొకవ్యక్తి ఆ సింహాసనాన్ని తాకడానికి రాబోతుండగా, ఆశిరోమాత్ర పురుషుడు ''నీవు సింహాసనాన్ని తాకలేవు. నీవు పగలు వేశ్యావృత్తి నిర్మూలనమీద సంతకం పెడతావు. రాత్రి వేశ్యాకాంతల ఇంట సల్లాపాలు సాగిస్తావు అని పలికాడు.

ఈ సందర్భంలో రచయిత ''కచ్చకట్టలేనివాడు, నోరుకట్టలేనివాడు, మనసుకట్టలేనివాడు దేశభక్తుడు కాడని, ఏ భక్తికయినా బాహ్యాంతరింద్రియ నిగ్రహముండాలని తెలియజేశాడు.

ఆ సభలో దేశభక్తులేలేరా? అను సంశయ నివారణార్థం, ఆవ్యాసం చివరలో ఇద్దరు ముగ్గురు దేశభక్తులు నులువుగా ఆ సింహాసనాన్ని స్పృశించినట్టుగా పేర్కొన్నారు.

''అంతఃపురోపన్యాసము'' - అనే వ్యాసంలో దేశానికి ఎన్నివిధాల సేవచేయవచ్చో తెలియజేశారు.

ఈ వ్యాసంలో ఒక భార్య లాయరువృత్తిలో కొనసాగుతూ అధిక సంపాదనాపరుడైన తనభర్త నుద్దేశించి, సంపాదించినది చాలని, దేశసేవ చేయమని ఉద్బోధిస్తుంది, కేవలం ఉపన్యాసాలతో సరిపెట్టవద్దని, కరపత్రాలు ప్రచురించటంకాదని, ఆచరణకు వీలగు మార్గాలను అవలంభించి పనిచేయమని కోరుతుంది.

ఆడవారికి పాఠశాలలు ఏర్పాటు చేయవచ్చని, ప్రతీ గ్రామంలో బీదవారికి అనువగు బడులు ఏర్పాటు చేయవచ్చని, ఇంటికొక రూపాయి చొప్పున వసూలు చేసి ప్రతీగ్రామంలో చిన్న పరిశ్రమ నెలకొల్పవచ్చని, చేతివృత్తుల వారికి ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి పరపతి సంఘాలు స్థాపించమని, సమీపంలో ఉన్న మాలపల్లెను ఆరోగ్యవంతం చేయమని ఆచరణతో కూడిన సంస్కరణ, నిష్కాపట్యంతో కూడిన మనస్సు, ప్రతిఫలవాంఛా రహితమైన ప్రేమ ఇవి దేశాభివృద్ధికి కావలసినవని తెలియజేసింది.

''స్వీయచరిత్రావశ్యకత'' వ్యాసంలో లోకానికి తమ భావ పరిమళాలు వెదజల్లి కాలగర్భంలో కలిసిపోయే కవులు చరిత్ర రాయాలని, ఇదికూడా దేశభక్తిలో ఒక భాగమేనన్నది ఈ వ్యాస సారాంశం.

''సనాతనాధునాతన నాగరికతలు'' వ్యాసంలో జాతీయత మరియు దేశభక్తి ప్రస్తావన ఉంది.

అన్యోన్య ప్రేమపూర్వకమగు దేశభక్తియే జాతీయతకు ప్రధానమని, దేశాన్నే దైవంగా ఆరాధించాలని, దేశక్షేమం ముందు వ్యక్తి క్షేమాన్ని తృణప్రాయంగా భావించాలని నిష్పలాపేక్షతో దేశానికి తనను తాను అర్పణ చేసుకున్నవాడే నిజమైన దేశభక్తుడని, అంతేగాని స్వార్థాన్ని విడిచిపెట్టకుండా, తరతమ భేదాలు పాటిస్తూ కేవలం ఉపన్యాస పీఠాలపై దేశభక్తి, దేశభక్తి అని అరచినంత మాత్రాన దేశభక్తి ఉన్నట్టుకాదని పేర్కొనబడింది.

''అంతఃపురోపన్యాసము''లో ఒక ఇల్లాలు తన భర్తతో తాను గాంధీనిధికి విరాళమిచ్చిన విషయం ప్రస్తావిస్తూ, ఆ సంగతి పదిమందికీ తెలియజేసి తనకు ఖ్యాతి వచ్చేలా

చేయలేదని భర్తను దెప్పుతుంది. సాధారణంగా తోటికోడళ్ల మధ్య పోటీతత్వం ఉంటుందంటారు. తనకంటే చిన్నదైన తన తోటికోడలు ముందుగా మెడలోని 'నాను'ను సభలో చదివించిందని సభవారు తోటికోడలిని గౌరవగర్భముగాను, తనను నిందాగర్భముగా చూసారని, అందుకే వెంటనే కంకణాలు సమర్పించి గట్టున పడ్డానని వెల్లడించింది.

ఇలా కీర్తికోసమో, మరొకరితో పోటీపడో నగలు విరాళమిచ్చిన వారినిగూర్చి రచయిత ఈవ్యాసంలో వ్యంగ్యధోరణిలో వివరించారు.

కోపల్లె హనుమంతరావు గారు ఆంధ్రజాతీయ పరిషత్తు నెలకొల్పి, జాతీయ విద్యావ్యాప్తికి కృషిచేస్తూ మరొకవైపు స్వాతంత్ర్యోద్యమ కృషి కొనసాగించిన మహనీయులు. "స్వర్గస్థులగు శ్రీ కోపల్లె హనుమంతురావు పంతులుగారు" వ్యాసం వారి మృతినిగూర్చి చింతిస్తూ రాసినది. ఇందులో మనుమంతరావు గారు దేశానికి చేసిన నిస్వార్థ సేవను కొనియాడారు. దానితోపాటు దేశసేవకోసం తమ సమస్తాన్ని త్యాగంచేసే త్యాగధనులు చేపట్టిన బృహత్కార్యాలలో పాల్గొని తమవంతు సహాయం చేయకుండా, వారి మరణానంతరం వారి గొప్పదనాన్ని కీర్తిస్తూ అంతులేని హడావిడి చేసే కుహనా దేశభక్తుల నైజాన్ని కూడా వెల్లడించారు.

ఈ విధంగా సాక్షివ్యాసాలలో అనేక సందర్భాలలో దేశభక్తి ప్రస్తావన వర్ణితం.

"దేవుడనగనేమి? దేశమే దేవుండు
దేశభక్తియనగ దేవభక్తి
దేశమునకుద్రోహి, దేవునకే ద్రోహి
దేశముద్ధరింప దివురుడయ్య (సాక్షి పుట : 421)

ఉపయుక్త గ్రంథం :

1. "కవిశేఖర పానుగంటి లక్ష్మీనరసింహారావు, సాక్షి సంపాదకులు : డా॥ డి. చంద్రశేఖరరెడ్డి, ముద్రణ : నవంబరు 2011.

❖❖❖

తెలుగు సినీ గీతాలు - దేశభక్తి

- గుత్తికొండ చంద్రకళ, అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు), కాకతీయ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ, తెలంగాణ.

జాతీయ పర్వదినాలైన స్వాతంత్ర్య దినోత్సవము, గణతంత్ర దినోత్సవం రోజులలో సినిమాలలోని దేశభక్తి గీతాలు పాఠశాలల్లో, కళాశాలల్లో, వివిధ కార్యాలయాలల్లో, కూడళ్ళలో, టి.వి, రేడియో ప్రసారాలలో మారుమ్రోగు తూ ఉంటాయి. సినిమాలలోని దేశభక్తి గీతాలు చెవిన పడగానే జాతీయ భావం ఉప్పొంగి మనసు పులకరించిపోతుంది. జాతీయతాభావవ్యాప్తిలో, దేశ సమైక్యత పెంపొందించడంలో, సంస్కృతి సంప్రదాయల ఔన్నత్యాన్ని చాటడంలో దేశభక్తి గీతాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.నిజానికి దేశభక్తి గీతాల వల్ల తెలుగు సినిమాపాటలకు సాహిత్యగౌరవం అబ్బినది. శ్రీశ్రీ, సి.నా.రె, దాశరధి, కృష్ణశాస్త్రి, ఆరుద్ర వంటి ప్రముఖ కవులు రాసిన దేశభక్తి గేయాలు సినిమాలలో ప్రదర్శించ బడి ప్రజలకు మరింత చేరువయ్యాయి. మన దేశంలో బ్రిటిష్ వారి కాలంలో మూకీ చిత్రాలలో ఆరంభ మైన సినిమారంగం నేడు అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ, వినోదం పంచే ఉన్నతమైన రంగంగా కొనసాగుతున్నది. ఆనాడు బ్రిటిష్ వారిని పారద్రోలడానికి చేసిన స్వాతంత్ర్య సంగ్రామంలో సినిమా కళాకారులు కూడా తమ కళద్వారా దేశభక్తిని చాటుకున్నారు. తెల్లవారి పాలనను నిరసిస్తూ చిత్రాలు రూపొందించారు. ఆనాటి నుండి తెలుగు సినిమాలలో మంచిని పెంచే మార్గాలే కాకుండా దేశభక్తిని పెంపొందించే గీతాలు కూడా ప్రముఖంగా చోటుచేసుకున్నాయి. సినిమా రంగానికి వినోదం పంచడమే ప్రాధాన్యం అయినప్పటికీ, సమాజానికి అంతో ఇంతో సందేశమివ్వాలనే, దేశభక్తి, పెంపొందించాలనే అభిలాష సినీరంగ నిర్మాతలు, దర్శకులు, కథానాయకులలోనూ కనిపిస్తుంది. అందుకే సినిమా కథల్లో భారత, భాగవత, రామాయణం వంటి పౌరాణిక అంశాలతో పాటు చారిత్రక, సామాజిక, రాజకీయ, నేరపరిశోధన, థ్రిల్లర్, సస్పెన్స్ వంటివే కాక, వివిధ రంగాలల్లోని ప్రముఖుల జీవిత చరిత్రలు కూడా ఎంపిక చేయబడ్డాయి. వినోదంతో పాటుగా సున్నిత మానవ సంబంధాలను, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, దైవభక్తి, దేభక్తితో కూడిన సినిమాలు, పాటలు నిర్మించ బడుతూ ఉత్తమ చిత్రాలుగా, పాటలుగా బహుమతులను అందుకొంటున్నాయి. ఇప్పటికీ దేశభక్తి పూర్వకమైన, సినిమాలు, పాటలు బహుమతులందుకోవడంలో ముందు వరుసలో ఉన్నాయి. సందర్భానుసారంగా ఆయా సినిమాలలో ప్రదర్శించబడిన దేశభక్తి గీతాలను పరిశీలించడం, వాటిప్రాముఖ్యతను గుర్తించడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. పత్ర పరిమితి దృష్ట్యా కొన్ని సినీగీతాలను పరిశీలనకు ఎంచుకున్నాను.

దేశభక్తి అనగానే స్వాతంత్ర్య పోరాట సంఘటనలు, దేశనాయకులు, సరిహద్దు రక్షణలో ఉన్న సైనికులు, వారి త్యాగాలు, సంఘసంస్కరణా చర్యలు గుర్తుకు రావడం సహజం. తెలుగు సినీ గీతాలలోను దేశభక్తిని పెంపొందించే అంశాలు స్థూలంగా ఈ క్రింది విధంగా కనిపిస్తాయి.

1. దేశాన్ని భరతమాతగా కీర్తించడం, భారతీయ సంస్కృతి గొప్పదనం.
2. జాతీయ జెండా, జాతయ గీతం ఔన్నత్యం.
3. జన్మభూమి ప్రాధాన్యత, ప్రత్యేకత.
4. సహజీవన, సమభావన స్ఫూర్తి .
5. స్వాతంత్ర్య పోరాట ఘట్టాలు, వీరులు, దేశ నాయకుల స్మరణ .
6. గత చారిత్రక వైభవం - ఘనత.
7. అవినీతి, సాంఘిక దురాచారాలు పోగొట్టే అభ్యుదయ కాంక్ష.

8. శ్రమజీవన తత్త్వము, శ్రామికుల, కర్షకుల, కార్మికుల పట్ల గౌరవం.
9. సేవా దృక్పథాన్ని పెంపొందించడం.
10. తెలుగు భాషను, తెలుగు సంస్కృతిని అభిమానించడం.

దేశాన్ని భరతమాతగా కీర్తించడం, భారతీయ సంస్కృతి గొప్పదనం :

'దేశభక్తికి సంబంధించిన గీతాలలో 1949లో వెలువడిన''మనదేశం'' సినిమాలో ''జడియకురా ధీరా .... జడియకురా ధీరా....సాత్వికరణ విజయము నీదేరా'' అనేపాట మొదటి పాటగా చెప్పవచ్చు. పరపీడన చెరవీడక భరతజాతి నిదురబోదు అని స్వాతంత్ర్య కాంక్షను, బాపూజీ మార్గమే - భరతజాతికి దాస్యముక్తి మార్గమ్మురా'' అని గాంధీని కీర్తిస్తూ సాగుతుంది.1972లో వెలువడిన 'బడిపంతులు' సినిమాలో ''భారతమాతకు జేజేలు బంగరు భూమికి జేజేలు'' అని భరతమాతకు నమస్కరిస్తూ భారతదేశం త్రివేణీ సంగమం నాలుగువేదాలు వెలసిన పవిత్ర భూమి, పంచశీలనుబోధించినభూమి, సహజీవనం, సమభావనతో ప్రజాక్షేమమే ప్రగతిమర్గమై 'భిన్నత్వంలో ఏకత్వం' తో భారతీయ సంస్కృతి గొప్పగా చూపింది. అమెరికా అమ్మాయి సినిమాలో ''ఏదేశమేగినా, ఎందుకాలిడినా ఏపీఠమెక్కినా, ఎవ్వరేమనినా పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపురానీజాతి నిండు గౌరవము'' -అని భరతభూమి దివ్యప్రదేశమని, పుణ్యప్రదేశమనీ, ఓ భారతీయుడా!నీకు అవమానమేల? భారతీయుడవని భక్తితో చెప్పు, భారతీయుడనని పిలుపించుకోవడమేగొప్పగా భావించాలి, భారతయుతంగా మెలగాలనే బోధిస్తుంది. (1982) ''బొబ్బిలిపులి'' సినిమాలోని ''జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ'' అనే పాటలో తల్లికి మించిన దైవం లేదు. అటువంటి తల్లికి కూడా ఆరాధ్యమైనది ఈజన్మ భూమి అని కన్న తల్లి ఋణమే కాదు, దేశమాత ఋణము కూడా తీర్చుకోవాలని అందుకు ప్రాణత్యాగానికైనా సిద్ధపడాలనీ, మనిషిగా పుట్టినా మనీషిగా ఎదగాలని, దేశభక్తి కలిగిఉండాలని చెప్తుంది. రాక్షసుడు (1986) సినిమాలో- 'జయజయ జయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రీ'', పాటలో దేశాన్ని భరతమాతగా, దివ్యమైన దేశంగా, భరతమాత ఒడిలో బిడ్డలకు సకలసౌఖ్యాలు కలుగుతాయని, కావలసినవన్ని ఇచ్చే దివ్యమైన దేశమని కీర్తించబడింది .''రాజన్న'' సినిమాలో ''అమ్మా, అవనీ ! నేలతల్లీ అని ఎన్నిసార్లు పిలిచినా తనివితీరదెందుకని'' అనే పాటలో మళ్ళీజన్మలోకుడా ఇక్కడే ఈ భరతమాత ఒడిలో, ఈ గుడిలోనే కళ్ళు తెరవాలనీ, భరతమాతకు వీరవనితవమ్మా! ధీరచరితవమ్మా! పుణ్య భూమివమ్మా! ధన్యచరితవమ్మా! అంటూ తల్లిగా కీర్తించబడింది. ''సంఘం'' సినిమాలో 'ఇలలో సాటిలేని భారతదేశం' అనే పాటలో భారతీయ సంస్కృతీ గొప్పతనాన్ని, ''తేనెల తేటల మాటలతో మనదేశమాతనే కొలిచెదమా!'' అనే పాటలోనూ దేశాన్ని తల్లిగా భావించి కీర్తించబడింది. 'మనోహరం' సినిమాలో ''భరతమాత భగవద్గీత మమతా సమతా మంగళచరిత మధురమైన సుస్వరం అదీ మరచిపోదు మాతరం, అది వందేమాతరం వందే మాతరం'' - అని భరత మాత పట్ల , ఇక్కడ హిమాలయాలు, గంగా, యమున, కావేరీ నదుల పట్ల, వేదాల పట్ల, ఒకే కుటుంబమై మెలిగే భారతీయ సంస్కృతి పట్ల గౌరవం వెల్లివిరిసింది.

జాతీయ జెండా, జాతీయ గీతం ఔన్నత్యం :

రోజా (1992) సినిమాలో ''వినరావినరా దేశం మనదేరా -అనరా అనరా రేపిక మనదేరా...''అనే పాట రక్తంలో భారతీయ తత్వం ఉంటే చాలు, నవభారతం మనదేరా, ఉపఖండమై వెలసిందిరా, దేశాలనే మరిపించి ఈ మట్టి మనకు కలిమిరా అని జాతాయ జెండా పట్ల, అభిమానం చాటుతుంది. ''జై'' సినిమాలోని ''దేశం మనదే తేజం మనదే.ఎగురుతున్న జెండా మనదే .....వందే మాతరం అందామందరం'' అనే పాటలోనూ ఈ దేశం,

ఈ గాలి, ఈ నేల ఎంతో గొప్పదని, ఎన్ని భేదాలున్నా, ఎన్ని దోషాలున్నా దేశమంటే ప్రాణమిస్తామని, భరత మాతకు ప్రణమిల్లుతామని, 'వందేమాతరం'' అని జన్మభూమి పట్ల గౌరవాన్ని ప్రకటిస్తుంది. ''బాబి (2002) సినిమాలో ''ఈ జెండా పసిబోసి చిరునవ్వురా.. దాస్య సంకెళ్ళు తెంచిందిరా....'' అంటూ, ఉరికొయ్యలు ఉయ్యాల చేసి, తెల్లవాడి గుండెల్ని తొలచిన అమ్మురా ఈ జెండా.... శత్రువెవడైనా తలవంచదు ఈ జెండా అని జెండా సమైక్యతకు చిహ్నంగా చెప్పబడింది. 'యువ'- సినిమాలోని ''ఓ యువ యువ, ఓ యువ జనగణమన, జనమన విన కలనిజమయ్యే కాలం ఇదే'' అనే పాటలో నిరుపేదల ఆకలి తీర్చేందుకు, ద్రోహాల వ్యూహాలు ఛేధించేందుకు, యువశక్తి,చూపిశ్రమించు, శ్రమఫలించు విజయవీధుల్లో ఎదురే తిరుగు యువ జనతా, భూమాతా, ఇకపై విధినే మార్చే చట్టం విరచిద్దాం అంటూ - యువశక్తి ప్రాధ్యాన్యత చెప్పి జనగణమణ గీతంలోని సమైక్యతను ప్రదర్శించింది. ''ఆర్ ఆర్ ఆర్'' సినిమాలో పరాయి పాలనపై కాలుదువ్వికొమ్ములు,విదిలించిన కోడెగిత్త ల్లాంటి వీరులను తలచుకుంటూ నెత్తురు మరిగితే ఎత్తరా జెండా....'' పాటలో గుజరాత్, పంజాబ్, మరాఠా పౌరుషం చాటిచెప్పింది.

జన్మభూమి ప్రాధాన్యత, ప్రత్యేకత :

భారతదేశం రత్నగర్భ అని, సిరుల తల్లి అని, మహోన్నతమైన హిమాలయాలు, గంగ, యమున వంటి పవిత్ర నదులు, మహారణ్యాలు గల భౌతిక సంపదలతో కళలు, సంగీత, సాహిత్య, శాస్త్రవిజ్ఞానంలో సాటి లేని మేటి దేశంగా కొనియాడే పాటలు ఎన్నో వచ్చాయి.

1969లో ''సిపాయి చిన్నయ్య సినిమాలోని - నా జన్మభూమి ఎంత అందమైన దేశము నా ఇల్లు అందులోన కమ్మని ప్రదేశము'' అనే పాటలో నూ, 'పరదేశి' (1998) సినిమాలో ''జగతి సిగలో జాబిలమ్మకు వందనం వందనం. మమతలెరిగిన మాతృభూమికి మంగళం మాతరం''- అనే పాటలో హిమగిరి మణివంటిదని, గంగ, యమున సంగమించిన, కూచి పూడి నాట్యంలో, అజంతా ఖజురహోల శిల్పసంపదలో, తాజ మహల్ ప్రణయజీవుల పావురమై, కృష్ణవేణి శిల్పారామ సొగసులతో, వివిధ జాతులు, వివిధ మతములు ఏకతాళమై నడిచే దేశానికి మంగళం అని భారతదేశ ప్రాధాన్యతను, ప్రత్యేకతను చాటిచెప్పింది. ఇంకా 'మన జన్మభూమి బంగారు భూమి'' - (పాడిపంటలు) సినిమా, ''గంగాయమునా తరంగా లలోఎంత చక్కనిదీ మన దేశం'' (మరపురానికథ) సినిమా, ''ఓంకార నాదంతో అంకురించిన వేదధాత్రికి ఖడ్గం... సంకేతం'' ఖడ్గం సినిమాలో, 'ఆంధ్రకేసరి' (1983) - సినిమాలో '' వేదంలా ఘోషించే గోదావరీ... అమర ధామంలా శోభిల్లే రాజమహేంద్రి .... శతాబ్దాల చరిత్రగల సుందరనగరం''- ఈ దేశమనీ, ఇక్కడ రాజ రాజనరేంద్రుడు, రెడ్డిరాజులు, గజపతులు ఏలిన నేల అని, నన్నయ, శ్రీనాథ కవిసార్వభౌముల సాహిత్యం వికసించిన నందనవనమని, చక్కని శిల్పకళలు, కట్టుకథల చిత్రాంగి మేడలు, కోటిలింగాలుగా గొప్ప ప్రదేశాలు, కందుకూరి వంటి సంస్కర్తలు వెలసిన నేల ఇది అని ఇక్కడి కళలు, సాహిత్యం, శాస్త్ర విజ్ఞానం గొప్పగా, చూపించిన పాటలు ఎన్నో ఉన్నాయి.

సహజవన, సమభావన స్ఫూర్తి :

భారతదేశం శాంతికి, సహజీవనానికి నిలయమైన నేల అని భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగి మానవత్వమే ఉన్నత తత్వమని, భిన్నమతాలు, కులాలు, భాషలు, ఆచార వ్యవహారాలు ఉన్నా, సమభావం, సహజీవనతత్వంతో ప్రపంచానికే ఆదర్శమని చెప్పే పాటలు సినిమాల్లో కనిపిస్తాయి. కోడలు దిద్దిన కాపురం (1970) సినిమాలోని ''నీసంఘం, నీధర్మం, నీదేశం నువు మరవద్దు, నీతిని నిలిపి, జాతిని నడిపిన మహానీయులనే మరవద్దు'' పాటలో - సత్యంకోసం హరిశ్చంద్రుడు నిలిచాడనీ, శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతమ్మల మార్గం అనుస రించాలనీ, చాపకూడుతో సమత, సమభావం నేర్చిన బ్రహ్మనాయుడు, సరస్కరణశీలి కందుకూరి, గురజాడల

సంఘం ఇది అని, నేతాజీ, టంగుటూరి వంటి త్యాగ జీవులు వెలసిన భారతదేశం సత్యాహింసల, శాంతి సహజీవనం, పంచశీల మార్గం ప్రపంచానికే ఆదర్శమని, 1973 లో 'గాంధీ పుట్టినదేశం' సినిమాలో - "గాంధీ పుట్టిన దేశం, రఘురాముడు వెలసిన రాజ్యం ఇది సమతకు, మమతకు సంకేతం " - అని భేదాలు మరచి, ద్వేషం విడిచి మనిషి మనీషగా బ్రతకాలని, శాంతి, సౌఖ్యాలతో, స్వయం సంవృద్ధిగా జీవించాలని చెప్తుంది. ఈ ఆశయాలు ఆచరణలో చూపకపోతే - 'గాంధీ పుట్టిన దేశమా ఇది, నెహ్రూకోరిన సంఘమా ఇది, రామరాజ్యం - సామ్యవాదం సంభవించే కాలమా ఇది " అని ప్రశ్నించుకునే రోజు వస్తుందని, 'బొంబాయి' సినిమాలోనూ "మతమేల గతమేల మననున్నాడు, హితమేదో తెలియాలి, మనిషైనవాడు, నీ దేశమే పూవనం, పూవై వికసించనీ జీవితం "- పాటలో కులం, మతం లేని ఒకే మాట, ఒక బాట, ఒకేప్రాణ వ్వై సాగాలి మనమందరం, మానవత్వంతో మెలగాలని అదే దేశానికి క్షేమకరమని చెప్తుంది.

స్వాతంత్ర్య పోరాట ఘట్టాలు, వీరులు, దేశ నాయకుల స్మరణ :

స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యంకోసం ప్రాగత్యాగం చేసిన త్యాగధనులు, సమాజ హితం కోసం సంస్కరణ బాట పట్టిన ఉత్తములు, విజ్ఞానానికి దారులు వేసి మార్గం చూపిన మహనీయులు పుట్టిన దేశం ఇది అని - నేతాజీ, బాపూజీ, అల్లూరి, వివేకానందుడు, వంటివారి త్యాగాలు వృధాపోవనీ,వారి జీవితమే ఆదర్శంగా గడుపుదామని తెలిపే పాటలెన్నో ఉన్నాయి.దొంగరాముడు (1955) సినిమాలో - "భలే తాత మన బాపూజీ... బాలల తాత బాపుజీ, పాట, విచిత్ర దాంపత్యం' లో- "పండిత నెహ్రూ పుట్టినరోజు.. పాపలందరికి పండుగ రోజు " అనే పాట, విశ్వరూపం (1981)లో - 'నూటికో కోటికో ఒక్కరు... ఎప్పుడో.. ఎక్కడో పుడతారు... అది మీరే మీరే మాష్టారు' పాటలో, నేటిభారతం' లోని - "మానవత్వం పరిమళించే మంచి మనిషికి స్వాగతం" అనేపాటలోనూ, మానవుడు - దానవుడు (1971) లో "అణువు అణువున వెలసిన దేవా.... కనువెలుగై మము కాపాడ రావా.." పాటలోను గాంధీ, నెహ్రూ, నేతాజీ, అల్లూరి, మదర్ థెరిసా వంటి వారి త్యాగనిరతి, పోరాటతత్వం, సేవాగుణం అన్నీ ముందుతరాలు మరచిపోవని 'శంకర్ దాదా జిందాబాద్' సినిమాలో "వందేమాతరం గాంధీ ఓంకారం.. ఓ బాపూ నువ్వేరావాలి.... నీ సాయం మళ్ళీ కావాలి, జరిగే దుర్మార్గం ఆపాలి" అంటూ గాంధీ మార్గమే నేటికీ ఆచరణీయ మని,'మహాత్మ' సినిమాలో -"కొంతమంది సొంత పేరు కాదుర గాంధీ...ఇందిరమ్మ ఇంటిపేరు కాదుర గాంధీ.... ఊరికొక్క వీధి పేరు కాదుర గాంధీ" అనే పాటలో, భరతమాత తలరాతను మార్చిన విధాత అనీ, సత్యం, అహింస ఆయుధాలుగా, చిరునవ్వేసంపదగా ఆశ్రమదీక్ష, నిరాడంబర జీవితం, అదే అందరికి ఆదర్శమని గాంధీని కొనియాడిన పాట. 'సరిలేరు నీకెవ్వరు'-సినిమాలో "భగభగమండే నిప్పుల వర్షమొచ్చినా, జనగణమన అంటూనే, దూకే వాడే సైనికుడూ..." అనే పాటలో 'తూటాలు దూసుకొచ్చినా, మారణాయుధాలు ఎదురైనా, ప్రాణాలే ఎదురొడ్డి, ధైర్యాన్ని నింపేవాడు, నేనున్నానని అండగ నిలిచేవాడే, సైనికుడు నువ్వెళ్ళేదారికి జోహారు, ఎనలేని త్యాగానికి నువ్వే మారుపేరు' అంటూ సైనికుల త్యాగాలను కీర్తించిన పాట ఇది. మేజర్ చంద్రకాంత్ (1993) సినిమాలో - "పుణ్యభూమి నాదేశం నమో నమామి, ధన్యభూమి నాదేశం సదా స్మరామి" అనే పాటలో ఈ దేశం ఛత్రపతి, కట్టబ్రహ్మన, అల్లూరి, నేతాజీ, వంటి గొప్ప వీరులగన్న దేశం అని, ధృవతారల, చరితార్థుల కన్న దేశం అని, అల్లూరి సీతారామరాజు - సినిమాలో - "తెలుగువీర లేవరా, దీక్ష బూని సాగరా, దేశమాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చెయ్యరా" పాటలో స్వాతంత్ర ఉద్యమ ఘట్టాలు చిత్రతమైనాయి.

గత చారిత్రక వైభవం - ఘనత :

(1962) 'మంచిమనసులు' సినిమాలో - అహా!

ఆంధ్రభోజా ! శ్రీకృష్ణదేవ రాయా! విజయ నగర సామ్రాజ్య నిర్మాణ తేజో విరాజ! అనే పాటలో నవరసాలొలికే నాట్య శిల్పాలు, అందమైన చిత్ర కళలు, ప్రబంధసాహత్యం, శతృరాజుల నుండి రక్షణ కలిగించే పాలన, రత్నాలు రాశులు గా పోసి సిరిసంపదలతో కూడిన విజయనగర సామ్రాజ్య వైభవాన్ని గొప్పగా చాటిచెప్పింది. ''మహాబలిపురం మహాబలిపురం, మహాబలిపురం... భారతీయ కళాజగతికిది గొప్ప గోపురం '' బాలరాజు కథ (1977) సినిమాలోని పాటలలో, భారతీయ శిల్పకళా సౌందర్యాన్ని, పురాణ ఘట్టాలైన మహిషాసుర మర్ధనం, మహావిష్ణు అవతారం, పాశుపతం కోసం పార్థుడు పరమశివునికై తపస్సు చేయడం వంటివన్నీ సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్న సజీవ చైతన్యం ఉట్టిపడే శిల్పాలు, వాటిని కట్టించిన పల్లవరాజుల చరిత్రను తెలుపుతుంది. రుద్రమదేవి సినిమాలో - రాణీరుద్రమ పరిపాలన గురించి, నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా వెలగిన కాకతీయవైభవానికి భద్రకాళిగా, రుద్రమాంబగా ఘనకీర్తిని పొందిన తీరు చిత్రితమైంది.

అవినీతి, సాంఘిక దురాచారాలు పోగొట్టే అభ్యుదయ కాంక్ష :

దేశభక్తిలో సంఘసంస్కరణ అంశాలుకూడా ప్రముఖంగా కీర్తించబడ్డాయి.దేశాభివృద్ధికి నిరోధకాలైన అవినీతి, బంధుప్రీతి, లంచగొండితనం,ఆశ్రితపక్ష పాతం, వంటివే కాక, బాల్యవివాహాలు, వరకట్నం, కన్యాశుల్కం, సతీసహగమనం వంటి దురాచారాలు, నిరక్షరాస్యత, పేదరికం వంటివన్నీ తొలగిపోయి సకలసంపదల, కాలం రావాలనే కాంక్ష, భారతదేశం సామ్యవాదలౌకిక రాజ్యంగా ఎదగాలనే ఆశతో ఎన్నో పాటలు వచ్చాయి. 'చండ శాసనుడు' సినిమాలో ''దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్'' పాటలో గురజాడ రాసిన పాటలోని అంశాలు ప్రతిఫలించాయి. 'బంగారుమనిషి' - సినిమాలో - ''ఎక్కడికెడుతోంది దేశం.... ఏమైపోతుందీ పాట, దాశరధి రాసిన ''ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో - పాట, 'స్వరాజ్యం' సినిమాలో శ్రీశ్రీ రాసిన- ''కాలేజీ కుర్రవాడ కులాసాగా తిరిగేటోడ''పాట ''ఎందరో మరెందరో బలైపోయారు... నిరుద్యోగ రక్కసి నిప్పుల కొగిలింతలో '' వంటి పాటలు స్వాతంత్ర్యానంతర దేశ పరిస్థితులు తెలియజేస్తాయి. సి.నా.రె రాసిన 'వందేమాతరం' సినిమాలోనే''వందేమాతర గీతం వరుసమారుతున్నది...తరం మారుతున్నది ఆస్వరం మారుతున్నది''. అనే పాట ఒకప్పటి వందేమాతరగీతం లోని పరిస్థితులు తారుమారైన రీతిని అద్దం పట్టినట్టు చూపించి, ప్రజాసుఖం పట్టని పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది, అభివృద్ధి సాధనలో ముందున్నా ఫలితాలు అందరికీ అందక అసమానతలు పెరిగి పోతున్న తీరు చూపిస్తూ ఇది కాదు ఆశించిన భారతదేశం అనే చురక కనిపిస్తుంది. ''పాడవోయి భారతీయుడా... ఆడిపాడవోయి విజయగీతికా'' వెలుగునీడలు (1961) పాటలో అవినీతి , బంధుప్రీతి, స్వార్థం లేని మనుషులు, సహకార భావన కోరుతుంది.

శ్రమజీవన తత్వాన్ని, శ్రామికుల, కార్మికుల, కర్షకుల పట్ల గౌరవం :

''కష్టేఫలి' అనేభావాన్ని రగిలించడం, ఆశయసాధనలో కష్టాలెదురైనా శ్రమించి సాధించాలని ''మానవుడే మహనీయుడు, శక్తియుతుడు, యుక్తి పరుడు మానవుడే మహనీయుడు'' - 'బాలభారతం' (1972) లోని పాటలో అనుకుంటే మానవుడు ఏదైనా సాధించగలడని, విశ్వామిత్రుడు, భగీరథుడు, ధృవుడు కూడా మనవుడే అని విజ్ఞానసంపన్నుడని, చెప్పుంది. రైతుల గురించి '' రోజులు మారాయి'' సినిమాలో ''కల్లాకపటం తెలియని వాడా... లోకం పోకడ తెలియనివాడా'' అనే పాట ఎప్పటికైనా వ్యవసాయమే మిన్న అని రైతు లేనిదే బతుకు లేదని చెప్పింది. రాముడు-భీముడు (1964) ''దేశమ్ము మారిందోయ్... కాలమ్ము మారిందోయ్'' అనేపాట- ఆనకట్టలు కట్టి బంగారుపంటలు పండించే రోజులు వచ్చాయని, సుఖాలు ముందున్నాయని ఆశకనబడుతుంది.

అందుకొరకు చేయి చేయి కలిపే సహకార భావంతో కష్టించి పనిచేయాలని, అప్పుడే అభివృద్ధిసాధ్యమని పిస్తుంది. 'జై జవాన్' సినిమలో - ''కారులో షికారుకెళ్ళే పాలబుగ్గల పసిడి దానా.... బుగ్గ మీద గులాబీ రంగు ఎలావచ్చేనో చెప్పగలవా'' - పాటలో కష్టజీవుల శ్రమనంతా సంపన్న వర్గాల దోపిడికి గురి అవుతున్నది వివరించ బడింది.

సేవాతత్వాన్ని పెంపొందించడం :

భారతదేశంలో ఆధ్యాత్మకత, సేవాతత్వం వెల్లి విరిసింది. బుద్ధుని బోధనలో కోరికలే దు:ఖానికి కారణ మని, నిరాడంబర జీవితం ఆదర్శమని బోధించింది. మానవసే మాధవ సేవ' అనే హిందూ మత ధర్మం, అహింసను బోధించే జైన మతం, ఒక చెంపమీద కొడితే మరో చెంప చూపే శాంతితత్వం, అనాథలను, రోగులను ఆదుకొని ఉచిత సేవనందించిన మదర్ థెరిసా వంటి మహనీయులు వెలసిన దేశం ఇది. వారి ఆదర్శగుణాలు రావాలని ''అణువు అణువున వెలసిన దేవా.... కనువెలుగై మము కాపాడరావా...'' పాటలో చిత్రితమైంది.

తెలుగు భాషను, తెలుగు సంస్కృతిని అభిమానించడం :

బుల్లెట్ సినిమాలో '' మాతెలుగు తల్లికి మల్లెపూదండ, మా కన్నతల్లికి మంగళారతులు'' గీతం, అమెరికా అమ్మాయి (1976) సినిమలో ''పాడనా తెలుగుపాట ... పరవశమైనే పరవశమై మీ ఎదుట మీపాట'' అనే పాట లోనూ, తెలుగుజాతి మనది, నిండుగ వెలుగుజాతి మనది'' పాట, ''సిరులు పొంగిన జీవగడ్డయి- పాలు బారిన భాగ్యసీమై '' పాటలోనూ, 'నీకు నేను నాకు నువ్వు' సినిమాలో - తెలుగుభాష తియ్యదనం, తెలుగుభాష గొప్పదనం తెలుసుకున్నవారికి తెలుగే ఒక మూలధనం'' అనే పాటలో తెలుగు సంస్కృతిని గౌరవించాలనీ, పరభాషా వ్యామోహం మానుకొని, అవసరానికే అన్య భాషలు నేర్చుకోవాలని, తెలుగు సంస్కృతిని పరిరక్షించా లనే ఉద్బోధ కనిపిస్తుంది.

ముగింపు :

పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు దేశభక్తిని తమ చిత్రాలలో, పాటలలో చాటాలని నిర్మాతలు, దర్శకులు నేటికి/ప్రయత్నిస్తూనే ఉన్నారు. గతంలోనే కాదు భవిష్యత్తులో కూడా అభ్యుదయ భావాలుగల మరిన్ని దేశభక్తి గీతాలు చోటు చేసుకుంటాయని ఆశించవచ్చు. కన్నతల్లి పట్ల, దేశం పట్ల ప్రేమ, భక్తి, ఎన్నటికీ తరిగిపోవు. అది నిరంతరం ప్రవహించే జీవధార. దేశభక్తి గీతాల ప్రవాహం అనంత సాగరమై కొనసాగుతూనే ఉంటుంది.

ఆధార గ్రంథాలు :

1. స్వాతంత్ర ఉద్యమం - భారతదేశచరిత్ర - తెలుగు అకాడమి.
2. దేశభక్తి గీతాలు - ఆకు ప్రకాశ్, తెలుగు డిజిటల్ లైబ్రరీ
3. తెలుగు సినిమాలలో దేశభక్తి గీతాలు - ఆంధ్రజ్యోతి దినపత్రిక (2004)

❖❖❖

సంపత్ కుమార్ కవిత్వం - దేశభక్తి తత్వం

- ఐ. వి. ఎస్. గౌతమ్, పరిశోధక విద్యార్థి.

ఈ మధ్యకాలంలో అక్కడక్కడ దేశభక్తి మీద సదస్సులు నిర్వహించడం సాహిత్య లోకం గమనిస్తూనే వుంది. దేశభక్తి అనేది ఒక బూటకం అనే అరాచకవాదులు వున్న ఈ దేశంలో ఇటువంటి సదస్సులు జరగడం చాలా ఆనందదాయకం. దేశభక్తి ఎటువంటిదో ప్రాచీనకాలం నుండి అనుకుంటున్న అత్యాధునిక యుగం వరకు ఎంతోమంది ఎన్నోరకాలుగా దేశభక్తి గురించి చెబుతూనే వచ్చారు. అందరి సాహితీవేత్తలకు మింగుడుపడక పోయినా దేశభక్తి అంటే ఏమిటో రుచి చూసినవారు మారు మాట్లాడరు.

అథర్వణవేదంలో - వయం తుభ్యం బలిహనత సామ్య (అథర్వణవేదం 12.1.62)

అంటే మాతృభూమి నీకోసం మేము బలిదానం చేసేవాళ్ళమవుతాం అని అర్థం. దేశభక్తి ఎవరినో చూసి వాత పెట్టుకున్నది కాదు. అది ఎందుకో దాని వలన కలిగే ప్రయోజనాలు ఏమిటి దేశభక్తి లేకపోతే ఏమి జరుగుతుంది. నేను వ్యాసంలో చెప్పవలసిన అవసరం లేదు. చరిత్ర పుటలని అడిగే తడి ఆరని అక్షరాలతోని మనసును తడిచేస్తుంది.

తల్లి, తండ్రి, గురువు, దైవం లాగనే తనదేశం కూడి పూజనీయమైనదని ప్రాచీనకాలంలోనే భావింపబడింది. మాతా భూమిః పుత్రోషమ్ పృథివ్యాః అన్న ఋక్కులో తాను ఈ భూమి పుత్రుడునని భావించిన భారతీయుడు కనిపిస్తాడు. తాను జన్మించిన నేల, తనకు మనుగడ నిచ్చిన భూమి పరమపవిత్రమైనదనే భావన నెలకొని జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ అనే కవి వాక్కు తారకమంత్రమైనది. వేదఋక్కులలో దేశంలోని నదీనదాల్ని, కొండల్ని, వనాల్ని, జంతుజాలాన్ని కీర్తించడం కనిపిస్తుంది. ప్రకృతిని ప్రేమించడం రక్షించడం నాటి భారతీయుల జీవనవిధానంగా కనిపిస్తుంది.

అయితే ఈ భారతజాతీయ భావం మధ్యయుగాలలో తెరమరుగైంది. దేశం ముక్కలయింది. రాజభక్తి తప్ప దేశభక్తి కనిపించని కాలమది. ఆంగ్లేయుల పరిపాలన కాలంలో నిద్రాణంగా ఉన్న జాతీయభావం జాగృతమైంది.

జాతీయోద్యమం దేశభక్తిని పునరుజ్జీవింప చేసింది. అణగారి ఉన్న మాతృదేశాభిమానం మహనీయుల ఉద్బోధలతో లావాలాగా పెల్లుబికింది. ప్రభంజనంలా జాలిని చుట్టేసింది. తెలుగులో కూడా అప్పుడే నిసర్గ సుందరమైన, శక్తివంతమైన దేశభక్తి కవిత్వం ఆవిర్భవించింది. మాతృదేశ దాస్య శృంఖలాలను తెగగొట్టడానికి కవులు తమ కలాలను కరవాలాలుగా మార్చి ఝళిపించారు. చిలకమర్తివారి భరతఖండంబు చక్కని పాడియావు తెలుగులో దేశభక్తి కవిత్వానికి శ్రీకారం చుట్టి శిరోభూషణమై నిలిచింది.

జాతీయోద్యమం నుంచి స్ఫూర్తిని పొంది దేశభక్తి కవిత్వం చెప్పిన వారిలో గురజాడ, రాయప్రోలు, గరిమెళ్ళ ప్రముఖులు సామాన్య ప్రజలలో చైతన్యం కలిగించారు.

ఒక్కొక్కప్పుడు ఉద్యమకాలంలో పుట్టిన కవిత్వం ఉద్యమానంతరం పట్టును కోల్పోతుంది. అలాకాకుండా జాతి జీవించినంతకాలం మన్నగలిగిన పదునైన కవిత చెప్పిన కవులను ఈ దేశ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు.

ఏదేశమేగినా ఎందుకాలిడినా
ఏపీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీతల్లి భూమిభారతిని
నిలుపరా నీజాతి నిండు గౌరవము

ఇలాంటి దేశభక్తి కవిత్వాలను తెలుగు సాహిత్య చరిత్రలు మనం ఎన్నో గమనించవచ్చు.

ప్రస్తుతం మనం ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ రాసిన కవిత్వ సంపుటాల్లో వున్న దేశభక్తి కవిత్వం గురించి చేర్చడం ఈ పత్రం యొక్క ఉద్దేశం.

ప్రాచీన సాహిత్యం సంస్కృత భాషతో మిళితమై సాహిత్య ప్రజలకు అర్థంకావడం లేదు. కాబట్టి కాలంతో పాటు సాహిత్యం కూడా మారుతూ వచ్చి ఆధునిక సాహిత్యంగా రూపుదిద్దుకుంది. ఇందులో కూడా కొంత మంది ఆధునిక రచయితలు రచించిన కవిత్వం అర్థం కాదు. మరి ఆ కవిత్వాన్ని ఏమి అనాలో అర్థం కాదు. కాని మాడభూషి వారు కవిత్వం రాస్తే కళ్ళ ముందు ఆ సన్నివేశం అలా కనబడుతుంది. కవిత్వాన్ని పరిశీలించి నట్లయితే వ్యర్థపదాలకు అవకాశం వుండనే వుండదు.

నిజం అనే కవితలో కవి గారు లోపిస్తున్న దేశభక్తి గురించి ఇలా రాశారు.

నే చూసిన
నా దేశంలో
ఎన్ని యిజాలు
కులజం, మతిజం
భాషిజం, ప్రాంతీయిజం
లేదొక్కటే దేశిజం!

ఎందుకు భారతదేశం మీద రకరకాల రాజవంశాలు దండెత్తి దేశాన్ని దోచుకున్నాయి. అంటే ఈ దేశంలో వ్యక్తి పూజ సొంత లాభం చూసుకుంటున్న జనాభా స్థాయి పెరగడం వలన పరదేశ రాజవంశాలు దేశాన్ని దోచు కున్నాయి. దీనిలో ఏమో కవిగారు పై పంక్తుల్లో చెప్పడం జరిగింది. దేశ అభిమానం లేకపోతే మనదేశంలో కూడా పరాయిగా బతకాల్సివస్తుంది. పైగా ఇజాలు ఎక్కువయి అసలు ఇజం అయిన దెశిజం జనాలలో లోపిస్తుంది. కవిత్వం చెప్పడానికి దీర్ఘ సమాసాలు, ప్రాసలు అక్కరలేదు. అందులో నిజం వుంటే చాలు అని పై పంక్తులు చూస్తే గ్రహించవచ్చు.

జెండా వంగి
వాడి మొలతాడుకు చుట్టుకుంది
ఈ దేశపు దౌర్భాగ్యాన్ని దర్శించలేక!
జెండా వంగి
గుండాగిరికి సలాం చేస్తుంది
ఈ దేశంలో దౌర్జన్యానికి ఎదిరించలేక!

పై కవితా పంక్తులను గమనిస్తే దేశంలో వున్న పేద ప్రజల తరఫున పై వ్యాఖ్యలు మాట్లాడుతున్నాయి. దేశంలో తిండి, బట్ట లేక దారిద్ర్యరేఖకు దిగువున నివసిస్తున్న వారి గొంతుకగా పై కవిత చెప్పుకోవచ్చు. దేశంలో గుండాగిరికి దిన దిన ప్రవర్ధమానమై పేద బడుగు బలహీన వర్గాలను పీడించుకుని తింటోంది. వారి దగ్గర వున్న కాస్త సొమ్ములను భూమిని గూండాగిరి చేసి వారిని చెట్టుకొకరిని పుట్టకొకరిని చేస్తున్నారు. సహాయం చేయవలసిన ఖాఖీలు ఖాళీగా కూర్చుంటున్నారు.

జెండా
మీటరు గుడ్డలేదు
లక్షమంది
ప్రాణత్యాగం చేసిన కన్నబిడ్డ

దేశంలో ప్రతిఒక్కరు జెండాకు గౌరవం ఇవ్వాలి. దానిని ఏదో గుడ్డముక్క లాగా చూడకూడదని కవి ఉద్దేశం. జాతీయపతాకం లక్షలమంది దేసభక్తుల ప్రాణత్యాగం వలన మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది అన్న సంగతి ఏ పౌరుడూ విస్మరించకూడదు.

స్వాతంత్ర్యం వచ్చేసింది అన్న కవిత ఒక్కసారి చూద్దాం.

అయ్యా!
స్వాతంత్ర్యం రాలేదంటే
మీరు ఒప్పుకోరని మాకు తెలుసు
.....
ఎలాగో ఒకలాగ కడుపు నిండితే చాలు
అనుకునే వాళ్ళే మా వాళ్ళంతా
ఇలాగే 39 ఏళ్ళు గడిచింది
.....
కులం గలోళ్ళు సమ్మె చేస్తారు
పైకి వచ్చేస్తామేమోనని

మమ్మల్ని
ఇలా బ్రతకనివ్వండి
స్వాతంత్ర్యం వచ్చేసిందని
ఒప్పేసుకుంటాం!

పై కవితా పంక్తులు చూసుకుంటే స్వాతంత్ర్యం వచ్చిందా వచ్చినట్టు అనిపిస్తుందా అన్న సందేహం కలగక మానదు. ప్రజలు ఇంకా రైలు పట్టాల పక్కన జాతీయ రహదారుల పక్కన చిన్న గుడారాల జీవనం సాగిస్తున్నప్పుడే మనకు అర్థం అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చిందా రాలేదా అని. కుప్పలు కుప్పలు పోసిన ఎంగిలి ఆకుల దగ్గర మనుషులను మనం ఈ సమాజంలో చూస్తూనే వుంటాము. అయినా కూడా స్వాతంత్ర్యం వచ్చింది అని అనుకుంటే అది పొరపాటు. ఇంత దమనీయ పరిస్థితిలో ఉన్నప్పటికీ తలదాచుకుంటున్న ఆ చిన్న పూరి గుడిసెలను కూడా కబ్జా చేసి ఇంద్ర భవనాలు కట్టుకుంటున్నారే ఏమి అనాలి ఈ సమాజాన్నీ - ఈ పాలకులనీ.

గాంధీయాలు అన్న శీర్షికన రాసినవి - వీటిని కవితలు అనలేము అలాగని కవిత్వం కాదని చెప్పలేము. వీటికి అర్థం లేదని కాదు కొంత ఆలోచిస్తే అప్పటి కాలమాన పరిస్థితులకు తగ్గ రచనలుగా చెప్పుకోవచ్చు. వీటిలో కొంత షైకూ, మినీ కవితాతత్వం కనిపిస్తాయి. అందులోంచి కొన్నింటిని గమనిద్దాం.

తాగితే నువ్వేకాదు.
నీ కుటుంబం కూడా నాశనం
మహత్యా వైన్స్!
అర్ధరాత్రి ఆడవాళ్ళ
ఒంటరి ప్రయాణమే అసలైన స్వాతంత్ర్యం
సామూహిక అత్యాచారం!

పై కవితా పంక్తులను గమనిస్తే మొదటి రెండు పంక్తులకి మూడవ పంక్తికి పూర్తి విరుద్ధంగా వుంటుంది. దీనిని వ్యంగ్యంగా పరిగణించవచ్చు. గాంధీ మహాత్ముడు మద్యపాన నిషేధాన్ని శ్రీకారం చుట్టినవాడు ఆయన పేరు మీదనే మద్యం దుకాణాలు వుండడం ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం. రెండో కవిత గమనించినట్లయితే చూడడానికి రెండు పంక్తులే అయినప్పటికీ దేశంలో జరుగుతున్న అత్యాచారాలన్నిటి బరువును ఈ రెండు పంక్తులు మోస్తున్నాయి.

జెండా అనే కవితలో మొత్తం చూసుకుంటే పదాలు చిన్నవే అయినా వాటిని వాడుకున్న తీరు ఇతర పదాలతో కలిసినప్పుడు వాటి అర్థం నిజంగా ఒక దేశ జెండాకు ఉన్నంత బరువు ఉంది.

ఒక గుడ్డముక్క
ఒక కొయ్యముక్క
కొంచెం దేశభక్తి
నిలువెత్తు జెండా అవుతుంది
.....
నువ్వు చెప్పే అబద్ధాలన్నీ
జాతీయ గీతంలా వినిపిస్తుంది
అది జెండా మహాత్మ్యం!
ఒకసారి నువ్వు కొంచెం ఎడంగా
ఎండలోకి వచ్చి చూడు
నువ్వు అవినీతికి బాసులా
నడిచే బ్రాందీ బుడ్డిలా
ఎన్నికల వాగ్దానంలా
నీ అసలు రంగు కనిపిస్తుంది.

ఒక రాజకీయ నాయకుడు దేశం అనే జెండా నుంచి విడిగా చూస్తే ఆ నాయకుడు చేసిన దారుణాలు మనకు అర్థమవుతాయి. రాజకీయ నాయకులని, వ్యాపారవేత్తలను దేశంలో భాగంగా చూడకండి. ఎవరు ఏ స్వలాభం కోసం ఏ పని తలపెడుతున్నారో తెలుసుకోవడం కష్టం.

యుద్ధం అనే కవితలో కుట్ర రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీల గురించి రచయిత ఈ విధంగా చెప్పారు.

అప్పుడప్పుడు
యుద్ధం చేస్తూ ఉండాలి
.....

కనీసం యుద్ధ ప్రయత్నం చేస్తూ వుండాలి
అప్పుడే ప్రజలు సమస్యలను మరిచిపోతూ ఉంటారు
.....
అప్పుడప్పుడు యుద్ధం గ్లూకోజ్ ఎక్కిస్తే గాని
ఒంట్లో వేడి పుట్టదు.
అంతా ప్రశాంతంగా ఉంటే
అంతర్గత యుద్ధం మొదలవుతుంది
నీళ్ళు కావాలంటారు
నిరుద్యోగం పోవాలంటారు
జీతాలు పెంచమంటారు
జీవితాలు మారాలంటారు
అసలు యుద్ధం ఉందో లేదో దేశ సరిహద్దులో ఉన్న సైనికుడికే తెలియదు. కాని ఇక్కడ అంతా హడావుడి. అక్కడ ఏదో జరిగిపోతోందని. అప్పటివరకు ప్రభుత్వ కుట్ర రాజకీయాలను ఎండకడుతున్న వార్తా మాధ్యమాలు ఒక్కసారిగా యుద్ధజపం చేస్తాయి. వాళ్ళ స్వలాభం వాళ్ళది. ఈ రాజకీయ చక్రంలో బలి అవుతున్నది ఒక మధ్యతరగతి సమాజం.

మాడభూషిగారి కవిత్వం పరిశీలించిన తర్వాత వాదాలకూ వివాదాలకూ తావులేకుండా కవిత్వాన్ని అసలైన అర్థాన్ని తీసుకొని వచ్చారు వస్తున్నారు అన్న విషయంలో ఈ పత్రం రాసినవాడిగా మాడభూషి వారి మీద పరిశోధన చేస్తున్న విద్యార్థిగా నాకు ఎటువంటి అనుమానం లేదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. శత్రువుతో ప్రయాణం (కవిత్వం) - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
2. ఆలోచనలు (కవిత్వం) - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
3. చివరకు నువ్వే గెలుస్తావు (కవిత్వం) - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
4. వికారి (కవిత్వం) - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

❖❖❖

తెలంగాణ మహాకవి దాశరథి కవిత్వంలో దేశభక్తి

– జగర్ల మహేందర్, సీనియర్ పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ప్రజల స్వాతంత్ర్య వాంఛను అనచడం అసంభవం. "తెరలు దించగలరు గానీ శిరస్సులను వంచగలరా" అని జనులను మేల్కొల్పిన కవిత వైతాళికుడు దాశరథి. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసినవారిని, స్వేచ్ఛ కోసం నినదించి, ప్రశ్నించిన వారందరినీ నైజం కాలంలో నిర్బంధించారు. మన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా అలాగే జరిగింది.

"ఓ నిజాము పిశాచమా! కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రత్నాల వీణ." అని

అప్పటి నిజం రాజ్యంలో ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎదిరించి, తెలంగాణ ప్రజల స్వరాజ్య స్వప్నాన్ని సాధించడానికి నిజం పాలన నుండి విముక్తి కోసం జైలు గోడల్ని తన కవిత్వంతో శిలాఫలకం చేసిన కవితాశరథి. తెలంగాణ మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు. జాతీయ అభిమానం, మానవతవాదం, శాంతి విప్లవం, సమైక్య వాదం ఇలా అన్ని విధాలుగా తన అక్షరంతో సమాజ దుస్థితిని మార్చగలిగిన వారు. చాలా రచనలు చేసి 30 గ్రంథాలను మన ముందు ఉంచారు. సంస్కృత, ఆంధ్ర, ఉర్దూ, ఆంగ్ల భాషలలో తన పాండిత్యంతో ప్రజల మన్ననలు పొందాడు. అనేక బిరుదులతో పాటు పదవులను పొంది అప్పటి ప్రధానిచే జాతీయ ఉద్యమ రథసారథిగా తామ్ర పత్రంతో సన్మానం పొందారు. తన నిండైన దేశభక్తిని రచనల్లో చూడవచ్చు. తెలంగాణ ప్రాంత విముక్తి కోరిన జాతీయ వీరుడు. స్వాతంత్ర్యం సమరయోధుడు దాశరథి గారి దేశభక్తి క్రమంగా భారత దేశ స్వాతంత్ర ఆకాంక్ష నెరవేర్చే దిశగా ప్రయాణించాడు.

"మూడు రంగులు ఉన్న జండ
మురిసిపోయే ఊరు నిండ
జాతి గౌరవం నిలువగ
జనులకు ఉన్న పెద్ద అండ

ఈ జెండా నీడలోన
వదిలేద్దాం ద్వేషాన్ని."

అని జాతీయ జెండాలో దేశభక్తిని ప్రకటించారు. భారతదేశ గుర్తింపు మువ్వన్నెల జాతీయ పతాకం ఒకటే అని జెండా యొక్క ప్రత్యేకతను తెలిపాడు. ఈ దేశంలో ప్రజలందరూ మూడు రంగులను వారి గౌరవానికి ప్రతీకగా భావిస్తారు. దేశ సమైక్యతను ఏర్పరిచే ఈ జెండా అందరికీ అండ అని, గాంధీ చేతులతో ముద్దాడిన ఈ జెండా మంచుకొండల్లో ఎగరడం, దేశ ప్రభుత్వం రంగాల్లో ఎప్పుడూ నిగనిగ లాడుతూనే ఉంటుందని పేర్కొన్నారు. దీనికోసం ఎంతోమంది పోరాడిన వారు ఉన్నారు. దీన్ని ప్రపంచ దేశాల్లో ఒకటిగా నిలపడానికి మన వీరులు ప్రాణ త్యాగం చేసిన సందర్భాన్ని తెలియజేశారు. ఈ పతాకం ద్వారా మనందరం ఏకమై జాతీయ జెండాను పూజించి దీని సాక్షిగా మనందరం ద్వేషాన్ని వదిలేద్దామని భారత దేశ జాతీయ జెండా ప్రత్యేకతను చాటాడు. దాశరథిలో ఉన్న దేశభక్తిని ఈ పద్యంలో చూడవచ్చు.

"జండా ఒక్కటే మూడు వన్నెలదిబీ దేశం ఒక్కటే భారత
ఖండాసేతు హిమాచలోర్వరబీ కవి ఖండంబులోనన్ రవీం
ద్రుండొక్కండే కవీంద్రుడు ఉర్జిత జగద్యుద్ధాలలో శాంతికో
దండొద్యద్విజయుండు గాంధి ఒక్కడే తల్లి మహా భారతీ."
(అగ్నిధార)

అని అఖండ భారతావని గురించి తెలుపుతూ, ప్రజలకు దేశభక్తి చైతన్యాన్ని కల్పించాడు కవి. ప్రధానంగా భారతదేశంలో శాస్త్రజ్ఞుల గురించి జవాన్, సైనికుల గురించి ప్రతి సంవత్సరం జరుపబడే స్వాతంత్ర సంబురాల గురించి పతాకం, దేశ పౌరుల గురించి తేనదైన శైలిలో

కవిత్వాన్ని సృష్టించాడు.

"దేహానికి హృదయంలా
గేహానికి కుడ్యంలా
నగరానికి దుర్గంలా
దేశానికి సైన్యం.

భారత సైనిక సోదరుడా
పగవారిని భజించుటలో."

(ప్రజాకవి దాశరథి సాహిత్యం - 2)

అని సైనికుడికి సలాం అనే కవితలో జవాన్ ప్రత్యేకతను తెలిపారు. ఒక దేశాన్ని, సరిహద్దులను కాపాడడానికి సైనికుడు ఎలా తన జీవితాన్ని కరిగించి తన బాధ్యత నిర్వర్తిస్తాడో ఇందులో చెప్పారు. జవాన్ ద్వారా దేశం సుభిక్షంగా ఉంటుందని, దేశ నలుమూలల వారి కాపలతోనే ప్రతి దేశం ప్రగతిని సాధిస్తుందని సైనికుడి గొప్పతనాన్ని వర్ణించారు. ఎంతోమంది వీరులు కన్నతల్లికి దూరమై, ఉన్న ఊరిని విడిచి దేశ రక్షణ కోసం రణరంగంలోకి దిగిన భారత సైనికుడు గురించి భరతమాత దేహానికి కంచు కవచనంగా నిలిచిన వీరులకు సలామంటూ జవాన్ ను స్మరించుకున్నాడు కవి.

"కులమత సుడిగుండాలకు బలిగాని పవిత్రులెందరో
భారతావని బలపరాక్రమం చెర వీడింది ఇంకెన్నాళ్లకో
మన భారత జనయిత్రీ ఘనఫాలం
వెలుగుతోంది వెలుగుతోంది వెలుగుతోంది."

అని ఇతరుల పాలనలో ఉన్న దేశం యొక్క అరాచకాలను, నిర్బంధాలను, వివిధ రకాలైన హింసలను తెలియజేస్తూ మన దేశ స్వరాజ్యం కోసం విన్నవిస్తూ ప్రజలందరికీ సందేశం ఇచ్చాడు. సామాన్య పౌరుల వైపు ఉంటూ దేశ స్వాతంత్రాన్ని కోరుకున్నాడు. ప్రజలందరినీ ఏకం చేసి తన కవితా వధూటితో మన భారత జనయిత్రి గురించి చక్కగా వర్ణించారు. అందర్నీ దేశ స్వాతంత్ర్యంలో భాగం చేశారు.

"వస్తుంది ఏటేటా ఆగస్టు 15
వచ్చినప్పుడల్లా పులకిస్తుంది నా మెను

నరాలలో ప్రవహిస్తుంది స్వాతంత్ర రుధిరం
భారత జాతీయ చరిత్ర మధురాతి మధురం."

అని స్వాతంత్ర్యం వేడుకల గురించి చెప్పారు. ప్రజలందరూ నిత్యం ప్రతి సంవత్సరం జరుపుకునే ఆగస్టు 15 ప్రత్యేకతను తెలియజేశారు. మనం చేసిన పోరాటాన్ని, మన ప్రజలు ఎందరో పోరాటం చేసి చనిపోయిన స్వాతంత్ర సమరయోధుల గురించి, దేశ జెండా గురించి తెలపడం జరిగింది. ఆరోజు మన దేశం కోసం ఉద్యమించిన తీరును, దేశ ప్రజానీకానికి చెప్పి మన తల్లి భరతమాత గొప్పతనాన్ని చాటి చెబుతారు. ప్రతి ఒక్కరు స్వాతంత్ర మాసం తెచ్చిన సంతోషాన్ని అనుభవిస్తూ భారత భారతీయుల చరిత్రను స్మరించుకుంటారు. అలా పాఠశాల పౌరుల నుండి పరిపాలించే దేశ ప్రధాని, ప్రెసిడెంట్ వరకు దేశ జెండా ఎగురవేసి భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. కవి తన కవిత్వంలో స్వాతంత్ర మాసపుర్నిమలో తెలిపారు.

"స్వాతంత్రం మాసం ఇదిగో
భరతాంబ హసమిదిగో
ఆసేతు శాతనగము
జనతా విలాసం ఇదిగో."

(ప్రజా కవి దాశరథి సాహిత్యం- 2, స్వాతంత్ర్యం మాసం)

అని దేశ ప్రజలందరూ ఒక పండుగగా ఈ స్వాతంత్ర మాసాన్ని జరుపుకుంటారు. ప్రతి వీధిలో జాతీయ జెండాను ఎగరవేసి, గౌరవిస్తారు. అంతటి స్వేచ్ఛను అనుభవించే జీవుల విలాసాలని తెలిపారు. మన దేశంపై ఎప్పుడు ఘర్షించే గళాల తీరును చెప్పారు. ప్రతి ఇంటిలో వెలుగు వచ్చిన తీరును చెప్పారు. సమాజంలో ఉన్న అసమానత పోవాలని ఓ సామ్యవాద రమణి! ఓ సమసమాజ తరుణి! అంటూ ప్రజల మధ్య ఉన్న హెచ్చుతగ్గులు మాసిపోవాలని ఆకాంక్షించాడు. అందరూ కలిసి శ్రమించి సమానంగా జీవించాలని కోరుకున్నాడు. దోచేటి స్వేచ్ఛ మర్చిపోయి పనిచేసి వచ్చిన ఫలితమంతా అందరం

పంచుకోవాలని అని ఆశించాడు. ఈ విధంగా ఈ కవితలో స్వాతంత్ర వేడుక గొప్పదనాన్ని చెబుతూనే దేశ ప్రజల విలువలను తెలియజేశారు.

"మతం మరిచిపోగలను
గతం విడిచి రాగలను
భారతీయుడను నేనని
పరవశించి పోగలను."

ఈ కవితలో సమానత్వాన్ని చూపిస్తున్నాడు. కవి కులం, మతం, జాతి భేదాభిప్రాయాలు లేకుండా సమానత్వంతో, మానవత్వంతో ఇతరుల పట్ల చూపిస్తూ భారతీయుడిగా గర్వంతో పరవశించిపోతానని కవి చెప్పడం జరిగింది. భారతీయుడుగా తన జాతి గొప్పతనాన్ని నిలువెత్తు నిదర్శనం సాక్ష్యంగా నిలబడతానని కవి భావించాడు.

"పాతికేళ్ల స్వాతంత్ర్యం
జాతిని మార్చేసింది
ప్రపంచ పటంలో మనకు
ప్రత్యేకత వచ్చింది."

ఆంగ్లేయులు భారతదేశాన్ని వదిలి వెళ్ళినప్పుడు స్వాతంత్రం రావడం జరిగింది. స్వాతంత్రం రావడంతో భారతీయులు అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడం జరిగింది. తద్వారా తమను తామే పరిపాలించుకున్నారు. ప్రపంచ పటంలో భారతదేశానికి ఒక ప్రత్యేక స్థానం వచ్చిందని భరతజాతి ప్రజల జీవనములో మార్పు రావడంతో ప్రజల స్వేచ్ఛతో జీవించగలుగుతున్నారని దేశ ప్రత్యేకతను వివరించారు.

"చదువురానివాడంటే
జాతికి అవమానం
ప్రతివాడు చదివినప్పుడు
భరతజాతి గౌరవము."

దేశంలో నిరుద్యోగిత ఉంటే దేశం అభివృద్ధిని సాధించలేదు. అందువల్ల దేశంలో ప్రతి వ్యక్తిని విద్యావంతులుగా తీర్చిదిద్దినట్లైతే అప్పుడే భరతజాతి గౌరవం వస్తుంది అంటు దేశ భవిష్యత్తును తెలిపారు. ప్రతివాడు చదివినప్పుడే విజ్ఞానవంతుడు అవుతాడని విద్య గురించి విద్య వల్ల భారత జాతి సాధికారితను సాధించవచ్చని మన దేశ గౌరవాన్ని, అభివృద్ధిని ప్రగతిని వివరించారు.

"నా దేశం అదేశం
నాకు మరపు రాదు
తిండి, గుడ్డ, ఇల్లు
ఉండని వాడు ఉండరాదు."

దేశంలో మానవునికి కనీస అవసరాలు అయినా కూడు, గుడ్డ, గూడు అవసరమని ఇవి లేకుండా మానవుడు జీవించలేడని పేర్కొన్నారు. ఎప్పుడైతే కనీస అవసరాలు అందుబాటులో ఉంటాయో అప్పుడే ప్రతిఒక్కరు స్వేచ్ఛాగా ఉంటారని ఆశించాడు. కాబట్టి పేదరికాన్ని నశింపజేయాలని అంటూ కవి మానవుల కనీస అవసరాలు అయిన వాటినీ అందించాలని కోరుకున్నాడు.

ముగింపు :

తన కవిత తత్వాన్ని బట్టి దేశభక్తి ం సామ్యవాదం్ దాశరథి అని కెవిఆర్ నరసింహం గారు పేర్కొన్నారు. దీన్నిబట్టి కవి యొక్క దేశభక్తిని అంచనా వేయవచ్చు. దాశరథి కవిత్వంలోని ఉద్వేగం, ఆవేశం, అన్యాయాన్ని ప్రతిఘటించడం, ప్రశ్నించడం ప్రధానంగా కనిపిస్తాయి. ఇలా తన పాండిత్యంతో అనేక రచనలు చేశారు. రుబాయిలు వంటి కొత్త ప్రక్రియకు నాంది పలికారు. అనేక భాషల పట్టుత్వంతో తెలుగు సాహిత్యంలో కవితావిశారధిగా ఉద్భవించాడు. ఈయన కవిత్వంలో మానవతవాదం, జాతీయభావం, ప్రపంచ శాంతి, సామ్యవాదం, సమసమానత్వం అన్ని మెండుగా కనిపిస్తాయి. ఇలా అన్ని కోణాల్లో తన ప్రతిభను కనబరిచి తెలంగాణ మహాకవిగా నిలిచాడు.

ఆధార గ్రంథాలు :

1. అగ్నిధార. 2. తిమిరంతో సమరం. 3. బాలల గేయాలు. 4. ప్రజా కవి దాశరథి సాహిత్యం - 2.

ముదిగొండ వీరభద్రమూర్తి "వందేమాతరం" కావ్యం - స్వాతంత్ర్య దీప్తి

- కప్పల శ్రీరాములు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి, ఉత్తరప్రదేశ్.

దేశంలో భాషలు వేరయినా, భావాలు వేరైనా అందరూ కలిసి ఏక కంఠంతో ఆలపించిన గీతం "వందేమాతరం". ఎందరో త్యాగపురుషులకు, వీరులకు ఉత్తేజాన్ని కలిగించిన గీతం. భారత స్వాంతంత్ర్య పోరాటాన్ని మలుపు తిప్పిన మహోజ్వలగీతం. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం ఉద్యమానికి ప్రత్యేక స్థానం వుంది. బెంగాల్ విభజన నేపథ్యంలో పుట్టిన ఈ గీతం భారత జాతీయ గేయమైంది. ఆసేతు హిమాచలాన్ని ఏకతాటిపై నడిపించి స్వరాజ్య కాంక్షను రగిలించిన గీతం. వందేమాతర నినాదం రణనినాదమై బ్రిటీష్ పాలకుల వెన్నుల్లో వణుకు పుట్టించిన సమరగీతం. భారతీయ యువతను శక్తివంతం చేయడంలో వందేమాతర గీతానిది ప్రత్యేక స్థానం.

ముదిగొండ వీరభద్రమూర్తిగారు రాసిన "వందేమాతరం" పద్యకావ్యం భారత స్వాతంత్ర్య పోరాటం సందర్భంలో జరిగిన చారిత్రక ఉద్యమ నేపథ్యాన్ని పద్యకావ్యంగా తీసుకురావడం చాలా సాహసమనే చెప్పాలి. ఆయన రాసిన ఈ పద్యకావ్యానికి ముందు మాట రాస్తూ, " 'వందేమాతరం' ఒకజాతి గుండెలో నుంచి ఉబికిన నినాదం. ఒక అస్వతంత్ర్య వ్యవస్థను వేళ్ళతో కుద్దాలించిన ఉద్బోధం. ఆ నినాదం, ఆ ఉద్బోధం ఒకనాడు మేషకంఠాలకు కంఠీరవత్వాన్ని సంతరించినవి అదే నినాదం. అదే ఉద్బోధం ఈనాడు ముదిగొండ వీరభద్రమూర్తిగారి కలంలో చొరబారి కావ్య కవాటాలను తెరుస్తున్నవి-అని పద్మశ్రీ డా॥ సి. నారాయణరెడ్డి గారు అన్న మాటలు అక్షర సత్యాలు.

ఆనాటి స్వాంతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని తరువాతి తరాలకు అందించాలన్న ఉద్దేశ్యంతో వచన కవితోద్యమం బలంగా ఉన్న రోజుల్లో ప్రాచీన పద్యసాహిత్యాన్ని ఎంచుకొని, ఈ పద్యకావ్యాన్ని 1977 ఆగస్టులో మొదటి ముద్రణ చేయించడం జరిగింది. ఈ పద్యకావ్యంలో ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమ పోరాటాన్ని ఇప్పటి తరం (1970-80దశకంలో వారికి పరిచయం చేసే ఉద్దేశ్యంతో ఈ పద్యకావ్యాన్ని రాశారు ముదిగొండ వీరభద్రమూర్తి గారు. సాహిత్య విమర్శకులు ఈ పద్యకావ్యాన్ని "ఆధునిక మహాభారతం"గా అభివర్ణిస్తారు. తెలుగు మహాభారతంలో 18 పర్వాలు ఉన్నట్లుగా ఇందులో కూడా 18 ఖండాలు వున్నాయి. ఒక్కో ఖండంలో ఆయా ప్రఖ్యాత వ్యక్తుల, వ్యవస్థల, ప్రాంతాలను గురించి వర్ణించడం జరిగింది.

జననం - విద్యాభ్యాసం :

ముదిగొండ వీరభద్రమూర్తిగారు 1908 ఆగస్టు 8వ తేదిన సనాతన సంప్రదాయ ఆరాధ్య వీరశైవుల కుటుంబంలో గుంటూరు జిల్లాలోని "మాదల"లో జన్మించారు. పన్నెండు సంవత్సరాల వయస్సులో 1921లో మహాత్మాగాంధీగారి పిలుపుతో ఆకర్షితులై, బానిస చదువులకు స్వస్తి చెప్పి బెజవాడ స్వచ్ఛంద సేవాదళంలో చేరి సంఘసేవలో ఓనమాలు నేర్చుకున్నారు. పండిత వంశంలో జన్మించినా, ఆగర్భ శ్రీమమంతుల అల్లారు బిడ్డగా పెరిగినా, ఇనుక పాతర చదువులు అచ్చిరాలేదు ఆయనకు. చుట్టుపక్కలవారు, బంధువుల పోరు పడలేక మద్రాస్ వెళ్ళి ప్రయివేట్‌గా సీనియర్ కేంబ్రిడ్జి పరీక్షకు హాజరయ్యారు. అందులో ఫెయిలయి, ఇంటికి వచ్చేశారు. కొన్నిరోజులు ఇంగ్లాండ్ వెళ్ళి సరదాగా గడిపి వచ్చారు. ఎందుకో గానీ చట్రాల బిగింపు చదువు ఆయనకు పడలేదు. అయితే చదువుపై మాత్రం నిర్లక్ష్యంగా వుండకుండా, స్వయంకృషితో ఆంధ్రభాషా సాహిత్యాన్ని అవలోకనం చేశారు. కళలను నేర్చుకున్నారు. గురువులేని విద్య గుడ్డి విద్య అవుతుందని భావించి, చివరకు ముదిగొండ వంశాగ్రణి వీరభద్రశాస్త్రిగారి వద్ద సంస్కృత

భాషా సాహిత్యాలను పఠించారు. ఆధ్యాత్మిక గ్రంథ పాథోధిని మథించారు. దీక్షాశిక్షలే దివ్య రక్షగా సాగిన ఈ నిరంతర కృషి మూలంగా సిద్ధించిన జ్ఞానం ఆయన నవనవోన్మేషమైన ప్రతిభకు తోడైంది.

రచనలు :

డిగ్రీలూ, డిప్లొమాలూ లేని పాండిత్యం వీరిది. నలభై యేళ్ళ తర్వాత ఆయన రచనా వ్యాసంగంలో అడుగు పెట్టారు. టంగుటూరి ప్రకాశం పంతులుగారి జీవిత రేఖలను చిత్రిస్తూ, "ఆంధ్రకేసరి" గ్రంథాన్ని, కాకతీయ చక్రవర్తుల కళ్యాణగాథా పరంపరపై "మహామరకతము" గ్రంథాన్ని, ప్రకృత ప్రబంధానికి పూర్వ పీఠికా ప్రాయమైన "భారత స్వాతంత్ర్య సంగ్రామము" గ్రంథాన్ని, "వాసవ దత్త" అనే అనువాద గ్రంథాన్ని రచించారు. వందేమాతరం పద్యకావ్యం మదిగొండ వీరభద్రమూర్తిగారి విద్వత్తుకు కలికితురాయి.

వందేమాతరం పద్యకావ్యం - స్వాతంత్ర్య దీప్తి :

వందేమాతరం కేవలం కల్పనాకథ కాదు. అలాగని పూర్తిగా భారతదేశ చరిత్ర కాదు. అచ్చంగా నిన్నామొన్నా మన కళ్ళెదుట జరిగిన వాస్తవ చరిత్ర. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో జాతీయోద్యమం సందర్భంగా జరిగిన కొన్ని ఘట్టాలకు అద్దంపట్టేలా తీర్చిదిద్దిన చారిత్రక కావ్యమిది. చరిత్ర పుటల్లోని వాస్తవ సంఘటనలకు, కావ్యకళాశిల్పాన్ని కల్పించడం మాటలు కాదు. చారిత్రక కావ్య రచన కత్తిమీద సాము. చారిత్రక సత్యం, సాహితీ సౌహిత్యం సరియైన పాళ్ళలో ససియైన సమ్మేళనం చెందినప్పుడే ఆ రచనం చక్కటి చారిత్రక కావ్యంగా రాణిస్తుంది. వందేమాతరం పద్యకావ్యంలో 18 ఖండాలు వేటికవే ప్రత్యేకాలు. క్షామ ఖండంతో మొదలై స్వరాజ్య ఖండంతో ఈ కావ్యం ముగుస్తుంది. ప్రతి ఖండం గురించి ముందు గానే పరిచయ వ్యాసాల్ని రాయించడం ఈ పద్యకావ్యం ప్రత్యేకత.

క్షామఖండము :

క్షామఖండము అవతారిక మొదటి పద్యంలోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రముఖ దేశభక్తులను గురించి, ప్రపంచాన్ని ప్రభావితం చేసిన ఆధ్యాత్మిక వేత్తలను గురించి ప్రస్తావించి, తనకున్న దేశభక్తిని చాటుకున్నాడు. అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు ఈ ఖండానికి పరిచయ వ్యాసాన్ని రాశారు. ఈ పద్యకావ్యం గురించి ముందుమాటలో డా॥ సి.నారాయణరెడ్డిగారు ప్రస్తావన చేస్తూ, "పోతన్న శ్రీకైవల్య పదంబు లోని వస్తుధ్వనిని పుంజీకరించుకున్న పద్యమిది. అది భాగవతపరం ఇది పాశుపతపరం. కవి ఇష్టదైవమైన శివమే కాదు ఇందులో వున్నది? భారత జాతీయ విమోచన శివకరమూర్తు లెందరినో స్ఫురణ సుందరంగా ప్రతిబింబిస్తున్న పద్య ముకురం" అని అభివర్ణించాడు. ఇందులో అవ తారికలో 24 పద్యాలు ఉండగా, క్షామఖండాన్ని గురించి 92 పద్యాల్లో వివరించాడు.

హొళీఖండము :

శ్రీ ఖండాన్ని గురించి హైదరాబాద్‌కు చెందిన శ్రీ అన్నాప్రగడ శ్రీరామమూర్తిగారు పరిచయ వ్యాసాన్ని రాశారు. ఇది స్వాతంత్ర్యోద్యమ రోజుల్లో నిర్వహించుకున్న హొళీ పండుగ గురించి ఈ ఖండంలో వర్ణించాడు. ఇందులో అనాటి పాశ్చాత్యుల మనోభావాలు, భారతీయులను గురించి, భారత స్వాతంత్ర్యార్హతను గురించి, తమ పాలనయొక్క అవశ్యకతను గురించి బ్రిటీష్‌వారు చర్చించుకున్న సందర్భాలను, పగటి వేషముల ద్వారా చెప్పించాడు కవి. ఈ దృశ్యానికి రంగభూమి(వేదిక) వంగభూమి అయినా, పగటి వేషములు ఆంధ్రదేశానికి చెందినవి. కవి ఆంధ్రుడు కనుక ఇది సహజంగా గోచరించింది.

కుమార సంభవ ఖండము :

ఈ ఖండానికి ఆచార్య తూమాటి దొణప్పగారు పరిచయ వ్యాసాన్ని 'ప్రశస్తివచనం' పేరిట వెలువరించారు. ఇందులో ప్రధానంగా ప్రకృతికి మానవ ప్రకృతికీ మార్పు ఉంటుందని కవి భావించాడు. ఆ కోణంలోనే ఈ రచన

చేశాడు. సాహిత్యంలోని మార్పు భావపరం కావచ్చు. భాషాపరం కావచ్చు. ఒక్కొక్కసారి రెండూ ఉంటాయని, మంచిని పెంచే ఏ మార్పునైనా సహృదయులు స్వాగతిస్తారని, ప్రధానంగా భారత జాతీయోద్యమంలో పాల్గొన్న చాలామందిలో ద్వైధీభావం కొట్టొచ్చినట్లు కనిపించిందని, అదే ఈ వందేమాతరం ప్రబంధాంతర్గత మయిన 'కుమార సంభవ ఖండం'లో పదే పదే ప్రత్యక్షమవుతుందని "ఆచార్య తూమాటి దొణప్పగారు" వివరించారు.

శౌర్య ఖండము :

ఈ ఖండానికి పరిచయ వ్యాసాన్ని "ఫ్రీవర్స్ ఫ్రంట్" వ్యవస్థాపకులు శ్రీ కుందుర్తి ఆంజనేయులుగారు రాశారు. ఈ శౌర్యఖండం రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఆనాడు గడగడలాడించిన మహారాష్ట్ర విప్లవ యోధుడైన ఫాడ్కేకు సంబంధించిన వీర చరిత్రలో ఒక భాగం. ఇందులో ఫాడ్కే తన భార్యకు రెండు ఉపకథలను చెప్తాడు. అవి శౌర్యానికి ప్రతీకలుగా నిలిచి, ఆయనకు స్వాతంత్ర్య ఉద్యమ దీప్తిని కలిగించాయని వివరిస్తాడు. ఇందులో 104 పద్యాలున్నాయి.

రానడే ఖండము :

ఈ ఖండానికి ప్రస్తుత కేంద్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ కె. శివారెడ్డిగారు పరిచయ వ్యాసాన్ని రాశారు. ఇందులో మహాదేవ గోవింద రనడే గురించి చర్చిస్తూ, అనేకమంది భారతీయ విద్యావేత్తలను, తత్త్వవేత్తలను గురించి ప్రస్తావించాడు. గోవింద రనడే భారతీయ విద్యావేత్త, సంఘ సంస్కర్త, న్యాయమూర్తి, రచయిత. ఇతను భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు. బాంబే లెజిస్లేటివ్ కౌన్సిల్లోనూ, కేంద్ర ఆర్థిక కమిటీల్లోనూ, బాంబే హైకోర్టులో న్యాయమూర్తిగా పలు పదవులు నిర్వహించాడు. గోవింద రనడే ప్రజలకు బాగా తెలిసిన వ్యక్తి, ప్రశాంతమైన వ్యక్తిత్వం కలవాడు, ఓరిమి కలిగిన ఆశావాది. ఈ లక్షణాలే అతను బ్రిటన్‌తో వ్యవహరించడం, భారతదేశంలో సంస్కరణలు అమలు చేయడం లాంటి కార్యక్రమాల్లో అతని వైఖరిని ప్రభావితం చేశాయి. రనడే జీవిత కాలంలో వక్తృత్వోత్తేజకసభ, పూర్ణ సార్వజనిక సభ, మహారాష్ట్ర గ్రంథోత్తేజక సభ, ప్రార్థనా సమాజం లాంటి సంస్థలను స్థాపించాడు. రనడే మాటలను ముదిగంటి వారు

"విద్య రాజకీయ విజ్ఞానదాయి కా
వలయు మతముచేత బట్టు వడక
యెల్ల పల్లెటూళ్ళ నింటింట నిట్టిది
మలపవనరీతి మలయ వలయు"

అంటూ విద్యావ్యవస్థ ఒక స్వతంత్ర్య వ్యవస్థలా వుండాలని, స్వేచ్ఛగా ప్రతి ఒక్కరి హృదయాలను తాకాలని ఆక్షాంక్షించారు.

ఫాడ్కే ఖండము :

ఈ ఖండానికి డా॥ అరిపిరాల విశ్వంగారు పరిచయ వ్యాసాన్ని రాశారు. ఈ ఖండంలో భారత స్వాతంత్ర్య సంగ్రామం ఎందరో త్యాగమూర్తుల బలిదానాలవల్ల వచ్చిందని, సాయుధ విప్లవం అందులో ఒక భాగమని, బలిదానాలు, సాయుధ విప్లవం ద్వారానే స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చన్న వారికి ఆది గురువుగా, విప్లవ యుగానికి పితగా, మార్గదర్శిగా కనిపించే ఫాడ్కే గురించి వివరించాడు. బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు వాసుదేవ బలవంత ఫాడ్కే. బ్రిటీష్ పరిపాలనలో రైతుల దుస్థితి ఆయనను కదిలించింది. 'స్వరాజ్' ఈ సమస్యలన్నిటికీ సరైన విరుగుడు అని ఫాడ్కే నమ్మారు. మహారాష్ట్రలోని కోలీలు, భిల్లులు, ధాంగర్లు మొదలైన తెగల సహకారంతో రామోషీ అనే విప్లవ బృందం తయారుచేశారు. ఈ బృందం బ్రిటీష్ పరిపాలనను అంతం చేయడానికి సాయుధ పోరాటం ప్రారంభించింది. వీరు ఆంగ్ల వ్యాపారవేత్తలపై దాడులు చేసి, దోచుకుని వారి విముక్తి పోరాటానికి నిధులు సమకూర్చుకున్నారు. బ్రిటీష్ సైనికులపై హఠాత్తుగా జరిపిన గెరిల్లా దాడుల్లోని ఒకదానిలో ఏకంగా

పూణే నగరంపైనే ఫాడ్కే పట్టు సాధించి కొద్దిరోజులు నిలబెట్టుకోవడంతో ఆయన వెలుగులోకి వచ్చారు.

హైదరాబాద్ ఖండము :

ఈ ఖండానికి దేవులపల్లి రామానుజరావుగారు, శ్రీ పోతుకూచి సాంబశివరావుగారు పరిచయ వ్యాసాలు రాశారు. 232 పద్యాల్లో హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన వీరగాథలను, సాహస కృత్యాలను మిక్కిలి రసవంతంగా కావ్యరూపంలో వ్యక్తీకరించారు.

దయానంద ఖండము :

ఈ ఖండానికి డా॥ నాయని కృష్ణకుమారిగారు పరిచయం వ్యాసం రాశారు. ఇందులో 137 పద్యాలున్నాయి. ఈ ఖండంలో దయానంద వృత్తాంతం క్లుప్తంగా వుంది. స్వామి దయానంద సరస్వతిని భారతదేశ "రూసో", "బిస్మార్క్"లుగా అభివర్ణించారు ముదిగొండ వారు. దయానందలోని వ్యక్తిత్వం రెండు రకాలుగా మనకు కనిపిస్తుంది. ఒకటి మాతృదేశ దాస్య శృంఖల విచ్ఛేదనం, మరొకటి ఆధ్యాత్మికౌన్నత ప్రచార ప్రవణం. ఈ రెండింటికీ వింతగా ఏకత్వం సాధించిన అద్భుతవ్యక్తి దయానందుడు. కవి ఈయన్ను గురించి మనసంతా కేంద్రీకరించి చెప్పినట్లు ఆ పద్యాల్లో మనకు కనిపిస్తుంది.

కాంగ్రెస్ ఖండము :

ఈ ఖండానికి శ్రీ కొడాలి ఆంజనేయులుగారు పరిచయం వ్యాసం రాశారు. ఇందులో 94 పద్యాలలో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం, స్వాతంత్ర్య పోరాటంలో అది చూపిన తెగువ, మొదటి కాంగ్రెస్ సభలో తీసుకున్న తీర్మానాలను వర్ణించాడు. ఈ ఖండములోనే కాకుండా ఇతర ఖండాలలో కూడా అక్కడక్కడా కాంగ్రెస్ ప్రస్తావన మనకు కనిపిస్తుంది.

పరమహంస ఖండము :

ఈ ఖండానికి రామకృష్ణమఠం గురువు రంగనాథానందస్వామి గారు పరిచయం వ్యాసం రాశారు. ఇందులో 171 పద్యాలున్నాయి. ఆధునిక భారతదేశానికి ఆధ్యాత్మిక తేజస్సును ప్రసాదించిన తపోధనుడు, మహర్షి శ్రీ రామకృష్ణ పరమహంస. మానవతావాదం, సకలమత సమానత్వం, విశ్వశ్రేయస్సు భారతజాతీయోద్యమ ఉదాత్త ఆశయాలలో ప్రధానమైనవి. అంతేకాదు భారత జాతీయోద్యమంలోని స్వాతంత్ర్య సమరంలోని వివిధ చరిత్రాత్మక సంఘటనలకు, మహానాయకుల, మహాపురుషుల చిరస్మరణీయపాత్రలకు ప్రతిబింబాల వంటి పద్య చిత్రాలను పరమహంస ఖండంలో అనేకం చిత్రించబడ్డాయి.

వివేకానంద ఖండము :

ఈ ఖండానికి కూడా రామకృష్ణమఠం గురువు రంగనాథానందస్వామి గారు పరిచయం వ్యాసం రాశారు. ఇందులో 198 పద్యాలున్నాయి. భారత ఆధ్యాత్మిక పతాకాన్ని విశ్వవ్యాప్తంగా రెపరెపలాడించిన తపోధనుడు స్వామి వివేకానంద. భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచపటం అంతా విస్తరించేలా చేసిన పుణ్యమూర్తి. ముదిగొండవారు ఈ వివేకానంద ఖండములో భరత భూమి గొప్పతనాన్ని కీర్తిస్తూ...

"నాదేశ ప్రజసుఖమే
నాదు సుఖము, స్వర్గమునకు నా దేశమురా!
నా దేశము, భరతావని
గాదిలి కొడుకు నని పురుష ఘన! గర్జిలరా!"

ఎంతో గొప్పగా అక్షరీకరించారు.

లోకమాన్య ఖండము :

ఈ ఖండానికి డా॥ దివాకర్ల వేంకటావధాని గారు పరిచయం వ్యాసం రాశారు. ఇందులో 290 పద్యాలున్నాయి. ఆయన చెప్పినట్లు ఈ లోకమాన్యఖండము వందేమాతరం గ్రంథంలో చాలా విశిష్టమైనది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో లోకమాన్య బాలగంగాధరతిలక్ స్థానం ఎంతో గొప్పది. భారత స్వరాజ్య సాధన సౌధానికి ఆయన మూలస్తంభము. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తిలక్ స్థానాన్ని వీరావేశంతో ముదిగొండవారు చక్కగా చిత్రించారు.

అరవింద ఖండము :

ఈ ఖండానికి వేలూరు సహజానంద గారు పరిచయం వ్యాసం రాశారు. ఇందులో 208 పద్యాలున్నాయి. ఇందులో శ్రీ అరవిందులు గురించి ప్రధానంగా చర్చిస్తూ, ఇతర స్వాతంత్ర్య ఉద్యమకారులను స్మరించుకున్నారు.

భవానీమందర ఖండము :

ఈ ఖండానికి విద్వాన్, శిరోమణి శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి గారు పరిచయం వ్యాసం రాశారు. ఇందులో 113 పద్యాలున్నాయి. ఇందులో ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు అరవిందులు, సురేంద్రనాథ్ బెనర్జీ, బిపినచంద్రపాల్, అశ్వినీకుమార్ తదితరులు చూపిన మాతృదేశభక్తి గురించి, వైశ్రాయి లార్డ్ కర్జన్ చేసిన దేశద్రోహం గురించి చర్చిస్తూ, పద్యాలను రాశారు.

ఇంగ్లాండ్ ఖండము :

ఈ ఖండానికి డా॥ ధూళిపాళ శ్రీరామమూర్తిగారు పరిచయ వ్యాసం రాశారు. ఈ ఖండములో భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులైన గోపాలకృష్ణగోఖలే, లజపతిరాయ్‌లు ఇంగ్లాండ్‌కు వెళ్ళి బ్రిటీష్ ప్రభుత్వంతో చర్చలు జరపడానికి వెళ్ళినట్లుగా, అవి విఫలమైనట్లుగా చర్చించాడు. అయితే దౌత్య చర్చలు ఎలా వున్నా, అక్కడ ఉన్న ప్రాకృతిక రమణీయతను కూడా కవి అద్భుతంగా, చాలా సహజంగా చిత్రించాడు. అందుకు కారణం కూడా లేకపోలేదు. కవి ముదిగొండ వీరభద్రమూర్తి ఆయన చిన్నతనంలోనే ఇంగ్లాండ్ పర్యటన చేశారు. ఆనాటి అందాలను తమ మనస్సులో నిగూఢంగా దాచుకొని, ఈ కావ్యంలో దాన్ని బహిర్గతపరిచారు.

బెంగాల్ ఖండము :

ఈ ఖండానికి డా॥ దాశరథి కృష్ణమాచార్యులు గారు పరిచయ వ్యాసం రాశారు. ఈ బెంగాల్ ఖండము వందే మాతరం కావ్యానికే వెన్నెముక. ఆయువుపట్టు. వందే మాతర గీత రణన్నినాదానికి వేదికగా నిలిచిన వేదభూమి వంగభూమి అంటూ ముదిగొండ వీరభద్రమూర్తి 239 పద్యాల్లో అద్భుతంగా చిత్రించారు.

"వందల్ వేల్ బ్రిటనంబరంబులు రగుల్పన్ భావక జ్వాలతో
వందేమాతర మంచు భారతిని నివ్వాళించు మీ హారతిన్
సందృప్యత్ ప్రభుతంత్రయంత్రన ప్రతిజ్ఞాయజ్ఞ పూర్ణాహుతిన్
వందిపన్‌దగు వర్ణమాల యిరవొందన్ లేదు వంగ ప్రజా!"

అంటూ భావోద్వేగంతో బెంగాల్ ప్రజల శక్తియుక్తులను యుదిగొండ వీరభద్రమూర్తిగారు ప్రశంసించారు.

ఉద్యమ ఖండము :

ఈ ఖండానికి శ్రీ బిజయ్ కుమార్ సిన్హా గారు ఆంగ్లంలో పరిచయ వ్యాసాన్ని రాశారు. దాన్ని తెలుగులో అనువాదం చేయించారు. ఈ ఖండంలో 1857 తిరుగు బాటును గురించి, 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన గురించి 108 పద్యాల్లో స్వాతంత్ర్య ఉద్యమాలను గురించి చక్కగా చిత్రించాడు.

స్వరాజ్య ఖండము :

ఈ ఖండానికి డా॥ కోవెల సుప్రసన్నాచార్యగారు పరిచయ వ్యాసాన్ని రాశారు. వందేమాతరం పద్య కావ్యంలో ఇది చివరి ఖండము. చివరి ఖండములో స్వరాజ్యం సాధించిన తీరును, దాన్ని ప్రజాప్రభుత్వంగా మలచి, మంచి పరిపాలన అందించేందుకు చేయాల్సిన ప్రయత్నాలను 286 పుటల్లో చివరగా

"ప్రజాస్వామ్య ప్రభుత్వాయ
ప్రజాయై మంగళం సదా
నిస్వార్థేభ్య: ప్రజాసేవా
నిరతేభ్యశ్చ మంగళం" అంటూ

మంగళాశాసనముతో ముగించారు. లోక వ్యవహారంలో వీరభద్రమూర్తిగారిది కోమల ప్రకృతి. కానీ కవితా లోకవ్యవహారంలో

"మొరసి శబ్దము లర్థముల్ మెఱసి, రసము
కురియునట్టి కావ్యమునకు కుదురయిన స
రస్వతిని భజింతును, తదారాధనమ్ము
నందు మ్రోయుఘంటకు నాల్క నాదు నాల్క"

అని చెప్పుకోగల ఉద్ధత ప్రకృతి వీరిది. ఉత్సాహ భరితమయిన ధర్మవీరం ప్రతిపాదిత మవడం చేత వీరరస ప్రధానంగా రూపొందిన ఈ కృతి కవి ప్రకృతికి చక్కగా సరిపోయింది.

ఆధార గ్రంథాలు :

1. వందేమాతరం - ముదిగొండ వీరభద్రమూర్తి
2. కథాంశం - రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
3. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య జి. నాగయ్య, నవ్యపరిశోధక ప్రచురణలు, తిరుపతి.
4. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - డా॥ మద్దూరి సుబ్బారెడ్డి

❖❖❖

మాడభూషి సంపత్ కుమార్ కవిత్వం - దేశభక్తి

- భూక్యా కాశీరాం, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్.

వర్తమాన సాహిత్యంలో మాడభూషి సంపత్ కుమార్ గారు ప్రత్యేకమైన శైలితో కవిత్వ రచన చేయడంలో తనకంటూ ఒక ప్రతిభను కనబరుస్తున్నారు. అతని రచనల్లో వస్తువు ప్రధానంగా సమకాలీన సమాజం పై ఆధారపడి ఉంటుంది. సమాజ పోకడాలను అర్థం చేసుకుంటూ, కలాన్ని పదును పెడుతూ అక్షర సేద్యం చేస్తున్నారు. నిరంతర అక్షర శిల్పి. ప్రతి అంశాన్ని చర్చిస్తూ అందులో ఉన్నటువంటి లోపాలని ఎండగడుతూ, ప్రశ్నిస్తూ, విమర్శిస్తూ, కవిత్వ రచన చేయడంలో నది ప్రవాహంల ప్రవహిస్తున్నారు.

ఈ కవి రచనల్లో దేశభక్తి సంబంధించిన కవితలు పాఠకులకు కనిపిస్తుంది. ప్రతి ఒక్కరికి వారి వారి దేశాల మీద అభిమానం, దేశభక్తి ఉంటుంది. అలాగే మన భారతీయ ప్రజలందరికీ కూడా మన భారత దేశంపై భక్తి ఉంటుంది. భారతదేశం భిన్న సంస్కృతులకు, భిన్న వర్ణాలకు, భిన్న జాతులకు సమ్మేళన రూపం. అటువంటి భారత ప్రజలు దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడడానికి ఐకమత్యంతో కలిసిమెలిసి ఉంటారు. వందేళ్లు బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని పరిపాలించినప్పుడు భారత ప్రజలు బానిస వ్యవస్థకు గురిఅవ్వడం, ప్రజలు వారికి వ్యతిరేక తిరుగుబాటు చేయడం జరిగింది. స్వతంత్రమే లక్ష్య సాధనంగా పోరాడిన మహనీయులు ఎందరో భారత దేశం కోసం ప్రాణ త్యాగాలు సైతం లెక్కచేయకుండా వీరమరణం పొందారు. అటువంటి గొప్ప దేశభక్తుల గురించి కవి దేశం భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని దేశభక్తిని గురించి తన కవితల్లో వివరిస్తూ దేశభక్తిని, దేశంపై తనకున్న గౌరవాన్ని, అభిమానాన్ని వ్యక్తపరుస్తూ సైనికుల వీర మరణాన్ని, త్యాగ ఫలితాలను కవిత్వీక రించారు కవి సంపత్ కుమార్ గారు. కవి రాసిన 'చివరకు నువ్వే గెలుస్తావు' కవిత సంపుటిలో 'జెండా' గొప్పతనాన్ని వివరిస్తూ ఇలా అంటున్నారు కవి-

"నువ్వు ఎంత త్రాష్టుడివైనా
దాని నీడలో
సుభాష్ చంద్రబోస్లా కనిపిస్తావు
అది జెండా మహత్మ్యం
నువ్వు ఊసరవెల్లివైనా
ఆ రంగుల నీడలో
కళ్ళద్దాలు పెట్టుకొని
కొయ్య పట్టుకొని
నడిచే గాంధీలా కనిపిస్తావు
అది జెండా మహత్మ్యం" పుట : 54

భారత జాతీయ జెండా దేశానికి గర్వకారణం. భారతీయులు అందరు గౌరవించే పతాకం. త్యాగాన్ని తెలిపే కాషాయం, శాంతిని చూపే తెల్లదనం, పంట పొలాలను తెలిపే పచ్చదనం, ధర్మం నిలిపే అశోక చక్రం. ఇవన్నీ కలగలిపింది మన జాతీయ జెండా. అటువంటి జెండా ముందు ఎంతటి దుష్ట స్వభావం ఉన్నవాడు కూడా జెండా నీడలో సుభాష్ చంద్రబోస్ లాగా, ఎంతటి రంగులు మార్చే ఊసరవెల్లి స్వభావం ఉన్న మనిషి మూడు రంగుల జెండా నీడలో మహాత్మా గాంధీలా కనిపిస్తాడు అటువంటి గొప్ప త్రివర్ణ పతాకం మన భారత జాతీయ జెండా అని కవి జెండా గొప్పతనాన్ని వివరించారు.

అలాగే శ్రీ శ్రీ మహాప్రస్థానంలో 'జయభేరి' ఖండికలో రాసిన కవిత్వం 'నేను సైతంప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఇచ్చాను' అంటూ సాగే ఈ కవిత్వంలోని పంక్తులు సంపత్ కుమార్ అనుకరణగా 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటిలోని 'కవిభేరి' ఖండికలోని ఇలా అంటున్నాడు కవి.

"నేను కూడా
స్వతంత్రానికి
కవితనొక్కటి రాసిచ్చాను!
నేను కూడా
దేశ విముక్తికి
గంటమెత్తి పాట పాడాను!" పుట : 15

జాతీయ ఉద్యమ కాలంలో స్వతంత్ర సాధనలో కవులు ఎంతో కృషి చేశారని చెప్పవచ్చు. సూర్యుడు అస్తమించని సామ్రాజ్యంలో బ్రిటిష్ ప్రభుత్వం ఆధీనంలో భారతీయులను బానిసలుగా చూస్తూ దేశానంతట తమ గుప్పెట్లో ఉంచుకోవడం జరిగింది. బానిస సంకెళ్ల విముక్తికై కవులు అటువంటి సమయంలో ప్రజలలో చైతన్యం నెలకొల్పి భారతీయులందరిని ఏకతాటిపై తీసుకువచ్చి స్వతంత్ర సాధనకై కవులు కవితలతో, రచనలతో ఎంతో చైతన్యాన్ని నెలకొల్పారు. ప్రజలు కూడా కవుల రచనలతోను, కవితలతోను చైతన్య పరులై ,భారత స్వతంత్రోద్యమానికి సిద్ధం అవ్వడం జరిగింది. ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తూ పోరాటాలు చేయడం జరిగింది. ఎంతోమంది దేశ స్వతంత్రం కోసం ప్రాణ త్యాగాలను సైతం ఇవ్వడం జరిగింది .అందుకే ఈ కవితను ఇలా అంటున్నాడు కవి-

"నేను గాని
రాయకుంటే
దేశభక్తి, దాస్య విముక్తి, ప్రజాశక్తి
దేశమందు
నాశనమావుతాయి" పుట : 16

ఈ కవితలో కవి గొప్పతనాన్ని వివరిస్తున్నాడు. ఎప్పుడైతే దేశ విముక్తికై ధైర్యాన్ని, చైతన్యాన్ని ఇచ్చినప్పుడే తిరుగుబాటు ధోరణి ప్రజలలో ఏర్పడుతుంది. స్వాతంత్ర ఉద్యమంలో కవులు విశేష కృషి చేయడం వలనే ప్రజలలో ఐక్యమత్యం ఏర్పడి ఆంగ్లేయుల పాలనను అంతం చేయడానికి కలిసిమెలిసి తిరుగుబాటు చేశారని చెప్పవచ్చు. అందుకే కవి దేశభక్తి గురించి రాయకుండా ఉండి ఉంటే ప్రజలలో చైతన్యం ఏర్పడేది కాదు అని కవి దేశభక్తిని చెబుతున్నారు. స్వతంత్ర ఉద్యమ కాలంలో కవుల పాత్ర గణనీయమైనదిగా చెప్పవచ్చు. అలాగే జెండా కవిత్వాలు ఇలా అంటున్నారు-

"జెండా
నీ వందనం కోసం చూడ్డం లేదు
దేశాన్ని నందనంగా మార్చేవాణ్ణి
అభినందించడం కోసం చూస్తోంది!
జెండా
మీటరు గుడ్డ కాదు
లక్షల మంది
ప్రాణత్యాగం చేసి కన్న బిడ్డ పుట :62

75 ఏళ్ల స్వతంత్ర భారతంలో దేశంలో మార్పు రాలేదని మహాత్ములు కలలు కన్నా సమాజం ఏర్పడలేదని చెప్పవచ్చు. దేశమంతా కూడా స్వార్థపరుల చేతిలో కేంద్రీకృతమై దేశ ఔన్నత్యాన్ని విస్మరిస్తున్నారు. ఇటువంటి సమాజంలో జెండా పవిత్రతను కోల్పోతుందని కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెండా అంటే కేవలం మీటర్ గుడ్డ కాదని, ఎంతోమంది ప్రాణ త్యాగ ఫలితం అని ఇటువంటి పవిత్రమైన భారత దేశంలో జెండా వందనం కోసం చూడడం లేదని చెప్తున్నారు. దేశాన్ని సురక్షితంగా, నందనంగా మార్చే మంచి నాయకుడు కావాలని కవి దేశ రాజకీయాలను ఉద్దేశించి రాస్తూ, దేశ ప్రజలను రాజకీయ నాయకులు పీడిస్తున్న దుస్థితిని, జెండా గొప్పతనాన్ని వివరిస్తున్నారు. అందుకే జెండా రాజకీయ ఊసరవల్లి రంగులలో కట్లు విప్పుకునే స్వేచ్ఛగా ఎగరడాన్ని గింజుకుంటుందని కవి వాపోతున్నారు.

అలాగే 'స్వాతంత్రం వచ్చేసింది ' కవితలో ఇన్నాళ్ళ స్వతంత్ర భారత అవనిలో నిజమైన స్వతంత్రం ప్రజలకు సిద్ధించిందా? నిజంగా తమ బతుకులు మారాయా? బానిస వ్యవస్థ రూపుమాపిందా?అంటే లేదనే చెప్పాలి ప్రజలు పడుతున్న దుస్థితిని కవితలు ఇలా అంటున్నారు.

"అయ్యా
స్వాతంత్రం రాలేదంటే
మీరొప్పుకోరని మాకు తెలుసు
ఇటు చూడండి
మేం బురద గుంటల్లో
పందుల్లా ఎలా బతుకుతున్నామో
సందుట్లో సమారాధన
కుక్కలు కూడా మాతో తింటున్నాయి
విసిరేసిన ఎంగిలాకుల్లాక్కొని పుట - 73

స్వతంత్రం వచ్చినప్పటికీ ప్రజల జీవన విధానంలో ఎటువంటి మార్పులు రాలేదు. పేదరికం నశించలేదు. అవినీతిపరులు దేశాన్ని దోచేస్తున్నారు. రాజకీయ బలంతో, అధికార బలంతో ప్రజల కష్టాన్ని దోచేస్తున్నారు. ఇంకా పేద ప్రజలు బురద గుంటల్లో పందుల్లా జీవిస్తున్నారని, అడుక్కునే దుస్థితి పోలేదని, కుక్కలు కూడా తమతో విసిరేసిన ఎంగిలాకులు లాక్కొని తింటున్నాయి అయిన పర్వాలేదు అంటూ తమ కడుపు నిండితే చాలు అని అనుకుంటున్నారని కవి పేదరిక సమాజాన్ని కళ్లకు కట్టినట్లుగా చూపించారు. ప్రజల జీవన గమనంలో నేటికీ ఎంతోమంది తమ కష్టాలను దళారులు, అవినీతిపరులు, రాజకీయ నాయకులు దోచుకోవడం వల్ల సామాన్య మానవుడు ఇంకా కటిక పేదరికం అనుభవిస్తున్నాడు. కులం, మతం, జాతి, వర్ణమంటూ ప్రజలను హింసిస్తూన్నా తీరుని ప్రజలు తమ బతుకులు తమనీ బతకనివ్వండి అంటూ స్వతంత్రం రాలేదంటే ఒప్పుకోరని తెలుసు కాబట్టి స్వతంత్రం వచ్చేసిందని ఒప్పేసుకుంటున్నామంటూ ప్రజల ధీనస్థితిని కవి ఆవేదనతో ప్రకటిస్తున్నాడు.

'వికారి' కవిత సంపుటిలో 'మరణం' కవితలో సైనికుడి గురించి చెప్తున్నారు కవి.

"అయినా వాళ్ళ కోసం
వాకిట్లో కాపలా కాసినట్టు
శత్రువుల కోసం
సరిహద్దుల్లో కాపలా కాసే
సైనికుణ్ణిజి
మరణ అంటదు" పుట : 42

దేశ రక్షణ కోసం నిరంతరం కష్టపడుతున్నారు సైనికులు. నిత్యం శత్రువుల కోసం సరిహద్దుల్లో పహారా చేస్తూ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఎండ, వాన, చలిని అన్నిటిని తట్టుకొని కాపలా కాస్తు దేశం కోసం అనునిత్యం దేశ రక్షణకై పాటుపడుతున్నారు. యుద్ధాన్ని జీవితంగా మార్చుకునే వారు సైనికులు. దేశం అంటే అంతులేని భక్తి. దేశం కోసం రక్తం చిందిస్తూ మాతృభూమి కోసం ప్రాణ త్యాగాలను అర్పిస్తారు అటువంటి గొప్ప వాళ్ళు సైనికులు.

"దేశం కోసం
అతను పొందే మరణం
మరణం కాదు త్యాగం
అతణ్ణి మరణం అంటదు" పుట : 42

దేశంలో ప్రజలు ధైర్యంగా స్వేచ్ఛగా జీవిస్తున్నారు అంటే అది కేవలం సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికుల వల్లే. వాళ్ల మనసులో ఒకటే ఆలోచన, వాళ్ళ జీవితాల్లో ఒకటే లక్ష్యం, వాళ్ళ చేతిలో ఒకటే తపన అదే దేశ రక్షణ. తల్లిదండ్రులను, భార్య పిల్లలను అందరినీ వదిలి ఎక్కడికంటే అక్కడికి సైతం వెళ్లి ప్రాణాలను వదిలేస్తారు. అటువంటి సైనికులు దేశం కోసం మరణించే వారికి మరణం ఉండదని, దేశ త్యాగ ఫలితం అంటూ దేశ సైనికుడు గొప్పతనాన్ని చెబుతున్నారు కవి.

'యుద్ధం' కవితలో సరిహద్దుల్లో సైనికుడు యుద్ధం చేస్తే దానికి కొంతమంది స్వార్థపు రాజకీయ నాయకులు తమమే చేసినట్టుగా,అటువంటి నాయకుల ప్రజా స్వామ్యంలో పాలన తీరుని కవి ఇలా సైనికుడి మరణ త్యాగాన్ని ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో తెలియజేశారు.

"యుద్ధం అంటే
పాలకులకు చలికాచుకోవడమే
ఎవడో పెళ్ళాం పిల్లల్ని వదిలేసి

మంచు గడ్డపై నిలబడి
దేశం కోసం వణుకుతూ ఉంటాడు
వాడి ప్రాణం పోతే
వీడు త్యాగం చేసినట్టు విర్రవీగుతాడు
వాడు విజయం సాధిస్తే
వీడు పోరాడి గెలిచినట్టు మీసం మెలివేస్తాడు''

పుట : 65

దేశం కోసం, మాతృభూమి కోసం దేశభక్తితో సైనికుడు నిరంతరం శ్రమిస్తూ శత్రు సైన్యాలతో పోరాడుతూ చివరికి ప్రాణాలు అర్పిస్తున్నారు. యుద్ధం అంటే శాంతిని నెలకొల్పే ప్రయత్నం. శాంతి స్థాపన కోసం అంతులేని రక్తపాతాలు ఎన్నో జరుగుతాయి. అటువంటి వీర సైనికుల కుటుంబాలకు వదిలేసి దేశ రక్షణకై దేశభక్తికై పాటుపడతారు. వారు దేశ రక్షణకై ఎన్నో సాహసాలు చేస్తారు. అటువంటి వీర సైనికులు యుద్ధంలో మరణిస్తే రాజకీయ నాయకులు త్యాగం చేసినట్టుగా, అలాగే యుద్ధంలో సైనికులు విజయం సాధిస్తే నాయకులు గెలిచినట్టుగా నటిస్తున్నారు. భారతదేశం కోసం నిరంతరం శ్రమిస్తూ కాపలా కాస్తున్న సైనికులు కొందరి స్వార్థపూ రాజకీయాల వల్ల కూడా మరణించడం జరుగుతుంది. అనునిత్యం శత్రువులతో సరిహద్దు ప్రాంతాల్లో పోరాడుతూనే ఉంటారు. అది వారి కున్న దేశభక్తి ఎనలేనిదిగా చెప్పవచ్చు. ప్రతి భారతీయుడు దేశభక్తుడుగా ఉండడం గొప్ప ధర్మం. మన దేశాన్ని మనం ప్రేమించాలి గౌరవించాలి. మన దేశాన్ని కోసం సేవ చేయాలి అప్పుడే దేశ రక్షణకై పాటుపడతాము.

మాడభూషి సంపత్ కుమార్ రాసిన ఆలోచనలు, శత్రువుతో ప్రయాణం, చివరికి నువ్వే గెలుస్తావు, వికారి, మూడో మనిషి కవిత్వ సంపుటాల్లో దేశభక్తికి సంబంధించి నటువంటి కవిత్వాలు రాయడం వల్ల కవిలో దేశభక్తి ఎంత ఉందో తెలుస్తుంది. యువకుల దగ్గర నుండి వృద్ధుల వరకు స్వతంత్ర దేశం కోసం పోరాడడం జరిగింది. సమాజంలో నేడు కూడా దేశం బాగుండాలి అంటే దేశభక్తులుగా పెంపొందించుకోవాలి. ప్రతి ఒక్కరిలో దేశభక్తి కలిగి ఉండాలి. దేశం పట్ల గౌరవాన్ని పొందాలి. దేశాన్ని ప్రేమించాలి. అప్పుడే దేశ భక్తులుగా వెలుగుందు తారు. నిజంగా జెండాను ఎగరేసే వారందరూ దేశ భక్తులుగా ఉన్నారా అంటే లేదని చెప్పాలి. వారందరూ దేశభక్తి కలిగి ఉంటే దేశ అభివృద్ధి చెందుతుంది. లేకుంటే దేశానికి అధోగతి పడుతుంది. సరిహద్దుల్లో సైనికుడికి ఉండే దేశభక్తి ప్రతి ఒక్కరి ఇంట్లో సైనికుడిలా దేశభక్తి ఉంటే, దేశం కోసం మంచి చేయాలనే ఆలోచన ఉంటే దేశం ఔనత్యాన్ని చాటుతారు. దేశ ఖ్యాతిని, సైనికుల వీర మరణాన్ని, వారి త్యాగ ఫలితాన్ని అలాగే జెండా గొప్పతనాన్ని, స్వతంత్ర అనంతరం పాలకుల పట్ల వ్యతిరేకతను కనబరుస్తున్నారు. స్వార్థపు రాజకీయ ముసుగుల్లో చేస్తున్నటువంటి దుర్మార్గపు మార్గాలను వాస్తవిక కోణంలో ప్రతి అంశాన్ని సున్నితంగా పరిశీలించి వివరిస్తున్నారు కవి ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారు. ప్రతి వ్యక్తి కూడా భారత దేశంలో దేశభక్తి కలిగి ఉంటే దేశ భద్రత కాపాడవచ్చు అని చెబుతున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆలోచనలు - మాడభూషి సంపత్ కుమార్
2. చివరకు నువ్వే గెలుస్తావు - మాడభూషి సంపత్ కుమార్
3. జీవితం కవిత్వం - మాడభూషి సంపత్ కుమార్
4. మూడో మనిషి - మాడభూషి సంపత్ కుమార్
5. వికారి- మాడభూషి సంపత్ కుమార్
6. శత్రువుతో ప్రయాణం - మాడభూషి సంపత్ కుమార్

❖

గంటేడ గౌరునాయుడు గేయ సాహిత్యం - దేశభక్తి

- ఎం. రమాగీతాదేవి, తెలుగు అధ్యాపకురాలు, మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాల, విజయనగరం.

ప్రతి పాట ప్రపంచం మీద వేకువ లాంటిది. అది నిద్రపోతున్న హృదయాన్ని తట్టిలేపుతుంది. విస్తృతమైన ఆకాశాన్ని చేరువచేస్తుంది. తూర్పు పశ్చిమాల్ని ఏకం చేస్తుంది. మన మధ్య అటువంటి వేకువ పిలుపుల్ని అందించే కొందరు శుభవార్తాహరులుంటారు. వారినే మహాకవి ''ముందు యుగం దూతలు'' అన్నాడు. గౌరునాయుడు అటువంటి దూత. కళింగాంధ్ర సాహిత్య ప్రపంచంలో తొలినుంచి విస్పష్టమైన గొంతుతో కవితా గానం చేస్తున్నవారిలో ప్రముఖంగా చెప్పుకోదగ్గవారు గౌరునాయుడు. గేయకవిగా, గాయకుడిగా, చిత్ర కారుడిగా, కథకుడిగా సుపరిచితులు.

లోపల, బయట ప్రపంచాలతో చేసే యుద్ధం సాహితీ సృజన. ఎవరి శక్తి సామర్థ్యాలుబట్టి వారి యుద్ధం సాగుతుంది. యుద్ధం ఎవరికీ సరదా కాదు. అను కోకుండా సంభవించేది కాదు. ఎప్పుడో, ఎక్కడో, ఎలాగో దాని బీజం మనసులో పడి మురిగి పెరిగి మరిగి మనసును మండించి బయట పడుతుంది. అక్షరమై గుండెలోతుల్లోంచి ఎగిసిపడుతుంది అని తన రచనా నేపథ్యం గురించి చెబుతారు గౌరునాయుడు.

మనుషులందరూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వా లతో మెలిగే సమాజమనే సమిష్టివాదంలోంచి సామాజిక గతితార్కిక చరిత్రలోంచి ఆశగా, ఆసక్తిగా అధ్యయనం చేస్తారు గౌరునాయుడు. వేదనకు సాంద్రమైన రూపం దిద్దితే అది కవిత్వమవుతుంది. పాడుదుమా స్వేచ్ఛగీతం (పాటలు), నాగేటి చాలుకు నమస్కారం (దీర్ఘకవిత), గీతాంజలి (పాటలు), నదిని దానం చేసాక (కవిత్వం), ప్రియభారత జననీ (దేశభక్తి గీతాలు) మొదలైన కవితలు రాసారు.

స్వతహాగా గాయకుడైన గౌరునాయుడు రాసిన పాటలు ''నేలలో వేళ్ళలోంచి సారాన్ని పిండుకున్న కొమ్మలో పూచిన పూలు'' అంటారు రామసూరి. బాల్యం నుండే కళల పట్ల మక్కువే కాదు దేశమంటే భక్తి కూడానూ. నాలుగో తరగతి చదివే సమయంలో యుద్ధ నిధి సేకరణ సమయంలో ఓ పాట పాడి దళాయిపేట గ్రామ పెద్దల అభినందల్ని అందుకున్నాడు.

ఆధునికాంధ్ర కవితా వికాసం జాతీయోద్యమంతో మొదలైంది. తెలుగు కవులు బానిసత్వం నుండి భారత జాతిని విముక్తి చేయడానికితమ కలాలకు పదును పెట్టి ప్రజల్లో దేశభక్తి నాటారు. చిలకమర్తి 'భరతఖండంబు చక్కనిపాడియావు', గురజాడ 'దేశభక్తి' గేయం, రాయ ప్రోలు వారి 'ఏదేశమేగినా...', విశ్వనాధ, తుమ్మల, దువ్వూరి, జాషువా, కరుణశ్రీ, గరిమెళ్ళ... మొ॥ వారు దేశభక్తి భావాలు రేకెత్తించే రచనలు చేశారు.

గౌరునాయుడు తన ముందు వారిని స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తి గీతాలు రాసారు. గంటేడ గౌరు నాయుడు అప్పుడప్పుడురాసిన గేయ సాహిత్యాన్ని 'ప్రియభారత జననీ' శీర్షికన 2005లో స్నేహ కళా సాహితి, కురుపాం, శ్రీకాకుళం జిల్లా వారు పుస్తకరూపంగా ప్రచురించారు. ఈ గేయ సంపుటిలో - ప్రియభారత జననీ, మా దేశం భారతదేశం, పాడరా ఓ సోదరా, అదిగదిగో మన జెండా, మన దేశం, నా దేశ గతచరిత్ర, పాడుదుమా సేచ్ఛాగీతం.. మొదలైన గేయాలున్నాయి.

మొదటి గేయం

'ప్రియ భారత జననీ..... వందే వరదాయినీ.....
వందే సుందర సస్యశ్యామల ధరణీ' అంటూ మొదలవుతుంది.

'భారతమాత చరణములందు శిరసు వంచనా
ఎల్లప్పుడు ప్రస్తుతించనా' అని సాగుతుంది.

'తెల్లదొరల దొరతనాన్ని త్రుంచి,
బానిసత్వపు సంకెళ్ళు త్రెంచుటకు,
గగన సిగలకెక్కిన వీరులెందరో' అంటూ ఆ వీరుల గాథలను ఆలకించాలి, ఆలపించాలంటారు గౌరు నాయుడు. ముప్పన్నెల వాకిళ్ళను తెరచడానికి దేశమాత ఒడిలో అసువులు బాసిన వీరులను, సమతా బీజాలు నాటిన నేతలు, మహనీయుల బాటల్లో నడవమని చెప్పిన ఈ కవిత దేశభక్తి ప్రబోధంతో సాగుతుంది.

'మా దేశం భారతదేశం'...
'ఎందరో మహానుభావుల త్యాగఫలం'.. అంటూ
'కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకూ
విపుల వేద విజ్ఞానం విరిసినది ఇక్కడ.
భగవద్గీతా మకరందరా ప్రవహించింది ఇక్కడ'
'బుద్ధుడు బోధించిన అష్టాంగ మార్గం
బాపు వెలిగించిన అహింసా దీపం' అంటూ

తమ దేశాన్ని, మన దేశాన్ని ప్రేమించడం నేర్పిస్తున్నారు కవి.

'మనమున్నది సస్యశ్యామలం సుమ కోమలమైన సుందర వసుధాస్థలియందు'

... అంటూ అటువంటి దేశాన్ని కీర్తించమంటాడు.

భారతమాతకు
'గంగా తరంగితాంతరంగ - హిమ శృంగ మకుట చిరకీర్తిరంగ'యని,
మహాకవీ గళనిగళ హారమని' స్తుతిస్తాడు.

గౌరునాయుడు తన కవితల్లో, గేయాల్లో, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన వీరుల్ని ఊపిరి ఉన్నంత వరకూ గుర్తుంచుకోవాలని, ఆ వీరుల దారుల్లో నడవాలని, నరనరాన దేశభక్తిని నింపుతాడు.

'ఖండాతర సీమలో అజాద్ హిందు ఫౌజు
ఉద్యమమై భగత్సింగు ఉరికంబపు మోజు'
మునుముందుకు సాగిన మృతవీరుల శకటాలను మన కళ్ళముందు కదిలే చిత్రపటంలా ఉంచుతారు.

'జెండాకు దండాలు పెడదాము రండి.. కాంతు లీనుచు గాలి కెరటాలతో తేలి ఆడే జెండాకు పూదండలతో అలంకరించి దేశమాతకు పూజలు చేద్దాం రండి' అంటూ పిలుపునిస్తాడు.

'అదిగదిగో మన జెండా... అందాల జెండా
మూడురంగుల జెండా... మురిపాల జెండా'..

త్యాగానికి గుర్తు కాషాయరంగు, తెలివికీ, తేటకీ తెల్లనిరంగు, పాడిపంటలకు పచ్చని రంగు... ఎంతో హంగుతో నింగిలోకి ఎగురుతుంది. జెండాను నేలకు తాకించరాదని, నీటిలో తడపరాదని, నిప్పంటించరాదని, జెండాపట్ల, దేశము పట్ల అభిమానం చాటుతుంది ఈ గేయం.

'చపల చిత్తులను చీల్చి.... కుటిల బుద్ధులను కూల్చి.. దారుణ మారణకాండను రేపి, కులమతాల చిచ్చులను రగిల్చే దుర్మార్గపు దుండగుల అరాచకాలను అణచి సుందర భారత దేశం కోసం విరామ మెరుగక పరిశ్రమించి విశ్వశాంతిని స్థాపిద్దా'మంటాడు గౌరునాయుడు.

గడిచిన యుద్ధాలకు కంటతడిపెట్టిన తల్లి కన్నీరు తన అక్షరాలతో, గానంతో తుడవడానికి పుట్టాడా ఈ కవి అని అనిపిస్తుంది. దేశచరిత్ర నెత్తుటి మరక, అయినా తల్లి మనసు మీగడ తురక. అందుకే యువకుల్ని హెచ్చరిస్తాడు.

'భారతమాత కంట కన్నీరుగా నిలువకు. శాంతి గీతంగా మారు' అని పిలుపునిస్తాడు. దానికి 'కలం పట్టి, గళం విప్ప'మంటాడు.

'పాడుదుమా స్వేచ్ఛాగీతం... ఎగరేయుదుమా జాతీయ పతాకం
దిగంతాల నినదించిన... విశ్వవిఖ్యాతినొందగా జాతి గౌరవం' అంటూ సాగిన ఈ పాటకు అరుదైన గౌరవం దక్కింది, మహారాష్ట్రంలో తొమ్మిదో తరగతికి పాఠ్యాంశముగా నిర్ణయింపబడింది. మతాలు, జాతులు, భాషలు, ప్రాంతాలు వేరైనా మనమంతా ఒక్కటే... భారతీయులం అని చాటి చెప్పుకుంది.

జలియన్ వాలాబాగ్ దురంతాలు, వందేమాతర నినాదాలు, మరాఠా విప్లవస్ఫూర్తులను, మన్నెం వీరుని విప్లవజ్యోతిని, గుండు కెదురుగా గుండెకు నిలిపిన ఆంధ్రకేసరిని, చీకటి గుండెలో పాటై మెరసిన గరిమెళ్ళను గుర్తు పెట్టుకోవాలని, 'అఖండ భారత ఖండం అక్షయ అమృత భాండమని, ఎల్లప్పుడూ పావనచరితమైన జనగణమన, జెండా గాథలు స్మరించాల'ని కవి కాంక్ష.

ఏ పాఠశాలలో పిల్లలు 'పాడుదుమా స్వేచ్ఛా గీతం' అని జపిస్తూ మేల్కుంటారో, అటువంటి పాఠశాల ప్రపంచానికే వేకువ. అక్కడ తలెత్తిన పసిబాలలలో ఎవరో ఒకరో లేదా అందరూ కూడానో తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని యథాతథంగా కొనసాగించాలని అనుకోరు. మరో క్రొత్త ప్రపంచ నిర్మాణపు సంస్కృతిలో జాతికి జీవమిచ్చి, మేథస్సును పదునుపెట్టిన వారవుతారంటారు - వాడ్రేవు చినవీరభద్రుడు.

ఈ దేశభక్తి గీతాలలో కవి తమ దేశాన్ని ప్రేమించడం నేర్పుతున్నాడు. ఆ దేశం వేరే ఎక్కడో లేదు. తామున్న చోటునుంచే మొదలయ్యేది.

'అలలై గిరులు ప్రవహించగా.. వెన్నెలలై విరులు వసియించగా
చిరుగాలిలోన గరికపువ్వులు... పాడేను సరదాల సరిగమలు'

'ఆదికవి వాల్మీకి స్ఫూర్తి. ఏకలవ్యుని మూర్తి' అందుకుని అక్షరమార్గంలో దీక్షగా ముందుకడుగిడ మంటాడు. 'విజ్ఞాన గంధాలు వెదజల్లే విశ్వగ్రంథాలయం అడవుల'ని, ప్రకృతిని ప్రేమించమని, కొండలు, కోనలు కాపాడుకోవడమే నిజమైన దేశభక్తి. కవికుమారుల కలలరూపం, అమర వీరుల ఆశయఫలం అయిన దేశం కోసం స్వప్నించడం ఎలాగో ఉపాధ్యాయుడుగా, కవిగా, గాయకుడుగా నేర్పుతున్నాడు గౌరునాయుడు. మన దేశం 'సలలిత సుమధుర సరస సాహిత్య సంగీతామృత స్వరరసధుని' అనడానికి గుర్తుగా గౌరునాయుడు పాటలు పాఠశాలల్లో మొగ్గ తొడిగి వికసిస్తున్నాయి. అమరవీరుల కన్నుల అరుణకిరణం... త్యాగధనుల ఎద ఆశయ హరితం, నిర్మల హృదయ వికాసం మన భారతదేశం. ఇక్కడ వీచే గాలి, నీరు, మట్టి పవిత్రం. ఈ పవిత్ర భూమిని ప్రేమిద్దాం.

ఉపయుక్త గ్రంథాలు :

1) పాడుదుమా స్వేచ్ఛా గీతం
2) ప్రియ భారత జననీ
3) గంటేడ గౌరునాయుడు సాహిత్యం (రెండు సంపుటాలు)

❖❖❖

బసవరాజు అప్పారావు గారి జాతీయ గీతాలు - దేశభక్తి

- నెక్కలూరి భవాని, తెలుగు అధ్యాపకురాలు, సి.హెచ్.ఎస్.డి.సెయింట్ థెరిసా మహిళా డిగ్రీ కళాశాల, ఏలూరు, ప.గో. జిల్లా.

భావకవితా యుగంలో, తెలుగు సాహిత్యంలో ముఖ్యమైన స్థానాన్ని పొంది గాంధీ ఉద్యమ ప్రభావంతో సరళమైన శైలిలో ''జాతీయ గీతాలు'' వ్రాసిన గేయకవి బసవరాజు అప్పారావు గారు. వీరి జీవితకాలం తక్కువైనా రచనలు మాత్రం ఎక్కువే. ప్రణయకవిత్వం, భక్తి కవిత్వం, స్మృతి కవిత్వాలతో పాటు జాతీయ గీతాలను సైతం రచించి దేశభక్తి కవిత్వంలోనూ వారి సాహిత్యాన్ని ప్రవేశ పెట్టారు. వీరు వ్రాసిన ''కొల్లాయి గట్టితేనేమి, మాగాంధీ?'' గేయం అప్పట్లో ప్రతి గొంతుకలో మారు మ్రోగింది. గేయకవిగా పేరుపొందిన బసవరాజుగారు ప్రణయ కవిత్వానికి ప్రతినిధిగా ఉంటూ ఎన్నో రచనలను వారి సొంతం చేసుకున్నారు. ఆయన మరణానంతరం ఆయన గీతాలు ఎందరో మహనీయుల గొంతులో మధురంగా ఆలపించబడ్డాయి.

భారత స్వాతంత్ర్య సాధనకు పోరాడిన ఎందరో నాయకులు పుట్టిన ఈ నేల ఎందరో సాహిత్యకారులకు సైతం పుట్టినిల్లు. సాహిత్యం ద్వారా ప్రజలకు ఉత్తేజాన్నం దించిన కవుల రచనలు ఆనాటి ప్రజలకు స్ఫూర్తినందించి, వారిని చైతన్యవంతులను చేయడంలో ఎంతగానో దోహదపడ్డాయి. గరిమెళ్ళ సత్యనారాయణ, రాయప్రోలు సుబ్బారావు, తుమ్మల సీతారామ్మూర్తి చౌదరి వంటి ఎందరో మహనీయులు వారి వారి రచనల ద్వారా తమ దేశభక్తిని చాటుకున్నారు. బసవరాజు అప్పారావుగారు రచించిన జాతీయ గీతాలు ఆనాటి ప్రజలకు నూతన ఉత్తేజాన్నందించాయి. బసవరాజుగారు వ్రాసిన మాగాంధీ, వేణునాదము, రాట్నము, ఈ జన్మము, జాతీయ పతాకము వంటి జాతీయ గేయాలు సామాన్య ప్రజలకు సైతం సులభంగా బోధపడి చక్కని సందేశాన్నం దించాయి.

బసవరాజుగారు 'మాగాంధీ' గేయంలో జాతిపిత మహాత్మాగాంధీని స్తుతిస్తూ

''కొల్లాయి గట్టితేనేమి, మాగాంధీ,
కోమటై పుడితేనేమీ ?''

అని వ్రాసి, కొల్లాయి కట్టుకుంటేనేమి, కోమటి వాడైతేనేమి బ్రహ్మర్షివాడని, చకచకా నడిచి జగతిని కంపింపజేసి స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన గాంధీ స్తుతి చేస్తూ వారి దేశభక్తిని చాటుకున్నారు. వ్యక్తి యొక్క వేషధారణ, కులమతాలు, వ్యక్తి యొక్క శక్తికి అడ్డురావనే సందేశాన్నందించేవిధంగా చక్కని గీతాన్ని వ్రాసారు.

బసవరాజుగారు వ్రాసిన ''వేణునాదము'' అనే గేయంలో

''భారతదేశపు దాస్యము బాపగ
పయనమాయె మోహనగాంధీ''

అంటూ భారతదేశపు దాస్యాన్ని పటాపంచలు చేయడానికి గాంధీ కదిలాడు.

''భార్యలు విడిచి భర్తలు రండోయ్
భర్తలు విడిచి భార్యలు రండోయ్
తల్లులు విడిచి పిల్లలు రండోయ్
పిల్లలు విడిచి తల్లులు రండోయ్''

అని పిల్లలు, పెద్దలు అందరూ పోరాటం చేయాలని గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని ప్రజలకు చక్కని సందేశాన్నందిస్తూ ఈ గేయాన్ని వ్రాసారు. వీరు వ్రాసిన 'మాలమాదిగ మొర' గేయం

''మాల మాదిగలం మనుసులం గామా
కుక్కలకన్నా తక్కువయ్యామా గాంధీ...

అంటూ మాల మాదిగలు వారి అవస్థలను

మహాత్మునితో చెప్పుకొని వారిని రక్షించమని వేడుకున్నట్లు చక్కని గేయాన్ని వ్రాసారు. ''డబ్బుగలవాళ్ళు వాళ్ళని దరిచేరనివ్వరని, ఈ ఘోరమేమిటి, మా నేరమేమిటి మమ్మల్ని రక్షించమని మొరపెట్టుకున్నట్లు'' చక్కని గేయాన్ని గాంధీ మహాత్మునితో వారి బాధను విన్నవించు కొన్నట్లు వ్రాసారు.

''రాట్నము'' అనే గేయం ప్రజలకు స్వదేశీ వస్త్రాలపై అభిమానం పెంచుకునే విధంగా, విదేశీ దుస్తులను విసిరి పారేసే విధంగా ప్రజలను చైతన్యపరుస్తుంది.

''సిగ్గులేదా నీకు శరములేదా
అన్నమైనా లేక బీదలల్లాడుతుంటేను
సీతాకోక చిలుకలాగా సీమగుడ్డ కట్టి తిరుగసిగ్గు''

అంటూ విదేశీ దుస్తులు ధరించినవారు సిగ్గుపడే విధంగా వ్రాసారు.

''భాగ్యరాసి భారత భూమి పరదేశపు
సరుకులేల ?'' సిగ్గు

అంటూ మన దేశపు భాగ్యరాశిని వదిలి ఇతర దేశాల సరుకులకై మనకెందుకు వ్యామోహం, అది సిగ్గుపడాల్సిన విషయం అని ప్రజలకు సందేశం ఇచ్చారు.

పరదేశీయుల పాలన మనదేశానికి మత్తుమందు వంటిది అని, భావిస్తూ ''మత్తుమందు'' అనే గేయాన్ని వ్రాసారు.

నల్లమందైతేను నాలుగ్గడియలవరకే
కల్లుమత్తైతే పది గడియల వరకేను
...గాంధీ మహాత్ముడు కనిపెట్టినట్లు
ఈ సత్యాగ్రహ మంత్రముతో మత్తు
వదిలేనేమో

అంటూ నల్లమందు మత్తు, కల్లుమత్తు, తాచువిషం కూడా కొంత సమయానికిపోతాయి, ఈ పరాయుల పాలన ఇంకెన్నాళ్ళో, గాంధీ సత్యాగ్రహంతోనైనా ఈ మత్తు పోతుందేమోనని ఆశను వ్యక్తం చేస్తూ ఈ ''మత్తుమందు'' గేయాన్ని వ్రాశారు.

వీరు వ్రాసిన ''జాతీయ పతాకము'' అనే గేయం భారతజాతి గర్వాన్ని, ఖ్యాతిని చాటిచెప్పే విధంగా చక్కని దేశభక్తిని ప్రకటించింది.

''వీర కేసరుల యెఱ్ఱనిరంగూ
దేశసేవకుల తెల్లనిరంగూ
భక్తుల పాలిట పచ్చనిరంగూ
బీదల పెన్నిధి రాటపు మెఱుపే
పతాకోత్సవము చేయండీ''

ఈ గేయం మన జెండా రంగుల చిహ్నాన్ని, స్వతంత్ర భారతజాతి ఖ్యాతిని తెలియజేసారు.

ప్రాణము పోయినా మానము మాత్రం మంట గలపక'' పతాకోత్సవము సేయండి అంటూ భారతీయు లకు చక్కని గౌరవాన్నందించి దేశభక్తిని పెంపొందింప జేసారు.

బసవరాజుగారు వ్రాసిన జాతీయ గీతాలలో ఎక్కువ శాతం గాంధీ నాయకత్వాన్ని ప్రశంసించినవే. సత్యం, అహింసలను ఆయుధాలుగా చేసుకుని శాంతి, సహనంతో స్వాతంత్ర్య సాధనకు కృషిచేసిన మహాత్ముని ప్రశంసిస్తూ ''బాపూజీ మా బాప్'', ''గాంధీప్రభ'', ''స్వరాజ్యలక్ష్మి పెండ్లి'' వంటి గేయాలను రచించి మహాత్మునిపై వారి అభి మానాన్ని దేశం పట్ల వారికి గల గౌరవాన్ని, భక్తిని చాటు కున్నారు. రాట్నము, ఈ జన్మము, జాతీయ పతాకము వంటి గేయాల ద్వారా ప్రజలకు చక్కని సందేశాన్నందించి దేశసంరక్షణ కోరుకున్నారు. ప్రజలను చైతన్యమూర్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. వారి సాహిత్య కృషి, దేశభక్తి కడు ప్రసంశనీయం. ఎందరో మహనీయులు త్యాగఫలం మనదేశం. మనదేశ రక్షణకు ఎందరో సాహితీవేత్తలు, ఉద్యమకారులు కృషిచేసి స్వాతంత్ర్యాన్ని సాధించారు. అటువంటి మహామహులందర్నీ గౌరవించడం, దేశ గౌరవాన్ని నిలబెట్టడం, భారతీయులుగా మనందరి బాధ్యత.

ఆధారగ్రంథాలు :

1. అంధ్రభారతి - అంతర్జాల మాధ్యమం
2. శబ్దరత్నాకరము - బహుజనపల్లి సీతారామచార్యులు

❖❖❖

మధుర కవిత్వం మార్గదర్శకం

- నేతేటి కామేశ్వరి శర్వాణి, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల, విజయనగరం.

సాహిత్యానికి " హితేనా సహితం సాహిత్యం", " సహితస్య భావఃసాహిత్యం" అని సంస్కృతంలో నిర్వచనాలు ఉన్నాయి. అంటే మిత్రుని వలె సాహిత్యం మేలు చేసేది, ప్రీతి ధాయకమైంది, నీతి బోధించినది, ధర్మప్రతిపాదన చేసేది అని భావం. సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉంది. సమాజంలో నుంచి సాహిత్యం వెలువడుతుంది కాబట్టి సాహిత్యం సమాజం కోసమే.

ఆధునిక సాహిత్యం 1857 నుంచి ప్రారంభమైంది. ఇందులో సామాజిక తపన, సమతా భావన, మానవత్వ కాంక్ష చోటు చేసుకున్నాయి." భారత దేశం ఎంతగా పరుల పాదాల కింద నలిగిపోవాలో అంతగాను నలిగిపోయాక, జాతి ఎంతగా బానిస అయిపోవాలో అంతగాను బానిస అయిపోయాక, భాష ఎంతగా శృంఖాల బద్ధం అయి పోవాలో అంతగానో శృంఖాల బద్ధం అయిపోయాక, సాహిత్యం ఎంతగా దిగజారి పోవాలో అంతగాను దిగజారిపోయాక, భవిష్యత్తు ఎంతగా అంధకార బంధురం అయిపోవాలో అంతగాను అంధకార బంధురం అయిపోయాక పుట్టుకు వచ్చాడు మహాకవి- అని"శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి" గారు అన్నారు. తెలుగు ఆధునిక సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడు, కవి శేఖర, బిరుదాంకితుడు, తన రచనల ద్వారా తర్వాత తరానికి ఆదర్శవంతంగా నిలిచిన మహాకవి గురజాడ.

గురజాడ అని పేరు తలవగానే గుర్తుకు వచ్చేది ఆయన రాసిన దేశభక్తి గేయం." నిక్కమైన మంచనీల మొక్కటే చాలు తళుకు బెలుకురాళ్ళు తట్టెడేలా" అని వేమనవాక్కు గురజాల విషయంలో అక్షరాల అన్వ యిస్తుంది అని శ్రీశ్రీ గారు అన్నారు అంటే గురజాడ రచనలు నష్టపోయిన ఒక్క దేశభక్తి గేయం మిగిలిన చాలు అని అర్థం. దీనిని కొంతమంది దేశభక్తి గేయం అని కొంతమంది దేశభక్తి గీతమని అంటారు. ఏదైనాప్పటికీ ఈయన రాసిన ఈ గేయం 162 సంవత్సరాల అయి నప్పటికీ ఈ రోజుకు కూడా పండితుల దగ్గర నుంచి పామరుల వరకు పాడుకుంటున్నారు అంటే ఈ కవిత్వంలో ఉన్న మాధుర్యం అలాంటిది. జాతీయోద్యమ గీతాల్లో భారత సాహిత్యంలో అత్యున్నత స్థానానికి చేరిన గేయం గురజాడ వారి దేశభక్తి గేయం."

బంకీం-"వందేమాతరం" ," ఠాగూర్ - జనగణమన "ఇక్బాల్ - సారే జహాసే అచ్చా" వీటన్నింటిని మించి అగ్రస్థానంలో ఉన్న గేయం ఇది. భారత సాహిత్యంలో ఘనత సాధించినది ఇలాంటిది మరి ఎక్కడా లేదు అనడంలో అతిశయోక్తి లేదు.

ఈ గేయంలో "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయి" అని దేశానికి నిర్వచనం చేశారు. ఇది తెలుగులో రాసినప్పటికీ భారతదేశానికి పరిమితం కాకుండా ప్రపంచ మొత్తానికి చెందుతుంది. గేయం మొదట్లో "దేశమును ప్రేమించమన్నా మంచి అన్నది పెంచుమన్నా" అని రచించారు. అంటే ప్రేమించడం అనే పదం నాకు తెలిసినంతవరకు ఎవరు ఉపయోగించ లేదు అంటే దీని అంతరంగంగా అర్థం చూసుకుంటే ఒక మంచి సమాజం తయారవ్వాలి అంటే అది ప్రేమ వలనే జరుగుతుంది అని చెప్పారు. కన్నతల్లిని, జన్మభూమిని మర్చిపోకూడదు అంటారు. "పాడి పంటలు పొంగి పొర్లే దారిలో నువ్వు పాటుపడవోయ్" అన్న పంక్తులలో భారత భూమిపై ఉన్నటువంటి భక్తి, గౌరవం కనబడుతుంది. దేశంలో ఉన్న ప్రజలు కుల, మత, జాతి, బేధాలు

లేకుండా అన్నదమ్ముల వలె కలిసి ఉండాలని సూక్తిని సరళంగా ,సుందరంగా సూచించారు. మనిషికి అసూయ ద్వేషాలు ఉండకూడదు అలాగే దేశం మీద నాకు చాలా భక్తి ఉన్నది అని శుష్క ఉపన్యాసాలు ఇవ్వకుండా కళలు నేర్చుకొని దేశాన్ని అభివృద్ధి చేయమన్నారు.

డమరుకనాదం నుంచి వెలువడిన మహేశ్వరి సూత్రాలు వ్యాకరణంకి ఎంతగా ఉపయోగపడ్డాయో అదేవిధంగా గురజాడ వారి దేశభక్తి గేయం విశ్వమంతటా ప్రభావితం చేసింది. ఈ విధంగా ఈ గేయం ''ముత్యాల సరాలల్లో'' ముత్యంలా అమర్చి, సరళమైన పదాలతో సుందరంగా, కవిత్వం కమనీయంగా, మనసును రంజింప చేసే విధంగా సర్వకాలానికి, విశ్వజనులకు అందిస్తూ నూతన తరాల వారికి మధుర కవిత్వంతో మార్గదర్శకులుగా నిలిచారు.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. గురజాడ దేశభక్తి గురించి - జి. ఎస్. చలం,
2. ఒకటిన్నర శతాబ్దాల గురజాడ
3. https://te.m.wikipedia.org › wiki ›
4. గురజాడ అప్పారావు - వికీపీడియా

❖❖❖

దేశమెరగని "దేశభక్తి"

- బండారి ప్రేమ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖైరతాబాద్, హైదరాబాద్.

తెలుగు సాహిత్య ప్రక్రియలైన నవల, కథలతో అశేష పాఠకాభిమానులను సొంతం చేసుకున్న వారిలో బలివాడ కాంతారావు గారి స్థానం ప్రత్యేకం. అనువాద రంగంలో కూడా తన ప్రతిభను చాటుకున్న గొప్ప రచయిత. జీవిత అనుభవాలను సమకాలీన సంఘటనలను జోడించి రచనలు చేస్తారు. జీవితానుభవాల సారమే వీరి రచనా వస్తువుకు కేంద్రం. పాఠకులు వీరు రాసిన కథలు నవలల్లో తమ పాత్రను ఊహించుకుని తాదాత్మ్యం చెందుతారు కాబట్టే బలివాడ కాంతారావు గారి రచనల్లో సజీవత్వం ఉట్టిపడుతుంది.

సజీవత్వం, సార్వజనీనత అనే లక్షణాలను తన రచనల్లో ప్రతిఫలింపచేస్తూ సాహిత్య రంగాన్ని విస్తృతం చేసిన బలివాడ కాంతారావు గారు 1927 జూలై 3 న శ్రీకాకుళం జిల్లాలోని మడపాం లో జన్మించాడు. బాల్యం నుంచే తల్లిదండ్రులు, గురువుల నుంచి సాహిత్య పాఠాలను నేర్చుకుంటూ సాహిత్యం పట్ల అభిరుచిని పెంచుకున్నాడు. వృత్తిరీత్యా భారత నౌకాదళంలో చేరి వివిధ విభాగాల్లో పనిచేస్తూ మరోవైపు ప్రవృత్తి రీత్యా తన రచన ప్రస్థానాన్ని కొనసాగించేవారు. పరివర్తన, అమ్మ, మనిషి - పశువు, ముంగిస వంటి 400 కథలు, 38 నవలలు రాయడం జరిగింది. వీరి నవలలు కథలు అనేక భాషల్లోకి అనువాదమయ్యాయి అంటే బలివాడ కాంతారావు గారి రచనల్లోని వస్తువైవిధ్యమే అని చెప్పవచ్చు. బలివాడ కాంతారావు గారి పుణ్యభూమి అనే నవలకు గాను 1972 లో రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. వంశధార అనే నవలకు 1986 లో తెలుగు విశ్వవిద్యాలయం బహుమతి లభించింది. బలివాడ కాంతారావు గారు సాహిత్యంలో చేసిన సేవకు గాను 1988 లో గోపీచంద్ పురస్కారం లభించింది.

బలివాడ కాంతారావు గారి దేశభక్తి కథలో ప్రధాన పాత్రధారి చలమయ్య. చలమయ్య తన కుమారున్ని, అతనికి గల దేశానికి సేవ చేయాలనే సంకల్పాన్ని గమనించి, ప్రోత్సహించి మిలటరీలో చేరడానికి అనుమతిస్తాడు. దేశ రక్షణకై ఆర్మీలో చేరిన కుమారుడు యుద్ధంలో ప్రాణాలు కోల్పోతాడు. ఆ సైనికుని పార్థివ దేహాన్ని ఇంటికి తరలిస్తారు. కుమారుని పార్థివ దేహాన్ని చూసిన తండ్రి భావోద్వేగాలు, సమాజపు తీరు, మెలిపెట్టే సంఘటనల సమాహారమే ఈ కథాంశం. సైన్యంలో వివిధ శాఖల్లో పనిచేసిన అనుభవ నైపుణ్యంతో, వాస్తవిక సంఘటనల నేపథ్యంతో రచయిత ఈ కథను రాశారు. దేశ రక్షణకై ఎన్నో ఒడిదుడుకులను, ఎన్నో ఆటంకాలను, సవాళ్లను ఎదుర్కొని సేవ చేసే సైనికుల పట్ల, వారి కుటుంబాల పట్ల, సమాజపు వైఖరిని ఈ కథలో రచయిత ఆవిష్కరించారు.

సైనికులు యుద్ధంలో మరణించారు అనే వార్త తెలియగానే "అమరవీరులకు జై" అనే నినాదంతో ఆ రోజుకు వారికి నివాళులర్పించి తమ దేశభక్తిని చాటుకున్నాం అని అనుకుంటారు. నిజంగా దేశభక్తి అంటే అంతేనా? సైనికులకు మనం ఇచ్చే గౌరవం అదేనా? నిజంగానే మనలో దేశభక్తి ఉందా? సమాజం ముందు ప్రదర్శించడానికేనా దేశభక్తి ? మన అంతరంగాల్లో దేశభక్తి అంటే ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ కథ. సమకాలీన సామాజిక సమస్యలపై స్పందిస్తూ విభిన్నమైన ప్రక్రియల్లో రచనలు చేసిన రచయితలు ఎంతోమంది ఉన్నారు కానీ, విభిన్నమైన, వైవిధ్య భరితమైన సైనికుల నేపథ్యంలో వచ్చిన రచనలు మితంగానే వచ్చాయని చెప్పవచ్చు. సైనికుల కుటుంబాల్ని, వారి సంఘర్షణను, సమాజపు తీరును రెండింటిని మేళవించి, హృదయాన్ని మెలిపెట్టేలా రచయిత బలివాడ కాంతారావు ఈ కథను చిత్రించారు.

"భక్తికి కోరికలు జతపరిస్తే అది భక్తి కాదు. నేను ఏదో కాంక్షించి దేశభక్తి చూపిస్తే అది అహం మీద నాకున్న భక్తి. కానీ దేశభక్తి కాదు. నా పేరు చరిత్రలో కాదు నా ఆత్మలో రాసుకోండి." (దేశభక్తి కథలు పుట,164)

ప్రస్తుత సమాజంలో దేశభక్తి అనేది ఆగస్టు 15, జనవరి 26, వంటి రోజుల్లో మాత్రమే జెండాలు ఎగురవేసి, సభలు, సమావేశాలలో పాల్గొంటూ వివిధ మాధ్యమాల ద్వారా తమ దేశభక్తిని చాటుకుంటున్నారు. అది నిజమైన దేశభక్తి కాదు. నిజమైన దేశభక్తి అంటే ఎలాంటి స్వార్థం లేకుండా, పేరు ప్రఖ్యాతులు ఆశించకుండా, ప్రతిఫలాన్ని కోరుకోకుండా, దేశ సౌభాగ్యంలో, దేశ ప్రగతిలో భాగ స్వాములు అవ్వడం. హృదయాంతరాలలో దేశానికి ఉపయోగపడాలనే ఆలోచన, దేశం పట్ల బాధ్యతా యుతంగా జీవించడమే నిజమైన దేశభక్తి అని రచయిత పై సంభాషణల్లో చలమయ్య పాత్ర ద్వారా వ్యక్తీకరించారు. తండ్రి చలమయ్య తన కుమారుని మరణ వార్తను విని చలించిపోయిన స్థితిలో కుటుంబ సభ్యులు, సమాజం, అతన్ని నిందిస్తున్న సందర్భంలో చలమయ్య పాత్ర ద్వారా రచయిత బలమైన సంభాషణల్ని పలికిస్తాడు. ఆ సంభాషణలే కథకు ఆయువుపట్టు అని చెప్పవచ్చు. నిజమైన దేశభక్తి అంటే ఏమిటో ? రచయిత చలమయ్య పాత్ర ద్వారా చెప్పించే ప్రయత్నం చేశారు.

ఒక తండ్రి అంతరంగ స్వగతం ఆవిష్కరించబడింది. కథా వస్తువులో వైవిధ్యత ఉంది. కానీ రచయిత రాసిన సంభాషణల్లో భావోద్వేగాల్ని పలికించే సంభాషణల్ని బలంగా రాయలేదు. కథ నడిచిన తీరు సాధారణంగా అనిపిస్తుంది. ఎక్కడ మలుపులు కానీ, ఉత్కంఠతను కలిగించేలా సంఘటనలు కానీ కథలో లేవు. కథలో పాత్రలు కూడా చాలా తక్కువే. చలమయ్య పాత్రే కథనంతా తన భుజాన వేసుకుని నడిపిస్తున్నట్లుగా కథ నడుస్తుంది. కానీ వస్తువు, వస్తువులోని వైవిధ్యం పాఠకుల్ని కథ చదివించేలా చేస్తుంది. దేశభక్తి కథ అనగానే సంభాషణలు చాలా గాఢంగా ఉండాలి అని పాఠకుడు అనుకుంటాడు. కానీ ఆ సంభాషణ నైపుణ్యమే ఈ కథలో లోపించింది. కొన్ని సందర్భాల్లో సంఘటనలకు సంబంధించిన భావావేశాన్ని కవితాత్మక ధోరణిలో రచయిత వెల్లడి చేస్తారు. ఈ కవితాత్మక ధోరణి పాఠకుల్ని కథ చదివించేలా చేస్తుంది. అటువంటి కవితాత్మక రీతితో పాఠకుల్ని చదివించేలా చేయడం రచయిత బలివాడ కాంతారావు గారి రచనలో గల నైపుణ్యం అని చెప్పవచ్చు.

ఏ రచన అయినా సార్వజనీనతను పొందిందంటే, అది ఆ రచయిత రచన ప్రతిభ ఆధారంగానే పాఠకుల ఆదరణ పొందుతుంది. సార్వజనీనతను ఒక రచన ఎప్పుడు సంపాదించగలుగుతుందంటే? ఏ ప్రాంత పాఠకులైనా ప్రాంతీయ వైవిధ్యాన్ని మరిచి ఆ రచనను తమ హృదయానికి హత్తుకున్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. స్థల, కాల, నేపథ్యాలను చూడకుండా ఆ వస్తువులోని విషయానికి మాత్రమే ప్రాధాన్యతను ఇచ్చినప్పుడు ఆ రచన విశ్వజనీనతను సంతరించు కుంటుంది. అటువంటి వస్తువును ఎన్నుకొని రచయిత బలివాడ కాంతారావు గారు దేశభక్తి కథను రాయడం జరిగింది. పాఠకులందరీ ఆమోదయోగ్యం పొందేలా రచన చేయడం బలివాడ కాంతారావు గారి రచనా వైశిష్ట్యం అని చెప్పవచ్చు. సార్వజనీనత అనే లక్షణం గల గొప్ప కథ ఈ "దేశభక్తి" కథ.

ప్రస్తుత సమాజంలోని వ్యక్తులు ఏ ప్రాంతానికో? ఏ వర్గానికో? ఏ రాజకీయపక్షానికో? విధేయంగా ఉండటమే దేశభక్తి అని అనుకుంటున్నారు. కానీ దేశభక్తి అంటే నలుగురి మెప్పుకోసం ప్రదర్శించేది కాదని, మనస్ఫూర్తిగా దేశ ప్రగతిని, శాంతిని కాంక్షించడమే నిజమైన దేశభక్తని, ప్రస్తుత సమాజానికి కనువిప్పు కలిగేలా రచయిత ఈ కథ ద్వారా మంచి సందేశం అందించారు.

ఆధార గ్రంథాలు :

1. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, ''కథా శిల్పం'' ప్రథమ ముద్రణ,జనవరి,1994, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ , హైదరాబాద్.
2. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, '' ''నవలా శిల్పం'',1996, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. దక్షిణామూర్తి.పోరంకి, ''కథానిక - స్వరూప స్వభావాలు'' ప్రథమ ముద్రణ, 1988, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. కాంతారావు. బలివాడ, దేశభక్తి కథ.

❖❖❖

"కవిసమ్రాట్" - శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి దేశభక్తి కవిత్వం - భారతీయ ధర్మం

- డా॥. పైడిపాటి ఉమానాథ శర్మ, ప్రొఫెసర్, కె.ఎల్.ఇ.ఎఫ్. కె.ఎల్.విశ్వవిద్యాలయం, వడ్డేశ్వరం.

వేదభూమి, కర్మభూమి, జ్ఞానభూమి, యోగభూమి అయిన పవిత్ర భారతావనిని ఆంగ్లేయ అధికార శృంఖలాల నుండి తప్పించి పూర్వ వైభవాన్ని పునఃప్రతిష్ఠ చేసిన ప్రధాన భూమికలు రెండు. మొదటిది దేశభక్తి ప్రపూరితులైన జాతీయ నాయకులు దేశపర్యటన గావిస్తూ తమ ఉపన్యాసాల ద్వారా ఆంగ్లేయుల దాష్టీకాలను చెప్పి ప్రజలలో చైతన్యాన్ని కలిగించి, దేశభక్తిని రగుల్కొల్పడం. రెండవది వాగ్దేవీ వైభవాన్ని అందిపుచ్చుకున్న కవి పుంగవులు దేశమాతను స్మరిస్తూ, ఈ దేశాన్ని పాలించిన ఈ దేశరాజుల త్యాగనిరతిని, దేశభక్తిని వర్ణిస్తూ తమ తమ కవితల ద్వారా ప్రజలను జాగృతం చేయడం. తెలుగులో ఈ రెండవ మార్గాన్ని ఎన్నుకున్న అనేకులైన తెలుగు కవులలో ఒకరు జాతీయ కవిగా ప్రశంసలందుకున్న కవిసామ్రాట్ శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి. 1918 ఫిబ్రవరి 22న అంటే దేశానికి స్వాతంత్ర్యం రావడానికి సుమారు 30 ఏళ్ళు ముందు కృష్ణాజిల్లా శాయిపురం గ్రామంలో వెంకట పున్నయ్య, పేరిందేవమ్మ దంపతులకు జన్మించారు. అంటే స్వాతంత్ర్య ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న రోజులవి. చిన్నతనం నుండే తల్లి వీరికి జన్మభూమి గొప్పతనం గురించి కథలు చెప్తుండేవారు. దానితో పసిప్రాయమునుండే వీరిలో జాతీయతా, జాతీయసమైక్యత, పరాయిపాలన పట్ల విముఖత మొదలైన భావాలు మనసంతా నిండిపోయాయి. అందు వలన ప్రారంభంలో వీరి రచనా వ్యాసంగమంతా దేశభక్తి, దేశ ఔన్నత్యం మొదలైన అంశాలతోనే సాగింది. జాతీయభారతి, జయభారతి, విజయభారతి, విక్రమ భారతి, నాదేశం, ఆంధ్రశ్రీ మొదలైనవి వీరు రచించిన గ్రంథాలకు పేర్లు. ఆ పేర్లు పెట్టడంలోనే వీరి భారతీయత మనకు అర్థమౌతుంది. ఈ గ్రంథాలను ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, తరువాత స్వతంత్ర భారతావనికి రాష్ట్రపతులు, వివిధ శాఖల అమాత్యులుగా పనిచేసిన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ, శ్రీ నీలం సంజీవరెడ్డి, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, శ్రీ ఎం.ఆర్.అప్పారావు మొదలైన వారికి అంకితం గావించబడ్డాయి. అంటే కృతికర్తే కాదు, కృతిభర్తలు కూడా మాతృదేశ సేవా పరాయణులే. ఈ గ్రంథాలన్నీ దేశభక్తి గేయాలే. సామాన్యులలో కూడా దేశభక్తి ఉద్దీపితమవ్వాలంటే సాహిత్యం వారిక్కూడా అర్థం కావాలి. అందువలననే గురజాడ, రాయప్రోలు, గరిమెళ్ళ మొదలైన దేశభక్తి కవులందరూ తమ రచనకు "గేయ" ప్రక్రియనే ఎన్నుకున్నారు. అందుకనే ఈ కవికూడా తన దేశభక్తిని గేయములలోనే రచించారు. ఈ దేశభక్తి గేయాలలో భారతీయ సనాతనధర్మ వైభవం ఎలా ప్రకటింపబడినదో, తద్వారా భరతజాతి వైభవాన్ని జ్ఞప్తికి తెచ్చి ప్రజలలో ఎలా ఈ కవి స్ఫూర్తిని నింపారో వివరించే ప్రయత్నం చేస్తాను.

భారతీయ సనాతనధర్మంలో "శాంతి"కి విశేష ప్రాధాన్యం వుంది. మన వేదాలలో ప్రతి మంత్రం చివర తాపత్రయాలు మూడు శాంతిగా వుండాలనే ప్రబోధాన్ని సూచిస్తూ మూడు సార్లు "ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః" అని ప్రకటింపబడింది. మన స్వాతంత్ర్య ఉద్యమం అంతా "శాంతి" సత్యాగ్రహాల మీద ఆధారపడే సాగింది. స్వార్థపూరితులైన జీవుల వైషమ్యాలు, స్పర్ధలు అశాంతికి దారితీస్తాయి. సాధారణంగా మనిషి ఎప్పుడూ ప్రశాంతతనే కోరుకుంటాడు. కాని, దానికి అవసరమైన ప్రవర్తన మాత్రం వృద్ధి చేసుకోరు. పూర్ణ శాంతిని పొందాలంటే ముందర బాహ్యంలో ప్రశాంతత ఎంతో ఆవశ్యకం. అది అంతరంగ

ప్రశాంత వృద్ధికి కూడా దోహదం చేస్తుంది. అయితే ఏది ప్రశాంతత? అనేది ప్రశ్న. "అనిష్టపరిహారిణి సంఖ ప్రాప్తి రుపతౌ" - అవాంఛనీయమైన విషయాలను తొలగించు కోవడం మూలంగా ఆనంద అనుభవమే ప్రశాంతత" - అంటూ సావణుడు అభివర్ణిస్తాడు. చెడును వదలి మంచిని స్వీకరించేటప్పుడు మనసంతా ప్రశాంతతలో మునిగిపోతుంది. బ్రిటిష్ విదేశీ పాలన భారతీయు లందరికీ అనిష్టమైన విషయం. దానిని పరిహరిస్తే భారతీయులకు శాంతి లభిస్తుంది. అసలు ప్రపంచానికి శాంతి గురించి, దాని ప్రాముఖ్యతను గురించి ప్రబోధిం చిన మొట్టమొదటి దేశం భారతదేశం. కేవలం ప్రాణులే కాదు. సమస్త ప్రాణుల ప్రాణానికి మూలాధారమైన సమస్త ప్రకృతి శాంతిగా వుండాలనేది భారతీయ సనాతనధర్మం మనకు ప్రవచించింది. అధర్వవేదంలోని శాంతి సూక్తం ఈ సమస్త విశ్వానికి శాంతి ప్రాముఖ్యతను ఇలా చెప్తుంది.

"పృథివీ శాంతి అంతరిక్షం శాంతి ద్రౌ: శాంతిరాపః శాంతిరోషధయః శాంతి వనస్పతయః శాంతి విశ్వేమేదేవాः శాంతిः సర్వేమేదేవాः శాంతిः శాంతిः శాంతిः శాంతిభిः తాభిः శాంతిభిः సర్వశాంతిభిः శమయామోహం యదిహ ఘోరం యదిహాక్రూరం యదిహపాపం తచ్ఛచాంతం తచ్ఛివం సర్వమేవ శమస్తు నఃॗ ఓం శాంతిः శాంతిः శాంతిःॗ"

భూమిలో శాంతి నెలకొనుగాక! అంతరిక్షంలో శాంతి నెలకొనుగాక! ఆకాశంలో శాంతి నెలకొననీ, నీటిలో శాంతి నెలకొనుగాక! మూలకాలలో, చెట్టుచేమలలో శాంతి నెలకొనుగాక! దేవతలందరూ నాకు శాంతిని ప్రసాదించు దురుగాక! ప్రతి దేవతా నాకు శాంతిని అనుగ్రహించుగాక! శాంతిలో సకల ప్రాణులు శాంతిని పొందుగాక! ఈ నానావిధ శాంతుల మూలంగా నాకు మంగళం ఒనగూరు గాక! సమస్తమూ మనకు మంగళాన్ని ప్రసాదించుగాక! అనేది ఈ మంత్రార్థము. ఈ భారతీయ సనాతనధర్మ వైభవాన్ని ఆకళింపు చేసుకున్న ఈ కవి తన రచనలో దీని ప్రాభవాన్ని, వైభవాన్ని ఇలా ప్రకటిస్తున్నారు.

"ఓరోరిమానవా వినరా! మారణోద్యోగమ్ము మానవ దేరా! - హద్దుతప్పినడుచు హక్కు నీకు ఎక్కడిది
యుద్ధాలు రెండైనా బుద్ధి రాలేదేరా! - హిరోషిమా నగర ఘోరమ్ము కన్నావు
మారణాస్త్రముపైన మనసు విడవేరా! - దానవత్వము తప్పదారి పట్టించేను
మానవుడా! తెలివి మంట కలపకురా! - పాపపు టూహలు పలుమారు భావింప
పాపకర్ముడా! నీకె ప్రాప్తించుగదరా! - శాంత రసము చిందు సాధుమూర్తులు ఋషులు
శాంతి శాంతి యనిరి - సారమ్ము గనరా!"

మొదటి, రెండవ ప్రపంచయుద్ధాలు జరిగాయి. హిరోషిమా, నాగసాకి మీద జరిగిన ఘోరమైన దాడి నుండి కూడా పాఠాలు నేర్చుకోవేమిరా! అసలు పాపపు ఊహలే వద్దు. అలాంటి ఊహలు నీ మనసులో పదే పదే వస్తే అదే జరుగుతుంది. "యద్భావం తద్భవతి" అనిగదా! కాబట్టి సమస్త మానవాళి శాంతితో ప్రవర్తిల్లమని స్వాతంత్ర్య ఉద్యమం సందర్భంగా కవి పిలుపునిచ్చాడు.

"తన ప్రాచీనపు ఘన వైశిష్ట్యం - తన ఔన్నత్యం తానె స్మరించుకు
వలన పద్ధతికి ప్రబల విరోధి - అణ్వాయుధముల కామడదూరం."

అంటూ, ఆ రోజులలోనే మేము అణ్వాయుధములకు దూరమని చాటిచెప్పిన గొప్ప దేశభక్తి కవి వీరు.

అధర్వణవేదంలో 12వ అధ్యాయంలో 1వ సూక్తాన్ని పృథ్వీ సూక్తం అంటారు. దీనినే మాతృభూమి సూక్తం అని కూడా పిలుస్తారు. మాతృభూమి యొక్క గొప్పతనాన్ని, వైశిష్ట్యాన్ని, వైభవాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది ఈ సూక్తం. భూమితల్లి పట్ల మన కర్తవ్యాలను కూడా చెప్పింది. జాతీయ అవగాహన, వసుదైక కుటుంబ భావన వికసించడానికి, విస్తరించడానికి ఈ సూక్తం ఎంతగానో ఉపకరిస్తుంది.

"యోనో ద్వేషత్ పృథివియః పృతన్యాత్ యోభి దాసాన్మనసాయోపధేన, తం నో భూమే రందయ పూర్వకృత్వరి"

ఓ మాతృభూమీ! మాపై వ్యతిరేక భావంతో, ద్వేషభావంతో వుండేవారు, వారి సైనిక బలంతో మమ్ములను అవమానించాలని, పరాభవించాలని కోరేవారు, నిత్యం వారి మనసుతో మాకు అనిష్టాన్ని కోరుకునేవారు, మమ్ములను పరతంత్ర బంధనంలో బిగించి కట్టడం కోసం చెడ్డపనులు చేసేవారు, మమ్ములను చంపడానికి, పీడించడానికి యిష్టపడేవారు మా శత్రువులు. ఓ దేశమాతా! నీవు వారిని సమూలంగా నాశనం చేయవమ్మా! అని దీని అర్థం.

"సత్యం బృహదృత ముగ్రం దీక్షా తపో బ్రహ్మయజ్ఞః
పృథివీం ధారయంతీ - సానో భూతస్య భవ్యస్య పత్నీ
యం లోకం పృథివీన కృణోతు"

గొప్పదైన సత్యనిష్ఠ, యథార్థజ్ఞానం, పరాక్రమం, ధర్మదీక్ష, అనుష్ఠానం, దక్షత, త్యాగం, యజ్ఞం అనేవి మాతృభూమిని పోషిస్తాయి, రక్షిస్తాయి. స్వార్థపరులు, తాము మాత్రమే గొప్పవాళ్ళం కావాలనుకునే వారు మాతృభూమికి ఎప్పటికీ పుష్టి, వికాసం కలిగించలేరు అని అన్యాపదేశంగా చెప్పబడినది ఈ సూక్తంలో.

మరివన్నీ అలవడాలంటే మన సనాతన ధర్మంలోని రామాయణము, భగవద్గీత మొదలైన గ్రంథాలన్నీ ఒక్కసారైనా చదవాలి. అప్పుడే నరుడు నారాయణుడౌతాడు. భారతీయులందరూ ఎవరికి వారే ఆత్మపరీక్ష చేసుకోవాలి అంటాడు ఈ కవి. అందుకే ఈ కవి నిర్మొహమాటంగా ప్రజలను ఇలా ప్రశ్నిస్తున్నాడు.

"పుట్టినావీ భరతదేశాన - చేతపట్టినావా గీతయెపుడైనా?
రామరాజ్యం పేరు చెబుతావు - రామాయణమ్మెంత చదివావు?
భారతీయుడ నేనెనంటావు - నీవు భారతం సగమైన చూశావ?
భగవంతుడే తత్వమంటావు - నీవు భాగవత శుశ్రూష చేశావ?
జాతి నడిపిస్తాను అంటావు - నీవు జాతీయతా దీక్ష పొందావ?"

కాబట్టి నా దేశం చాలా గొప్పది, అగ్గిపునీత అని కేవలం మాటలతో కాలక్షేపం చేయడం కాదు. భారతీయ ధర్మాన్ని ప్రబోధించిన గ్రంథాలను చదవాలి. ఉత్తేజాన్ని పొందాలి. దీనినే "వట్టి మాటలు కట్టిపెట్టోయి" అంటాడు గురజాడ కూడా.

భారతీయ సంస్కృతిలో "గోవు" ఒక ప్రధానమైన భాగం. భారతీయ సంప్రదాయంలో "గోమాతకు" ఒక విశేష ప్రాధాన్యం వుంది. బ్రహ్మాండపురాణంలోని లలితా సహస్రనామంలో "గురుమూర్తిర్గుణనిధిర్గోమాతా గుహ జన్మభూః" అంటూ గోమాత లలితా పరాభట్టారిక యొక్క స్వరూపంగా వర్ణింపబడినది. భారతదేశ మొట్టమొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా వర్ణింపబడిన 1857 సిపాయిల తిరుగుబాటుకు గల అనేక కారణాలలో "గోవు" కూడా ఒకటి అని చరిత్ర చెబుతోంది.

అందుకనే పద్మభూషణుడైన కవికోకిల శ్రీ గుర్రం జాషువా కూడా గోహింస విషయమై చాలా బాధపడ్తూ కవిత రాశాడు. ఓ గోమాతా! నీ రక్తాన్ని పాలుగా మార్చి ఈ మానవాళికి అందజేస్తావు. నీ పరమపావనమైన పాలు త్రాగి, నువ్వు ముసలిదానివైపోగానే నిన్ను నిర్దాక్షిణ్యంగా చంపివేడం ధర్మమా! అంటూ ప్రశ్నిస్తాడు.

"వెలగలయట్టి నీ రుధిర బిందువులెన్ని వ్యయించి పాలుగా
జిలికెదవో గదా! మొదవు చేడియ! నీ బలమెల్ల యిమ్మును
ష్యులకిడి, వృద్ధరాలవయి స్రుక్కిన నీకు గటారి పోటులా
ఫలితము! భారతీయుని కృపాపరతంత్రము గొడ్డు వోయెనే!" - అంటాడు.

జాషువా గారి లాగానే ఈ కవికి కూడా గోమాత అంటే ఎనలేని భక్తి, గౌరవాలు. భూమాతే గోమాత. గోవిందుడే గోమాత. ప్రధానంగా ఈ దేశం వ్యవసాయిక దేశం. వ్యవసాయానికి ఆనాడు ప్రధాన భూమిక గోమాత. అందుకనే రైతుకు గోవు పంచప్రాణాలు. కాబట్టి గోజాతి హింసకు పూనుకోకండి. ఆ పని చేసి రైతు యొక్క

శాపాగ్నిలో భస్మం కాకండి. అసలైన భారతీయత, జాతీయత తెలుసుకోండి అంటూ ప్రబోధిస్తున్నాడు ఈ కవి.

"భూమాత ఒకనాడు - గోమాత తానొచు
పృథువుకే ఓషధుల పిదికె - గోవిందుడే తాను
గోపాలకత దాల్చి - గీతామృతమ్మునే పిండె"
"పంట రైతుకు పంచప్రాణాలు గోజాతి
జాతి హింసకు పూనకండి -
రైతు శాపాగ్నిలో రగిలి భస్మముగాక
జాతీయతను తెలుసుకోండి!"

మా నేలపై లేని మతమే లేదు. మానవాళి సత్ప్ర వర్తనకు వలసిన మార్గాన్ని చూపించినదే ఈ దేశం అంటాడు ఈ కవి. "మానైలపై లేని మతమసలె లేదు" - అంటూ మా ఋషులు తమ తపోశక్తితో సర్వమానవాళి సంక్షేమాన్ని ఆకాంక్షించి - మనిషి మనీషి కావడానికి, పురుషుడు పుణ్యపురుషుడు కావడానికి, మానవుడు మహనీయుడు అవడానికి దారి చూపించారు. అలాంటి దేశంలో పుట్టడమే మన అదృష్టం. అట్టి పుణ్యభూమిని మనం ఎల్లవేళలా గౌరవిస్తూ, పూజిస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. ఈ జగత్తుకు జ్ఞానభిక్ష పెట్టిన ఎంతోమంది మహానుభావులను కన్న ఓ భారతాంబా! నీకు జోహారు! అంటున్న కవి పలుకులతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

"భారతాంబా నీకు జోహారు! జ్ఞానధాత్రీ నీకు జోహారు!
వీరమాతా నీకు జోహారు! అమృతవల్లీ నీకు జోహారు!
కన్నతల్లికి నీకు జోహారు! వెన్నెల్ల చూపులకు జోహారు!"

ఆధార గ్రంథాలు :

1. అథర్వణవేదము - టి.టి.డి. వారి ప్రచురణ - తిరుపతి
2. ఋగ్వేదము - టి.టి.డి. వారి ప్రచురణ - తిరుపతి
3. జయభారతి - సుబ్బరామశాస్త్రి పైడిపాటి - భారతీనికేతన్ ప్రచురణ, విజయవాడ
4. విజయభారతి - సుబ్బరామశాస్త్రి పైడిపాటి - భారతీనికేతన్ ప్రచురణ, విజయవాడ
5. విక్రమభారతి - సుబ్బరామశాస్త్రి పైడిపాటి - భారతీనికేతన్ ప్రచురణ, విజయవాడ
6. గుర్రం జాషువా - ఖండకావ్యాలు - జాషువా - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

❖❖❖

దేశభక్తి సాహిత్యం - పాటలు

- రొధక మంగిశ్రీ, శ్రీ సాంస్కృతిక కళాసారథి-సింగపూర్ కార్యవర్గ సభ్యులు,రచయిత్రి, కవయిత్రి, వక్త, వ్యాఖ్యాత.

నమస్కారం. 75 సంవత్సరాల దేశస్వాతంత్ర్యాన్ని ఒకవేడుకగా అందరూ కలిసి వైభవంగా జరుపుకుంటున్న సమయం ఇది. ఈ కోలాహలంలో దేశభక్తి యొక్క నిర్వచనమే మరుగున పడిపోయింది. దేశభక్తి అంటే కేవలం దేశ ప్రాశస్త్యాన్నిపొగడడంవెూ,'నా దేశమే గొప్ప'అంటూ చాటడమెూ కాదు.పరాయి దేశాలను దూషించడం అంతకంటే కాదు.మాతృదేశం పట్లమనసులో ప్రేమ పెంచుకోవడం, ఆ దేశ సంప్రదాయాలను గౌరవించడం, దేశ పరిస్థితులను అర్థంచేసుకొని వాటిని మెరుగుపరచడానికి,అభివృద్ధి సాధించడానికి కృషి చేయడం.. నిజమైన దేశభక్తి అనిపించుకుంటుంది.

నేటి పరిస్థితులలో '75 సంవత్సరాల భారతదేశం నాకేమిచ్చింది' అని ప్రశ్నించుకునేవారే ఎక్కువ ఉన్నారు తప్ప, 'నేను నా దేశానికి ఏం చేయగలిగాను' అని ఆలోచించేవారు కరువవడం శోచనీయం. ప్రపంచంలో ఏ మూల ఉన్నా మన దేశం పేరును నిలిపే విధంగా ప్రవర్తించడం ముఖ్యం. మన ప్రవర్తన బట్టేఇతర దేశస్థులకు, మన దేశంపై అటు గౌరవం కానీ,ఇటు న్యూనతా భావం కానీ ఏర్పడడానికి ఎక్కువ అవకాశం ఇస్తూ ఉంటాము. మాతృదేశ గౌరవం కాపాడడం ప్రతి పౌరుని కనీసవిధి.

ఎన్నేళ్లయినాభారతదేశ పరిస్థితులు మెరుగుపడలేదని బాధపడేవారు, ఇతర దేశాలతో పోల్చుకొని స్వదేశాన్ని దుయ్యబట్టేవారు కూడా మనలో లేకపోలేదు. అందుకే ప్రస్తుతం ఏ స్వాతంత్ర సమరాలు లేకపోయినా కూడా దేశభక్తి సాహిత్యాన్ని తలుచుకునే అవసరంపడుతోంది. అందుకు ఇటువంటి సదస్సులు చక్కగా ఉపయోగ పడతాయని భావిస్తున్నాను.

అమరవీరుల గాథలను తెలుసుకోవడం కేవలం చరిత్రను మననం చేయడం కోసం కాదు. వారి త్యాగాన్ని తలచుకోవడం ద్వారావారు ఎంతో శ్రమపడి సాధించిన స్వాతంత్ర్యాన్ని మనం ఎంత నిర్లక్ష్యంగా చూస్తున్నామో అర్థమయ్యే అవకాశం ఉంది. దేశం పట్ల మన అందరి బాధ్యతను తెలుసుకునే విధంగా దేశభక్తి సాహిత్యం అందరినీ ప్రోత్సహిస్తుంది. స్వాతంత్ర సమరం జరుగుతున్న రోజులలో, మన తెలుగులో వచ్చిన దేశభక్తి సాహిత్యం ప్రముఖ పాత్ర పోషించి అందరిలోనూ ఒక సంఘటితత్వాన్ని తీసుకురావడానికి ఎంతో దోహద పడింది. అందులోనూ పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో అన్ని వర్గాలవారిని ఉత్తేజపరిచే విధంగా, ఎంతోమంది కవులు దేశభక్తి పాటలను మనకు తరతరాలుగా అందించారు. అందుకే ముఖ్యంగా పాటల రూపంలో ఉన్న దేశభక్తి గీతాలు ఇప్పటికీతమ ప్రభావాన్ని చూపిస్తూనేఉన్నాయి.

మహాకవి గురజాడ అప్పారావు గారు దేశం పట్ల మనకున్న బాధ్యతను అతి చక్కగా "దేశమును ప్రేమించు మన్నా.."గేయం ద్వారా తెలియజేస్తారు. పరుల కలిమికి పొర్లి ఏడవద్దు అంటారు. తోటి వారికి సహాయపడ మంటారు. మనసులు ఒకటై మనుషులు కలసి ఉండాలంటారు. మతసామరస్యాన్నిబోధిస్తారు. సామాజిక సంఘటిత జీవనం కొరకు ఉండవలసిన లక్షణాల్ని విశదీకరిస్తూ కర్తవ్యబోధ చేసే అద్భుతమంత్రం ఇది.కొన్ని పాటలకుకాల పరిస్థితులతో సంబంధం లేదు. అవి ఎన్నటికీ సజీవాలే.అందుకే రాయప్రోలు సుబ్బారావు గారు రచించిన "ఏ దేశమేగినా, ఎందుకాలిడినా.." ఈనాటికీ అందరి గుండెల్లో మార్మోగుతోంది. ముఖ్యంగా ఈ పాటను తలుచుకోని ప్రవాస భారతీయుడు ఉండడంటే అతిశయోక్తి కాదేమో!

'నేను, నా ఇల్లు, నా కుటుంబం..' అనే భావన నుంచి బయటకు వచ్చి'మన ఊరు, మన దేశం, అందరూ

మనవాళ్లు..' అనే భావనకు వ్యక్తి ఎదగడానికి సామాజిక స్పృహ ఎంతో అవసరం. సమాజం పట్ల బాధ్యతను ఎరిగిననాడే పక్కవాని బాగుకోసం వ్యక్తి ఆలోచించగలడు. అటువంటి నిస్వార్థమైన భావాలను వ్యక్తి హృదయంలో ఉదయింపజేయడానికి దేశభక్తి గీతాలు అలనాటినుండి నేటివరకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

సంఘం ఎప్పుడు కలసి ఎదుగుతుంది. కలసి వికసిస్తుంది. దానికై ఆ సంఘంలోని ప్రతి వ్యక్తి దోహదపడవలసి ఉంటుంది. స్వార్థాన్ని పక్కన పెట్టి ఐకమత్యభావాన్ని మనసులో నాటుకోవలసి ఉంటుంది. అప్పుడే శాంతియుత సహజీవనంలోని మాధుర్యం అర్థమవుతుంది. 'లోకో భిన్న రుచి:' అంటారు. వ్యక్తిగత అభిప్రాయాలు ఇష్టాయిష్టాలుఉండడం వేరు. కానీ ఒక సంఘం లేదా దేశం అభివృద్ధి చెందడానికి అందరికీనిర్దుష్టమైన ఏకాభిప్రాయం, సంఘటిత భావాలు ఉండడం అవసరం. దానిని పెంపొందించడానికి సహకరించే గీతాలన్నీ దేశభక్తి సాహిత్యం కిందకే వస్తాయి.అటువంటి గీతాలు మన సాహిత్యంలో ఎన్నో చోటుచేసుకున్నాయి.

జన్మనిచ్చినజననితో పాటు జన్మభూమిని కూడా తల్లిగా భావించే మహోన్నత సంప్రదాయం మన భారతీయులది. ''స్వతంత్ర భారత జననీనీకిదె నితాంత నవనీరాజనము'' అంటూ బాలాంత్రపు రజనీకాంతరావు గారు భరతమాతను కీర్తిస్తే,''హే భారత జననీ! స్వేచ్ఛాగగనవీధి విహారిణి'' అంటూ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు శ్లాఘించారు.

ఆరోజుల్లో ''మాకొద్దీ తెల్ల దొరతనము'' అంటూ ఖచ్చితమైన అభిప్రాయాన్ని తెలియజేశారు గరిమెళ్ళ సత్యనారాయణ గారు.నిజానికిఇది ఆజాతిపేరును కించపరిచినట్లు కాదు. ఒక జాతి యొక్క స్వార్థం, హింస మరియు అమానుషత్వ పరిపాలనా విధానాల పట్ల తెలిపిన నిరసన అది.

అలనాటి ఆకాశవాణి మాధ్యమం ద్వారా మరియు చలనచిత్రాల ద్వారా కూడా ఎన్నో దేశభక్తి పాటలు వివిధ వర్గాల శ్రోతలను, ప్రేక్షకులను ఆకర్షించాయి. పద్య నాటకాలు, జానపద గేయాలు వంటివి జనపదాలలోనికి సూటిగాచొచ్చుకుపోయాయి.

కవులతోపాటు ఎంతోమంది గాయనీగాయకులు కూడా ఈ దేశభక్తి పాటలకు ప్రత్యేక ప్రాచుర్యాన్ని తీసుకు వచ్చారు. అమర గాయకులు శ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు, శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి,శ్రీబాలాంత్రపు రజనీకాంతరావు వంటి ఎందరోప్రఖ్యాత గాయనీ గాయకుల ద్వారా ఎన్నో పాటలు ప్రజల మనసులలో కొత్త ఉత్తేజాన్ని నింపాయి.

''స్వాతంత్ర్యమెనా జన్మహక్కని చాటండి,
నిరంకుశంబగుశక్తులెదిరిననిర్భయముగ ఎదిరించండి''

- తోలేటి వారి రచన

''మాదీ స్వతంత్ర్య దేశం, మాదీ స్వతంత్ర్యజాతి'' ''ఎత్తవోయినీ జయ జెండా''రజనీకాంతరావు గారి రచనలు

ఇలా ఇంకా ఎన్నో జెండాపాటలు, ఆణిముత్యాలు ఈనాటికీ ప్రజల మనసులలో మార్మోగుతూనే ఉన్నాయి.

''జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి'' అనే సంస్కృత రచన మన తెలుగు కవి అయిన దేవులపల్లి వారి కలం నుండి ఉద్భవించి, మన రాష్ట్ర గీతం 'జనగణ మన'తో పోటీ పడింది.

కొన్ని పాటలు ప్రత్యేకించి అసువులు బాసిన దేశ నాయకులు, అమరవీరులకు నివాళిగా కూడా రచింపబడి ప్రాచుర్యం పొందాయి.''ఇదే జోత నీకిదె జోత,ఓ స్వతంత్ర భారత పితా'', ''కొల్లాయిగట్టితేనేమి మన గాంధీ''.. ఇవిగాంధీ మహాత్మునిపై రచింపబడినపాటలు.''అమ్మా సరోజినీదేవి'',''జోహారు పండిత జవహారు''మొదలైన పాటలెన్నో ఉన్నాయి.

ఇక చలనచిత్రాల విషయానికి వస్తే అప్పట్లో ప్రతి సినిమాలోను ఖచ్చితంగా ఒక దేశభక్తి పాటను ఎంతో ఇష్టంగా పొందుపరిచేవారుదర్శకనిర్మాతలు.శ్రీ శ్రీ గారి రచన ''పాడవోయి భారతీయుడా'', ఆత్రేయ గారి కలం

నుంచి జాలువారిన ''భారతమాతకు జేజేలుబంగారు భూమికి జేజేలు'', ''నీ ధర్మం నీ సంఘంనీ దేశం నువ్వు మరువద్దు'', ''తేనెల తేటల మాటలతోమన భరతమాతనే కొలిచెదమా''.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పాటలు చిత్రసీమలో నేటికీ సుస్థిరంగా వినిపిస్తూనే ఉన్నాయి.

ఇక బాలల సాహిత్యంలో కూడా పిల్లలలో దేశభక్తిని పెంపొందింపజేయడానికి ఎంతోమంది కవులు చక్కటి పాటలను పిల్లల కోసం ప్రత్యేకించి రచించారు. ''నారాయణ నారాయణ అల్లాఅల్లా, మా పాలేటి తండ్రీ నీ పిల్లలమేమెల్ల'' అంటూ మతసామరస్యాన్ని బోధిస్తారు కృష్ణశాస్త్రి గారు. ''భారతీయ వీరులం భరతమాత బిడ్డలం'' మరియు ''తల్లీభారతి వందనము, నీ ఇల్లే మా నందనము, మేమంతా నీ పిల్లలము'' అనే పాటలు దాశరధి గారి రచనలు. ఇటువంటి ఎన్నో పాటల ద్వారా పిల్లలకు అటు దేశభక్తిని, ఇటు ఐకమత్యభావాలను కూడా రంగరించి పోశారు మన తెలుగు కవులు.

ఇక ప్రాంతీయంగా తెలుగు తల్లిని కూడా కీర్తిస్తూ ఎన్నో అద్భుతమైన పాటలు రచింపబడ్డాయి.వాటిలో తలమానికమైనది శంకరంబాడి సుందరాచారి గారు రచించిన ''మా తెలుగు తల్లికి మల్లెపూదండ, మా కన్నతల్లికి మంగళారతులు'' అనే పాట. వేములపల్లి శ్రీకృష్ణ గారి రచన ''చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి కలవోడా'', ''తెలుగు జాతి మనది,నిండుగ వెలుగు జాతి మనది'', ''ఆంధ్రుల చరితము అతిరస భరితము'' అంటూ ఆంధ్రమాత ప్రాశస్యాన్ని, తెలుగు నేల గొప్పతనాన్ని చాటి చెప్పే పాటలు ఎన్నో వచ్చాయి. ఇక్కడ 'తెలుగు తల్లి' అంటే నేటి ఉభయ ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన నేలతల్లి అని అర్థం.అంతే తప్పసీమ, కోస్తా, తెలంగాణ, సర్కారు ప్రాంతాలు విడిగా వర్తించ బడవు. సరిహద్దులు రాష్ట్రాలకు, ప్రభుత్వాలకే గాని భాషకు కావు. సాహిత్యానికి అంతకంటే కావు అని నిరూపించేవే ఈ పాటలన్నీ.

ఆ రోజుల్లో తెలుగువారికి సాహిత్యము,దేశభక్తి, పాట, సంస్కృతి, కళలు అనేవి నిత్యజీవితంలో నుండి వేరు కావు. అవన్నీ జీవన విధానంలోని అంతర్భాగాలు. దేశభక్తి అంటేకేవలం చరిత్ర పుటలకు పరిమితమైపోయే పరిస్థితి రాకముందే నేటితరం మేల్కొనవలసిన అవసరం ఉంది. ఇంకా తెలుగువారి దేశభక్తిని చాటే ఎన్నో వీరగాథలు, పద్యాలు, నాటకాలు, మహానుభావుల స్వీయ చరిత్రలు, మొదలైన ఎన్నో సాహితీరూపాలు మనకు లభ్యమయి ఉన్నాయి. వాటన్నిటినీ మన తరం తెలుసుకొని భావి తరాలకు అందించగలరని ఆశిస్తూ, నాకు ఈ అవకాశాన్ని అందించిన సదస్సు నిర్వాహకులకు నా కృతజ్ఞతలు. జైహింద్

❖❖❖

తెలుగు ఆధునిక కవిత్వం - దేశభక్తి

- బసవరాజప్ప, అధ్యాపకుడు, నలంద ఉపాధ్యాయ విద్యా శిక్షణ కళాశాల, మహబూబ్ నగర్, తెలంగాణ.

హితాన్ని చేకూర్చేది సాహిత్యం. ఆధునిక సాహిత్యానికి నవ్య సాహిత్యం, అభినవ సాహిత్యం అనే పేర్లు ఉన్నాయి. కాని కాలక్రమంలో ఆధునిక అనే పదమే స్థిరపడింది. తెలుగు సాహిత్య చరిత్రలో ఆధునిక యుగం 19వ శాతాబ్ది ద్వితీయార్ధంలో ప్రారంభమైనట్లుగా సాహిత్య పరిశోధకులు భావిస్తున్నారు. 1875 నుంచి ఆధునిక యుగం ప్రారంభంగా పేర్కొనవచ్చు. ఈ ఆధునిక కాలంలోని రచనలైన పురాణాలు, పద్యకావ్యాలు మొదలైనవి. వీటిన్ని ఆధునిక యుగంలోని సంప్రదాయ సాహిత్యంగా చెప్పాలి. ఇంగ్లీష్ మాధ్యమ విద్యవల్ల భారతీయులలోని పాత భావాలు, మూఢనమ్మకాలు, సనాతన ఆచారాలు బల హీన పడ్డాయి. ఈ ఆలోచన విధానమే ఆధునిక సాహిత్యం వైపు మళ్ళింది.

1885లో జాతీయ కాంగ్రెస్ స్థాపనతో దేశంలో జాతీయోద్యమానికి అంకురార్పణ జరిగింది. దేశీయ ఉద్యమం ప్రారంభం, సంఘ సంస్కరణోద్యమం, నిమ్నజాతి ఉద్ధరణ, గ్రంథాలయోద్యమం మొదలయిన వాటివల్ల కవులు, రచయితల ఆలోచనలలో మార్పులు వచ్చాయి. కొత్త భావాలతో, కొత్త రచన ప్రక్రియలు చేపట్టడం ప్రారంభించారు.

ఈ పరిణామదశలో ఉద్భవించిన కందుకూరి వీరేశలింగం సాంఘిక రంగంలో సంస్కరణలకు పునుకోవడమే కాక సాహిత్య రంగంలో నూతన ప్రక్రియలకు దారి తీసి ఆధునిక యుగకర్తగా కీర్తిపొందాడు. అంతవరకు పద్యానికి గల ప్రముఖ స్థానాన్ని కాదని గద్య వాఙ్మయ ప్రక్రియలు, కథలు, వ్యాసం, నాటకం, నవల, విమర్శ మొదలైనవి ఆవిర్భావించాయి.

ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు - ప్రయోగాలు అన్న సిద్ధాంత గ్రంథంలో ఆచార్య సి.నారయణరెడ్డి ఆధునిక కవిత్వ లక్షణాలుగా ఖండ కావ్యరచన ఆత్మాశ్రయరీతి, వస్తునవ్యత, భావనవ్యత, శైలినవ్యత, కవితారచనానవ్యత, ప్రక్రియాబాహుళ్యతలను పేర్కొన్నారు.

ఆంగ్ల విద్యా విధానం ఫలితంగా ప్రపంచ స్థితిగతులు అవగాహన కావటంతో నిద్రాణమైవున్న భారతజాతిలో చైతన్యకాంతులు ఉద్దీప్తమైనవి.

పరప్రభుత్వ వలసపాలనకు నిరసనగా జాతీయ పునరుజ్జీవనోద్యమం తలెత్తింది. రాజారామమోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి, స్వామి వివేకానంద, అనిబిసెంట్ మొదలైన మేధావుల ప్రబోధ ప్రభావంతో మానవతావాదం, సంఘ సంస్కరణ దృక్పథం, జాతీయత భావాలు దేశమంతటా పరివ్యాప్తమైనవి. జాతీయ పునరుజ్జీవన చైతన్యం బయల్దేరింది.

1885లో జాతీయ కాంగ్రెస్ ఏర్పడటంతో స్వాతంత్ర్య పోరాటానికి వేదిక రూపొందింది. ఎందరో దేశభక్తులు బయలుదేరి తమ ధనమానప్రాణాలను సైతం లెక్క చేయకుండా బానిసత్వ విముక్తికి పాటుబడ్డారు. ఈ పోరాటంలో తెలుగు దేశంలోని రచయితలు, కవులు కూడా ముందుంజవేసి దేశభక్తి సంభందించిన రచనలు వెలువరించి జాతిని జాగృతం చేశారు. 1897-98 ప్రాంతంలో సరస్వతి, చింతామణి పత్రికల్లో దేశ పరిస్థితిని చిత్రించే పద్యాలు ప్రచురితమైనవి. జాతీయ పునరుజ్జీవనోద్యమ ప్రభావంతో తెలుగులో దేశభక్తి కవిత్వం, రాష్ట్రభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం ప్రారంమైనాయి.

తెలుగులో ఆధునిక కవిత్వం దేశభక్తి కవితా రూపంలోనే ప్రారంభమైంది. బ్రిటిష్ వారి దమన నీతికి ఫలితంగా బెంగాల్ విభజన జరగటంతో 1904-05లో దేశమంతటా నిరసన వ్యక్తమైన తరుణంలో మద్రాస్

రాష్ట్రం నుండి కూడా గంజాం, విశాఖ జిల్లాలను వేరు చేయాలన్న ప్రయత్నాన్ని ఆంధ్రులు "వందేమాతరం మనదే రాజ్యం" నినాదంతో తీవ్రంగా ప్రతిఘటించి ఆ యత్నాన్ని విరమింపచేశారు. ఈ సందర్భంలోనే ఒక అజ్ఞాత కవి "ది క్రై ఆఫ్ మదర్ ఇండియా" పేరుతో కృష్ణా పత్రికలో ప్రబోద గీతం వెలువరించాడు.

దూడనోరు గట్టి ద్రోహంబు గొల్లలు
పాడి సమస్తముపరులకమ్ముగతి
కూడ
కూడులేని నా కొడుకుల గాదని
ఏడకో నా ధనమెల్లను బోయెడి

అన్న ఈ గీతమే చిలకమర్తి వారి క్రింది ప్రసిద్ధ పద్యానికి ప్రేరకమై ఉంటుంది.

భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేకదూడలై ఏడ్చుచుండ,
తెల్లవాను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియబట్టి.

గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావుల దేశభక్తి గీతాల కంటే ముందే విరచిత పై కృష్ణ పత్రికలో గేయం సమకాలీనకవుల కెందరికో స్ఫూర్తిదాయకమైంది. సంప్రదాయబద్ధమైన పద్యకావ్యాలు, శతకాలరూపం లోను, గీతలు, కీర్తనల రూపంలోను తెలుగు కవులు దేశభక్తిని ప్రబోధించరు. చెన్నాప్రగడ భానుమూర్తి, భారత ధర్మదర్శనము-1907, అత్తిలి సూర్యనారాయణ హిందూదేశం దారిద్ర్యము-1908. ముట్నూరి వెంకటసుబ్బారాయుడు, మంగిపూడి వెంకట శర్మ కలిసి 'మాతృశతకం'-1908లో వెలువరించారు. వందేమాతరం గీతంతో మొదలై 20 దేశభక్తి కీర్తనలతో కూడిన దేశీయ కీర్తనలు ఆ కాలంలోనే ప్రచురితమైంది. గురజాడ 'దేశమును ప్రేమించుమన్నా', రాయప్రోలు 'ఏదేశమేగిన ఎందుకాలిడిన' గేయాలు దేశభక్తి కవిత్వంలో గురుపీఠ స్థానాన్ని ఆక్రమించాయి. దువ్వూరి, వేదుల, కవికొండల, జాషువా మొదలైన కవులు భారతమాత వైభవాన్ని కీర్తించి ప్రజాహృదయల్లో దేశభక్తి బీజాలు వెదజల్లారు. కొందరు కవులు పౌరాణిక గాథలను ఆలంబనం చేసుకొని స్వేచ్ఛాసమర సందేశాన్ని వ్యంగంగా చాటారు. కరుణశ్రీ, జంధ్యాల పాపయ్యశాస్త్రి విజయశ్రీ కావ్యంలో మహాభారత యుద్ధాన్ని స్వాతంత్ర్య సంగ్రామంతో పోల్చారు. మరి కొందరు మహాకవులు చారిత్రక పురుషులను కావ్య నాయకులుగా స్వీకరించి జాతీయతాభావ వ్యాప్తికి దోహదం చేశారు. దుర్భాక రాజశేఖర శతావధాని రాజపుత్ర వీరుడైన రాణాప్రతాపుని పోరాటాన్ని గాంధీమహత్ముని స్వరాజ్య ఉద్యమంతో పోల్చినాడు. గాంధీ కవిగా పేరుపొందిన తుమ్మల సీతారామమూర్తి, బాపూజీ ఆత్మ కథను మహాకావ్యంగా మలిచాడు.

సహాయ నిరాకరణం 1920, ఉప్పసత్యగ్రహం 1930 మున్నగు ఉద్యమాల ప్రభావంతో విరచితమైన పాటలు, ప్రచారగీతాలు స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రజల మధ్యకు తీసుకువెళ్లాయి. గరిమెళ్ల సత్యనారాయణ, త్రిపురనేని రామస్వామిచౌదరి, బసవరాజు అప్పారావు మున్నుగు వారి గీతాలు బహుళ ప్రచారం పొందాయి. పద్య, గేయ, పాటలు, బుర్రకథలు, కీర్తనలు దేశభక్తి కవిత్వం ద్వారా దేశదుస్థితి, దేశవైభవం,మాతృదేశభక్తి, స్వాతంత్ర్య రక్తి వస్తువులుగా తీసుకొన్నారు.

రాష్ట్రభక్తి కవిత్వం జాతీయ పునరుజ్జీవనోద్యమ ప్రభావంతో దేశభక్తి కవిత్వం అంతర్భాగంగా రాష్ట్రభక్తి కవిత్వం వెలసింది. 1910లో గుంటూరు సభలో ఆమోదింపబడిన ఆంధ్రరాష్ట్ర తీర్మానం. 1913లో ఏర్పాటైన ఆంధ్రమహాసభ మొదలైనవి ఆంధ్రోద్యమానికి ప్రేరకమైనాయి. జాతి, దేశ, భాషభిమానాలు ముప్పేట లుగా పెనవేసుకొని ఈ ఉద్యమానికి ఊపిరి పోశాయి.

'నాదుజాతి నా దేశము నాదు భాష
అను అహంకార దర్శన మందు మాంధ్ర.'

అన్న ప్రబోధం రాష్ట్రోద్యమ కవితకు బీజావాపన మైంది. ప్రాచీనాంధ్రుల ఘనవిజయాల చరిత్రను పరిశోధకులు త్రవ్వి తలకెత్తగా, అందలి ఉజ్జ్వల ఘట్టా లను వస్తువులుగా గ్రహించి కవులు కవితలల్లారు.

'అమరావతి పట్టణమున బౌద్ధులు.
విశ్వవిద్యాలయములు స్థాపించునాడు'

మొదలైన పద్య, గేయ కృతులతో రాయప్రోలు సుబ్బారావు రాష్ట్రాభిమాన కవితకు మార్గదర్శకుడైనాడు. ఆంధ్రావళి, తెనుగుతోట కవిత సంపుటులు ఆంధ్రుల పూర్వవైభవాన్ని వర్ణిస్తూ తెలుగు ప్రజలను ఉద్బోధించాయి.

నవ్య కవిత్వ శాఖలన్నింటివలెనే రాష్ట్రోద్యమ కవితలో కూడా గణనీయమైన స్థానంను పొందడం. విశ్వనాథ సత్యానారాయణ ఆంధ్ర పౌరుషము, ఆంధ్ర ప్రశస్తి రాష్ట్రభక్తి ప్రతిపాదకములైన చారిత్రక కావ్యాలుగా ప్రసిద్ధి గడించాయి. పూర్వాంధ్ర రాజుల యశోవైభవం, ఆంధ్రదేశ క్షేత్ర నదుల ప్రశస్తి ఇవి హృద్యంగా వర్ణితమైనాయి. ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంలో ఆంధ్రప్రజల్లో పౌరుషోద్దీపనం కావిస్తూ వెలువడిన విశిష్ట చారిత్రక కావ్యం మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 'ఆంధ్ర పురాణం'. ఆంధ్రుల చరిత్రను మలుపుతిప్పిన రసవద్ఘట్టాలు ఇందులో చిత్రితమైనాయి. జాషువా 'రాష్ట్ర పూజ', తుమ్మల సీతారామమూర్తి 'రాష్ట్ర గానము' ఉదయగానము' స్వస్థాన వేష భాషాభిమానాలకు నిదర్శనాలు. కొడాలి సుబ్బారావు హంపి క్షేత్రం. పుట్టపర్తి, పెనుగొండ లక్ష్మీ. ఇంద్రగంటి దక్షారామము. శ్రీనివాస సోదరులు ఓరుగల్లు కోట. తెలుగుదేశ వైభవాన్ని ప్రదర్శించే క్షేత్ర ప్రశస్తి కావ్యాలు.

సంఘ సంస్కరణ కవిత్వం :

ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణ ఉద్యమాన్ని ప్రారంభించిన వారు కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, బ్రహ్మసమాజం, ఆర్యసమాజం మొదలనవి సంస్కార బీజాలను వెదజల్లాయి. దేశం స్వాతంత్ర్యం పొందాలంటే వ్యక్తి వికాసం, సమాజ సంస్కరణ అవసరమని మేధావులు బోధించారు. జాతీయ పునరుజ్జీవన చైతన్యంలో భాగంగానే తెలుగులో సంఘ సంస్కరణ కవిత్వం వెలువడింది. బాల్యవివాహాలు, కన్యాశుల్కం, వరకట్నం, అస్పృశ్యత, మద్యపానం, వంటి దురాచారాలను ఖండిస్తూ కవులు తమ రచనలతో సంస్కరణోద్యమ భావాలను పరివ్యాప్తం చేశారు.

కన్యాశుల్కం నాటకంలో ఆ దురాచారాన్ని దుయ్యబట్టిన గురజాడ అప్పారావు, పూర్ణమ్మ కవితలో కూడా ఆ సమస్యను చిత్రించారు. తోకచుక్కను సంఘ సంస్కరణ పతాకగా భావించిన గురజాడ "మంచియన్నది మాలయైతే మాలనే అగుదున్" అంటు 'లవణరాజుకల'లో వర్ణ వ్యవస్థలోని అధర్మాన్ని ఎత్తిచూపారు. 'విధవా విలాపము' శీర్షికతో ఆంధ్రపత్రికలో ఉగాది సంచిక ద్వారా వితంతువుల దుర్గతిని చిత్రించిన భోగరాజు నారాయణ మూర్తి వరశుల్కాన్ని నిరసిస్తూ "పండుగకట్నం" కావ్యం రచించారు మంగిపూడి.

మహాత్మాగాంధీ లేవదీసిన హరిజనోద్యమానికి ముందే తెలుగు కవులు అస్పృశ్యతా సమస్యను ఎలుగెత్తి చాటటం గమనించదగింది. 1910లో ఆంధ్రభారతిలో ప్రచురితమైన 'మాలవాండ్ర' పాట తొలి దళితవాద గీతంగా, మంగిపూడి వెంకటశర్మ "నిరుద్ధభారతము" తొలి దళిత కావ్యంగా చెప్పబడుతున్నాయి.

వర్ణవ్యవస్థను తీవ్రంగా నిరసించిన కావ్యాలలో అద్వితీయమైనది జాషువా 'గబ్బిలం'. హరిజనుల దేవాలయ ప్రవేశం వస్తువుగా గ్రహించి కాటూరి వెంకటేశ్వరరావు 'గుడిగంటలు' విరచించారు. అదేవిధంగా స్వాతంత్ర్యం కొరకు గళమెత్తిన గరిమెళ్ల "కల్లు త్రాగబోకు కడుపు మాడ్చుకోకు" అంటూ మద్యపానాన్ని ఖండించాడు. వ్యభిచారం మొదలైన దురలవాట్లను నిరసిస్తూ ఇంకా అనేక గీతాలు, పద్యాలు వెలువడ్డాయి. ఈవిధంగా వస్తు, భావ, రచనా నవ్యతలతో సంఘ సంస్కరణ కవిత్వం కొనసాగింది.

"నాది ప్రజల ఉద్యమం, దానిని ఎవరిని సంతోషపెట్టడానికైన వదులుకొలేను. నా ఆశయం ప్రజల ఆశయం. సంస్కారవంతుల సదభిప్రాయం నాకు

అండగా ఉంది. అని ప్రకటించిన గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి పంతులు. ఎల్లలు దాటిన దేశభక్తిని ప్రబోధించడానికి "దేశభక్తి" అనే గేయం రాశాడు. ఆ గేయంలో దేశాన్ని ప్రేమించు ఆ దేశానికి మంచిని కలిగించే భావాన్ని పెంచుకో. కల్లబొల్లు మాటలు చెప్పడం మాని నిక్కచ్చిగా మానువులకు మంచిచేసే పనిని తలపెట్టు. దేశం సుభిక్షంగా ఉండాలంటే పాడిపంటలు పొంగిపొరలాలి. ఇది మానవుని కృషివల్లనే సాధ్యం. మనిషి బలసంపన్నతల మీదనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంది. మనుషులు సోమరిపోతులయితే దేశం బాగుపడదు. మనిషి ఉత్సాహం వల్లనే దేశ అభివృద్ధి, కళ అభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి జరుగుతుంది. నాకు దేశంమీద ప్రేమ ఉందని గొప్పలు చెప్పడం మానివేయాలి. దేశీయులకేదైన ఒక మేలుచేసి చూపించు. అదే నీ దేశభక్తిని ప్రకటిస్తుంది - అంటాడు గురజాడ. దేశంలోని మనుషులంతా ఐకమత్యంగా మెలగాలి, చేయిచేయి కలిపి నడవాలి, ఏజాతి అయినా, ఏ కులం అయినా, ఏ మతం అయినా అన్నదమ్ముల్లా మెలగలి. దేశమనేది ఒక పెద్ద వృక్షం లాంటిది. ఆది ప్రేమ అనే పూలు పూయాలి. బంకించంద్రుని "వందేమాతరం" గేయం జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగిస్తూ వచ్చింది. అందులో కొండలు, నదులు, వృక్షాలు, నా మాతృదేవతలు అని అంటాడు బంకిం చంద్రుడు. గురజాడకు ఆది నచ్చలేదు. అందుకే ఆ గేయానికి సవరణగా "దేశమంటే మట్టికాదోయ్, దేశ మంటే మనుషులు" అన్నాడు. వ్యక్తుల గుణగణాలు జాతీయ జీవితం వర్ణింపదగినదన్నాడు. ప్రజల్లో చైతన్యం కలిగించేవి ఇవేనన్నాడు. తెలుగులో దేశాభిమాన కవిత్వం, జాతీయగంధము గల ప్రబోధ కవిత్వం ఈ శతాబ్ది ప్రథమపాదమున ప్రారంభమైనను, దానికి రాయప్రోలు సుబ్బారావు వారి కృతులలోనే సమగ్ర స్వరూపమేర్పడినది అని డా॥ సి.నారాయణరెడ్డి విశ్లేషించారు. 1914లోనే రాయప్రోలు వారి ప్రఖ్యాత జాతీయగీతం, జన్మభూమి, ప్రబోధము మొదలైన ఖండకావ్యాలు వెలువడినాయి.

బ్రిటిష్ పరిపాలన కొనసాగుతున్న కాలంలో దేశ ప్రజలలో జాతీయ భావ చైతన్యాన్ని రగిలించడానికి రాయప్రోలు సుబ్బారావు దేశభక్తి ప్రబోధం చేయటం ఈ కవిత ఖండికలో చూడవచ్చు.

'కృష్ణానదీ తరంగాలలో ఆంధ్రనౌకలు నాట్యమాడే రోజురావాలి. ప్రతి ఇంటిలో దేశీసాహిత్య దీపాలు వెలిగి, ఆంధ్రతేజస్సు ప్రకాశించాలి. సుకుమార శిల్పప్రపంచంలో ఆంధ్ర నైపుణ్యం జనాదరణ పొందాలి. యుద్ధవ్యూహం ప్రతి వ్యూహలతో ఆంధ్ర పౌరుషము పేరొందాలి. ఇవన్నీ చూసి సంతోషమున తలఊపి, ఆంధ్ర పుత్రీపుత్రు లందరు గర్వపడాలి. అప్పటిదాక మనకు శాంతి లేదు, విశ్రాంతి లేదు. విసర్జనకు ఇది సమయము కాదం'టూ ఆంధ్రప్రజలను రాయప్రోలు సుబ్బారావు చైతన్య పరిచారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర
2. ఆధునిక కవిత్వం

❖❖❖

గురజాడ దేశభక్తి - భవితకు స్ఫూర్తి

- రేపల్లె ఈశ్వరరెడ్డి, బి.ఏ (ద్వితీయ సంవత్సరం), తెలుగు మాధ్యమం, మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాల, విజయనగరం- (ఆంధ్రప్రదేశ్)

ఒక సంఘంలో, సమాజంలో వ్యక్తుల ప్రవర్తన, అభిప్రాయాలు, మంచి, చెడు, జాతి, కుల, మత, వర్ణ విభేదాలు, ఐకమత్యం, మనుషులకి మనుషులకి మధ్య గౌరవ మర్యాదలు, ఎవరు ఏం చేస్తున్నారు? ఎటు వెళ్తున్నారు? ఏ గతి పడుతున్నారు? చేయలేని తప్పులకి తెలియని వాటికి ఎవరైతే బలైపోతున్నారో అటువంటి వాళ్ళ జీవితాల్లో వెలుగుని నింపేటి కవి భాస్కరుడు గురజాడ వెంకట అప్పారావు గారు.

తెలుగు సాహిత్య లోకానికి అణిముత్యం. తెలుగు భారతిని ప్రజల భాషగా తీర్చిదిద్దిన సాహితీ శిఖరం. వారి రచనలతో ఎందరో యువ కవులకు సందేశాన్నిచ్చి ఆదర్శంగా నిలిచారు. గుర్రం జాషువా గారు అన్నట్టు "సుకవి జీవించు ప్రజల నాల్కుల యందు". వీరు జీవించినది ఏభై మూడు సంవత్సరాలైనా, వారి రచనల ద్వారా సాహితీ లోకంలో 'చిరంజీవులు' అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వారు చేసిన సంఘసంస్కరణ ఇప్పటికీ ఎందరో యువకులకు ఆదర్శం. నాటకం, గేయం, కథానిక, కవిత ఏ ప్రక్రియలో నైనా వారు చూపించిన రచనా శైలి అద్భుతం. తెలుగు సాహితీ లోకానికి ఒక సుసంపన్నమైన సాహిత్యాన్ని అందించారు. నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నారు. కాళ్ళు వర్తమానంలో ఉన్నా, వీరి కళ్ళు భవిష్యత్తును చూశాయి. వీరి కవిత్వం, నాటకం, గేయంలో విశ్వ మానవ ప్రేమ వీరిది. కుల, మత, జాతి, వర్ణ విభేదాలు ఏమీ కనిపించవు వీరి రచనలలో. ఐకమత్యంగా అందరినీ కలుపుకుంటూ పోయే రచనలు వీరివి. ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని చెప్పిన మహనీయులు. వారి రచనలలో చేసి చూపించిన మహానుభావులు. 19వ శతాబ్దంలోను, 20వ శతాబ్ది మొదటి దశకంలోనూ వారు చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. అతను ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేసారు.

వీరి 'కన్యాశుల్కము' నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ నాటకంలో వారు సృష్టించిన గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు మొదలైన పాత్రలు ప్రఖ్యాతి పొందాయి. 'అభ్యుదయ కవితా పితామహుడు' అని బిరుదు పొందిన అప్పారావు, తెలుగు సాహిత్యంలో వాడుక భాషా ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యులు. వీరికి 'కవి శేఖర' అనే బిరుదు కూడా ఉంది. "ప్రాచీన కాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ వీరు ముగ్గురే మహాకవులు" అని శ్రీశ్రీ కొనియాడారు.

జీవిత విషయాలు :

గురజాడ అప్పారావు కుటుంబం వారి తాతల కాలంలో కృష్ణా జిల్లా గురజాడ గ్రామం నుండి విశాఖ మండలానికి వలస వచ్చింది. విశాఖపట్నం జిల్లా, ఎల మంచిలి తాలూకా, రాయవరం (ఎలమంచిలి) గ్రామంలో 1862 సెప్టెంబర్ 21 వ తేదిన అప్పారావు మాతామహుల ఇంట జన్మించారు. తండ్రి వెంకట రామదాసు, తల్లి కౌసల్యమ్మ. చీపురుపల్లిలో పదేళ్ళ వరకు చదివారు. విజయనగరం మహారాజ కళాశాలలో బి.ఏ చదువుతున్నప్పుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి ఆయనకు సహాధ్యాయి. వారిద్దరూ ప్రాణస్నేహితులు.

రచనా విషయాలు :

వీరు పన్నెండో ఏట "కుక్కు" అనే ఆంగ్ల కవిత్వం రచించారు. 1892 "కన్యాశుల్కం" మొదటి కూర్పు, 1909

"కన్యాశుల్కం" పూర్తిగా వాడుక భాషలో రెండో కూర్పు విడుదల. 1910 "ముత్యాల సరాలు" చందస్సు, "దేశభక్తి గేయం", "పూర్ణమ్మ", "లవణరాజు కల", "మనిషి"... మొదలైన రచనల ప్రచురణ. 1910లో మొట్టమొదటి కథానిక "దిద్దుబాటు" రచించారు. ఇలా మరెన్నో మహోన్నతమైన సందేశాత్మకమైన సంఘసంస్కరణ పరంగా రచనలు చేశారు.

గురజాడ కవిత్వం - దేశభక్తి :

గురజాడ అప్పారావు గారి దేశభక్తి, భవితకు స్ఫూర్తి. వీరు మనకు అందించిన ఒక గొప్ప వరం, సాహితీ లోకంలో చిరకాలం నిలిచిపోయేది. వీరు రచించిన "దేశభక్తి గేయం" విశ్వ మానవ ప్రేమను చెబుతుంది. నిస్వార్థమైన దేశభక్తి వీరి గేయంలో కనిపిస్తుంది. రవీంద్రుని జనగణమన, ఇక్బాల్ సారే జహాసే అచ్చా, బంకించంద్రుని వందేమాతరం, మన భారతదేశ నదులు, కొండలు, కోనలు, పర్వతాలు, దేశ నాయకులు, దేశభాష లందు వర్ణిస్తే గురజాడ దేశభక్తి గేయం విశ్వమానవ ప్రేమను ఆకాంక్షించింది. ఎంతో విలువైన సందేశాన్ని ఇచ్చింది. ఈ దేశభక్తి గేయం మొత్తం పరిశీలించినా ఎక్కడ ఆ ఒక్కదానినే వర్ణించినట్లు ఉండదు. గురజాడ అప్పారావు గారు రాసిన దేశభక్తి గేయం గురించి మహాకవి శ్రీ శ్రీ ఇలా అన్నారు "గురజాడ రచనలు అన్నీ పోయినా దేశభక్తి గేయం ఒక్కటి చాలు ప్రపంచానికి వారు మహాకవి అని చెప్పడానికి". "వీరి దేశభక్తి గేయం విశ్వమానవ ప్రేమను ఆకాంక్షించేది అని ప్రపంచంలో ఏ దేశ భక్తి గేయానికి లేని కీర్తిప్రతిష్టలు ఈ దేశభక్తి గేయానికి మాత్రమే అబ్బినది అని, ఇంకా ప్రపంచంలో ఏ దేశం వారైనా నూ ఈ దేశభక్తి గేయం జాతీయగీతంగా తీసుకోవచ్చు"ని డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు కొనియాడారు. వీరి రచనా శైలి అద్భుతం. ఎలా అంటే? ఎంతో పెద్ద అర్థాన్ని కలిగిన భావాన్ని కలిగిన వాటిని చిన్న చిన్న పదాలలో అందించే ఆ యొక్క ఘనత గురజాడ అప్పారావు గారిది. వీరు దేశాన్ని ప్రేమించమన్నారు కాని ఆ దేశభక్తి గేయంలో ఏ దేశం అని, ఏ దేశం వారిని ప్రేమించాలని అనలేదు. ఇంకా చెప్పాలంటే నా ఈ దేశము ఏ విధంగా అయితే బాగుపడుతుంది? ఎలా అయితే బాగుంటుంది? దేశం అంటే ఏమిటి? దేశం అంటే ఏ విధంగా ఉండాలి? అని తెలియజేయడానికి వారు సంఘసంస్కరణ పరంగా సమాజాన్ని బాగు పరచాలి అనే ఉద్దేశంతో ప్రపంచ దేశాలకే ఎంతో ఉపయోగకరమైన జాతీయగీతంగా తీసుకోవడానికి వీలు కలిగినటువంటి దేశభక్తి గేయాన్ని రచించారు.

ఈ దేశభక్తి గేయం ఎన్ని మన్ననలు పొందిందంటే శ్రీశ్రీ గారు చెప్పినట్టు "మనం వీరి రచనలలో ఒక్క దేశభక్తి గేయం చూస్తే చాలు ఆయన మహాకవి అని చెప్పడానికి. వీరు దీంట్లో వాడిన ముత్యాలసరాలు చందస్సు, నూతన పద బంధం, చిన్న చిన్న పదాలలో పెద్దపెద్ద అర్థాలు "దేశమంటే మట్టి కాదోయి దేశమంటే మనుషులోయి" ఎన్నో పెద్ద పెద్ద పుస్తకాలతో చెప్పేది ఒక గేయ రూపంలో అది కూడా నాలుగేసి పాదాల రూపంలో అంతటినీ వివరించే మహానుభావులు, నవయుగవైతాళికులు, మహాకవి గురజాడ వెంకట అప్పారావు గారు." ఈ గేయం సర్వకాలాల, సర్వావస్థలలో అజరామరంగా నిలిచిపోతుంది. భారతదేశానికి, ప్రపంచ దేశాలకి గురజాడ దేశభక్తి భవితకు స్ఫూర్తి.

ఉపయుక గ్రంథ సూచి :

1) ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయాలు ప్రయోగాలు- డాక్టర్ సి.నారాయణరెడ్డి.
2) గురజాడ దేశభక్తి గురించి - సంపాదకులులు : జి.ఎస్ చలం.
3) చైతన్య భారతి అద్దంలో గురజాడ దార్శనికత - సంకలనం : డాక్టర్ గురజాడ వెంకట అప్పారావు.

4) గురజాడ అప్పారావు గారి 150వ జయంతి సంచిక - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ.

5) గురజాడ రచనలు- విశాలాంధ్ర పబ్లికేషన్స్.

6) వికీపీడియా

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గొల్లరామవ్వ కథ - దేశభక్తి

- *సన్నెక లలిత,* అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూరు, మంచిర్యాల.

ప్రముఖ రాజనీతిజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి. సుమారుగా 17 భాషల్లో ప్రావీణ్యం కలిగిన వారు తెలుగు రాష్ట్రాల వారు సగర్వంగా చెప్పుకోగలిగే అత్యున్నత పదవి అయిన ప్రధాన మంత్రి పదవిని అధిరోహించిన తెలుగువారు పి.వి నరసింహారావు. భారతదేశ ప్రధాన మంత్రి పదవిని అధిష్టించిన మొదటి తెలుగువాడు అయిన పీవీ నరసింహారావు గారు 1921 జూన్ 28న కరీంనగర్ జిల్లాలోని లక్నేపల్లి లో జన్మించాడు. వీరి పూర్తి పేరు పాములపర్తి వెంకట నరసింహారావు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసిన గొప్ప నాయకుడు. 1957లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ప్రారంభించి కీలక పదవులు ఎన్నింటినో సమర్థవంతంగా నిర్వర్తించి, ప్రధానమంత్రి కావటం అనేది పి.వి నరసింహారావు గారి పట్టుదల, కృషి, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం మాత్రమే అని చెప్పవచ్చు. పి.వి గారు మృదు స్వభావి, మితభాషి, నిరాడంబరమైన జీవితాన్ని గడపడానికి మాత్రమే ఇష్టపడే వ్యక్తిత్వం వీరిది.

రాజకీయ రంగంతో పాటుగా సాహిత్య రంగంలో తనదైన పంథాను ఏర్పరచుకున్నారు. ప్రవృత్తి రీత్యా సాహిత్యం పట్ల అభిరుచి గలవారు కావటం చేత తన రచనా పరంపరను కొనసాగించారు. రచయితగా, పాత్రికేయుడిగా, అనువాద రచయితగా తనకంటూ ఒక విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకున్నారు.

విశ్వనాథ సత్యనారాయణ గారి వేయిపడగలు అనే నవలను పి.వి నరసింహారావు గారు "సహస్ర ఫణ్" అనే పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. పివి గారి అనువాదానికి గాను ఆ రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. పివి గారి ఆత్మకథ ఇన్ సైడర్ లోపలి మనిషి అనే పేరుతో తెలుగులోకి అనువదించ బడింది.

పీవీ నరసింహారావు గారి రచనలు ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయంటే రచయితగా పాఠకుల మనస్సును హత్తుకునే విధంగా, సందేశాత్మకంగా రచన చేయటమే ప్రధాన కారణం.

1949లో కాకతీయ పత్రికలో "విజయ" అనే కలం పేరుతో పివి నరసింహారావు గారు గొల్ల రామవ్వ అనే కథను రాశారు. తెలుగు కథా సాహిత్యంలో కలికితు రాయిగా నిలిచిన కథలెన్నో ఉన్నాయి. అటువంటి కథల కోవాకు చెందినదే ఈ గొల్ల రామవ్వ కథ. తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యంలో వచ్చిన కథ. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ ప్రాంతానికి ఇంకా నిజాం పరిపాలన నుంచి విముక్తి లభించని రోజులవి. నిజాం పాలనలో రజాకార్ల దాష్టికానికి బలైపోతూ రోజులు లెక్కపెట్టుకుంటూ గడ్డు పరిస్థితుల్లో బతుకు వెళ్ళదీస్తున్న సమాజమే ఈ కథకు కాల నేపథ్యం. నిజాం వ్యతిరేక పోరాటంలో ఆనాటి గ్రామాల్లో స్థితిగతులు, ప్రజల మానసిక స్థితిగతులు, నైజాం పాలనలో రజాకాల దురంతాలను ఈ కథలో రచయిత అత్యంత సహజంగా వర్ణించారు. గొల్ల రామవ్వ అనే ముసలమ్మ నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఒక యువకుడ్ని తన సమయస్ఫూర్తితో, చాకచక్యంతో, సాహసించి, అతని ప్రాణాలు కాపాడి తన దేశభక్తిని చాటుకుంటుంది.

దేశభక్తిని ప్రబోధించే కథలు తెలుగు సాహిత్యంలో వచ్చినప్పటికీ ఒక మహిళను అందులో వృద్ధాప్యంలో ఉన్న మహిళను కథానాయకురాలుగా చేసి, ఆమెలో గల ఔన్నత్యాన్ని, దేశభక్తిని, త్యాగనిరతిని ఆవిష్కరించిన కథ

గొల్లరామవ్వ కథ. ఈ కథలో గొల్ల రామవ్వ తన ప్రాణం కంటే తమ వారిని నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తిని కలిగించి, స్వాతంత్ర్యాన్ని తెచ్చే యువకుని ఆశయానికి విలువను ఇచ్చింది. భావితరాలకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించాలనే లక్ష్యమే గొల్ల రామవ్వలో అంతటి తెగువ, ధైర్యాన్ని నూరిపోసింది. మానవత్వానికి ప్రాధాన్యమిచ్చింది.

సంఘటన చిన్నది అయినప్పటికీ రచయిత పీ.వీ నరసింహారావు గారు తెలంగాణ యాసతో, నాటకీయతను జోడించి ఆ దృశ్యాన్ని పాఠకుల మదిలో నిలిచేలా ఉద్వేగపూరితంగా మలచడం రచయితలో దాగివున్న సృజనాత్మకతకు, రచనా పటిమకు నిదర్శనం.

గొల్ల రామవ్వ సాధారణ గ్రామీణ మహిళ అయినప్పటికీ ఆమెలో కలిగిన మార్పుల్ని, పరిణతి చెందుతున్న ఆమె ఆలోచనా ధోరణిని, సన్నివేశాల వరుస క్రమంలో ఎంతో ఔచిత్యవంతంగా ఆ పాత్ర ఎదిగిన తీరును రచయిత మలిచారు.

ప్రాణాల్ని రక్షించుకునే క్రమంలో యువకుడు గొల్ల రామ ఇంటిలో ప్రవేశించే క్రమంలో గొల్ల రామవ్వలో ముందు భయం మొదలవుతుంది. యువకున్ని రక్షించాలనే సదుద్దేశంలో ఆమెలో ఒక కార్యశూరత్వం కనిపిస్తుంది. భయం తొలగిపోయి, ఒక నాయకురాలిగా యువకుడ్ని కాపాడేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది.

''దేహమంతటా పల్లేరు కాయలు, చిగురంతా, జిట్టరేగు ముళ్ళు, అంటుకుని ఎండిపోయిన రేగటి మన్ను, ఆ మట్టిలో చిక్కుకొని యున్న తుంగపోచలు, గడ్డిపోచలు, వెంపలాకులు, తాటిపీచు వగైరా ఇవన్నీ ముసలవ్వ చేతులకు కండ్లున్నవా అన్నట్లు గోచరించినవి.''

పై సంఘటనలో వృద్ధాప్యంలో ఉన్న ముసలవ్వకు చూపు సరిగా ఆ తన అనుభవాల సారంతో చేతులతో తడిమి ఆ యువకుని దేహం ఏ స్థితిలో ఉందో గమనించ గలుగుతుంది. అతడు నిస్సహాయ స్థితిలో ఉన్నాడని తెలుసుకుంటుంది. ఒక్క వర్ణనతో రచయిత, ముసలవ్వ మేధాసంపత్తిని పాఠకుల ముందు ఆవిష్కరిస్తాడు.

యువకునికి సపర్యలు చేయమని తన మనవరాలు మల్లమ్మకు ఆజ్ఞలు జారీ చేయడంతో, మల్లమ్మ మొహమాటపడుతూ ఉంటే మల్లమ్మని సున్నితంగా మందలించి, ఒక ప్రాణం కాపాడటంలో మానవత్వం అనేదే ప్రధానమని తెలియచెబుతుంది.

పోలీసులు గొల్ల రామవ్వ ఇంటిని ముట్టడి చేసిన సందర్భంలో యువకునికి గొల్లవాని వేషం వేయించి, తన మనవరాలు మల్లమ్మ పక్కన పడుకోబెట్టి వారిని భార్యాభర్తలుగా నమ్మింపజేస్తుంది. ఒక స్త్రీ తన ప్రాణం కంటే శీలం గొప్పదని భావిస్తుంది. కానీ గొల్ల రామవ్వ శీలం కంటే ఒక వీరున్ని దేశానికి సేవ చేసే యువకుడ్ని కాపాడటమే ముఖ్యమని ఆలోచిస్తుంది. వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ గొల్ల రామవ్వ నేర్పుతో తను చేయగలిగింది అంతా చేసి ఆ యువకుని ప్రాణాలు కాపాడుతుంది.

ఈ కథలో సంభాషణలు, వర్ణనలు కథను నడిపించిన క్రమం, భావోద్వేగాల కూర్పు, ఆయా పాత్రల హావా భావాల్ని రచయిత ఎంతో హృద్యంగా అక్షరీకరించారు. కథా వాక్య నిర్మాణం పాఠకుల్ని పరుగులు పెట్టిస్తుంది. పాఠకుల్లో ఉత్కంఠతను రేపేలా వాక్య శైలి ఉండటం వల్ల కథ ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తుంది. పాఠకులు సంఘటనా కాలంలో మమేకమై సజీవంగా కథలో లీన మయ్యేలా కథా సంవిధానం చేయటం పీవీ నరసింహారావు గారి రచనా పటిమకు తార్కాణం.

గొల్ల రామవ్వ సమయస్ఫూర్తితో చేసిన సాహసం అందర్నీ చకితుల్ని చేస్తుంది. పాఠకుల్లో పోరాటపటిమను, ఉద్యమ స్ఫూర్తిని పెంపొందిస్తుంది. గొల్ల రామవ్వ ఒక గొప్ప యోధురాలుగా కనిపిస్తూ అస్తిత్వం కోసం పోరాటం తప్పదనే ఒక మంచి సందేశాన్ని అందించింది.

ఆధార గ్రంథాలు :

1. దక్షిణామూర్తి. పోరంకి,'' కథానిక స్వరూప స్వభావాలు'' ప్రథమ ముద్రణ, 1988, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
2. వెంకటసుబ్బయ్య. వల్లంపాటి, ''నవలా శిల్పం'' 1996, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. వెంకటసుబ్బయ్య. వల్లంపాటి, ''కథా శిల్పం'' ప్రథమ ముద్రణ, జనవరి, 1994, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. వెంకట నరసింహారావు. పాములపర్తి, గొల్ల రామవ్వ కథ.

❖❖❖

రాయప్రోలు సుబ్బారావు గారి శ్రీలు పొంగిన జీవగడ్డ గేయం - దేశభక్తి

- సుశీల్ ప్రత్యూష దొనరి, తెలుగుశాఖాధిపతి, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల (అటానమస్), గుడివాడ.

రాయప్రోలు సుబ్బారావు గారు గుంటూరు జిల్లా బాపట్ల తాలుకాలోని గార్లపాడు గ్రామంలో 13 మార్చి 1892 సం॥లో జన్మించారు. బిరుదులు : కోకిల స్వామి, అభినవ కవికుల గురువు, కాల్పనిక కవితా భీష్ముడు, సుబ్బారావు గారి రచనలు 4 విభాలుగా చెప్పుకోవచ్చు.

1. అనువాదాలు
2. స్వతంత్ర కావ్యాలు
3. ఖండ కావ్యాలు
4. లక్షణ కావ్యాలు

అనువాదాలు :

లలిత, అనుమతి, మధుకలశం, భజగోవిందం, సుందరకాండ, సౌందర్యలహరి.

స్వతంత్ర్య రచనలు :

తృణకంకణం, కష్టకమల, స్నేహలత, స్వప్నకుమారం

ఖండకావ్య సంపుటాలు :

ఆంధ్రావళి, జడకుచ్చులు, వనమాల, మంజరి

లక్షణ కావ్యాలు :

రమ్యాలోకం, మాధురీ దర్శనం

రాయప్రోలు వారి 'ఆంధ్రావళి' ఖండకావ్య సంపుటిలో 'దేశభక్తి'ని గురించి తెలిపే పుస్తకం, ఆంధ్రమాత, తమ్ముడా, ఆంధ్ర తెనుగుతల్లి, తెలుగుమాన్యం ఖండిక లన్నింటిలోనూ, ఆంధ్రుల గత వైభవాన్ని దేశ గొప్పతనాన్ని తెలిపే అనేక విశేషాలున్నాయి.

రాయప్రోలు వారి దేశభక్తి కవితల్లో 'తమ్ముడా' అనే గేయం ఒకటి దీనిలోనిదే 'శ్రీలు పొంగిన జీవగడ్డ'.

కవి మన దేశపు గౌరవాన్ని, గొప్పతనాన్ని తెలుసుకుని స్ఫూర్తిని పొందేలా ఈ గేయాన్ని రచించారు.

శ్రీలు పొంగిన జీవ గడ్డయి
పాలు పారిన భాగ్యసీమయి
వరలినది ఈ భరత ఖండము
భక్తి పాడర తమ్ముడా!
వేదశాఖలు వెలసెనిచ్చట
ఆదికావ్యం బలరె నిచ్చట
బాదరాయణ పరమ ఋషులకు
పాదుసుమ్ముది చెల్లెలా!

మన భారతదేశం సంపదలతో పొంగిన, చైతన్యముతో తొణికిలాడుచున్న (జీవమున్న భూమి), పాడి పంటలు గల భారతదేశం. అలాంటి మన భారతదేశాన్ని గురించి భక్తితో పాడాలి. వేదాలు వాటి శాఖలు భారతదేశంలోనే వెలిశాయి. ఆదికావ్యమైన రామాయణం ఇక్కడే పుట్టింది. మహాభారతం, భాగవతాలను రచించిన వేదవ్యాసుడు మొదలైన వారెందరో మునులను గన్న (పుణ్యభూమి) మన భారతదేశం పవిత్రభూమి అంటూ రాయప్రోలు దేశభక్తిని చాటిచెప్పారు.

విపినబంధుర వృక్షవాటిక
ఉపనిషన్మధు వొలికెనిచ్చట
విపుల తత్త్వము విస్తరించిన
విములతలమిదె తమ్ముడా!
సూత్రయుగముల శుద్ధవాసన
క్షాత్రయుగముల శౌర్యచండిమ
చిత్రదాస్యముచే చరిత్రల
చెఱిగిపోయెను చెల్లెలా!

భారతదేశంలో దట్టమైన చెట్లతో కూడిన విస్తారమైన అరణ్యాలున్నాయి. మధురమైన భావసారం గల ఉప నిషత్తులు ఇక్కడే పుట్టాయి. తత్త్వబోధన విస్తరించిన పవిత్రమైన భూమి భారతదేశం. ఆపస్తంభ, ఆశ్వలాయ నాది సూత్రాలను చెప్పిన కాలంనాటి గొప్పతనం, క్షత్రియ

ధర్మం, వీరత్వం ప్రచండ పరాక్రమమున్న రాజుల కాలం నాటి పరాక్రమ చరిత్రలన్నీ పరదేశముల బానిసతనం వల్ల అంతరించిపోయాయి.

కిన్నెర వాద్యాన్ని మీటుతూ, రాళ్ళను కూడా కరించగల రాగంతో మధురంగా భావి భారతదేశ భాగ్యాన్ని గురించి పాడుకోవాలి.

మేలి కొన్నెర మేళవించీ
రాలు కరగగ రాగమెత్తీ
పాలతీయని భావిభారత
పదము పాడర తమ్ముడా

ప్రస్తుత సమాజములో దేశాభిమానం, జాతీయాభిమానం నశిస్తూ, నైతిక విలువలు కాకుండా, కేవలం ధన సంపాదనే ప్రధానంగా జీవిస్తున్న సమాజానికి దేశభక్తిని తెలియచేసి స్ఫూర్తిని నింపే గేయంగా శ్రీలు పొంగిన జీవగడ్డ ను పేర్కొనవచ్చు. రాయప్రోలు వారికి తెలుగు జాతి, తెలుగుభాష, తెలుగు నేల అంటే వీరికి ప్రాణ పదాలు.

''రాయప్రోలు నిజంగా తెలుగు మట్టిల్లోంచి మొల కెత్తిన మహావృక్షం ఆయన శైలి తెలుగు సాహిత్య మృత్తికల్లోంచి పుట్టిన లత'' అని గుంటూరు శేషేంద్ర ధర్మ ప్రకటించారు.

రాయప్రోలు వారి 'ఆంధ్రావళి' తెలుగు వారి గత పరాక్రమాన్నీ గొప్పగా వర్ణించి వారిని కర్తవ్యోన్ముఖుల్ని చేస్తుంది.

దేశభక్తి కవిత్వానికి మార్గం వేసిన కవి రాయప్రోలు.

'నాదు దేశము - నాదు జాతి - నాదు భాష' అని సగర్వంగా చాటుకున్నారు.

జాతి, దేశం, భాష ఈ మూడింటిమీద అమితమైన మమకారాన్ని పెంచుకున్నారు.

''దేశగర్వము దీప్తి చెందగ
దేశ చరితము తేజరిల్లగ
దేశమరసిన ధీరపురుషుల
తెలిసిపాడర తమ్ముడా!''

దేశాభిమానం ప్రకాశించేటట్లుగా, దేశచరిత్ర విస్తరించే టట్లుగా, దేశాన్ని కాపాడిన వీర పురుషులను గురించి తెలుసుకుని వారిని కీర్తించాలి అని రాయప్రోలు సుబ్బా రావు గారు పిలుపునిస్తున్నారు.

ఈ విధంగా రాయప్రోలు సుబ్బారావు గారు 'శ్రీలు పొంగిన జీవడ్డ' గేయంలో దేశగౌరవాన్ని నిలబెట్టటానికి ప్రతి ఒక్కరం ప్రతి సందర్భంలోనూ చక్కని తెలుగు పదాలతో అందరూ కలిసి దేశాభిమానం ప్రకాశించే టట్లుగా దేశం యొక్క గొప్పతనాన్ని గురించి పాడుకోవాలి అనే చక్కని సందేశాన్ని తెలియజేశారు.

❖❖❖

రాయప్రోలు దేశభక్తి శ్రీలు పొంగిన జీవనధాత్రి

- ఐ. మల్లీశ్వరి, మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాల, విజయనగరం, ఆంధ్ర రాష్ట్రం.

నవ్య కవిత పితామహునిగా పేరుపొందిన రాయప్రోలు సుబ్బారావు గారు 1892 మార్చి 17న జన్మించారు. ఈయన బాపట్ల గుంటూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ భారత దేశంలో జన్మించారు తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు. ఈయన 1913లో వ్రాసిన తృణకంకణముతో తెలుగు కవిత్వంలో నూతన శకము అమలిన శృంగార తత్వాన్ని ఆవిష్కరించాడు ప్రేమ పెళ్లికి దారి తీయని యువతి యువకుల స్నేహితులుగా మిగిలిపోవడానికి నిర్ణయించుకున్న ఇతివృత్తముతో కండకావ్య ప్రక్రియలకు అంకురార్పణ చేశాడు. వీరి రచనలు అద్భుతమైన శైలి ఎటువంటిదంటే దేశభక్తి ఉట్టిపడేలా ఏ దేశమేగినా ఎందు కాలిడినా అని అంటారు రాయప్రోలు సుబ్బారావు గారు. డాక్టర్ సీనారే నా రెడ్డి గారు రాసిన ఆధునిక ఆంధ్ర కవిత్వము సంప్రదాయము ప్రయోగాలలో పుస్తకం అంతటికీ ఇద్దరే యుగకర్తలు అని పేర్కొన్నారు ఆ ఇద్దరు యువగర్తల్లో నవయుగ వైతాళికులు గురజాడ అప్పారావు ఒకరైతే మరొకరు రాయప్రోలు సుబ్బారావు గారు ఇటువంటి విధానం బట్టి రాయప్రోలు సుబ్బారావు గారి కవిత రచన శైలి ఎంత అద్భుతమో మనం తెలుసుకోవచ్చు.

రచన విషయాలు :

1. తృణకంకణము, కష్టకమల, రమ్యలోకము, వనమాల, స్నేహలతా దేవి, ఏ దేశమేగినా ఎందుకాలిడిన గేయం. వీరు రచనలన్నింటిలోని ఏ దేశమేగినా ఎందు కాలిడిన గేయం అద్వితీయమైనది దేశభక్తి గురించి వివరించే ఒక మరపురాని రచన.

రాయప్రోలు కవిత్వం - దేశభక్తి
పొగడ రా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

అంటూ భారతమాతను కీర్తిస్తూ దేశభక్తిని పెంచే పాటను స్వతంత్ర రచనలు రచించి నవ్య కవితా పితామహునిగా పేరుపొందిన రాయప్రోలు సుబ్బారావు గారు.

రాయప్రోలు గొప్ప జాతీయవాది తెలుగుజాతి అభిమాని ఆయన దేశభక్తి గేయాలు ఎంతో ఉత్తేజ కరంగా ఉంటాయి .

దేశమును ప్రేమించుమన్నా అని గురజాడ అప్పారావు గారు అంటే ఏ దేశానికి వెళ్లిన ఎక్కడ కాలు పెట్టిన నీ భారతమాతను పొగుడు, నీ తల్లిని నీయొక్క జాతి నిండు గౌరవం నిలుపు అని చెప్పి చెప్పినవారు రాయప్రోలు సుబ్బారావు గారు. చిన్నచిన్న పదాల్లో పెద్ద పెద్ద అర్థాలు వచ్చేది ఆ ఘనత వీరికీ దక్కుతుంది. దేశభక్తి గురించి ఇంతటి సత్యాలని ఇచ్చిన ఎందరో మహనీయులు మహానుభావులలో రాయప్రోలు వారు కూడా ఒక్కరు. ఎంతో చరిత్ర కలిగిన సంస్కృతి, సంప్రదాయ, వేద, శాస్త్రాలు ఉపనిషత్తులు కలిగిన ఈ భారత గడ్డమీద పుట్టామంటే అది ఏ జన్మ పుణ్యమో ఏ యోగ ఫలము జనించినావట ఈ భరతఖండమున అన్నారు.వీరు ఈ తల్లి బంగారు గర్భంలో ఉన్నావు కదా నువ్వు ఏ మంచి పువ్వులను ప్రేమించావో అని అన్నారు. మనము నడుస్తున్న ఇటువంటి భూదేవి ఇంకెక్కడ లేదని అటువంటి భూదేవి మీద ఉన్న మనము ఇంకా ఎక్కడ లేము అని చాటి చెప్పారు. నీ యొక్క దేశభక్తితో, విద్యతో, ఈ యొక్క దేశాన్ని కీర్తి ప్రతిష్టలపరంగా, ఖ్యాతిని, సంపద, వనరుల పరంగా వెలిగించు అనే ఒక మహోత్తరమైన సందేశాన్ని వారి రచనల ద్వారా ఇచ్చారు రాయప్రోలు వారు.

ఈ భరత గడ్డమీద వేద కావ్యాలు, ఆదికావ్యాలు వెలిసేయని కూడా ఆయన రచనల్లో చెప్పారు. ఈ యొక్క

భూమి నేల పాలు పారిన భాగ్యసీమా అని వర్ణించినారు. ఉపనిషత్తులు వృక్షవాటిక లాంటివన్నీ ఇక్కడ ఇచ్చట ఉన్నాయని చెప్పినారు. ఇటువంటి దేశభక్తి గేయాలని ఇస్తున్న ఎందరో గొప్పకవులలో రాయప్రోలు వారు ఒకరు. వీరు రచించిన రచనలు దేశభక్తి గేయము ఇలా అన్ని విధాల భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి. దేశ కీర్తిని, ఖ్యాతిని పెంచే విధంగా ఉండాలి, తరతరాలుగా చిర స్థాయిగా నిలిచిపోవాలి.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. ఆధునిక ఆంధ్ర కవిత్వము సంప్రదాయాలు ప్రయోగాలు డాక్టర్ సి.నారాయణరెడ్డి.
2. రాయప్రోలు సుబ్బారావు గారి దేశభక్తి రచనలు.

❖❖❖

విశ్వనాథ నవలలు - దేశభక్తి

- - డా॥. గుమ్ములూరి ఇందిర, విశ్రాంతాచార్యులు & తెలుగు శాఖాధ్యక్షులు, అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్, విశాఖపట్టణం.

"సముద్రవసనేదేవి పర్వతస్తనమణ్ణలే
విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే"

అని నిద్రలేవటంతోటే భూదేవికి నమస్కరించటం భారతీయుల ఆచారం. భూమిని తల్లిగా భావించి ఆమెను త్రొక్కుతున్నందుకు క్షమించవలసిందిగా ప్రార్థించటంలో దేశభక్తి ప్రతిఫలిస్తుంది.

భారత దేశం కర్మభూమి అన్న విషయం సర్వజనేక వేద్యం. ఈ కర్మాచరణకు తాను నివసిస్తున్న, తనకు జీవికను కల్పిస్తున్న, తనకు అస్తిత్వాన్ని ఇస్తున్న ఈ భూమి పట్ల భక్తి కలిగి ఉండవలసిన అవశ్యకత ఎంతైనా ఉన్నదని, అదే మూలసత్త్వమని గుర్తించారు వేదకాలం నాటి ఋషిపుంగవులు. ఒక దేశం యొక్క సర్వాంగీణ స్ఫూర్తి ఆ దేశంలోని నదులు, కొండలు, చెట్లు, మృత్తిక ఇలా ఒకటేమిటి సర్వ ప్రకృతి మీద ఆధారపడి ఉంటుంది. ఆనాడు అంటే ఆ వేదకాలంలో ఋషులు గొంతెత్తి పాడిన నదీసూక్తం, పృథ్వీ సూక్తం మొదలైనవి దేశమాత స్వరూపాన్ని కీర్తిస్తూ పాడిన సంకీర్తనలే. అయితే అవి ఆ విధంగా ఆవిష్కృతం కావటానికి ఆ ఋషుల తపశ్శక్తి కూడా వాటిలో గర్భితమై ఉందని అర్థం చేసికోవాలి. దేశం సస్యశ్యామలంగా ఉండాలంటే అక్కడ తృణకాష్ఠ జలాదులు సమృద్ధిగా ఉండాలి. అప్పుడే ఆధ్యాత్మికశక్తి వికసించటానికి వీలున్నదని గుర్తించినవారు నాటి ఋషులు. అలా గురించబట్టే తమ తమ స్తుతులకు వాటిని ప్రధాన అంగంగా చేసికొన్నారు. ఆదిశంకరులు రచించిన గంగాస్తవం, యమునాస్తవం ఈ కోవలోనివే అని ఈపాటికి మనకి అర్థం అయిపోయి ఉంటుంది. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని శ్రీమద్రామాయణం మనకందించిన సూక్తి కూడా ఈ విషయాన్నే నొక్కి వక్కాణిస్తోంది.

అసలు దేశభక్తి అంటే ఏమిటి ? అంటే ఒక జాతి యొక్క ఆత్మగౌరవానికి, ఔన్నత్యానికి అనుకూలంగా ఉండటం, జాతి సంస్కృతీ సంప్రదాయాలను, చారిత్రకతను అభిమానించటం. అయితే ఇది తాత్కాలికం కాదు ఇదొక నిరంతర ప్రక్రియ. అంటే ఒక జీవనది లాంటిదన్న మాట! అయితే జాతీయోద్యమం తరువాత మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఈ దేశభక్తి భావన ప్రజల్లో నెమ్మది నెమ్మదిగా చచ్చుబడిపోసాగంది. అయినా విదేశీయులతో యుద్ధం సంప్రాప్తించినప్పుడు అది ప్రజల్లో ఉత్తేజితమౌతూ ఉండటం నేటికీ చూస్తూనే ఉన్నాం. మళ్ళీ ఏ చైనా వారితో యుద్ధమో, పాకిస్థాన్ వారితో సమరమో ప్రజల్లో ఈ చైతన్యస్ఫూర్తిని తీసికొని వస్తుందేమో! దేశభక్తి అంటే దేశం కోసం ప్రాణాలర్పించటం అన్నారు జాతీయోద్యమం చేస్తున్న కాలంలో. బ్రిటీష్ పాలనా కాలంలో భగత్సింగ్ వంటి ఎందఱో దేభశక్తులు తమ ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి ఉరికంబాల్ని కౌగిలించుకొన్నారు, వారి కాల్పులకు బలైనారు. అయితే కాలక్రమేణా ఇది కొంతవఱకు తన రూపును మార్చికొంది. దేశం కోసం జీవించటం దేశభక్తిగా రూపుదిద్దుకోవటం నిజ్ఞంగా ఆహ్వానించవలసిన మార్పే. తెల్లదొరల పాలనలో బానిసలై ఆత్మాభిమానాన్ని చంపుకొని హీనస్థితిలో బ్రతుకుతున్న సమయంలో ఎందఱో వీరులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, మనకు స్వాతంత్యం తెచ్చి పెట్టేరు. కనుక అప్పుడు దేశం కోసం ప్రాణలర్పించటమే దేశభక్తి అన్నారు. అయితే దేశాన్ని సంఘటిత పఱచటానికి తమ జీవితాన్ని వెచ్చించటమే దేశభక్తి కాని ప్రాణాలనర్పించటం కాదన్నది మొట్టమొదటగా రాష్ట్రీయస్వయం సేవక్ సంఘ స్థాపకుడైన డా. హెడ్గేవార్ అనే ఆయన.

పరదేశీయ సంస్కృతి ప్రభావం వల్ల ప్రజలలో హేతువాదముద్భవించి, దాని ప్రభావపర్యవసానంగా

ప్రజా బాహుళ్యంలో మతం తన ప్రాముఖ్యాన్ని కోల్పోయింది. దాని ఫలితమే సంస్కృతీరాహిత్యం. అనుస్యూతంగా వస్తున్న మహాసభ్యతా సుసంపన్నమైన భారతీయ సంస్కృతి కాలక్రమానో, కర్మవశానో, పరదేశీయుల ప్రాబల్యం వల్లనో పలుచ్చబడి, కలుషితమై అలనత్వం చెందగా ఆ పతనానికి నాటి దేశకాలపరిస్థితులు తోడయి, జాతి నిర్వీర్యమౌతున్న కాలంలో సంస్కరణాభిలాషులైన బుద్ధిశాలురు దానిని సంస్కరించ్చటానికి ప్రయత్నించారు. తమ ఆధ్యాత్మికోపదేశాలతో రామకృష్ణ పరమహంసా దులు, ఉపన్యాసాలతో వివేకానందాదులు, తత్త్వశాస్త్ర అధ్యయనాధ్యాపనలచే రాధాకృష్ణ ప్రభృతులు, యోగసాధనాది మార్గంలో అరవిందాదులు, శిల్ప సౌందర్యతత్త్వప్రకటనం ద్వారా ఆనందకుమారస్వామి వంటివారు, చిత్రలేఖనం ద్వారా రవివర్మాదులు భారతీయ సంస్కృతి యొక్క వైభవ ప్రాభవాలను ఖండ ఖండాంతరాలకు వ్యాపింపజేసేరు. కనుక వీరందఱూ నిస్సందేహంగా దేశభక్తిపరులే.

ఇక ఇదే దేశభక్తిని సాహిత్యానికి అన్వయిస్తే ఋషి కల్పుడైన కవికి, సమాజానికి అవినాభావ సంబంధ ముంటుంది. అటువంటి కవి తన దేశకాల పరిస్థితులను వీక్షించి, వాటి మంచి చెడ్డలను, తత్కాలానికే కాక భవిష్యత్తులో కలుగబోయే పరిణామాలను క్రాంతదర్శియై వీక్షించి, ప్రజలవ్యక్తిత్వాన్ని రూపుదిద్దటానికి తన పరిధిలో తాను తీవ్రప్రయత్నం చేస్తాడు. సమాజం కల్లోలభరిత మైనపుడు కవిబాధ్యత పెరుగుతుంది. తన కవిత్వంతో దిశానిర్దేశం చేయవలసిన పరిస్థితి ఎదురౌతుంది. ఆ సంక్లిష్ట పరిస్థితిలో తనదైన మార్గంలో సమాజానికి మేలు కొలుపు పాడుతాడు. అటువంటి కవే కాలానికి అతీతంగా జాతిజనుల గుండెల్లో నిలిచిపోతాడు. దీనికి నిదర్శనం తిక్కన సోమయాజి. తిక్కనకాలంలో తెలుగునేలలో శైవ వైష్ణవమత ప్రచారాలు వెఱ్ఱితలలు వేసి, తమ మతమే గొప్పదని ఒకరంటే తమ మతమే గొప్పదని మఱొకరు అనటం, చివరకు ఈ రెండూ వీరశైవ, వీరవైష్ణవ మతాలుగా విడిపోవటమేకాక యుద్ధాలకు కూడా దారితీసింది. ఈ రెండు వర్గాలు తమ విశ్వాసం గొప్పదంటే తమ విశ్వాసం గొప్పదని దేశాన్ని ఒక అనిశ్చితస్థితిలోకి నెట్టివేసినపుడు వారిద్దఱి మధ్య తారతమ్యాలను తొల గించే ప్రయత్నంలో భాగంగా తెలుగునాట ఒక దేవుణ్ణి ప్రతిష్ఠించాడు తిక్కన. ఆ దేవుడే హరిహరనాథుడు. తన సాహిత్యంలో దేశంలో మతసామరస్యాన్ని నెలకొల్పిన తిక్కన కూడా దేశభక్తిపరుడే.

అయితే ఇంతకీ దేశభక్తి ఒక రాజకీయ దృక్పథమా? ఒక సాంఘిక దృక్పథమా? ఒక ఆర్థికదృష్టి దృక్పథమా? అంటే నిజ్జానికి ఇవేవీ దేశభక్తి అనిపించుకోవు కదా? అయితే ప్రస్తుతకాలంలో దేశభక్తి అంటే ఈ మూడింటి సమాహారంగా మాఱిపోవటం చ్తాలా దురదృష్టకరమైన పరిణామం. ఒక జాతి క్షేమం, శక్తి, పురోగమనం, క్షయం. ఇవన్నీ దేని మీద ఆధారపడి ఉంటాయి? ఆ జాతికి చెందిన ఉత్తమలక్షణాలు కలిగిన ఒక సనాతనమైన సంస్కృతి, దాని పరిరక్షణ, దాని అనుసరణ మీద ఆధారపడి ఉంటాయని వేఱే చెప్పనక్కఱలేదుగా? అటువంటి సంస్కృతి ఉన్నచోట జాతి ఏకోన్ముఖ మౌతుంది. ఏ దేశంలో ప్రజలు ఆ దేశ సంస్కృతీ సంప్రదాయాలను, ఆచారాలను గౌరవించలేరో, ఆదరించ లేరో, పైగా ద్వేష భావంతో అవమానిస్తారో ఆ ప్రజలు దేశభక్తులు కారు, కాజాలరు. పైగా వారిని దేశద్రోహులుగా పరిగణించాలి.

తాను జన్మించిన భరతభూమి విదేశీశక్తుల పాలనలో చిక్కి శల్యమై తాను కోల్పోతున్న అస్తిత్వాన్ని, తాత్త్వికతను గమనించి, స్పందించించిన దేశభక్తుడు విశ్వనాథ. పరాయిపాలనలో తన మాతృదేశం భౌతికంగా అభివృద్ధి చెందుతున్నట్లు కనబడుతున్నప్పటికీ ఆంతరంగికంగా, ఆధ్యాత్మికంగా ప్రజల ఆత్మశక్తి నిర్వీర్యమౌతున్న పద్ధతిని తీవ్రంగా నిరసించారు విశ్వనాథ, ఆ నిరననను వ్యక్తపరచటానికి తమ కలాన్ని ఝళిపించారు. భయంకర

మైన, అనారోగ్యకరమైన, అసత్యదూషితమైన భావజాలం నుండి ప్రజల ఆలోచనా నరణిని మార్చవలసిన అవసరాన్ని గుర్తించి, ప్రణాళికాబద్ధమైన రచనలను చేయవలసిన ఆవశ్యకత తన బాధ్యతగా భావించారు విశ్వనాథ. భావదాస్యంలో ప్రగ్గుతూ నిద్రాణంగా ఉన్న జాతిని జాగృతపఱచటంలో ఆయన చేసిన సాహితీశంఖారావం ఒక ఆదిశంకరాచార్యులవారిని, ఒక వివేకానందుల వారిని తలపింపజేస్తుందనటం ఏమాత్రం అతిశయోక్తి కాదు. వారి రచనలన్నిటా దేశభక్తి అంతర్లీనంగా ప్రవహిస్తూనే ఉంటుంది. ఆంధ్రదేశచరిత్రలో మహా సామ్రాజ్యాల ఉత్థానపతనాలకు సంబంధించిన ఆనంద విషాదమయ సంస్కృతధారే వీరు 1919-1920 ప్రాంతాలలో రచించిన "ఆంధ్రప్రశస్తి" అనే పద్యకవితాధార. ఇందులో చరిత్ర కందినంత వఱకు దేశకాలఖండాలను ఆలంబనగా గొని, విశ్వనాథవారి ప్రతిభ చరిత్రకందని దేశకాల వైభవాలను శాశ్వతంగా మన కళ్ళముందు నిలుపుతుంది. సంస్కృతీపరిరక్షణను ప్రధానాంశంగా గొని రచితమైన నవల వేయిపడగలు. తూర్పు పశ్చిమచాళుక్యుల మధ్య మతపరమైన విభేదాలు ఏర్పడి రెండుగా విడిపోగా బద్ధన్న అనే దేశభక్తుడు తూర్పు చాళుక్యులకు తిరిగి స్వాతంత్యం సంపాదించటం ఇందులో కథాంశం. వీరి చారిత్రక నవలల్లో కూడా దేశం కోసం ప్రాణాలనర్పించి ఎన్నో పాత్రలు కనిపిస్తాయి. ఈనాటి నా వక్తవ్యాంశం "విశ్వనాథ నవలల్లో దేశభక్తి" విశ్వనాథ 57 నవలలను రచించారు.

క్రీ. శ 1193 వ సంవత్సరంలో కురుక్షేత్ర స్థానేశ్వర సంగ్రామంలో మహమ్మదీయ ప్రభువైన మహమ్మదుగోరీ చేత నాడు పాలనలో ఉన్న రాజవంశాలు చాలా వఱకు నిర్మూలితమైపోయాయి. ఈ వంశాలచరిత్ర అంతా పురాణ నిబద్ధం. అంతేకాదు ఈ గణనమంతా సప్తర్షి మండల గమనం ద్వారా, జ్యోతిర్గణితశాస్త్రాల ద్వారా నిరూపింప సాధ్యమై ఉండగా, భారత యుద్ధకాలనిర్ణయంలోనే పాశ్చాత్యుల లెక్కకు, భారతీయుల గణనానికి విభేదం కలిగింది. కలి ప్రవేశం మొదలు సంయుక్తాపృథ్వీరాజుల వఱకు గల కథలో సుమారు మూడు వేల ఏళ్ళ చరిత్రను పాశ్చాత్యులు తారుమారు చేసేరు. అలెగ్జాండరు దండయాత్ర సమయంలో భారత దేశాన్ని ఏలుతున్నది గుప్త చంద్రగుప్తుడు కాగా మౌర్యచంద్రగుప్తుడని వారు చిత్రించారు. ఇక శక కర్తలైన విక్రమార్క శాలివాహనులు అసలు లేనే లేరనేది వీరి వాదన. ఇదీ అసలైన దేశద్రోహం! పై విషయాలు అసత్యాలని నిరూపించటానికి, కాళిదాసాది నవరత్నాలు ఆస్థానంలో గల విక్రమార్క చక్రవర్తి కాలనిర్ణయం చేయటం, ఆతని మునిమనుమడైన శాలివాహనుడు శకపురుషుడని, మిథ్యాపురుషుడు కాడని నిరూపించటానికి కోట వేంకటాచలం, ఇత్యాదుల గ్రంథాలను ప్రమాణంగా గ్రహించి విశ్వనాథ. పురాణ వైర గ్రంథమాల పేర 12 నవలలు రచించారు. ఇవేకాక అచ్చమైన మనదేశ చరిత్రను నిరూపించటానికే కాశ్మీర చరిత్రను, నేపాలచరిత్రను, దాక్షిణాత్య చరిత్రను ఆధారంగా చేసికొని 20 నవలలు రచించారు. అచ్చమైన చరిత్రను ఆవిష్కరించి ప్రజలకు తెలియజేయటం కూడా దేశభక్తేగా? అయితే వారు రచించినది సాంఘికమైనా, చారిత్రకమైనా భారదేశ ఔన్నత్యాన్ని, సనాతనత్వాన్ని, భారతీయతను పాఠకులకు తెలియజేయటానికేనని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఇదీ అసలు సిసలు దేశభక్తి! నాకిచ్చిన పరిమిత సమయంలో 57 నవలల గుఱించి స్థాలీపులాకన్యాయంగానైనా వివరించటం కష్టం కనుక నేను రెండు నవలల గుఱించి మాత్రమే వివరిస్తాను. అయితే ఈ రెండు నవలలూ కూడా అంతగా ప్రాచుర్యానికి నోచుకోలేదు. ఆ రెండు నవలల పేర్లు వీరపూజ, ప్రళయనాయుడు.

ప్రళయనాయుడు :

'ప్రళయనాయుడు' నవలానాయకుడు కల్లు గీసికొని జీవించే వారి కులానికి చెందినవాడు. ఆంగ్లేయులు భారతదేశాన్ని పాలిస్తున్న నాటి కథ ఇది. 19 వ శతాబ్దంలో ఆంగ్లేయులు ఆంధ్రదేశంలోనే కాక యావద్భారత దేశంలో

తమ అధికారాన్ని చెలాయిస్తూ, విచక్షణారహితంగా పన్నులు విధిస్తూ, ఆ పన్నులు చెల్లించలేనివారిని శారీరకంగానూ, మానసికంగానూ వేధిస్తున్న సమయాన పాలకులకు ఎదురుతిరిగిన వాని కథ ఇది.

ఈ నవలలో ఆంగ్లేయులని ఫిరంగీలుగా వ్యవహరించటం గమనార్హం. వీరు తమ పాలనా కాలంలో కారణంగా అన్ని వృత్తులమీదా, అన్ని కులాల మీద పన్నులు విధించటంతో, కులవృత్తులు చేసికొనే వారు తమ తమ వృత్తులను కొనసాగించటం కష్టంగా పరిణమించింది. చివరకు పెళ్ళి, పురోహితుడు, బాజా భజంత్రీల మీద కూడ పన్నులు విధించటంతో నాడు పెళ్ళిళ్ళు చేసికొనే వారు పెళ్ళిళ్ళు మానివేయటమో, లేక పెళ్ళిళ్ళు దొంగతనంగా చేసికోవటమో చేయసాగేరు.

ప్రస్తుత నవలా కథానాయకుడు స్ఫురద్రూపి, కొంత చదువుకొన్నవాడు. ఈతడు మదరాసుకు పోయి, కొందఱు వర్తకుల వద్ద, న్యాయవాదుల వద్ద పని నేర్చికొన్నాడు. ఆంగ్లేయుల ప్రాబల్యం, వారు విధించే పన్నుల కారణంగా దేశంలో ప్రజలు పడుతున్న కష్టాలను తెలిసికొని వారి సమస్యలను తీర్చటానికీతడు నడుం బిగిస్తాడు. అయితే ఆ కాలంలోనే దేశంలో ప్రళయనాయుడనే అజ్ఞాతవ్యక్తి ఆంగ్లేయుల క్రౌర్యానికి బలైపోయిన వారి పక్షం వహించి, ఆంగ్లేయాధికారులని, అందులో పాత్ర వహించిన వారిని శిక్షిస్తూ ఉంటాడు. ఈ ప్రళయనాయుడెవరో తెలియని నాటి అధికారులు మాటు వేసి, ప్రళయనాయుని ఆకారానికి సరిపోయే ఒక రత్నాలవ్యాపారిని బంధిస్తారు. బంధితుడైన ప్రళయనాయుడు అసలు ప్రళయనాయుడు కాడని ప్రమాణాలతో నిరూపిస్తాడు వీరాస్వామి.

'నేటివ్ అసోసియేషన్' స్థాపకుడైన గాజులలక్ష్మీనరసు సెట్టి వద్ద వీరాస్వామి పనిచేస్తూ నాడు ప్రజలను పాఠకుడు గుర్తించేట్లు భావగర్భితంగా సూచిస్తారు. అమితంగా బాధిస్తున్న 'మోతర్ఫా' పన్నును రద్దు చేయటంలో ప్రముఖ పాత్ర వహిస్తాడు. ఆంగ్లేయుల ఆగడాలను అరికట్టి ప్రజలందఱి హృదయాలలో స్థానం సంపాదించుకొన్న వీరాస్వామే ప్రళయనాయుడు. అయితే రచయిత ఈ విషయాన్ని నవలలో ఎక్కడా వాచ్యం చేయరు. వీరాస్వామి కృషి ఫలితంగా 1854లో చెన్న పట్టణంలో మోతర్ఫా పన్ను శాశ్వతంగా రద్దైపోయింది. ఆంగ్లేయుల పాలనలో పన్నుల కారణంగా పాలిత ప్రజలు ముఖ్యంగా వివిధ వృత్తులవారు నానా ఇక్కట్లకు గుఱౌతూ ఉండగా ఒక అజ్ఞాతవ్యక్తి వచ్చి వీరి కష్టాలు తీర్చటంతో ప్రజలలో ఒక చైతన్యం కలగటంతో కథ సుఖాంత మౌతుంది.

ఆంగ్ల సాహిత్యంలో రాబిన్ హుడ్ కథ చాలా ప్రసిద్ధి వహించింది. ఈ కథ ఆధారంగా ఎన్నో చలనచిత్రాలు కూడా తీయటం జరిగింది. 'ప్రళయనాయుడు' కథకు చారిత్రకాధారం ఏమైనప్పటికీ ఆ పాత్ర చిత్రణకు రాబిన్ హుడ్ ఆధారమని ఊహించవచ్చు. అయితే ఇదే కథాంశంతో 1980, 90 లలో వచ్చినవే హిందీలో 'జుగ్ను', తెలుగులో 'కొండవీటి దొంగ', 'ఆజాద్ ' అనే చలన చిత్రాలు అన్న విషయం గమనార్హం.

వీరపూజ :

ఇక రెండవ నవల విషయానికి వస్తే కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు తురుష్కుల చేతిలో బంధితుడై చెఱసాలలో మరణించిన అనంతరం దేశం తురుష్కుల పరమైన తరువాత ఆంధ్రదేశానికి రాజన్నవాడే లేకపోయాడు. 'ఘయాజుద్దీన్ తుగ్లక్' కుమారుడైన 'ఉలూఘ్ ఖాన్' ఆంధ్రదేశాన్ని ఆక్రమించుకొన్నప్పటికీ దేశానికి రాజును నియమించక సైనికపాలనను విధించాడు. ఇంతకీ ఈ ఉలూఘ్ ఖాన్ మఱెవరో కారు. 'పిచ్చితుగ్లక్' గా భారత దేశ చరిత్రలో ప్రసిద్ధి చెందిన 'మహమ్మద్ బీన్ తుగ్లక్'. దేశం సైనిక పరమైపోయిన తరువాత పాలితుల పట్ల వారు చేసే ఆగడాలకు మితి లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో దేశాన్ని స్వాతంత్ర్యదిశగా మళ్ళించేందుకు ఎన్నో ప్రయత్నాలు రహస్యంగా జరుగుతున్నాయి. రాజకుటుంబం ఆపదలో ఉన్నప్పుడు, దేశంలో సుభిక్షత లోపించి, అతివృష్టి అనావృష్టులతో సతమతమై

పోతున్నపుడు, దేశ క్షేమం భంగమయినపుడు కొందఱు దేశ క్షేమాన్ని కోరి తమ్ము తాము బలినిచ్చుకొనేవారు. ఈ ప్రక్రియ పేరే 'వీరపూజ'. ఇటువంటి ఒక అరుదైన సంప్రదాయాన్ని తెలియజేసే నవలే 'వీరపూజ'.

పర్వతయ్య అనే వ్యక్తి ఈ వీరపూజ చేయ సంకల్పించి ఇరువది దినాలుగా ఉపవాసం చేస్తుండగా ప్రోలయ నాయుడు పర్వతయ్యను వీరపూజనుండి విరమింప జేసి, సంవత్సరంలోపే దేశానికి స్వాతంత్యం తీసికొని వస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ ప్రయత్నంలో ప్రోలయనాయునికి అండదండై నిలచినవాడు భీమన్న. వీరిద్దఱు ప్రజలలో స్వతంత్రాభిలాషను రేకెత్తించ్చటంలో ప్రధానపాత్ర పోషించారు.

ఈ 'వీరపూజ' ప్రధానంగా కాకతీయుల పాలనా కాలంలో ఆంధ్రదేశంలో ప్రచలితంగా ఉన్న ఒక ఆచారం. "ఆనాడాంధ్ర దేశములో 'వీరపూజ' యను నొక యాచార ముండెడిది. రాజకుటుంబములాపదలో నుండిన గాని, గ్రామములకు అరిష్టములు ప్రాప్తించిన గాని, దేశ క్షేమము భంగమైనపుడు గాని కొందరు పురుషులు తమ్ము దాము బలిగా నిచ్చుచుండెడివారు. దేశములో నున్న మహావీరు లైన యువకులు శౌర్యావేశమును పొంది, వీరకంకణము కట్టుకొనుటకు, కొందఱు వీరపూజ చేసెడివారు. అనగా తాము చచ్చిపోయిన తరువాత తమ నెత్తురు ముట్టుకొని, యే యాపద నివారించుటకీ వీరుడు చచ్చిపోయెనో, యా యాపద నేను నివారింతునని, నివారించుటకు ప్రయత్నము చేయుదునని, యొక వీరయువకుడు ప్రతిజ్ఞ చేయును. అతనిని తక్కిన వారందరనుసరింతురు. ఇది యాచారము." అని విశ్వనాథ నవలారంభంలో ఈ వీరపూజ లోని అంతరార్థాన్ని వివరించారు.

అతివృష్టి వలన పంటలు పాడైనా, అనావృష్టి వలన పంటలు పండక పోయినా వీరపూజ చేస్తే ఆ వ్యక్తి యొక్క ఆత్మశక్తి కారణంగా ప్రకృతిలో ఎగుడుదిగుళ్లు సర్దు కొంటాయి. ఇది కూడా ఒక విధమైన వీరపూజే. ఇది మొదట విధమనుకొంటే పైన వివరించినది రెండవ విధమన్న మాట. ఇందులో "మొదటిరకమైన వీరపూజ చేత పంచభూతముల యందలి యాత్మను కదిలించుట, రెండవరకమైన వీరపూజ చేత మానవుల యందున్న యాత్మలను కదిలించుట" అంటారు రచయిత.

ఈ వీరపూజలోని సాధ్యాసాధ్యాలను గూర్చి రచయిత ఇలా వివరిస్తున్నారు. లోకంలో జరిగే ప్రతివిషయం మంచిచెడు అనే వివక్ష లేక ఆత్మశక్తి వలననే జరుగు తున్నాయి. జ్ఞరుగుతాయి కూడా. ఆత్మశక్తితో పనిచేయాలని అనుకోవటమే సంకల్పం, అంతేకాదు ఫలితం లేని సంకల్పం ఉండదంటారు విశ్వనాథ. కొన్ని కొన్ని సంకల్పాల ఫలితాలు మనకు కనిపించ్చనిచోట, మనకు తెలియనిచోట ఫలించ్చవచ్చు. "అనావృష్టి కలిగినపుడు వీరపూజ చేసినచో ఆ వీరపూజ చేసినవాని యొక్క ఆత్మబలము చేత , గాలిలో నాకాశములో కదలికలు పుట్టి వానలు కురిసి తీరును. అనాడట్లు కురిసిడెవి."

ఒక్కొక్కప్పుడు కొన్ని కొన్ని ప్రయత్నాలకు అడ్డంకులు కలిగి ఫలితం కనిపించ్చక పోవచ్చు. కళ్ళెదుట ఉన్న ప్రపంచం కనుక ఇక్కడ అడ్డంకులు కనిపించ్చటానికి అవకాశముంది. కనిపించ్చని జగత్తులో "ప్రయత్నమే కనిపించును. ఫలితము కనిపించదు. .....కనిపించని జగత్తులో జరి గెడి మార్పులు కనిపించవు." ఫలితం లేకుండ సంకల్పం ఉండదు కనుక ఆ సంకల్పానికి మనకు తెలియని చోట, కనిపించ్చని చోట ఫలితం పుడుతుంది. దేశాన్ని అతివృష్టి అనావృష్టులు పీడిస్తున్నపుడు "వీరపూజ' చేయగా చేసినవాని ఆత్మబలం లేక సంకల్ప బలం కారణంగా గాలిలో మార్పులు చోటు చేసికొని ఫలితం కనిపిస్తోంది. ఇక్కడ ప్రధానంగా పనిచేసేది సంకల్ప బలమే అంటారు రచయిత.

నవలలో పర్వతయ్య రెండవవిధమైన వీరపూజ చేయ సంకల్పించాడు. వీరపూజ చేసే వ్యక్తి మరణించ్చటమో, మరణించకపోవటమో దేశంలోని వీరుల మీద ఆధారపడి ఉంటుంది. ఈ సందర్భంలో వీరపూజలో పాటించే కొన్ని ఆచారాలను రచయిత ఇలా చెబుతున్నారు. "వీరపూజ

చేయు వేళకు మహావీరుడెవడైనను వచ్చి, నీవు శూలమునందు దిగబడ నక్కర లేదు. నేనీ కార్యమును సాధించెదను. నాకింతటి గడువిమ్ము. ఈ కాలములో నేను సాధించలేక పోయినచోనప్పుడు వీరపూజ చేయుము' అని ఆపినచో నతడు వీరపూజ మాని వేయును." "వీరపూజను యెవడు వారించునో వాని యంతట వాడు వచ్చి వారింప వలయును. పది మంది పోయి నీవీ పని చేయవలయునని చెప్పరాదు."

రేకపల్లి మనునూరి నాయకుల రాజధాని వీరు ప్రతాపరుద్రుని సామంతులు. ఈ రేకపల్లి మన్నీ డైన ప్రోలయనాయుడు తీర్థయాత్రలకై వెళ్లి మార్గమధ్యంలో ప్రతాపరుద్రుని మరణవార్తను, తురుష్కుల ఆగాడాలను, పర్వతయ్య వీరపూజ చేయటాన్ని విని, స్వగ్రామాన్ని చేరి పర్వతయ్య చేత వీరపూజ మాన్పించి, దేశానికి స్వాతంత్ర్యం రప్పించే బాధ్యతను తన నెత్తిన వేసికొన్నాడు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ప్రజలో చైతన్యం కలిగిం చేందుకు జానపద కళలు ఉపయోగపడినంతగా మఱే ఇతరకళలూ ఉపయోగపడలేదని చెప్పవచ్చు. హరికథలు, బుఱ్ఱకథలు, తోలుబొమ్మలాటలు ఇత్యాదికళలు, ఆయా కళలను ప్రదర్శించే వివిధ కులాలవారు స్వాతంత్య్ర సముపార్జనలో తమవంతు పాత్రను పోషించారు. దేశరక్షణలో అటువంటి కళాకారుల పాత్రను పాఠకులకు ఎఱిగించటానికి ఈ నవల రచితమైందని చెప్పవచ్చు.

"నాడు పాములవాండ్రు, దొమ్మరులు, గంగి రెడ్ల వారు, పంబలవాండ్రు, పిచ్చుకుంట వారు, నూనెగుడ్డల వాండ్రు, వారు వీరననేల బిచ్చగాండ్రందఱు తమ వినోదములలో, బిచ్చపుపాటలలో, తెలుగుజాతి తురుష్కుల కధీనమైపోయినదన్న యర్థమును, తెలుగువాండ్రు నల్లనాగులు, తలచుకొన్నచో ముంగిసను నలిపివేయుదురని ధ్వని వచ్చునట్లు పాడుచుండిరి," అంటారు విశ్వనాథ నవలాముఖంగా.

హరికథలు, బుఱ్ఱకథలు, తోలుబొమ్మలాటలు ఇత్యాదులు వినోద సాధనాలుగా ఉన్న కాలమది. దేశ ప్రజలలో చైతన్యం కలిగించ్చటానికి ఈ కళలు ఏ విధంగా ఉపయోగపడ్డాయో నవలలో చాలా వివరంగా వర్ణించారు. విశ్వనాథ. ఆనాడు ఈ కథలు ఎక్కువగా ద్విపదా చందస్సులో వ్రాయటం జరిగేది. నాడు 'నాగులమయ్య' అనే శైవ కవి ప్రోలయనాయుని ఆదేశం మేఱకు ఒక హరికథను వ్రాసేడు! ఇది ఒక జంగముని కథ. ఈ కథలో ఒక జాతివారు వేఱొక జాతిని ఆక్రమించ్చగా, ఆ జాతిని త్రోసివేయటం ఏవిధంగా జ్ఞరిగిందో వర్ణితమైంది. ఈ కథలో ఎవరూ ఎవరితోనూ మాట్లాడరు. అన్ని కార్యాలూ గుర్తులతోనే నడుస్తాయి. ఒక గుర్తు చూడగానే వీరందఱూ సమావేశమవుతారట! ఇంకొక గుర్తు చూపినపుడు రహస్యంగా ఖడ్గాలు చేస్తారట! మఱియొక గుర్తు చూపినపుడు వీరంతా అంతే రహస్యంగా కత్తిసాము నేర్చి కోవటం..... ఈ విధంగా నాడు ఒక రహస్య సైన్యమే ఏర్పడింది. ఈ కథను నాగులమయ్య తన భార్య చేత, చెల్లెలు చేత ప్రదర్శింపజేసేడు. ఈ కథలను చూచి ఉత్తేజితులైన ప్రజల నుండి వీరులు బయల్దేరేరు. మొదట్లో పదిమంది పాలాల్లో కలిసికొనేవారు. ఆ పదిమంది ఇరువదిగానూ, ఇరువది మంది వందమంది గానూ, వంద వెయ్యిగానూ రహస్య సైన్యం ఏర్పడింది. పైకి వీరందఱూ కథకులు, అంతర్గతంగా యుద్ధానికి సన్నద్ధులైన వీర సైనికులు!

"పూర్వం మనదేశపు రాజులకు నాలుగు విధాలైన సైన్యముండెడిది. రథముల సైన్యము, ఏనుగుల సైన్యము, గుఱ్ఱముల సైన్యము, కాలిబంట్ల సైన్యము. ఈ నాలుగు విధములైన సైన్యము కాక 'ఆటవిక సైన్యమ'ని ఇంకొక సైన్యముం డెడిది. ఎఱుకలు, ఏనాదులు, చెంచులు, దొమ్మరులు, పాములవాండ్రు వీరందరు ఆటవిక సైన్యము! యుద్ధసమయములందు వీరందరు శత్రురాజుల గ్రామములపై దోచుకొందురు. సైన్యము నడచుటకు మార్గములు బాగుచేయుదురు. శత్రురాజుల గోధనము నపహరింతురు."

అయితే ఈ ఆటవిక సైన్యం తెగబడి నఱుకటం తప్ప,

ఒక పద్ధతిలో క్రమశిక్షణతో, యుద్ధనీతి ననుసరించి యుద్ధం చేయటంలో ప్రవీణులు కారు. అందుచేత ప్రతిగ్రామంలో తెలుగు సైన్యంతో పాటు నలుగు రైదుగురు ఆటవికసైన్యం ఉండేట్లుగా ఏర్పాటయింది. మహమ్మదీయ సైనికుడు గుఱ్ఱం మీద పోతుండగా ఎవడో వచ్చి, గుఱ్ఱపుకాళ్ళు తెగనఱుకును. మఱొకడు వచ్చి రౌతును క్రిందకు పడద్రోయును. ఈ విధంగా తురుష్క సైన్యం ఇంచుమించు వేయిమంది నాశనంకాగా తెలుగు సైన్యం వందమంది కూడా నష్టపోలేదట! అయితే ఇంత సైన్యాన్ని వెనుకనుండి నడిపించటంలో వ్యూహమంతా ప్రోలయనాయునిది, అతని అనుయాయుడైన భీమన్నది. ఈ నవలలో ఆటవిక సైన్యం వారి శౌర్య పరాక్రమాలు, దేశానికి స్వతంత్ర్యం తీసికొని రావటంలో వారి పాత్ర అతివేలంగా వర్ణితమైంది.

అంతర్గత రహస్య సైన్యాన్ని సమీకరించి, నాడు దేశంలో ఉన్న అన్ని కులాలవారిని, అన్ని వృత్తుల వారిని ఏకత్రాటిపైకి రప్పించి, వారిని ఉత్తేజపఱచి, వారందఱినీ సైనికులుగా రూపొందించి, తురుష్కులతో యుద్ధం చేసి ప్రజావిప్లవం ద్వారానే దేశానికి స్వాతంత్యం సంపాదించి పెట్టేడు ప్రోలయనాయుడు. ఎక్కడో రేకపల్లిలో సంకల్పిత మైన వీరపూజ దేశమంతటినీ కదిలించ్చగలిగింది కనుకనే ఆంధ్రదేశానికి స్వాతంత్ర్యం లభించింది. సంకల్పమెక్కడో జరిగి, ప్రయత్నం ప్రత్యక్షంగా కన్పట్టకుండానే ఫలితం కనిపించ్చటం ఇక్కడ గమనార్హం.

ఇటీవల "అగ్నిపథ్" అనే మాట మన ప్రధాని మోడీ ముఖతః చాలా విరివిగా కనబడుతోంది. సామాన్య ప్రజానీకాన్ని యుద్ధవిద్యలలో ప్రవీణులను చేయటం, అవసరార్థం వారి సేవలను వినియోగించుకోవటం ఇందులో ప్రధానోద్దేశ్యం. వీరపూజ నవల రచించేనాటికి ఈ అగ్నిపథ్ దేశంలో లేదన్నది అందరికీ తెలిసిన విషయమే. "ఆ కాలమున పొలముదున్ను కృషికులును, నితర వృత్తులు సేయు వారును నందఱును సైనికులే! యుద్ధము వచ్చినప్పుడు కరవాలమును, డాలును గైకొని సర్వజనులు సైన్యములో చేరుదురు. స్త్రీ బాలవృద్ధులు మాత్రమే గృహములలో నుందురు. అందఱికును సైనిక శిక్షణ యుండెడిది. ప్రతిగ్రామమునందును గరిడీశాలలుండెడివి. యువకులందఱికును కత్తియుద్ధము చేతనగును. యుద్ధము లేని వేళ నెవరి వృత్తులు వారు చేసికొనుచుందురు." అయితే విశ్వనాథవారు నాడే ఈ దిశగా ఆలోచించి నవల వ్రాయటం నిజంగా ఆశ్చర్య కరమైన విషయం. కవి క్రాంతదర్శి అనటానికి ఇంతకంటే చ్తక్కని ఉదాహరణ మఱెక్కడా చూడలేమనటంలో అతిశయోక్తి ఏమాత్రమూ లేదు.

ఈ నవల రచనాకాలం 1948. గాంధీ మహాత్ముని నాయకత్వంలో దేశమంతా ఏకమై సాధించుకొన్నదే మన దేశస్వాతంత్యం. ఈ సత్యాగ్రహం స్ఫూర్తితోనే విశ్వనాథ ఈ నవల రచించారని ఊహించవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి :

1) ప్రళయనాయుడు - కళాప్రపూర్ణ, డా. విశ్వనాథ సత్యనారాయణ
2) వీరపూజ - కళాప్రపూర్ణ, డా. విశ్వనాథ సత్యనారాయణ
3) బద్దన్న సేనాని - కళాప్రపూర్ణ, డా. విశ్వనాథ సత్యనారాయణ
4) భారతీయత - శ్రీ కందుకూరి శివానందమూర్తి
5) ఆధునికాంధ్ర కవిత్వము - డా॥ సి. నారాయణ రెడ్డి సంప్రదాయములు - ప్రయోగములు

❖❖❖

దేశభక్తి - తెలుగు జాతీయోద్యమ సాహిత్యం

-వై. విజయలలిత, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హన్మకొండ.

భారతదేశ స్వాతంత్ర్యసమరంలో "దేశభక్తి"కి సంబంధించిన సాహిత్యం అన్ని భారతీయ భాషల్లో వెల్లివిరిసింది. తెలుగులో కూడా ఎంతో ప్రముఖమైన దేశభక్తి సాహిత్యం వచ్చింది. సమకాలీన కవులు ఎంతో మంది దేశభక్తి సాహిత్యమును రచించినారు.

దేశభక్తికి సంబంధించిన సాహిత్యం పాట, వచన కవిత, నవల, కథ, ఉపన్యాసం, వ్యాసం మొ॥ వివిధ ప్రక్రియల్లో దేశభక్తి కవిత్వం వచ్చింది. గురజాడ, శ్రీశ్రీ, రాయప్రోలు సుబ్బారావు, కట్టమంచి రామలింగారెడ్డి, దాశరథి మొ॥ వారు దేశభక్తికి సంబంధించిన సాహిత్యమును సృష్టించినారు. నేను పాట, గేయం, పద్యం గురించి వివరించాను.

పాట :

సాహిత్య ప్రక్రియలన్నింటికి మూలమయినది పాట. పాట మొదట మౌఖికంగా తర్వాత లిఖిత పూర్వకంగా వచ్చింది. బ్రిటీష్ వారి దౌర్జన్యాలను ఎదిరించడానికి ఊరువాడ అందరిని ఏకం చేయవలసి వచ్చింది. పాట ఎంతో చైతన్యవంతమైనది కావడం మరియు అందరిని ఆకట్టుకుంటుంది. కాబట్టి ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యవంతులను చేయడం కోసం మౌఖిక పాటను ఎన్నుకున్నారు. లయ, తాలము సంబంధం లేకుండా పాట ద్వారా ప్రజలను మేల్కొల్పించారు. తర్వాత సాహిత్య పరంగా పల్లవి, చరగాలతో రాయుక్తంగా, తోళయుక్తంగా లయబద్ధంగా పాట సాగి ప్రజలను మేల్కొల్పింది. 'పాట' శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తుంది. జనం మధ్య నుండి పుట్టిన పాట అధిక ప్రాచుర్యం పొందింది. పాట పామర, పండితులను ఆకట్టు కుంటుంది. స్వాతంత్ర్యపోరాటంలో పాట ముఖ్యమైన పాత్ర పోషించింది.

శ్రీశ్రీ, "అల్లూరి సీతారామరాజు" సినిమా కోసం దేశభక్తికి సంబంధించిన పాట వ్రాశారు.

"తెలుగు వీర లేవరా
ధీక్ష భూమి సాగరా
దేశమాత స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా"

ఈ పాట పండిత పామరులను చైతన్య పరిచింది. అల్లూరి సీతారామరాజు దేశభక్తి నిలువుటద్దము ఈ పాట. గ్రామీణ మన్నెం ప్రాంతంలో ప్రజలను చైతన్యపరచి, ఆయన అడుగుజాడలలో నడుస్తున్నట్లు చూపించింది. అప్పట్లో ఈ పాట కేవలం సినిమాకే పరిమితం కాకుండ అందరి నోట పాడుకునేటట్లు చేసింది.

గరిమెళ్ళ సత్యనారాయణ స్వాతంత్ర్యోద్యమ తొలి ప్రజాకవి గరిమిళ్ళ సత్యనారాయణ. జాతీయోద్యమంలో ప్రజలను ఉత్తేజపరచు ప్రబోధ గీతమును వ్రాశారు. వాటిని పాట రూపములో పాడుకునేవారు. గరిమెళ్ళ జాతీయోద్యమంలో పాల్గొనడం వలన ఉద్యోగం కూడా పోయింది. అయినా ఎక్కడ వెనకడుగు వేయలేదు. ప్రజా చైతన్య పాటలను, గేయాలను వ్రాశారు. గరిమెళ్ళ సత్యనారాయణ వ్రాసిన "మా కొద్దీ తెల్లదొరతనము దేవ" అనే పాట ఎంతోమందిని చైతన్యవంతులను చేసింది. జాతీయోద్యమ సమయంలో ఈ పాట ప్రజలనోట పాడించగలిగిన వాడు గరిమెళ్ళ.

పాట :

పల్లవి : మా కొద్దీ తెల్లదొరతనము దేవ, మాకొద్దీ తెల్ల దొరతనము

అను పల్లవి : మా ప్రాణాలపై పొంచి, మానాలు హరియించె ॥మా కొద్దీ॥

చరణము :

1. పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమాండీ
ఉప్పు ముట్టుకుంటే దోషమండీ
నోట మట్టికొట్టి పోతాడండీ
అయ్యో కుక్కలతో పోరాడి
కూడు తింటామండి ॥మా కొద్దీ॥

2. కోర్టులంటూ పెట్టి పార్టీలు పుట్టించి
ద్రవ్యదాహము కల్పించి నాడు
చెడ్డ యూహలు కడు పెంచినాడు
మా ఆహారముల ద్రుంచి ఆహాయనిపించినాడు
॥మా కొద్దీ॥

ఈ పాట స్వాతంత్రోద్యమంలో ప్రతి నోట మార్మో గింది. ప్రజల్లో దేశభక్తిని, బ్రిటిష్ వాళ్ళపై విద్వేషాన్ని ప్రజల్లో కలిగించింది. విభిజించి పాలించిన బ్రిటిష్ వారి కుట్రను ప్రజల భాషలో వ్రాసి ఉత్తెజ పరచిన కవి గరిమెళ్ళ సత్యనారాయణ.

తెల్లదొరతనము అంటే బ్రిటీష్ పరిపాలన. ఈ పరిపాలన మాకు ఒద్దుదేవ, మా మానాలను, ప్రాణాలను తీసే ఈ బ్రిటిష్ పరిపాలన మాకు ఒద్దు. భారతదేశంలో పంటలు పుష్కలంగా పండుకున్నా తినడానికి పట్టెడన్నదు లేదు. మా సముద్రంలో ఉండే ఉప్పు ముట్టుకొనివ్వడం లేదు. నీటికి తిండి దొరక్క, మట్టి కొట్టుకొని పోతున్నాము.

కుక్కలతో సమానంగా బ్రతుకున్నాము. మాలో ఐకమత్యము లేకుండా చేసి, పార్టీలు పెట్టించి కోర్టుల చుట్టు తిప్పుతున్నాడు. మా అహారాన్ని దోచుకుని ఆ కవిత చావమంటున్నాడు. ఇది అన్యాయం అని అడిగితే మమ్ములను కొట్టి మా నోర్లు మూయిస్తున్నాడు.ప్రజలను చైతన్యపరిచే పాట పాడవద్దంటున్నాడు. ఓ దేవా ! మాకు తెల్లదొర తనము నుండి విముక్తి కల్గించమని ఈ పాట ద్వారా భారతీయుల అభిప్రాయాన్ని, బాధను తెలిపినాడు.

గేయం :

గురజాడ అప్పారావు వ్రాసిన ''దేశభక్తి'' గేయమును రచించినాడు. ఈ గేయము ద్వారా భారతీయులందరు ఒకటిగా వుండి అన్నదమ్ములవలె, కులమతాలను తొలగించుకుని ఒక్కటిగా దేశమును ప్రేమించమన్నాడు.

''సొంతలాభం కొంత మానుకొ
పొరుగు వారికి తోడు పడివోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్''

దేశమంటే మట్టి కాదని, దేశమంటే ప్రజలని తెలియజేసినాడు.

రాయప్రోలు సుబ్బారావు: జాతీయోద్యమ సమయంలో స్ఫూర్తి దాయకమైన సాహిత్యాన్ని సృష్టించినవాడు రాయప్రోలు సుబ్బారావు.

''ఏ దేశమేగినా ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కినా ఎవ్వరే మనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము''

రాయప్రోలు వ్రాసిన ఈ గేయం నాడు దేశమంతట ప్రతిధ్వనించింది. నీవు ఏ దేశమునకు వెళ్ళినా, ఎక్కడికి వెళ్ళినా, ఎటువంటి గౌరవప్రధమైన పీఠమును అధిరోహించిన, ఎవ్వరు ఎమనుకున్న, నేను భారతీయుడిని అని గర్వముగా చెప్పుకోమన్నాడు. ఎందుకంటే భారతీయ సంస్కృతి చాలా గొప్పది దాన్ని ప్రపంచానికి తెలియజేయలన్నాడు.

''లేదురా ఎటువంటి భూదేవి యెందు
లేదురా మనవంటి ధీరులింకెందు
అపమానమేలరా అనుమానమేలర
భరత పుత్రుడనంచు భక్తిలో పాడర

ప్రపంచంలోనే ఇటువంటి దేశము, ప్రజలు ఎక్కడ లేరు. దీనిలో అవమానవడవలసిన అనుమాన పడవలసినది లేదు. నేను భారతీయుడిని అని గౌరవముగా చెప్పుకోమన్నాడు. భారతదేశము పుట్టిన ప్రతి

పౌరుడు గొప్పవాడు. ఏ జన్మలో మంచి పువ్వులతో భగవంతుని పూజించినావో - ఈ జన్మలో భారతదేశములో పుట్టినావు అని భారతదేశమును స్వర్గముతో పోల్చినాడు.

చిలుకమర్తి :

జాతీయోద్యమ సమయంలో చిలకమర్తి ప్రజలను మేల్కొలిపే పద్యాలను రచించినాడు.

"భరత ఖండంబు చక్కని పాడితావు
హిందువులు లేగదైడలై మేడ్చుచుండ
తెల్లవారలు గడుసరి గొల్లవారు
పితికుచున్నారు మూతులు బిగియగట్టి

భారతదేశములో పాడి ఆవును తల్లితో సమానముగా పూజిస్తారు. ఆవు ఇచ్చే పాల ద్వారా మనకు ఆకలి తీరుతుంది. వివిధ రూపాలలో వాటిని వాడుకుంటాము. భారతదేశమును పాడి అవుతో పోల్చినాడు. దేశప్రజల దేశములో పండే తిండిని తినలేక పోతున్నారని ఆవేదన వ్యక్తపరిచినాడు తల్లి ఆవు పాల కోసం లేగదూడ ఏడుస్తూ వుంటే బ్రిటిష్ వారు లేగదూడ నోటిని కట్టివేసి పాలత్రాగ కుండ మొత్తం పాలను బ్రిటిష్ వారే త్రాగు తున్నారు. అంటే భారతీయ సంపదను ఎంత అన్యాయంగా దొచుకుంటున్నారో ఈ పద్యం ద్వారా చిలకమర్తి వారు తెలియజేసినాడు.

సమన్వయం :

స్వాతంత్ర్యపోరాటంలో దేశప్రజలతో ఐక్యమత్యముతో బ్రిటీష్ పరిపాలనను వ్యతిరేకించారు. జాతీయస్ఫూర్తి పోరాటయోధులు, సాహిత్యకారులు, కళాకారులు వివిధ ప్రక్రియల్లో దేశప్రజలను చైతన్యవంతులను చేశారు. జాతీయోద్యమ పోరాటంలో సాహిత్యం ప్రముఖపాత్ర పోషించింది. తెలుగు సాహిత్యంలో దేశభక్తికి సంబంధించి వివిధ ప్రక్రియలు రూపుదిద్దుకున్నాయి. పాట, గేయం మరింత చైతన్యపరచడం జరిగింది. ఇవి పండిత, పామర జనులను ప్రభావితం చేసినాయి. జాతీయోద్యమ పోరాటంలో పాట సాహిత్య కారులు వ్రాసిన గేయం సమాజంలో ఎంత చైతన్యాన్ని తీసుకువచ్చాయి. జాతీయోద్యమ సాహిత్యంలో భాగంగా నవల, కథా, వచన కవిత్వం మొ॥ ప్రక్రియలు విరివిగా, వచ్చాయి. ముఖ్యంగా జాతీయోద్యమ స్ఫూర్తితో ఇచ్చిన ఉపన్యాసాలు ప్రజలను చైతన్యపరిచాయి. ఈ సాహిత్యం పత్రికల్లో కూడా వచ్చింది. విద్యావంతులైనవారు పత్రికలు చదివి స్ఫూర్తిని పొందినారు.

ఆధార గ్రంథాలు :

1. డా॥ ద్యా.నా. శాస్త్రీ- తెలుగు సాహిత్య చరిత్ర
2. గురజాడ - ముత్యాలసారాలు
3. డా॥ జి.నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష భాగము- 2

❖❖❖

తెలుగు సాహిత్యంలో దేశభక్తి

- డా॥. బ్రుక్మాకందరెడ్డి, అతిథి ఉపన్యాసకులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

మేలుకొనుమీ భరతపుత్రుడ
మేలుకొనుమీ సుజనపుత్రుడ
మేలుకొనుమీ సచ్చరిత్రుడ
మేలుకొనవయ్యా! వత్సా! మేలుకో
(మేలుకొలుపు, అజ్ఞాత కర్తృత్వం)

సాహిత్యమంటేనే సమాజానికి హితాన్ని చేకూర్చేది అని అందరికీ తెలిసిన విషయమే. కాకపోతే సాహిత్యంలో దేశభక్తి అన్నప్పుడు ఏ శివాజీనో, రాణాప్రతాపసింహుడ్నో లేక ఎవరైనా రాజునో వారిని గురించే చర్చించుకుంటాం. దాదాపు 150 సం॥లు మనల్ని బానిసలుగా చేసుకొన్న ఆంగ్లేయులపై ప్రత్యక్షంగా దాడి చేయలేకపోయారా!? మన సాహిత్యకారులు అనే సంశయం మనకు కలుగుతుంది. ఒకళ్ళో ఇద్దరో తమ కలాలను కదిలించినప్పటికీ పాళీలు విరిగిన కలాల్లా వారు మారిపోయారు. కారణం వారిని ఏదో ఒక రూపాన భయపెట్టడమో లేదా ఇంకేదైనా చేయడవలననో...

తెలుగు సాహిత్యంలో దేశభక్తిని పాదుకొల్పడానికి అజ్ఞాత కర్తృత్వంగా వచ్చిన 'మేలుకొలుపు' గేయం కొంతవరకు భారతీయులను మేలుకొల్పడానికి దోహదం చేసిందనే చెప్పాలి. తర్వాత్తర్వాతి కాలాలలో వచ్చిన కవులు ప్రత్యక్షంగా ఆంగ్లేయులపై పోరాడలేక తమ రచనల్లో శివాజీనో, మహారాణా ప్రతాపసింహున్నో, ప్రతాపరుద్రుణ్ణో కథానాయకునిగా చేసుకున్నారు. అతని గురించి చెప్తూ వారు మాతృదేశ రక్షణకై చేసిన పోరాటాన్ని గొప్పగా చెప్పారు. ఇలాంటివి చేయడంవల్ల చదివే వారికి చెప్పకనే దేశాభిమానమనే టానిక్‌ను అందించిన వారయ్యారు. ప్రత్యక్షంగా ఆంగ్లేయులపై పోరాడమని చెప్పకనే చెప్పారు. స్వాతంత్ర్య ఫలాలు అందిన తర్వాత కూడా తాము తెచ్చుకున్న స్వాతంత్ర్యాన్ని ఎలా కాపాడుకోవాలో కూడా చెప్పారు. తెలుగు సాహిత్యంలో దేశభక్తిని పాదుగొల్పిన కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

గడియారం వేంకటశేష శాస్త్రి తన 'శివభారతం'లో జిజియాబాయి తన కొడుకు శివాజీకి దేశాభిమానాన్ని ప్రబోధిస్తుంది. భారతదేశం పశులకాపరి లేని పశువుల మందగా తయారయ్యింది. మరీ అచ్చంగా గోగణము అన్నారు. అంటే అలమంద. అవు సాధుజీవి. సాధుజీవుల్లాంటి భారతీయులను కాపాడుకోవడానికి ఒక్క సుక్షత్రియుడు లేకపోయాడు. ఈ ముష్కరులు (అప్పటి తురుష్కులు) నుండి నీ దేశాన్ని, నీ జాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత నీపై ఉంది. కాబట్టి 'శివరాజా' నీవు ఈ భారాన్ని మోయాల్సిన అవసరం ఉంది అని సుస్పష్టంగా చెబుతుంది.

"కాపరిలేని గోగణముకైవడి భారతభూమి ధర్మర
క్షాపరులైన క్షత్రియులఁగానక, ముష్కర తస్కరాళిచే
నేపఱి, నీపయిన్ బరువులెత్తెడు నాసల వేచియుండె; బా
హాపరిణాహధూర్వహుడవై శివరాజ! భరింపు మీధరన్"

పై పద్యంలో చెప్తున్నది శివాజీ గురించే అయినప్పటికీ అది గతించిన విషయం. గతించిన విషయాన్ని ఎంత గొప్పగా చెప్పిన ఫలితం శూన్యం. కాకపోతే గతించిన విషయాలతోటి వర్తమాన విషయాలను అనుసంధానించినప్పుడు ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. శివాజీ కాలంలో భారతదేశం తురుష్కుల చేతిలో ఇబ్బందిపడితే రచయిత కాలానికి ఆంగ్లేయుల చేతుల్లో ఇబ్బందులు పడుతోంది. భారతజాతి పరిస్థితీ దొందూ దొందే. అప్పుడు జిజియాబాయి శివాజిని పెంచి పోషించి యుద్ధోన్ముఖుణ్ణి చేసింది. ఇక్కడ కవి నెపం శివాజీమీద వేసి భారతీయుల్ని ఆంగ్లేయుల మీదికి పోరాడటానికి సిద్ధం చేస్తున్న విషయం మనం ఆలోచిస్తే అర్థమవుతుంది.

దువ్వూరి రామిరెడ్డి గారు తన 'మాతృమందిరం' ఖండికలో ఆంగ్లేయుల కాలంనాటి మనుషుల స్వభావాన్ని చక్కగా చిత్రించారు. అందరూ మనుషులే. వాళ్ళకు మనసు కూడా ఉంటుంది. కానీ తెగింపు ఉండదు. నాటకంలో అంకాలు లాగా ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు లాగా ఒక్కొక్కరిగా పరిచయం చేస్తూ వారి మనస్తత్వాన్ని చెపుతారు. అందులో కొండకొమ్మును చేరుకోవాలి. అంటే ఫలితాన్ని సాధించుకోవాలి. ప్రయత్నించిన వారు తమచేత కాదని కొండకొమ్మను చేరలేమని వెనక్కు మరలుతారు. చిట్టచివరి యాత్రికుడు 'తగ్గేదేలే' అని ముందుకు నడుస్తాడు. ఈ ఖండిక 1921-25 మధ్య కాలంలోనిది. కవి ఎక్కడ కూడా ఆంగ్లేయులన్న పదం వాడలేదు. కానీ అంతరార్థం మాత్రం వారి గురించే సూచిస్తుంది. చివరి యాత్రికుడు ఇలా అంటాడు తన తోటివారితో

"కఠినంపు విధి; దైవఘటితంబు నదియు
స్వాతంత్ర్య రథమెక్కి సంసిద్ధుడనగ
మునుకొంటి; గుఱ్ఱాల పూనింతు నిపుడె
విజయాపజయములు విధిమూలకముల"

(05.10.1922)

తాను ఈ రచన చేసిన కాలానికి చాలామంది స్వాతంత్ర్య సిద్ధికోసం పోరాడారు. గాంధీ వచ్చిన తర్వాత వాటి రూపురేఖలు మారిపోయాయి. ఈ చివరి యాత్రికుడు బహుశా గాంధీజీ కాబోలు.

అలాగే తన 'సమరతృష్ణ' ఖండికలో కవులంతా ఏకం కావాలంటాడు. తాము చేసే రచనలద్వారా తమ కలాల పదునును చూపించాలంటాడు. ఒకరకంగా సామ్రాజ్య నేతలను ధిక్కరిస్తాడు. వారు చేస్తున్న పనులను చూచి హూంకరిస్తాడు. 'నానాజాతి సమితి'ని తూలనాడతాడు. ఆంగ్లేయులలాంటి పెద్దమనుషుల చేతల్లో ఇవి కీలు బొమ్మల్లాంటివని చెప్తాడు. నా చిరకాల స్వప్నము 'ఖండాంతరాలలో ఆంగ్లేయుల కపటనాటకాన్ని తేటతెల్లం చెయ్యడానికి ప్రపంచంలోని కవులందరూ ఒక్కటి కావాలి' అని అంటాడు.

ఖండాంతరంబుల కపటనాటకము,
కాలమెప్పటికైన కనికరము లేక
నీ ముసుంగును జీల్చి నిజమూర్తి చూపు
భావిసంగర ముష్టిపట్టు పడనీక
జగతిని కాపాడ సకల దేశముల
కవి మహాశయులొక్క కట్టుగావలయు
ఇదియె నా స్వప్నంబు; నిదియె నాయాశ.

(25.10.1922)

అట్లే తన 'ప్రబోధ శంఖము' ఖండికలో ఓ భారత వీరకుమారా! ఎందుకు డీలాపడతావు. ఎందుకు ముఖం మాడ్చుకుంటున్నావు. తెల్లచర్మము నీకు లేదని, బలమైన నరాలలో నెత్తురు పాఱలేదన్న భయం నీకెందుకు. ఒక్కసారి భారతీయుడినని గర్వంగా మనసులో తలచుకోచాలు. నీ తలపైకెత్తి ఒక్కసారి ఈ లోకాన్ని చూడు నీకు లెక్కలేనంత ధైర్యం వస్తుందని భారతజాతికి ప్రబోధం చేస్తారు.

తెల్లచర్మము నీకు లేదనియో
బలమైన నాడుల
పెల్లునెత్తురు పాఱలేదనియో!
భారతీయుడననెడి గర్వమున
తలయెత్తి నిక్కి
తేఱి చూడుము సకల లోకమును.

నిరాశ, నిస్పృహలతో జీవించే మనిషిని చైతన్య పరచాలంటే నమ్మకం కలిగించే మాటలుండాలి. అవి వారి హృదయాలని కదిలించాలి. నరాలలో సత్తువ కోల్పోయి, నెమ్మదించిన రక్తం సలసలా మరిగి ఎగదన్నుకు రావాలి. అదే ఉద్బోధ. 'ధైర్యంగా ముందడుగు వేస్తేనే విజయం. డీలా పడ్డావంటే ప్రమాదం. ఓడిపోతావు' అని తన మాటలతో నిస్తేజమైన జనాన్ని ముందుకు కదిలేలా చేయడానికి తనకున్న ఆవేశాన్ని, ఆలోచనలను కవితామయంగా మనసు లోతుల్లోకి చొచ్చుకుపోయేలా చెప్పారు.

ఎంతకాలము స్వప్న సింహంబు
దడిపించు నిన్ను?

చింతసేయుము తొలగు మోహంబు
ఏలనోయీ గద్గద స్వనము? అక్రోశ గానము
చాలు చాలిక విఫల యాచనము!
వీరపూజోత్సవపు సమయమున పూరింపలెమ్ము
ఘోరభీషణ విజయశంఖమును!
ఏల తెలియక సంశయించెదవు?
భారతకుమారా,
డీలుపడి వెనుకంజ వేసెదవు. (10.03.1923)

తర్వాతి కాలంలో దేశభక్తి నగర స్థాయినుండి గ్రామాలకు పాకడంతో ఎట్టకేలకు గత్యంతరం లేకుండా ఆంగ్లేయులు స్వాతంత్ర్యం ఇచ్చారు. ఇలా కష్టార్జితమైన స్వాతంత్ర్యం మంచి ఫలాలను అందించడం లేదన్న భావన కొందరి కవులను కలిచివేసింది. ప్రజల్లో తాము ఎలాంటి బాధలనుండి, పోరాటాల నుండి దేశాన్ని కాపాడుకున్నామో మరిచిపోయే ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని కనిపెట్టారు. మళ్ళీ వారిని రగిలింప చేయడానికి తమ కలాలకు పదును పెట్టారు. అలాంటి సందర్భంలో వచ్చినవే ఆంధ్రప్రశక్తి, తెనుగు తల్లిలాంటి ఖండికలు. ఇక్కడ ప్రాంతీయతను చూపించినప్పటికీ అది వారు నివశిస్తున్న దేశంలోని అంతర్భాగాలు. శానిదే. కాబట్టి ప్రాంతీయత్వానికి తావులేదు. ప్రాంతాలు కలిస్తేనే దేశం. జాతులన్నీ కలిసుంటేనే దేశం. ఇలాంటి సందర్భంలో 'కరుణశ్రీ' ప్రజలను మేల్కొల్పడానికి చెప్పిన పద్యం చూడండి.

''కనిపింపదే నేడు కాకతీయ ప్రాజ్య సామ్రాజ్య జాతీయ జయపతాక
వినిపింపదే నేడు, విద్యానగర రాజసభలోని విజయ దుందుభుల మ్రోత
చెలగదే నేడు, బొబ్బిలికోట బురుజుపై తాండ్ర పాపయ తళత్తలలబాకు
నిప్పచ్చరంబయ్యనే నేడు - వీరపల్నాటి యోధుల సింహనాదలక్ష్మి
చెక్కు చెదరని - యేనాడు మొక్కవోని
ఆంధ్రపౌరుషమిప్పుడధ్వాన్నమయ్య
మరలనొకమాట వెనుకకు మరలిచూచి
దిద్దుకోవమ్మ! బిడ్డల తెనుగుతల్లి'' - కరుణశ్రీ, తెనుగుతల్లి, ఖండిక

ఇన్ని రకాలుగా కవులు ప్రజల్ని జాగృతం చేస్తున్నారంటే వారికున్న దేశభక్తి అలాంటిది. తాము చెప్పదలచుకున్న విషయాలు సూటిగా తగలాలి. ప్రజల్లో దేశభక్తి భావాలు అణువణువుగా నిండిపోవాల. తద్వారా జాతీయతా భావాలు పాదుకొల్పుకొని స్వాతంత్ర్యాన్ని సాధించి కాపాడుకోవాలి అన్నదే వీరి ఆశయం. సాహిత్యానికున్న మహదాశయం కూడా ఇదే.

ఆధార గ్రంథాలు :

1. రామిరెడ్డి, దువ్వూరి, కవికోకిల గ్రంథావళి, నెల్లూరు. దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి, 1996.

❖❖❖

తెలుగు సాహిత్యంలో దేశభక్తి - పరిశీలన

- డా॥. తోరీష్ కుమార్ శ్రీధం, సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్ల, జగిత్యాల జిల్లా, తెలంగాణ.

సమాజం, సాహిత్యము పరస్పర ప్రభావితాలు కొంతమేర, సార్వకాలీన సత్యాలు, నీతి కథలు, కొన్ని కల్పనలు వంటి వాటిని, మినహాయిస్తే సమాజం రచ యితల మీద చూపే ప్రభావమే సాహిత్యంగా రూపాం తరం చెందుతుంది.

'దేశభక్తి' అనేది సార్వకాలీనమే సందేహం లేదు. కానీ సాహిత్యంలో విరివిగా వచ్చిన సందర్భం మాత్రం జాతీయోద్యమ కాలమే. తెలుగు సాహిత్యంలో జాతీ యోద్యమ కాలంలో దేశభక్తి కవిత్వం గురించి స్థూలంగా ఈ వ్యాసంలో వివరించే ప్రయత్నం చేస్తాను.

దేశభక్తి :

''మానవుడు అడవుల్లో, కొండ గుహల్లో జీవిస్తూ సాంఘిక వ్యవస్థ ఏర్పరచుకొన్నప్పటి నుండి అతనిలో స్వజాత్యభిమానము, స్వభాషాభిమానము ఏర్పడినవి. జాతులు, మతాలు, ప్రభుత్వాలు, దేశాలు వేరైన కొలదీ జాతీయత, దేశభక్తి అధికమైనవి. (1)

''దేశమంటే జీవిస్తున్న మనుష్యులు మాత్రమే కాదు. భూత భవిష్యత్ వర్తమానాల్లో మానవ మనుగడకి కారణమైన ప్రకృతి మరియు వారి తాత్వికత, కళాత్మకత, సాంస్కృతికత వీటిపై అభిమానంతో దేశభక్తి పెరుగు తుంది.'' (2)

''దేశభక్తి ప్రతి జాతికీ ఒక నిసర్గమైన భావన అనువణునా నిండి అవసరమైనప్పుడు ప్రజ్వలించే భావన'' (3)

దేశభక్తి పదం ఇంగ్లీషులో Patriotism అనే పదానికి సమానార్థకంగా వాడుతున్నాము. Patriotism అనే పదం Partia అనే గ్రీకు పదం నుండి వచ్చింది. Patris అంటే Father-land ''పితృభూమి'' అని అర్థం. ప్రస్తుతం మనం దీనినే జన్మభూమి అనే అర్థంలో వాడుతున్నాం.

''జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గర్ష్మీయసి'' అని సాక్షాత్తు శ్రీరాముని చేతనే వాల్మీకి చెప్పించినాడు. అంటే దేశం పట్ల జన్మభూమి ఉన్న అపారమైన అభిమానమే కదా!


లక్షణాలు :

దేశభక్తి కవిత్వానికి మద్దూరి సుబ్బారెడ్డి గారు తన ''సాహిత్య వివేచన'' లో కొన్ని లక్షణాలను ఇలా చెప్పారు.

1. పాలిత దేశం పాలక దేశాన్ని నిందించడం (ఉదా॥ భారత్ బ్రిటిష్ వారిని నిందించుట)
2. శాంతంలో దేశ హితాన్ని కాంక్షించుట
3. స్వదేశీ అభిమానాన్ని పెంపొందిచేలా-తమ సంస్కృతీ సాంప్రదాయాలను, ఆచారాలను గౌరవించేలా చేయుట.
4. గత వైభవ స్మరణ
5. వీరుల స్తుతి
6. వర్తమాన ఉద్యమ నాయకులకు ప్రశంస
7. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల సమగ్ర రూపాన్ని వివరిం చుట.

ఆచార్య సి. నారాయణరెడ్డి గారు తెలుగులో దేశభక్తి కవిత్వాన్ని రెండు విధాలుగా పేర్కొన్నారు.

1. భారత జాతీయాభిమానానికి సంబంధించినది.
2. ఆంధ్ర దేశమునకు సంబంధించినది.



భారతీయాత్మలో జన్మభూమి పట్ల అభిమానం అంతర్లీనంగా ఉంటూనే ఉంది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో కూడా దీనిని పరిశీలించవచ్చు. నన్నయ భారతంలో గోదావరిని వర్ణిస్తే, శ్రీనాథుడు ద్రాక్షారామాన్ని,

"అచ్చమగు భోగ మోక్షము లిచ్చోటం దొరకు కరతలామలకముగన్" అంటూ పొగిడినాడు.

శ్రీకృష్ణదేవరాయలు చెప్పిన "దేశభాషలందు తెలుగు లెస్స" సుజన విదితమే కదా!

ఆధునిక సాహిత్యం - జాతీయోద్యమ కవిత్వం :

పందొమ్మిదవ శతాబ్దపు ఉత్తరార్ధాన్ని సాంస్కృతిక పునరజ్జీవన కాలంగా చెప్పవచ్చు. ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన 19వ శతాబ్దం చివర్లో తెలుగునాట పాశ్చాత్య సాహితీ ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. 20వ శతాబ్దపు తొలినాళ్ళలో 1905 లో జరిగిన వందేమాతర ఉద్యమ ప్రభావం తెలుగు సాహితీ ధురీణులపై పడింది. దాని ఫలితంగా తెలుగు నేలలో జాతీయోద్యమ కాంక్ష బలపడి తత్సంబంధిత రచనలు విరివిగా వచ్చాయి.

1905లో జరిగిన బెంగాల్ విభజన స్వరాజ్య ఉద్యమానికి నాంది అయింది. 'వందేమాతరం' జాతీయ నినాదం అయింది. వందేమాతర ఉద్యమం దేశమంతా విస్తరిస్తున్న క్రమంలోనే 1907 ఏప్రిల్ 19 నుండి ఏప్రిల్ 24 వరకు రాజమండ్రిలో బిపిన్ చంద్రపాల్ చేసిన ఉద్వేగభరిత ఉపన్యాసాలు ఇక్కడి ప్రజలను ఉత్తేజితుల్ని చేశాయి.

ఆ క్రమంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు అశువుగా చెప్పిన

"భరత ఖండంబు చక్కని పాడియావు హిందువులు లేగ దూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడసరి గొల్లవారు పితుకుచున్నారు మూతులు బిగియబట్టి"

అన్న పద్యం జాతీయోద్యమ రచనల్లో మొదటిదని సినారె గారు పేర్కొన్నారు. (4)

1907లో లాలా లజపతిరాయ్‌ని బంధించి బర్మాకి పంపించినందుకు సరసనగా

"భరత ఖండంబె యొక పెద్ద బందిఖానా
ఇందులో ఉన్న ఖయిదీలు హిందుజనులు"...

అంటూ చిలకమర్తి గారే ధిక్కార స్వరాన్ని వినిపించ గలిగారు.

గురజాడ అప్పారావు గారి "దేశమంటే మట్టికాదోయ్ - దేశమంటే మనుషులోయ్" వంటి చైతన్య పూరిత కవిత్వాన్నీ, "ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్" అని చెప్పే ప్రబోధాలు జాతీయ భావాన్ని పెంపొందించినవే.

తెలుగులో జాతీయోద్యమ కవిత్వాన్ని ముందుకు తీసుకవెళ్లిన వారిలో మంగిపూడి వేంకటేశ్వర శర్మగారు ఒకరు. 'దేశభక్తుడే దేశ విభుడు' అని నిర్వచించారు

"పర తంత్రత సౌఖ్యహీనము పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్
పరతంత్రత బహు హేయము నరకమువలె భరత మాత, న్యాయసమేతా!

అని పరతంత్రతలోని దైన్యాన్ని వివరించారు.

ప్రచార గీతాల ద్వారా జాతీయోద్యమ వ్యాప్తిని విస్తృతం చేసిన వారిలో గరిమెళ్ల సత్యనారాయణ గారు ఒకరు. వీరు రాసిన "మాకొద్దీ తెల్ల దొరతనము" అనే పాట పాడని యువకుడు ఆ కాలంలో లేడంటే అతిశయోక్తి కాదని పెద్దల మాట.

పైన పొర్కొన్నట్లు, సినారె గారు చెప్పినట్లు తెలుగు జాతీయోద్యమ కవిత్వంలో ఆంధ్రదేశాభిమాన కవిత్వమే అధికంగా కన్పిస్తుంది. ఇలాంటి రచనలను వెలయించిన వారిలో మొదటగా చెప్పుకోవలసిన వారు రాయప్రోలు సుబ్బారావు గారు, 1913 నెల్లూర్‌లో జరిగిన ఆంధ్రసభలో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర తీర్మానము నెగ్గకపోతే, రాయప్రోలు గారు "నిండార బారు నఖండ గోదావరి దాగిన చాళుక్య నాగరికత, పల్లె పదాల జీవము నిల్చికొన్న పలినాటి వీరుల రక్తనాళ పటిమ, పాడైన పెనుకోట గోడల దీర్ఘ నిద్రలు వోవు కాకతి ప్రాభవమ్ము" ..... దుగ్గిరాల గారి కంఠంలోంచి మోగితే మధ్యాహ్నం తీర్మానం ఆమోదించారట.

గ్రంథాలయ సర్వస్వమనే పత్రిక వీరికి చేదోడయ్యింది.

"సిరులు పొంగిన జీవగడ్డయు పాలు గారిన బాగ్యసీమయి" అన్న గేయము,

"ఏదేశమేగినా, ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా -
పొగడరా నీత ల్లి భూమి భారతిని - నిలపరా నీజాతి నిండు గౌరవము"
"లేదురా ఇటువంటి భూదేవి యెందు - లేదురా మనవంటి వారు ఇంకెందు"

అని మాతృభూమిపై ప్రేమస్తు వ్యక్తీకరించారు.

తన 'ప్రబోధము' ఖండికలో

'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాడు.... (5)

అంటూ, గత వైభవ స్మరణ ద్వారా జాతీయతా భావాల్ని ఉద్దీపింపజేశారు.

"తెలుగుతల్లి" అనే మరొరక ఖండికలో

"మోటుపల్లీ తీరమున లంగరేసి ..." అంటూ గత వైభవ పునరుద్ధరణ విధిని ఉద్బోధించారు.

అస్థి పంజరాల్ని సైతం ఆడించే శక్తి దేశభక్తికి గలదని నమ్మి రచనలు చేసిన వారు దువ్వూరి రామిరెడ్డి గారు. స్వాతంత్ర్య రథము, బారతమాత వంటి పద్యాలు రచించారు. Battle of Blenhamను జ్ఞాపకం తెచ్చే కొండవీడు వంటి కథలను రాశారు. కర్షక కవిగా జనాకర్షక రచనలు వీరి సొత్తు.

"మేలుకో బారత కుమార
మేలుకోరా కరుణ ధీరా మేలుకో ....."

జాతి ప్రశంస ద్వారా జాతీయ ప్రబోధం చేసిన మహనీయులు విశ్వనాథ సత్యనారాయణ.

"ఒక నాడు గలరాంధ్ర యువకులు తూరుపు
కనుమ దుర్గముల నేలిన దినము....." (6)

అంటూ ఆంధ్ర పౌరుషాన్ని గుర్తు చేస్తూ జాతీయోద్యమంలో సైనికుల్లా పోరాడటానికి ఉన్ముఖులను చేశారు.

తెలుగు వాళ్లు బానిస బ్రతుకు భరింపలేరని, స్వాతంత్ర్య సిద్ధికై ప్రబోధించారు.

''తెలుగు నదులెల్ల ..... బ్రతుకు తెన్నువారు భరించలేరు''

వీరితో పాటు కొడాలి వెంకట సుబ్బారావు గారు మొదలగు రచయితలు కూడా జాతీయోద్యమ సాహిత్యాన్ని గత వైభవ స్మరణ పునాదులపై నడిపించారు.

తెలంగాణలో పుట్టి పెరిగి తెలంగాణా ఉద్యమంతో మమేకమైన స్వరం దాశరథిది. తెలంగాణా ఉద్యమ కాంక్షలోనే జాతీయోద్యమ స్ఫూర్తి ప్రస్ఫుటంగా వినిపించేలా వీరి రచనలు కొనసాగాయి.

నను గనిపెంచినట్టి కరుణామయి నా తెలంగాణ, నీ గృహం
గణ వనసీమలో బరుమకంప నాటిన మా నిజామురాజును నీడ ద్రోసినట్టి రణశూరులు పెచ్చని కృత దీపమాలికలు మాదిరి నీకు వెలుంగులిచ్చెడిన్''

ఆచార్య ఖండవల్లి లక్షీరంజనం గారు ''దాశరథి దేశభక్తి సాయంకాలపు నీడ వంటిది. అది క్రమాభివృద్ధి పొందినది. ఈయన మహాంధ్ర సందర్శనము నిండార విరిసిన పుండరీకము'' అని చెప్పినట్లు ''దాశరథి కవిత - ఒక పరిశీలన'' గ్రంథంలో శ్రీమతి ఏ. రమాదేవి గారు పేర్కొన్నారు. దాశరథి కవిత్వంలో దేశాభిమాన పూరితమైన భావవేశం ఉంది. మహాంధ్రోదయంలో దేశభక్తి, జాతీయతా భావం కట్టలు తెంచుకొని ప్రవహించింది.

జాతీయోద్యమ సాహిత్యంలో బలిజెపల్లి లక్ష్మీకాంతం గారి ''స్వరాజ్య సమస్య'' అన్న పద్యాల పుస్తకము చదివి తీరాలి. అలాగే ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ గారి ''రసపుత్ర విజయము'' మంచి పద్యరచన.

జాషువ గారి నీ॥ నగర మాంధాత్రాది షట్చక్రవర్తుల..... మాతలకు మాత సకల సంపత్సమేత !!

పద్యమొక్కటి చాలదా! జాతీయోద్యమంలో భారత మాతను తెలుగువారు ఎంత హుందాగా, అందంగా, హృద్యంగా వర్ణించారో తెలియజేయుటకు.

ఓలేటి నారాయణమూర్తి గారి 'దుర్గాదాసు', గరిమెళ్ల గారి రచనలు దేశభక్తిని నూరిపోసేవే.

''అది తటాకమా - కాదాంధ్రకుమార తెలుగు నెత్తుటి గడ్డ దెరలినదుమ్ము'' అని శేషాద్రి రమణ కవులు.

''కుక్కలు చింపిన విస్తరిగ కూలిన ఓర్గల్లు కోట కంటివే,
మక్కువ ఊపిరుండియును మూతికి మీసము గల్గనాథుడా'' అని వానమామలై వరదాచార్యులు, ఓరుగల్లు కోట దీనావస్థను వివరించడం ద్వారా ప్రాంతీయాభిమానాన్ని, అంతర్లీనంగా స్వేచ్ఛాంగానాన్ని ఆలపించారు.

దేవులపల్లి రామానుజరావు గారు ఓరుగల్లు కోటను గురించి,

''అల్లుని స్వేచ్ఛకై నెల్లూరి నెరజాణ పఠయించు నిచటనే భారతంబు'' అన్నప్పుడు తిక్కన్న జ్ఞాపకము వస్తాడు.

పన్నెండేండ్ల వయసులోనే ఆంధ్రవైభవాన్ని ఆవిష్కరించిన పుట్టపర్తి నారాయణాచార్యుల దేశభక్తి కవిత్వం అపురూపం. వారి మేఘదూతం, పెనుగొండ లక్ష్మి, సిపాయి పితూరి.. ఇలా ప్రతి రచనా ఉద్ధే భరితమే. ''గాంధీజీ మహాప్రస్థానం'' గాంధీ గారిపై వారికున్న ప్రేమకు తార్కాణం.

శ్రీనివాస సోదరుల 'ఓరుగల్లు కోట' లో మంచి పద్యాలు గలవు.

''ఆంధ్ర నాగరికత విజయపు చరిత్ర చదువుకొనిన చేతగాని తనాన్ని'' చూపి వయిజయం వైపు అడుగులు వేయమంటారు. ప్రతాపేంద్రుడు ప్రాత:స్నానము చేయుకొలను ముడుచుటకు పోయిందట... ఇలా ధ్వని ప్రధానంగా గత వైభవాన్ని గుర్తు చేశారు.

దేశాభిమానానికీ, దేశీయాభిమానికి మకుటాయమాన కవిత్వం కాళోజిది.

కన్యాకుమారి కన్నులు - రుద్రాక్షలు ఎందులకన్ని
ఉత్తర దిశలో ఉరుములు - ధనుష్కోటి టంకారము - ఏమిటి కథ?

వాయువ్యములో అరుపులు, మీనాక్షి రక్తాక్షిగా మారినదే, ఎందుకు ?

సరిహద్దును కాపాడే జై సేనా జైహింద్
లద్దాక్‌ను కాపాడే లచ్చన్నా జైహింద్
ఈశాన్యము రక్షించే ఎంకన్నా జైహింద్
ప్రాణాలకు లెక్కించని పంజాబీ జైహింద్

అరచేతిలో తల ఉన్న అస్సామీ జైహింద్ సాదోబా జైహింద్, మదోజీ జైహింద్, మల్ఖర్ జైహింద్

"ముందంజ వేయవలసిన సమయాన ఇజాలు అడ్డు పడతాయా తమ్ముడూ" అంటూ, ఈ యత్రు ఝురులతో రొదలితో సొదలతో అహంతో సిగ్గుతో బ్రదికే జనాన్ని "హిమవంతునికి ఆపదయట" పద పద మంటూ జాతీయతా భావాన్ని ముందుకు నడిపించారు కాళోజి.

చివరగా, నాటి నుండి నేటి వరకూ ప్రక్రియ పరంగా, వస్తుపరంగా, శిల్పపరంగా, వేర్వేరు వైవిధ్యాలుండవచ్చు. వస్తువు "దేశభక్తి" అయియినప్పుడు ఏ కాలమైనా ఒకే స్ఫూర్తి ఒకే ఉత్సాహం.

ఆధార గ్రంథాలు :

1. విజ్ఞాన సర్వస్వము - ఆరవ సంపుటము
2. "సాహిత్యము-జాతీయీకరణ" వ్యాసము-ఆచార్య కోవెల సుప్రసన్న.
3. సాహిత్య వివేచన - మద్దూరి సుబ్బారెడ్డి
4. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగాలు - ఆచార్య సి. నారాయణరెడ్డి
5. ఆంధ్రావళి - రాయప్రోలు సుబ్బారావు
6. ఆంధ్రప్రశస్తి - విశ్వనాథ సత్యనారాయణ

❖❖❖

అంతర్జాల సైనిక గేయాలు - విశ్లేషణ

- డా॥. కొలిపాక అరుణ, అధ్యాపకురాలు, తెలుగుశాఖ, సి.హెచ్.ఎస్.డి. సెయింట్ థెరిసా స్వయంప్రతిపత్తి, మహిళా డిగ్రీకళాశాల, ఏలూరు, ప॥గో॥జిల్లా.

దేశప్రజలంతా ధైర్యంగా, స్వేచ్ఛగా జీవించ గలుగుతున్నామంటే అది కేవలం దేశ సరిహద్దులలో కంటిపై కునుకు లేకుండా కంటికి రెప్పలా కావలి కాస్తున్న సైనికుల వల్ల మాత్రమే. వారి ప్రాణాలను పణంగా పెట్టి అనుక్షణం కాపాడుతున్న సైనికుల త్యాగాలు, ధైర్య సాహసాలు, అకుంఠిత దీక్ష, దేశభక్తి గురించి ఎంతమంది ఎన్ని విధాలుగా ఎన్నిసార్లు కొనియాడినా అది తక్కువే. కవులు, రచయితలు సైనికులను పలు పలు విధాలుగా వారి వారి రచనల్లో కీర్తించారు. కృతజ్ఞతాభి వందన ములనర్పించారు. భారత దేశపు గొప్ప ఇతిహాసాలైన రామాయణ, మహాభారతాలలో ఆయా కలాలలోని సైనిక నిర్మాణాలు, యుద్ధ రీతులు, ఆయుధాలను గురించిన వర్ణనలు ఉన్నాయి. రథ, గజ, తురగ, పదాతి దళాలు, పద్మవ్యూహం, క్రౌంచవ్యూహం మొదలైన వ్యూహాలను గూర్చిన వర్ణనలు ఉన్నాయి. చిన్న చిన్న రాజ్యాలనేలిన రాజులనుండి చక్రవర్తులవరకూ రాజ్యం కోసం, అధికారం కోసం, భూభాగాల కోసం యుద్ధాలు చేసారు, చేస్తున్నారు. భారతీయ రక్షణ దళాలు ఆర్మీ, నేవీ మరియు వైమానిక దళాలుగా వారి సేవలను అందించాయి, అందిస్తున్నాయి.

స్వాతంత్ర్యానికి ముందు భారత సైన్యం బ్రిటీషు పాలనలో మొదటి ప్రపంచ యుద్ధంలో పోరాడింది. స్వాతంత్ర్యానంతరం భారతసైన్యం కాశ్మీర్ యుద్ధం, చైనా సంఘర్షణ, భారత్ పాక్ యుద్ధాల వంటి పలు యుద్ధాలలో వారి తెగువను ప్రదర్శించి మన దేశానికి విజయాన్ని చేకూర్చారు. అలా విజయాన్ని చేకూర్చే క్రమంలో ఎంతో మంది అమరులయ్యారు. వారి చిహ్నంగా దేశ రాజధాని న్యూ ఢిల్లీలో ఇండియా గేట్ వద్ద గత 50 ఏళ్ళుగా అమర జవాన్ జ్యోతి (జాతీయ యుద్ధ స్మారక జ్యోతి) వెలుగుతూ ఉంటుంది. మన దేశంలో ప్రతీ సంవత్సరం జనవరి 15వ తేదీన జాతీయ సైనిక దినోత్సవం జరుపుకుంటున్నాము.

1962వ సంవత్సరం నుండి వివిధ యుద్ధాలలో మరణించిన యుద్ధవీరుల స్మారకంగా వారి పేర్లు, హోదాలు న్యూఢిల్లీలోని అమర్ జవాన్ జ్యోతి వద్ద చుట్టూ గోడలపై చెక్కబడ్డాయి. హిమాలయాలలో ఉన్న అతిపెద్ద మంచు ప్రాంతం సియాచిన్. గుండెలనీండా పీల్చుకోవ డానికి గాలిగానీ, త్రాగడానికి నీరు గానీ ఉండదు. ఒంటిమీద 25కిలోల బరువును మోస్తూ గస్తీ తిరుగుతూ సైనికులు మనకై కావలి కాస్తారు.

మైనస్ 30 డిగ్రీలు, మైనస్ 60 డిగ్రీల చలిలో మంచుతో ముంచుకొచ్చే ప్రమాదాలను సైతం ఎదుర్కొంటూ దేశమాత సేవలో నిమగ్నమైన సైనికులకు జోహార్లర్పిస్తూ అనేకమంది రచయితలు రాసిన గేయాలను అంతర్జాలం నుండి సేకరించి ఈ పరిశోధనాపత్రంలో విశ్లేషిస్తున్నాను.

సైనికులకు 'సలాం' గేయాలు :

"సలాం సైనికా" పాట అజయ్ మెంగని రచించగా ఆర్వీ క్రియేషన్స్ వారు చిత్రించిన ఈ పాట 'వి మ్యూజిక్ ఛానల్'లో ప్రసారమైంది.

దేశరక్షణే ధ్యేయంగ భావించి బోర్డర్‌లో కాపు కాసేవా
బ్రతుకంతా మాకై ధారబోసావా?
కన్నతల్లి కట్టుకున్న ఆలినొదిలి కష్టాలనువ్వు మోసేవా?
కన్నుల్లా దు:ఖాన్ని దాసినడిసావా? మరువలేమయా...
మంచు కొండల్లా నువ్వువడ్డతిప్పలనూ...
సూడలేమయా...
ఎన్నడూ నీ కంట జారిన కన్నీళ్ళనూ...

సలాము సైనిక...నువ్వు సాగిపో సమరాన భారత రక్షకా... ॥సలాము॥

చావు కళ్ళముందు చిందులు వేస్తూ ఉన్నా ఏమాత్రం వెనుకడుగు వెయ్యకుండా భయపడకుండా రొమ్ము విరుచుకొని ప్రతి సైనికుడొక అల్లూరి అవుతాడు. కంటి మీద కునుకు లేకుండా కష్టనష్టాలకోర్చి కాపు కాస్తాడు. కన్నతల్లి, కట్టుకున్న భార్య, బిడ్డలను వదిలి వెళ్ళిన జవాను మంచుగడ్డలనే కన్న బిడ్డలుగా భావించి ఆనందంగా దేశసేవ చేస్తాడని ముళ్ళ తోవలనే మల్లెల పడకగా భావించి దేశ సేవలో నిమగ్నమైన సైనికునికి సలాం అంటూ ఈ గేయం ద్వారా జేజేలు పలికారు.

అమరవీరుల నివాళి గేయాలు :

శత్రువులతో పోరాడి నేలకొరిగినప్పుడు అవనితల్లి ఎద మీదవాలి మూడురంగుల జెండాకేసి చూస్తూ చివరి నిమిషంలో బ్రతుకంతా చీకటి అయిపోయినా భరత మాతను తలచి "జై భారత్" అంటూ కనుమూసిన సైనికులందరికీ కన్నీటి నివాళులు అర్పిస్తూ రచయిత రాసిన గేయాలను ఈ విభాగంలో విశ్లేషిస్తున్నాను. 2019 ఫిబ్రవరి 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల 15 నిమిషాలకు జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామాజిల్లా అవంతిపూర్‌కు సమీపంలో లితిపోరా దగ్గర జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు నివాళులు అర్పిస్తూ రచయితలు రాసిన గేయాలు ఇవి. యుద్ధంలో అమరులైన సైనికులకు జోహార్లు అర్పించిన పాట ఇది.

భరతభూమి పోరులో అమరుడైన సైనికుడా
భరతమాత ముద్దు బిడ్డవు జోహార్లు జవానుడా...

తూటాలు తగిలినప్పుడు దేహం ఎంత తల్లడిల్లి ఉంటుందో కదా! నెత్తుటి మడుగుల్లో అతని ప్రాణం నేలకొరిగినప్పుడు కన్నతల్లి భరతమాత ఒడిలో ఒదిగిన ఆ నిమిషాన నవమాసాలు మోసి కనిపెంచిన అమ్మ, పొత్తిళ్ళలో ముద్దాడి మురిసిపోయిన అమ్మ అర్ధరాత్రి పీడకలగా ఒక్కసారి ఉలిక్కిపడి లేచిన ఆ భయంకర విషయాన్ని తల్లిపేగు గుర్తించి కుమిలిపోయింది అంటారు రచయిత. ఎదమీద పెట్టుకొని పెంచిన నాన్న, గారాల చెల్లి, ముద్దుల తమ్ముడు వీరందరికీ ఒక్కసారిగా గుండె పగిలింది.

దేశంకోసం ప్రాణాలిచ్చిన వీరుల్లారా...భారత సైనికులారా
ఏమిచ్చి మీ ఋణము తీర్చుకోగలమయ్య త్యాగధనులారా...
భారతరక్షకులారా జోహారులు మీకు జోహారులు
జోహారులు మీకు జోహారులు

ఈ పాట రచయిత, గాయకుడు రామకృష్ణ కందికట్ల. డి.వినోద్ కుమార్ ప్రొడ్యూసర్‌గా లలితా మ్యూజిక్ ఆధ్వర్యంలో లలితా ఆడియోస్ అండ్ వీడియోస్ ఛానల్ ద్వారా ఈ పాట ప్రసారం అయ్యింది. పుల్వామా ఉగ్రదాడిలో అసువులు బాసిన అమర వీరులకు జోహార్లు అంటూ భరతజాతి కన్నీటి నివాళులు అర్పించారు. ఏమిచ్చినా ఆ త్యాగధనుల ఋణం తీర్చుకోలేము అంటూ అణువణువునా దేశభక్తిని నింపుకొని, నిద్ర మరచి సుఖము విడిచిన జవానులను పొట్టన పెట్టుకొన్న శత్రుదేశ చర్యలను ఊరుకోమంటూ ప్రతీకారం తీర్చుకుంటామని భగ్గుమన్న భారతదేశ ఆవేదనను వ్యక్తం చేసారు.

పాకిస్తాన్ తీవ్రవాదుల కాల్పుల్లో నిజామాబాద్ జిల్లా వేలూరు మండలం కోమన్‌పల్లి గ్రామానికి చెందిన ర్యాడమహేష్ వీరమరణం పొందాడు. అతని నిస్వార్ధ మరణానికి కన్నీటి వీడ్కోలు పలుకుతూ...

అమ్మా! వీరసైనికుణ్ని గన్నవమ్మా
అమ్మా! త్యాగాల చరితను నువు గన్నవమ్మా
నేల తల్లి ఒడిలోన అమరుడై పోయెనా...
రక్షణ దళపు ర్యాడ మహేషన్న నింగినిజేరి వెలుగులు పంచెనా
॥అమ్మా॥

గంగమల్లు, రాజుబాయిల ముద్దుల బిడ్డ దేశ రక్షణ కోసం జీవితాన్ని ధారపోసిన భారత ముద్దు బిడ్డ త్యాగాల చరిత ఘనమైనదంటూ కన్నీటి నివాళులు అర్పించారు.

పెళ్ళైన కొన్నినాళ్ళకే అమరుడైన భర్తను తలచుకొని భార్య పడుతున్న బాధ, కన్నీటి వ్యధ ఎవరూ తీర్చలేనిది. నీడనిచ్చే చెట్టు నేలవాలిందని, పెళ్ళిలో కట్టిన బాసికం

బోసిపోయింది అని, ఏడు అడుగుల నడకలు నెత్తుటి మడుగులయ్యాయని, మూడుముళ్ళబంధం మూణ్ణాళ్ళ ముచ్చటయిందని, కడుపులో అతని ప్రతిరూపాన్ని చూస్తూ..."కడుపులో కణమైన నా చిన్ని తండ్రి వీరుడై ఒరిగాడు నీ కన్న తండ్రి" అని భార్య ఆవేదనను వ్యక్తం చేసిన పాట ఇది.

భరతమాతపోరులో అమరుడైన సైనికుడా
భరతమాత ముద్దు బిడ్డవు జోహార్లు జవానుడా
తూటాలు తగులంగ తల్లడిల్లే నీ దేహమూ
నెత్తుటి మడుగుల్లో నేలకొరిగే నీ ప్రాణమూ...
॥భరతమాత॥

ఇంటివద్ద తల్లిదండ్రులకు జాగ్రత్తలు చెప్పి, నెల తప్పిన ఇల్లాలికి భద్రతలు చెప్పి, దేశభద్రతే బాధ్యతని వెళ్ళిన సైనికుడు దేశసేవలో నేలకొరిగినప్పుడు అతనిని కాల్చేటి కట్టెకూడా కన్నీరు పెట్టుకుంది. మువ్వన్నెల జెండా

మురిసి అక్కున చేర్చుకుంది. సహవాసనేస్తాలందరూ సెలవిక సైనికా అంటూ సెల్యూట్ చేసారు. వీరుడా నీకింక చివరి విడ్కోలు అంటూ పాడిన పాట విన్నవారి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగేలా చేసింది. ఈ పాట అమూల్య ఆడియోస్ అండ్ వీడియోస్ ఛానెల్‌లో ప్రసారమయింది. రచయిత శివనాగులు, పాడినవారు జై శ్రీనివాస్, మ్యూజిక్ గజ్వేల్ వేణు అందించారు.

క్రియేటివ్ డ్రీమ్స్ ఛానెల్ ద్వారా ప్రసారమైన "అమరవీర భారత సైనికులారా...అందుకోండి భరతావని జోహారులు...మా జోహారులు" అంటూ సాగే ఈ పాటలో దేశసేవయే లక్ష్యంగా కర్తవ్యంగా భావించి అయిన వాళ్ళందరినీ వదిలివెళ్ళి దేశ సేవలో నిమగ్నమై నరనరాల్లో ధీరత్వాన్ని నింపుకొన్న సైనికులందరికీ జోహార్లర్పించిన పాట ఇది.

తొలిపొద్దు వెలుగుల్లో మన భారత సైనికులు కనిపిస్తున్నారంటూ ఆకునూరి దేవయ్య పాడిన పాట తెలంగాణ ఫోక్ సాంగ్ ఛానెల్‌లో ప్రసారమైంది. కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవానులకు, అమర జవానులందరికీ ఈ పాట ద్వారా జోహార్లు అర్పించారు. తూటాల వర్షంలో పులి బిడ్డల్లా గర్జించి, తిరగబడి దేశ రక్షణలో అసువులుబాసిన అమర వీరులకు కన్నీటి నివాళులు అర్పిస్తూ వారిని కన్న తల్లిదండ్రులకు పాదాభివందనములు తెలియజేసారు.

కంటికి నిదురే లేదు
ఒంటికి వణుకే లేదు
తూటాకి బెదురే లేదు
ధైర్యానికి కొదువే లేదు

అంటూ సాగిన ఈ పాట రచయిత సురేష్ కడారి, సంగీతం డేవిడ్ జి, గానం బాబ్జి, ఎన్.ఐ.వి.ఐ స్టూడియోస్ ఛానెల్‌లో ప్రసారం అయింది.

ఎమ్.ప్రసాద్ రచించిన ఈ పాట మధుప్రియ గానం చేయగా, రాజ్ కిరణ్ సంగీతం అందించారు. టి.ఎఫ్.సి.సి లైవ్ ఛానెల్‌లో ప్రసారమైన "భరతమాత బిడ్డడురా బోర్డర్‌లో ఒదిగెనురా"అంటూ జూన్ 15, 2020 తేదీన ఎముకలు కొరికే చలిలో శత్రువులతో పోరాడి మనకోసం ప్రాణాలర్పించిన తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన కల్నల్ సంతోష్ బాబుకు నివాళులు అర్పించారు. బిక్కుమళ్ళ ఉపేంద్ర, మంజుల ల ఏకైక పుత్రుడీతడు. వారి తల్లిదండ్రులకు యావత్ భారతజాతి ఋణపడి ఉంటుంది. వారి పాదాలకు వందనాలు అర్పించారు. అలాగే 1962వ సంవత్సరంలో చైనా యుద్ధంలో అసువులుబాసిన ప్రతాని కృష్ణయ్యకు జోహార్లర్పించారు.

సైనికుల జీవన చిత్రణ :

క్షణమొక జననం, క్షణమొక మరణం అనునిత్యం అదే సమరంలో ఉంటే సైనికులు యుద్ధరంగంలో అరి వీరులతో పోరాడుతూ ఉంటే సమరం ముగిసే నాటికి విజయం మనదే అంటూ ప్రతీ భారత హృదయం నినదిస్తుంది. వారి త్యాగమే జాతికి మహోదయం, దేశ రక్షణ చేయడానికి ధర్మదీక్ష బూనిన ఉక్కు గుండెలు జవానులవి అంటూ వెన్నెలకంటి రచించిన పాట రేవంత్ గానం చేయగా మాధవ పెద్ది సురేష్ సంగీతం అందించారు. శుభోదయం మీడియా ఛానెల్‌లో ప్రసారం అయ్యింది. దేశ సేవయే జీవిత పరమార్థంగా భావించి

అయినవాళ్ళను సైతం వదిలివెళ్ళి నరనరాల్లో ధీరత్వాన్ని నింపుకున్న సైనికులకు ఎంతమంది ఎన్ని రకాలుగా కృతజ్ఞతలు తెలుపుకున్నా తక్కువే.

కన్నవారిని, కట్టుకున్న ఇల్లాలిని విడిచి దేశ రక్షణలో నిమగ్నమైన వారి దేశభక్తికి గర్విస్తూ, అనుక్షణం వారిని తలచుకుంటూ వారి క్షేమానికై దేవుణ్ణి ప్రార్థిస్తూ కుటుంబీకులు కాలం వెళ్ళదీస్తూ ఉంటారు. వారి త్యాగం గురించి ఎంత చెప్పినా తక్కువే. కొత్తగా పెళ్ళయిన దంపతుల ఎడబాటు, నెలతప్పిన ఇల్లాలిని వదిలి ఉద్యోగ నిర్వహణకు వెళ్తున్న సైనికునికి వీడ్కోలు తెలుపుతూ అతను వెళ్ళిన తరువాత కడుపులో పసి రూపును చూసుకుంటూ పరి పరి విధాల భర్తను తలచుకుంటున్న 'చిన్ని' ఆవేదనను పాటగా మలచిన తీరు కంటతడి పెట్టిస్తుంది.

సిన్ని సిన్ని మావ నా సిన్నారి మావ
సిన్నబోయున్నా నన్ను సూసన్నబోమావ

రచన చొప్పారి అనిల్, గానం సత్య - యామిని, సంగీతం ప్రశాంత్ విలేజ్ స్టైక్స్ ఛానెల్‌లో ప్రసారం అయింది. పెళ్ళైన అతికొద్ది రోజులకు ఆర్మీలో ఉద్యోగం రావడంతో వెళ్ళిన సైనికుని కళ్ళలో ప్రేమ, మనసులో బాధ, గుండెల్లో దేశభక్తి మిళితమైన పాట. రాసిన వారు గణు, మ్యూజిక్ మదిన్ ఎస్.కె, గానం హనుమంత్ యాదవ్. "నేనున్నది బాడరు కాడా, నువ్వు ఎట్లున్నావో ఇంటికాడా...నేను రాలేనే నిన్ను చూడా...సచ్చిపోయినా తెలువదే జాడా" తింటున్న తిండి లోనికి పోవట్లేదని నవ వధువునే పలు మార్లు తలుచుకుంటూ ఆమె పైనే ప్రాణాలు నిలుపుకున్నానంటూ జవాను ప్రేమకు అక్షరరూపం కల్పించిన పాట ఇది.

పారే జలపాతాలన్నీ పరుగందుకున్నాయి
ఉరికే ఆ లేగ దూడలు ఉరిమురిమి చూస్తున్నాయి
ఉవ్వెత్తున మేఘాలన్నీ నన్నే కమ్మేస్తున్నాయి
నీ కోసమె తలచీ తలచీ కనులే మసకవుతున్నాయి
సిన్నీ సిన్నీదానా నా చిన్నారి మైనా - సిన్నబోవద్దంటున్నా
నీకు చేరువుగా నే రాలేకున్నా.... ॥సిన్నీ సిన్నీ॥

ఈ పాటను రచించిన వారు చొప్పారి అనిల్, గానం - సంగీతం మార్క్ ప్రశాంత్. సైనికుని దేహము, అతని ప్రాణము అతని కోసం కాదు ఈ మట్టి కోసమే. ముళ్ళ గుట్టలే అతని చుట్టాలు. కాశ్మీరమే కన్నతల్లి, ఆతని కన్న బిడ్డలను చూసి మురిసిపోవడానికిగానీ, ఆడించడానికి, ఆనందించడానికిగానీ అవకాశం లేక ఇంటి మీద రంది గుంజుతున్న గుండె బండరాయిగా చేసుకొని మంచు కొండల్లో ఎప్పుడు ఏ విధంగా చావు ముంచుకొస్తుందో తెలియని జీవితం గడుపుతున్న సైనికులకు ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేము.

"నీది గాదు నీ దేహము...నీ నిలువెల్ల ఈ దేశము" ఈ పాట రచనా - గానం అజయ్ మెంగని, సంగీతం వెంకట అజ్మీర్. "వీరుడా నీకు వందనం" రచన, గానం బి.ఎన్.రాజ్ సంగీతం వినోద్ కుమార్ బి.ఎన్.రాజ్ అఫీషియల్ ఛానెల్‌లో ప్రసారం అయింది. "ప్రవహించే నా రక్తం ప్రజలకోసమే" రచన, గానం అప్పల ప్రసాద్, సంగీతం రాజ నేషనలిస్ట్ హబ్ ఛానెల్‌లో ప్రసారం అయింది. ఇటువంటి పలు సైనిక గేయాలు అంతర్జాలంలో యూట్యూబ్ వేదికగా ప్రసారమయ్యాయి. మాతృభూమి ఋణం తీర్చుకోవడానికి మరణం అయినా ఆనందంగా భరిస్తామంటూ కాలాలతో కన్నీళ్ళతో సంబంధం లేకుండా దేశ శాంతికై ప్రాణ త్యాగం చేసిన వీరులందరికీ 'జై జవాన్', సలాం సైనికా...

ఆధారగ్రంథాలు :

1. శ్రీమదాంధ్ర మహాభారతము - తిరుమల తిరుపతి దేవస్థానములు
2. అంతర్జాలం - లలితా ఆడియోస్ అండ్ వీడియోస్ ఛానల్
3. తెలంగాణ పద (బంధ) కోశం - నలిమెల భాస్కర్

❖

రాయప్రోలు కవిత్వములో - దేశభక్తి పరిశీలన

- డా॥. ఎం. ప్రభావతి

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా ఎవ్వరే మనిన పొగడరా నీ తల్లి భూమి భారతిని నిలుపరా నీ జాతి నిండు గౌరవము" "శ్రీలు పొంగిన జీవగడ్డయి పాలు పారిన భాగ్యసీమయి వ్రాలినది ఈ భరతఖండము భక్తి పాడర తమ్ముడా వేదశాఖలు పెరిగె నిచ్చట ఆదికావ్యం బందె నిచ్చట" అంటూ భరత మాతను కీర్తిస్తూ దేశ భక్తిని పెంచే పాటను స్వతంత్ర ఉద్యమములో రచించినది నవ్య కవితా పితామహునిగా పేరుపొందిన రాయప్రోలు సుబ్బారావు గారు

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు. ఈయన 1913లో వ్రాసిన తృణకంకణముతో తెలుగు కవిత్వములో నూతన శకము ఆరంభమైనదని అంటారు. సుబ్బారావు గారు 1892 మార్చ్ 17న గుంటూరు జిల్లాలోని గార్లపాడు గ్రామములో జన్మించారు. 1908లో విద్యార్థిగా ఉండగానే అనేక కవితలు పద్యాలు వ్రాసేవారు. కాకినాడలో రఘుపతి వెంకట రత్నము నాయుడి గారి ప్రోత్సహముతో హైస్కూల్ విద్య, మెట్రిక్యులేషన్ పూర్తి చేసుకొని, ఉన్నత చదువులకు పోకుండా హైదరాబాద్ లో కొమర్రాజు లక్ష్మణ రావు గారు ప్రారంభించిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము రూపొందించటంలో సహాయ సంపాదకుడిగా చేరాడు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలి పలుమార్లు చదివి స్పందించి, శాంతినికేతన్ లో ఉండటానికి రవీంద్రుని అనుమతి తీసుకొని అక్కడికి వెళ్ళాడు. అక్కడ ఇతర కవి పండితుల సాహిత్యాన్ని అధ్యయనము చేసాడు. ఆ తరువాత కాశీ వెళ్లి సంస్కృత పండితుల వద్ద వివిధ శాస్త్రాల అధ్యయనము చేసాడు. రాయప్రోలు గొప్ప జాతీయవాది. తెలుగు జాతి అభిమాన రచయత. ఆయన దేశభక్తి గేయాలు ఎంతో ఉత్తేజకరంగా ఉంటాయి. ఈయన రచనలు ప్రధానంగా ఖండ కావ్యాలు, తృణ కంకణము, ఆంధ్రావళి, కష్టకమల, రమ్యలోకము, వనమాల, మిశ్రమంజరి, స్నేహలతా దేవి, స్వప్నకుమారము, తెలుగు తోట, మాధురీ దర్శనం, రూపనవనీయతం మొదలైనవి.

1921లో ఉస్మానియా విశ్వ విద్యాలయములో తెలుగు శాఖలో వివిధ హోదాలలో పనిచేశారు. వరంగల్లు కాలేజీ ప్రిన్సిపాల్ గాను, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయములో తెలుగు శాఖాధిపతిగా పనిచేశారు. ఆ విధముగా దాదాపు 38 సంవత్సరాలపాటు పలు విద్యాసంస్థలలో వివిధ హోదాలలో పనిచేసి 1959 లో సికింద్రాబాద్ లోని మారేడ్ పల్లి లో స్థిరపడ్డారు.నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షునిగా, ఆంధ్ర పండిత పరిషత్ అధ్యక్షునిగా, రేడియో సలహా సమితి, ఫిలిం సెన్సార్ బోర్డు ,కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యునిగా విశేష సాహితి సేవలు అందించిన వ్యక్తి రాయప్రోలు సుబ్బారావుగారు. 1965 లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది,తెలుగు సాహితి లోకములో భావ కవిత్వ యుగ కర్తగా కీర్తించబడ్డ రాయప్రోలు సుబ్బారావు గారు 1984,జూన్ 30న సికింద్రాబాద్ లో తుది శ్వాస విడిచారు. వారి రచనలు నేటి యువ రచయితలకు ఆదర్శము, మరియు నూతన స్ఫూర్తిని ఇస్తాయి.

తెలుగు సీమ సొగసును, తెలుగువారి ఆచారాలను భాష సొకుమార్యన్ని, భావ గంభీరలతో పాటు ఆంధ్ర ప్రాభవాన్ని మనోహరముగా చక్కని పదాల కూర్పుతో రమణీయముగా గానము చేసిన మహాకవి రాయప్రోలు సుబ్బారావు గారు జాతీయోద్యమ కవిత్వాన్ని పుష్కలంగా రచించిన కవి రాయప్రోలు సుబ్బారావు. "నాదు జాతి, నాదు దేశము, నాదు భాష అను అహంకార దర్శన మందు" అని ప్రబోధిస్తూ జాత్యభిమానం, దేశాభిమానం,

భాషాభిమానం ప్రతి ఒక్కరికీ నరనరాల్లో జీర్ణించుకు పోయేలా ఆయన సృజన చేశారు. ఉవ్వెత్తున ఎగసిన కెరటంలాంటి చైతన్యంతో సాగిన భారత స్వాంతం త్ర్యోద్యమంలో అదే స్ఫూర్తితో ఆంధ్రులు పోరాడారు. నిండైన దేశ భక్తి అందించిన కొత్త ఊపిరి పోసుకొని తెలుగు కవులు శంఖారావాన్ని పూరించారు. వివిధ ప్రక్రియలను వాహికలుగా చేసుకొని రచనలు చేసి ఉద్యమానికి ప్రేరకులయ్యారు. ప్రజలను దేశం కోసం పాటుపడే విధంగా తయారు చేయడం కోసం, దేశ భక్తిని నూరిపోసేందుకు కవుల కలాలు జోరుగా సాగాయి. ఉత్తమ దేశభక్తి ప్రబోధం రాయప్రోలు సుబ్బారావు రాసిన గీతాలలో అందరినోళ్లలోనూ బాగా నానిన "జన్మభూమి" గీతంలో తెలుగుదనం, జాతీయాభిమానం, గత వైభవ సంకీర్తనం, ప్రబోధం లాంటివి తొణికిసలాడుతుంటాయి. ఇప్పటికీ ఈ గీతం ఉత్తమ దేశభక్తి ప్రబోధంగా నిలి చిందనడంలో అతిశయోక్తి లేదు.

రాయప్రోలు వారి ఆంధ్రావళి కవితల్లో దేశభక్తి ఎక్కువగా కనపడుతుంది. రాయప్రోలు సుబ్బారావు గారిది మూర్తీభవించిన దేశాభిమానిగా గుర్తించవచ్చు. రాయప్రోలు వారు తమ కవితల ద్వారా ప్రజల్లో ఆంధ్ర పౌరుషాన్ని, దేశాభిమానాన్ని గత వైభవాన్ని ప్రజ్వరిల్ల చేశారు.ప్రాంతీయ దురభిమానం విడనాడి గత వైభవాన్ని స్మరించి ముక్కోటి ఆంధ్రులు ఒక దారిలో నడవాలని ఆశించారు. రాయప్రోలు వారు తెలుగు సాహిత్య సంపదను, తెలుగు సంస్కృతి వైభవాన్ని"ఆంధ్ర తెలుగు తల్లి,తెలుగు మాన్యము" మొదలైన కవితల్లో ఘనంగా కీర్తించారు. రాయప్రోలు వారి కవితల్లో దేశభక్తి కాస్త ఎక్కువగానే కనబడుతోంది. భారతదేశం ఒక రత్నగర్భ.ఒక కామధేనువు.ఒక కల్పవృక్షంతో సమానం.ఈ దేశంలో పుట్టాలంటే ఎవరైనా ఎంతో పుణ్యం చేసి ఉండాలి.అని తన "జన్మభూమి" కవితల్లో ఈ విధంగా అన్నారు.

"ఏ పూర్వ పుణ్యమో'ఏ యోగ బలమో
జనియించినాడ నీ స్వర్గ ఖండమున
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో
నిను మోసే ఈ తల్లి కనక గర్భమున. అని అన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలతో, సిరిసంపదలతో, అలరారుతున్న మన భారతదేశంలో పుట్టి అవమానం, అనుమానం ఎందులకు, మేమంతా భారతీయులమని గర్వంగా, గుండె నిర్భయంగా,ఎలుగెత్తి, గొంతెత్తి, భరతమాత గొప్పదనాన్ని పాడుకుందాం రండి అని కవి పిలుపునిచ్చాడు.

పాలముల రత్నాలు మొలిచెరా యిచట
వార్ధిలో ముత్యాలు పండేరా యిచట
పృథివి దివ్యౌషధుల్ ఎదికెరా మనకు
కానల కస్తూరి కాచెరామనకు
అవమాన మేలరా! అనుమానమేలారా!
భారతీయుడనుంచు భక్తితో పాడ!
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవమ్ము.

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలు ప్రాణాలు అర్పించిక తప్పదు. స్వాతంత్ర్య సమరాన్ని కవి యాత్రగా భావిం చాడు. స్వాతంత్రోద్యమాన్ని మహా ప్రవాహంగా కవి భావించి, స్వాతంత్ర్య వీరులను కదలిరండి తన కవితల ద్వారా ప్రజల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపిన గొప్ప దేశభక్తి కవి రాయప్రోలు సుబ్బారావు.

భారతదేశం ప్రకృతి సౌందర్యానికి, శిల్పసంపదకు, పాడి పంటలకు ప్రసిద్ధి.ఈ వైభవాన్ని కవి "పుంజ" కవితలో వర్ణించాడు. కవులు, శిల్పులు, గాయకులు కీర్తించిన భరతమాతను స్తుతించమని కవి తన కవితలో విన్న వించాడు.

"కవులు కవితా మధు వుతో జగమ్ము తడుప
శిల్పకులు వన్నెకుంచెల సృష్టి దిద్ద
గాయకులు గాత్ర రక్త రాగముల నెత్త
వ్రేలవే! తల్లి మెడను గీతాలలామ"

రాయప్రోలువారు భారతదేశపు సౌభాగ్యాన్ని వర్ణిస్తూ, తెల్లవారు దాన్ని కొల్లగొడుతుంటే కళ్లప్పగించి చూస్తూ

కూర్చుంటారా అని తన కవితల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని స్ఫురింప చేశారు.

"చిన్ని బంగారు పూసల చెట్ల వంటి
జొన్న కంకులు పండిన సొగసు చేల
ఎక్కడెక్కడ నుండియో చక్క వచ్చి
వ్రాలుచున్నవి పిట్టలు వేలు వేలు
లేచి రావమ్మా! మా తల్లి లేచి రమ్ము!"అని అభినవ కవితల్లో ఆంగ్లేయుల దోపిడీని అరికట్టాలని కవి ప్రజలకు ప్రబోధించాడు.

రాయప్రోలు వారు భావ కవిత్వం రాసినా, వాస్తవ జగత్తును ఎన్నటికీ విస్మరించలేదు. మాతృభూమి సంక్షేమం మరువలేదు.తెలుగువారికి ఎంతో ముఖ్యమైన పండుగ ఉగాది నాడు కూడా, పండుగ విశేషాలు తెలియజేయకుండా, దేశ స్వాతంత్ర్యం గురించి,దేశ భవిష్యత్తు గురించి ఈ క్రింది విధంగా తమ బాధను వ్యక్తపరిచారు.

"వీడరా నీ బాట వీడరా తమ్ముడా!
హింసతో సకలంబు ధ్వంసమగు పోరాట
కొమ్మలను చెడగొట్టి కోకిలల పడనేట్టి
మావితోటలు కూల్చి మసిచేయుటకు ముందే
అర్థతంత్రాలతో అడుగంటే సంపత్తు
రాజ్యాంగ మంత్రాల రక్తపాతమే హెచ్చె
వీడరా నీ బాట వీడరా తమ్ముడా"!అని "ఉగాది పదములో" భారతదేశపు సిరిసంపదలు హరించుకు పోతున్నాయనీ, దేశంలో హింసాకాండ ప్రబలుతున్నదన్ని, శాంతి సౌఖ్యాలు కరువయ్యాయన్నీ కవి ఆవేదన వ్యక్తం చేశాడు.భారతదేశానికి స్వతంత్రం కావాలని,ప్రజలు అందరూ సుఖసౌఖ్యాలతో జీవించాలని.అందరికీ కనీస అవసరాలైన కూడు, గుడ్డ,నీడ లభించాలని కవి ఆశించాడు.

"కాలే కడుపుకు గరిటెడు గంజీ
జారే సిగ్గుకు మూరెడు పాతా
ఎల్లరకందే చల్లని రోజులు
వెలసే విధముగా వెదకండీ!
కపటము విడిచి కృపణత నడిచీ
పగలను త్రెంచీ పాడిని పెంచీ
సుఖదుఃఖంబులు సుఖులై మెలిగే
తియ్యని త్రోవకు తిరుగండీ!" అని "తారణ" కవితలో తెలియజేశాడు.అంతే కాదు ప్రపంచంలో ఈర్ష్యాద్వేషాలు, కోపతాపాలు నశించి ఎల్లెడల శాంతి నెలకొనాలనీ, ప్రేమ రాజ్యం స్థాపించబడాలనీ కవి తన ఆకాంక్ష వ్యక్తం చేశాడు.

"నిలువున దేహము నెత్తుట జోత్తిల
సిలువ మిదబడె జీససు తానే
ప్రేమరాజ్యమును భూమి నిలుపనా
యుగాది తారణ నాదవేనా?"

భారత దేశము సకలసంపదలతో సమృద్ధి కలిగినది. ఇచ్చట జీవనదులు ప్రజలకు అమృతతుల్యమైన నీటిని ప్రసాదించుచున్నాయి. మానవాళికి సమస్త శుభాలూ చేకూర్చగలిగినదీ భరత ఖండం అని రాయప్రోలువారు ఉద్ఘాటించారు. అంతే కాకుండా రాయప్రోలు వారికి భారతదేశం పట్ల అమితమైన భక్తి శ్రద్ధలు కలవు.వారి కవితలో దేశభక్తి,రాష్ట్రభక్తి గంగాయమునల సంగమ ప్రవాహంలా అలలారుతూ ఉంటుంది.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి"అని రాయప్రోలువారు త్రికరణశుద్ధిగా నమ్మారు. కనిపించని దేవుని కంటే కనిపించే దేశమే నిత్యమనీ, సత్యమనీ కవి పలికారు.

'కలడు కలండని పలికే దేవుడు
కలడో లేడో కనబడడెవరికి
కలదు కలదు నిన్ను కన్న దేశమిది
నిత్యము సత్యము నిశ్చయమోయ్"అని ఈ విధంగా రాయప్రోలువారు ప్రజల్లో జాతీయతను ప్రబోధించి, విరపూజాగావించి దేశభక్తిని చాటారు.రాయప్రోలు వారికి తెలుగు తల్లి పట్ల ఎంత పూజ్యభావమో, భరతమాత పట్ల అంతే భక్తిశ్రద్ధలు కలవు. ఆయనకు భారత దేశం

పరమపుణ్యవతి, భుదేవత, చల్లని తల్లి.రాయప్రోలువారు బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడమని ప్రజలను ప్రేరేపించేందుకు కృత సంకల్పులయ్యారు.వారు తమ కవితా లక్ష్యాన్ని ఈ విధంగా వెల్లడించారు.'' నా లోకం బాగుపడాలని,దానికి నేను ఏదైనా ప్రయత్నం చేయాలనే సంకల్పంతోనే ''జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'' అనే బోధన నాలో సుళ్ళు తిరిగింది.తల్లి కంటే పరమామృతము లేదను నిశ్చయం పెట్టుకొని,నా దేశ ప్రజలను మేల్కొల్పడానికి నాలోని చేతన మేల్కొంది'' అని స్వయంగా చెప్పుకున్నారు.

''సూర్యుని వెలుతురుల్ సోకునందాక
ఓడల జెండాలు ఆడునందాక
నరుడు ప్రాణాలతో నడుచును నందాక
అందాక గల మా యనంత భూతలిని
మన భూమి వంటి కమ్మని భూమి లేదు''.

ఇక్కడ మన దేశమును ''కమ్మని భూమి'' అనడంలో కవికి దేశం పట్ల గల ప్రేమ తెలుస్తున్నది. మన దేశాన్ని అనంత భూతలిలో దీనికి సాటి లేదనడంలో సమస్త భూమండలంలో భారత దేశపు ఆధిక్యాన్ని, వైశిష్ట్యాన్ని కవి ఎత్తిచూపారు. ''సూర్యుని వెలుతురు ఎన్నటికీ మాయమవదు''. అది శాశ్వతమైనది.అంటే అనంతకాలం మనదేశ ప్రతిష్ట భూమిపై నిలబడగలదని కవి అభిప్రాయం.'' ఓడల జెండాలు ఆడునందాక'' సముద్రంపై ఓడలు ఉన్నంతవరకు జెండాలు ఎగురుతూనే ఉంటాయి. కాబట్టి చిరకాలం మన దేశం తలెత్తుకుని మనగలదని కవి విశ్వసించారు.'' నరుడు ప్రాణాలతో-నడుచునందాక'' మానవుడు ప్రాణాలతో బ్రతికి యున్నంత వరకు,అంటే అంతకాలం మన భూమి ఘనత నిలబడి ఉంటుందని కవి అభిప్రాయపడ్డారు.

రాయప్రోలు వారు భారతదేశం కీర్తిప్రతిష్టలు ఆచంద్రతారార్కమూ శోభిల్లగలవని కవితాత్మకంగా తెలియజేశారు.భారతదేశం దివ్య విశ్వంబుగా వెలిగిందని పుణ్య దేశంబుగా కాంతులు దశదిశలు వెదచల్లిందనీ, కవి జన్మభూమి మహనీయతను వెల్లడించారు.

ముగింపు :

రాయప్రోలు సుబ్బారావు గారి కవితలన్నింట్లో దేశభక్తి పొంగిపొర్లుతుంది. మామూలుగా ఉండే సంకుచితమైనటువంటి రాష్ట్రభిమానం కాకుండా సమగ్రమైనటువంటి జాతీయాభిమానం రాయప్రోలు వారిలో కనిపిస్తుంది. వీరి యొక్క పాటలు ఈనాడు కూడా స్వాతంత్ర దినోత్సవం రోజున ప్రజలు పాడుకుంటూ ఉంటారు. ఆనాటి నుండి ఈనాటి వరకు వీరి పాటలు పాడుతుంటే ఒళ్ళు పులకరిస్తుంది అంటే ఆ పాటల్లో ఉన్న జాతీయ ప్రభావం దేసభక్తి అటువంటిది. ఈ విధంగా రాయప్రోలు వారు తమ కవితల్లో అమితమైన దేశాభిమానాన్ని వ్యక్తీకరించారు. రాయప్రోలు కవిత జాతీయోద్యమానికి స్ఫూర్తినిచ్చింది. ప్రచార కవిత్వానికి సొంపులు తీర్చిదిద్దింది. జాతీయ జీవనంలోని చీకటి వెలుగులను, మిట్ట పల్లాలను ప్రతిబింబించింది. రాయప్రోలు సుబ్బారావు గారి కవిత్వం ఆంధ్రాభిమానానికీ దేశాభిమానానికీ జీవ కర్రగా భాసిల్లింది అని చెప్పవచ్చు. రాయప్రోలు వారు దేశ భక్తి కవితలు రాసినవి కొన్నే అయినా, అవి ప్రజలలో కలిగించిన ప్రభావం మాత్రం మహత్తరమైనవి.

ఆధార గ్రంధాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు.
2. జడకుచ్చులు-ఆంధ్రమాత - రాయప్రోలు సుబ్బారావు.
3. జన్మభూమి, తమ్ముడా - రాయప్రోలు సుబ్బారావు.
4. ఆంధ్రభూమి దినపత్రిక - 1963.
5. నా కవితా లక్ష్యము - రాయప్రోలు సుబ్బారావు.

❖❖❖

నెల్లూరి కేశవ స్వామి కథలు - దేశభక్తి

- డా॥. ఎం. శంకర్, P.G.T-Telugu, ఎక్లారా (పెద్ద), మద్నూర్ (మం), కామారెడ్డి (జిల్లా).

దేశభక్తి అన్న భావన విస్తృతమైంది. స్థూలంగా చెప్పాలంటే ఒక వ్యక్తి తాను పుట్టిన దేశం పట్ల గౌరవభావాన్ని కలిగి ఉండటాన్ని దేశభక్తిగా చెప్పవచ్చు. దేశ ప్రజలందరిలో దేశభక్తి భావన ఉన్నప్పుడే ఆదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది. ఆర్థికంగా బలపడుతుంది. భారత పౌరులందరిలో ఏకతా భావాన్ని, దేశభక్తిని కలిగించే సదుద్దేశంతో భారత ప్రభుత్వం 75 సంవత్సరాల స్వతంత్ర మహోత్సవాన్ని పురస్కరించుకొని భారతదేశమంతటా ''ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'' కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. ఈ అంశం దేశ ప్రజలందరిలో భారతదేశం పట్ల గౌరవభావాన్ని కలిగించడానికి భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

ఒక పౌరుడు తన దేశం పట్ల తనకున్న గౌరవాన్ని అనేక రకాలుగా ప్రకటించడానికి అస్కారం ఉంది. జాతీయ గీతాలాపన, జాతీయ గేయాలాపన, జాతీయ జెండాకి వందన సమర్పణ రాజ్యాంగబద్ధ దేశభక్తి ప్రకటనమార్గాలు కాగాసైనికునిగా దేశ రక్షణ, శాస్త్రవేత్తగా దేశానికి ఉపయోగపడే ప్రయోగాల నిర్వహణ, సాహితీ వేత్తగా దేశభక్తి కలిగిన సాహిత్య సృజనవైయుక్తిక దేశభక్తి ప్రకటన మార్గాలు. భారతీయ సాహితీవేత్తలు భారత స్వతంత్ర సంగ్రామ ఘట్టాలను చిత్రిస్తూ తమ రచనలను వెలువరించి భారతదేశంపై తమకున్న భక్తిని చాటు కున్నారు. దీనికి తెలుగు సాహిత్యం మినహాయింపు కాదు భారత స్వతంత్ర సంగ్రామంలో ప్రజలను చైతన్య పరుస్తూ చిలకమర్తి లక్ష్మీనరసింహం, గడి చర్ల హరి సర్వోత్తమరావు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, త్రిపురనేని రామస్వామి చౌదరివంటి అనేక మంది రచయితలు తమ రచనలని విలువరించారు.

భారత స్వతంత్ర సంగ్రామం జరుగుతున్న కాలంలో తెలంగాణ ప్రాంతం నిజాం నిరంకుశ పాలనలో కొన సాగింది. భారతదేశానికి 1947 ఆగస్టు 15నస్వాతంత్రం రాగానిజాం పాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతానికి1948 సెప్టెంబర్ 17న విముక్తి లభించింది.అంటే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా తెలంగాణ ప్రజలు ఒక సంవత్సర కాలం పాటు నిజాం నిరంకుశ పాలనలో కొనసాగాల్సి వచ్చింది. నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొంది భారతదేశంలో కలవడానికి తెలంగాణ ప్రజలు ఎటువంటి పోరాటం చేశారు? భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయ డానికి ఎటువంటి చర్యలు తీసుకుంది? నిజాం సైన్యంగా పిలువబడే రజాకార్లు తెలంగాణ ప్రజలను ఎలా దోచుకున్నారు? భారత స్వతంత్ర సంగ్రామ సమయంలో హైదరాబాద్ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు ఎలా ఉన్నాయి? వంటి అంశాలను భూమికగా స్వీకరించి నెల్లూరు కేశవ స్వామి గారు''పసిడి బొమ్మ'', ''చార్మినార్ కథలను'' రచించారు. ఈ రెండు కథా సంపుటాలలో 38 కథలు ఉన్నాయి. ఈ కథలలో భారతదేశం పట్ల నెల్లూరు కేశవ స్వామి గారికిఉన్న అభిమానం పూర్తి స్థాయిలో ప్రకటితమైన కథ 'యుగాంతం.'ఈ యుగాంతం కథ ఆధారంగా నెల్లూరు కేశవ స్వామి గారి దేశభక్తిని వివరించడం ఈ పరిశోధన పత్ర ప్రధాన ఉద్దేశం.

నెల్లూరి కేశవ స్వామి కథలు-నేపథ్యం :

తెలంగాణ తొలి తరం కథా రచయితగా పేరుపొందిన నెల్లూరు కేశవస్వామి గారు 1920వసంవత్సరంలో హైదరా బాదులో జన్మించారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన ఈయన హైదరాబాద్ సంస్థానంలో నీటిపారుదల శాఖలో ఇంజనీర్గా ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూ తన రచన

వ్యాసాంగాన్నికొనసాగించారు. "వెలుతురులో చీకటి" వీరు రచించిన ప్రసిద్ధ నవల కాగా "పసిడి బొమ్మ", "చార్మినార్ కథలు" వీరి కలం నుండి జాలువారిన కథా సంపుటాలు.

నెల్లూరి కేశవ స్వామి గారుహైదరాబాద్ నగరంతో మమేకమైన జీవనాన్ని గడిపారు. హైదరాబాద్ ప్రజల జీవన విధానాన్ని అనేక కోణాలలో తన కథల ద్వారా ప్రపంచానికి చూపించారు. కాస్మొటిక్ నగరంగా పిలవబడే హైదరాబాద్‌లో హిందూ ముస్లింల సంస్కృతి ఎలా ఉంది, భారతదేశం భారత్, పాకిస్తాన్గా విభజన చెందిన సందర్భంలో హైదరాబాద్ ప్రాంత హిందూ ముస్లింల మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయి అన్న అంశాలకు దర్పణంగా చార్మినార్ కథలు రచించారు. ముస్లిం పెళ్లి సంబంధాలు, పుత్ర సంతానం కోసం ముస్లిం స్త్రీలు పడే తపన 'వంశాంకురం' కథలో కనిపిస్తుంది. స్నేహానికి మతాల సరిహద్దులు అడ్డురావని నిరూపించే కథ 'కేవలం మనుషులం'. నమ్మక ద్రోహానికి ప్రతీక 'భరోసా' కథ. దుర్భేద్యమైన జీవితాన్ని నెట్టుకు రాలేకతమ కూతుళ్ళని అరబ్ షేక్‌లకు పేద ముస్లింలు అమ్ముకుంటున్న విధానానికి ప్రతీక 'ఆఖరి కానుక' కథ. హిందూ ముస్లింల మధ్య నెలకొన్న మహోన్నత మానవీయ సంబంధానికి ప్రతీక 'రూహి ఆఫా' కథఇలా హైదరాబాద్ ప్రాంత సంస్కృతి, ప్రజల జీవన విధానం నేపథ్యంగా నెల్లూరు కేశవ స్వామి గారుకథలను రచించారు.

యుగాంతం కథ - దేశభక్తి :

భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానంపై జరిపిన సైనిక చర్య వర్ణనతో యుగాంతం కథ ప్రారంభమవు తుంది. యుగాంతం కథ ఉత్తమ పురుష దృక్కోణంలో నడిచింది. యుగాంతం కథలోని ప్రధాన పాత్ర స్వామి. స్వామి తనకు జీవితంలో ఎదురైన సంఘటనల గురించి ప్రత్యక్షంగా పాఠకులకు చెబుతూ వెళ్తాడు. పోలీస్ యాక్షన్ సమయంలో తన బల్యమిత్రుడైన దిలావర్నిస్వామి కలుసుకుంటాడు. అతను రజాకారుగా మారాడని తెలుసుకొని బాధపడతాడు. నిస్సహాయస్థితిలోని దిలావర్‌కి ఆశ్రయం కల్పిస్తాడు. దిలావర్ ఇక్బాల్ ప్రోత్సాహంతో రజాకారుగా మారి తానుచేసిన అకృత్యాలకు బాధపడతాడు. భారతదేశంలో ఉండలేక పాకిస్తాన్‌కి వెళ్ళి పోతాడు. ఇది స్థూలంగా యుగాంతం కథ సారాంశం. ఈ కథలోని ప్రతీసంఘటనలో నెల్లూరి కేశవ స్వామి గారు నిజాం సంస్థానంలో కొనసాగినతెలంగాణ ప్రజలకు భారతదేశంపై ఉన్నభక్తిని,గౌరవభావాన్నికళ్ళకు కట్టినట్లుగా చూపించారు.

భారతప్రసారమాధ్యమాలపై ఆసక్తి :

హైదరాబాద్ సంస్థానంపై భారత ప్రభుత్వం సైనిక చర్య జరిపిన సందర్భంలో రేడియో ప్రధాన ప్రసార మధ్యమంగా కొనసాగింది. 1948వ సంవత్సరంలో భారతదేశం నుండి ఆలిండియా రేడియో వార్తలు వెలువడేవి, హైదరాబాద్ సంస్థానంలో నిజాం నవాబు ఆధీనంలో ఉన్న హైదరాబాద్ దక్కన్ రేడియో స్టేషన్ నుండివార్తలు వెలువడేవి. ఈ రెండింటికివార్తా ప్రసారంలో చాలా వ్యత్యాసం ఉండేది. హైదరాబాద్ సైన్యాలు కాసిం రాజ్వి నాయకత్వంలో భారత సైన్యాన్ని తరిమి కొడుతున్నాయి అంటూ వారి ధైర్యాన్ని పొగుడుతూ, భారత ప్రభుత్వాన్ని అనేక రకాలుగా తిడుతూ పాటలు ఉప న్యాసాలతో హైదరాబాద్ జిందాబాద్ నినాదాలతో హైదరా బాద్ దక్కన్ రేడియో స్టేషన్ లో వార్తలు ప్రసారం అయ్యేవి. ఇందుకు భిన్నంగా వాస్తవ పరిస్థితులను వివరిస్తూభారత సైన్యం నలువైపుల నుంచి హైదరాబాద్ సంస్థానాన్ని ముట్టడిస్తోంది ముఖ్యంగా తూర్పు దిశన విజయవాడ నుంచి పడమరన సోలాపూర్ నుంచి బయలుదేరిన సైన్యాలు నేడో రేపు హైదరాబాద్‌నికైవసం చేసుకునే అవకాశం ఉందంటూ ఆల్ ఇండియా రేడియోలో వార్తలు ప్రసారం అయ్యేవి. హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ ప్రజలుఆల్ ఇండియా రేడియో వార్తలు వినడానికి ఎంత ఆసక్తి చూపారనడానికి యుగాంతం కథలోని ఎత్తుగడ వాక్యాలు చక్కని ఉదాహరణగా నిలుస్తున్నాయి."15 సెప్టెంబర్ 1948

పోలీస్ యాక్షన్ మొదలై ఆనాటికి మూడు రోజులు మేము హైదరాబాద్ నగరంలో చాటుమాటుగా వాల్యూమ్ బాగా తగ్గించి ఆల్ ఇండియా రేడియో వార్తలు వింటున్నాం.'' ఈఎత్తుగడవాక్యాలు హైదరాబాద్ సంస్థానంలో ఆల్ ఇండియా రేడియో వార్తలపై నిషేధంఉన్నా ప్రజలు మాత్రం ఆల్ ఇండియా రేడియో వార్తలని వినే వారని తెలుపకనే తెలుపుతున్నాయి.

పోలీస్ యాక్షన్కి మద్దతు ప్రకటించడం :

భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానంపై జరిపిన పోలీస్ యాక్షన్ కి తెలంగాణ ప్రజలు పూర్తి మద్దతును ప్రకటించారు. నిజాం పరిపాలనలో ఉండలేక భారత దేశంలో కలవడానికి ఆసక్తిని చూపారు. నిజాం పరిపాలనని బాహాటంగా వ్యతిరేకిస్తే అప్పటికే ఓటమి అంచున ఉన్న నిజాం సైనికులు తమని ఎక్కడ చంపేస్తారో అన్న భయంతో వంచిన తల ఎత్తకుండా మౌనంగా తమ జీవనాన్ని కొనసాగించారు. ఇందుకు యుగాంతం కథలో స్వామి తాను పనిచేసే ఆఫీసులోని పరిస్థితి వివరించిన సందర్భంసాక్ష్యంగా నిలుస్తుంది. ''మాది ఇంజనీరింగ్ శాఖ ఎక్కువ హిందువులే ఉండే వాళ్ళు. అయినా ఆఫీసర్లు, చపరాసీలు, క్లర్కులు అంతా ముస్లింలే. ముస్లిం క్లార్కులు ఉర్దూ పత్రికల్లో భారత ప్రభుత్వాన్ని ముఖ్యంగా సర్దార్ పటేల్ ని తెగ తిడుతూ రాసిన రాతల్ని గట్టిగా చదువుతుంటే వినీ వినటట్టు మా పని మేము చేస్తూ కూర్చునేవాళ్ళం. పోలీస్ యాక్షన్ తో రొమ్ము మీద బరువు దిగిపోయినట్లుగా భావించాం. ఇంతవరకు శాంతంగా ఉన్న ముస్లింలు అటు భారత సేనలుదెబ్బ మీద దెబ్బ తీస్తుంటేతట్టుకోలేకగదిలో బంధించినపిల్లుల్లామాపై ఎక్కడ విరుచుకుపడతారో అని భయంగా ఉండేది. వాళ్ల దగ్గర ఆయుధాలు ఉన్నాయి, పోలీసు బలగం మెండుగా ఉంది. మేము నిరాయిధులం దినవెొక గండంగారాత్రుళ్లు మహా గండంగా గడుస్తున్నాయి.'' ఈ మాటలు పోలీస్యాక్షన్ సమయంలో తెలంగాణ ప్రజల పరిస్థితికి దర్పణం పడుతున్నాయి. ఒకపక్క భారత సైన్యం విజయం సాధిస్తుందన్న సంతోషం మరోపక్క ఓటమి బాధలో నిజాం సైన్యం తమపై ఎక్కడ దాడి చేస్తుందో అన్న భయం రెండు తెలంగాణ ప్రజలలో కనిపించాయని చెప్పడానికి, పోలీస్ యాక్షన్ కితమ మద్ధతును ప్రకటించిన విధానానికిపై వాక్యాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

నిజాం రజాకర్లపై వ్యతిరేకత :

కాసిం రజ్వి నాయకత్వంలోని నిజాం రజాకార్లు తెలంగాణ ప్రజలను అనేక రకాల ఇబ్బందులకు గురి చేయడం జరిగింది. నిజాం నవాబు హైదరాబాదును స్వతంత్ర రాష్ట్రంగా ప్రకటించిన నాటి నుండి రజాకర్లు స్థానిక పోలీసులతో కలిసి బలవంతంగా హిందువులను స్వతంత్ర రాష్ట్రానికి అనుకూలంగా మార్చాలన్న ఉద్దేశంతో వాళ్లపై దాడులు జరిపారు. హత్యలు, దోపిడీలు, మనభంగాలు లాంటి దారుణాలకి ఒడిగట్టారు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న తెలంగాణ ప్రజలు పోలీస్ యాక్షన్ జరుగుతున్న సమయంలోభారత సైన్యం విజయం సాధిస్తుంటే ధైర్యం తెచ్చుకుని బాహాటంగా నిజాం రజాకర్లను వ్యతిరేకించారు. ''ఇద్దరు బస్తీ పెద్ద మనుషులు సరాసరి డ్రాయింగ్ రూమ్ లోకి వచ్చి కూర్చొని ముస్లింలని, రజాకర్లని చడమడ తిట్టడం మొదలు పెట్టారు. నాకు చాలా ఇబ్బందిగా ఉంది. దిలావర్ ఎక్కడ వినిపోతాడో అని. అంత తొందర పడకండి ఇంకా రాజ్యం మన చేతిలోకి రాలేదు అన్నాను మెల్లగా. ఇంకా భయపడతారేంటండి చచ్చిన పేనులయ్యారు వెధవలు.'' యుగాంతం కథలోపోలీన్ యాక్షన్ మొదలైన మూడవరోజు హైదరాబాద్ నగరవాసులు స్వామితో పలికిన ఈ వాక్యాలు భారత సైన్య విజయ పరంపతో హైదరాబాద్నగర వాసులలోవచ్చిన ధైర్యాన్ని తెలుపు తున్నాయి.

భారత సైన్య విజయోత్సవంలో పాలుపంచుకోవడం :

17 సెప్టెంబర్ 1948 నా భారత సైన్యం హైదరాబాద్ రాష్ట్రంలోకి ప్రవేశించింది. నిజాం నవాబు తాను భారత

దేశానికి లొంగి పోతున్నట్టుగా ప్రకటించాడు. ఇది చారిత్రకంగా జరిగిన వాస్తవ సంఘటన.ఈ వార్తరేడియో ప్రసారాల ద్వారా విన్న తెలంగాణ ప్రజలు సంతోషంతో నంబరాలు చేసుకున్నారు. 17 సెప్టెంబర్ నాడు హైదరాబాద్‌లోకి ప్రవేశించిన భారత సైన్యానికితెలంగాణ ప్రజలు స్వాగతం పలికిన విధానాన్ని, భారత సైన్య విజయోత్సవంలో పాలుపంచుకున్న విధానాన్ని నెల్లూరు కేశవ స్వామి గారు యుగాంతం కథలో వివరించారు. "ఆరోజు దక్షిణ భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ దినం 350 సంవత్సరాలు మొఘల్ సామ్రాజ్యం క్షణ దశలో అవతరించిన అసాఫియా రాజ్యం అంతరించిన దినం. వందలాది సంవత్సరాలుగా 10 శాతం ముస్లింలు 90 శాతం ముస్లిమేతరులపై చలాయిస్తున్న అధికారం అంతమొందిన దినం. సరిగ్గా మధ్యాహ్నం మూడు జాములకు హైదరాబాద్ నగరంలో అడుగు పెట్టిందీ భారత సైన్యం. మిలటరీ ట్రక్కులు, ట్యాంకులు కంటపడగానే ఇళ్లల్లో దాక్కుని ఉన్న ప్రజలు తండోపతండాలుగాక వీధుల్లోకి వచ్చి జెండాలతో సుస్వాగతం చెప్పారు. ఇన్నాళ్లు మూగబోయిన గొంతులు ఎలుగెత్తి నినాదాలు చేశాయి. భారత్ మాతాకీ జై, సర్దార్ పటేల్ కి జై, జవహర్లాల్ నెహ్రూ కి జై, స్వతంత్ర భారత్ జిందాబాద్ అన్న నినాదాలు మిన్నంటాయి" ఈ వాక్యాలు తెలంగాణ ప్రజలలో నెలకొన్న భారతీయతకి నిదర్శనాలు. అప్పటివరకు బిక్కుబిక్కుమంటూ తమ జీవనాన్ని గడిపిన తెలంగాణ ప్రజలు భారత సైన్యాన్ని హైదరాబాద్ నగరంలో చూడగానే సంతోషంతో జాతీయ జెండాతో వారికి స్వాగతం పలికారు.

ముగింపు :

నెల్లూరి కేశవ స్వామి గారు తెలంగాణ జనజీవనం ఆలంబనగా కథలను రచించారు. హైదరాబాద్ నగరం లోని ప్రజల జీవన విధాన కేంద్రంగా చార్మినార్ కథలని రచించారు. భారతదేశం పట్ల తనకున్న మమకారాన్ని, అభిమానాన్ని పోలీస్ యాక్షన్ సమయంలో హైదరాబాద్సం స్థానంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులని కళ్ళకు కట్టినట్లుగా యుగాంతం కథలో వివరించారు. యుగాంతం కథలోని ప్రధాన పాత్ర అయిన స్వామినెల్లూరు కేశవ స్వామి గారే అని చెప్పక తప్పదు. నెల్లూరు కేశవ స్వామి గారుతానే ఒక పాత్రగా మారి 1948వ సంవత్సరంలోహైదరాబాద్ సంస్థానంలో జరిగిన వాస్తవ సంఘటనలను పాఠకులకు అందించారు. ఒకపక్కహైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనమైందన్న సంతోషం, ఇంకోపక్క దిలావర్ లాంటి ప్రాణ స్నేహితులు భారతదేశాన్ని వదిలి పాకిస్తాన్ కి వెళ్ళిపోయారన్న బాధ రెండునెల్లూరి కేశవస్వామిలో కనిపిస్తాయి. హిందూ ముస్లిం సంస్కృతికి ప్రత్యేక నిదర్శనంగా నిలిచిన హైదరాబాద్ సంస్కృతి రజాకర్ల అఘాయిత్యాల వల్ల విచ్ఛిన్నమైపోతుంటే తట్టుకోలేక రచయితగా తన బాధని, హైదరాబాద్ నగర ప్రత్యేకతని తన కథల ద్వారా ప్రపంచానికి తెలియజేప్పిన గొప్ప రచయిత నెల్లూరి కేశవస్వామి.

ఉపయుక్త గ్రంథ సూచి :

1) నెల్లూరి కేశవస్వామి ఉత్తమ కథలు(2007),నేషనల్ బుక్ ట్రస్ట్: హైదరాబాద్.
2) కేశవ స్వామి కథాసర్వస్వం(2005),విశాలాంధ్ర: హైదరాబాద్.
3) జితేందర్ రెడ్డి ఎం.(సం) 2015,తెలంగాణ చరిత్ర సంస్కృతి, తెలుగు అకాడమీ:హైదరాబాద్.
4) వైదేహి అల్లాడి,2007, ఆధునిక భారతదేశ చరిత్ర, తెలుగు అకాడమీ: హైదరాబాద్.
5) వైకుంఠం ఎల్లంపల్లి, 2011, భారతదేశ చరిత్ర సంస్కృతి, తెలుగు అకాడమీ: హైదరాబాద్.

❖❖❖

రాయప్రోలు - ఆంధ్రావళి ప్రబోధము

- డా॥. యలమంచిలి అలేఖ్య, సంస్కృత అధ్యాపకులు, రిషి యుబిఆర్ మహిళా కళాశాల, నిజాంపేట, ఎక్స్-రోడ్, హైదరాబాదు.

"దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్"

అన్నారు మహాకవి గురజాడ. కుటుంబమంటే బంధాలు - బాంధవ్యాలు ఎలానో దేశమంటే మనుషులు - విలువలు, సంస్కృతి - సాంప్రదాయాలు, ఐకమత్యం. అలాంటి సమాజంలో విలువలు లోపించినా, సంస్కృతి - సంప్రదాయాలు బీటలు వారినా, ఐకమత్యం లోపించినా దేశ సమగ్రతకు, జాతీయతకు ఇబ్బందులు తప్పవు. వాటిని సక్రమమైన మార్గంలో పెట్టడానికి లేదా పునరుద్ధరించటానికి, మన కవులు వారి పరిధులు దాటి రచనలు చేస్తూ జాతీయతను పెంపొందిస్తూనే ఉన్నారు. దేశకాల పరిస్థితులు ఏవైనా తెలుగుజాతి ముద్రను స్థాపించాలన్న ధ్యేయంతో భావకవిగా పరిచయమై అభ్యుదయ భావాలు పురిగొల్పే అభ్యుదయ కవిగా మారిన రాయప్రోలు సుబ్బారావు గారి ఆంధ్రావళి అందుకు ఒక మచ్చుతునక అనడంలో ఎటువంటి అతి శయోక్తి లేదు. అందుకు ఉదాహరణయే ఈ పద్యం అందరికీ సుపరిచితమైన ఈ పద్యభాగాలు.

"ఏ దేశమేగినా, ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలపరా నీ జాతి నిండు గౌరవము"

జాతీయ సమైక్యత అనేది ఒక అందమైన భవనం అయితే ఆంధ్రాభిమానం ఆ నిర్మాణానికి ఉప యోగించిన ఇటుక.

"పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను"

అని శ్రీశ్రీ అన్నట్లుగా ఒక సంఘర్షణలోంచి, ప్రతిఘటన లోంచి పుట్టుకొచ్చిన మనం మరిచిపోలేని ఒక మహోజ్జ్వలమైన సందర్భంగా - చారిత్రక ఘట్టం. శక, యవనులు, మహమ్మదీయులు, డచ్చి, ఫ్రెంచి, పోర్చుగీసులు సాగించిన దండయాత్రలకు పరాకాష్ట ఈ దేశంలో రెండున్నర శతాబ్దాల పాటుగా సాగిన బ్రిటీషు వారి వలసపాలన. ఆ పరిపాలన సమయంలో భారతీయు లలో రగులుకొన్న అస్వతంత్రతావేదన ఒక మహో ద్యమం పరిణమించి, ఆసేతుహిమాచల భారత జాతిని ఏకంచేసి ఒక్క తాటిమీద నడిపించింది. ఆ ఉద్యమమే భారతజాతీయోద్యమం. తెలంగాణ ఉద్యమం, ఆంధ్ర జాతి ఉద్యమాలు ఆ మహోద్యమంలో భాగాలే.

అయితే పారతంత్ర్య ప్రతిఘటనం - స్వాతంత్ర్య సముపార్జన ఆనాటి ప్రజల లక్ష్యమైతే, ఆ లక్ష్యసాధనకు మన కవులు ఎన్నుకొన్న అద్వితీయమైన రీతులు ప్రశంసనీయము. ఉద్యమానికి ఊపిరిపోసే శక్తి సంగీత - సాహిత్యాలకు ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు కనుక ఆ సంగీత సాహిత్యాల పురిటిగడ్డ భారతదేశమనడంలో ఎలాంటి సంశయం లేదనడం కవి భావన.

"అతి భయంకర శౌర్యధైర్య ప్రసక్తి
రసవశంకర నాగర రాగరక్తి
ఏకమై పాకమై ప్రవహించినట్టి
ఆ యఖండప్రభావమేమాయె నాంధ్ర"

నాటి ప్రజల పౌరుష పటిమ, సంగీత - సాహిత్యాలలో అభినివేశము క్రమక్రమంగా ప్రజలలో క్షీణించడాన్ని రాయప్రోలు నిర్వేదంతో ప్రశ్నిస్తున్న సందర్భమీ పద్యం.

"అన్యభాషల దూరదేశాంతరముల
నుద్ధరించి ప్రకాశించియును, నిజాంధ్ర
జాతి తంతు విచ్చేదంబు సలుపలేరు
లేదె నీలోన తత్ప్రభాలేశమాంధ్ర"

ప్రపంచ దేశాలకు విజ్ఞానభిక్షను పెట్టి ఉద్ధరించిన మన ఆంధ్రజాతి పౌరుషాన్ని బీటలు వారించుట ఎవరివల్ల కాని పని. అయినా 'నాటి జాతి ఔన్నత్యం లేశమాత్రమయినా లేని దుస్థితి ఈనాడు దాపురించింది' అని రాయప్రోలు తమ నిర్వేదాన్ని ఈ పద్యం ద్వారా వ్యక్తపరుస్తున్నారు.

"తర్క మహాసముద్రమ్ము నాపోశన బట్టె అన్నంభట్ట పండితుండు
యావదాయుర్వేద జీవనీయ చికిత్సలు గదించె బసవరా జగదవేత్త
జందెమ్ము తెగద్రెంచి క్షాత్రమ్ము నెగయించె అనపోత శర్మ దేశాభిమాని
గోలకొండ కిరీట కోటికాంతులు దిద్దిరక్కన్న మాదన్నల పరుగురులు

అఖిల పురుషార్థఫలసిద్ధి నందినారు
ఆదిదైవిక భౌతికాభ్యంగణముల
నీ పితామహ, మాతామహోపనిధులు
మాయనీయ కాంధ్రుల సంప్రదాయ మాంధ్ర!"

తర్క మహాసముద్రాన్ని ఔపోశన పట్టిన అన్నంభట్ట పండితులు, ఆయుర్వేద శాస్త్రానుగత చికిత్సావిధానంలో ఖ్యాతి గడించిన బసవరాజు, వ్యక్తి తన జాతిధర్మాన్ని త్రోసిరాజని క్షతియత్వాన్ని ఆపాదించుకొన్న దేశాభిమాని అయిన అనపోతశర్మ, గోల్కొండ సంస్థానంలో తమ రాజనీతి చతురతను ప్రదర్శించిన అక్కన్న - మాదన్నలు ఆదర్శప్రాయులై చరిత్రలో సుస్థిరస్థానాన్ని పొందినారు. పూర్వుల కృషిని, శక్తియుక్తులను ఆదర్శంగా గ్రహించ వలసిందని, వారి మార్గంలోనే ముందుకు సాగాలని కవి ఆంధ్రజాతికి హితవు పలికారు.

"గడ్డపాఱలు గోగుకాడల వలె ముళ్ళువేసినారట కొండవీటి రెడ్లు
తెలివెన్న రాసుల తీరున నల్లకొండలు చీల్చినారు పల్నాటిగండ్లు
శివుడు గంగనుబోలె చెరువుగండి ప్రవాహమాపినా రద్దంకి కాపుమగలు
వాటెడేసి శిలాకవాటముల్ గ్రుద్దుల గడిపినారట తెలంగాణ భటులు

అట్టి బలభద్రులీ భూమి బుట్టినారు
విజయకన్యక వీరగోరజము బూయ
పులికడుపు చలిచీమల పుట్టయమ్మో
చూడవోయి ప్రాల్మాలికల్ వీడి ఆంధ్ర!"

కఠినమైన గడ్డపాఱలను గోగుకాడల లాగా ఉప యోగించి భూమిని త్రవ్వి సస్యశ్యామలం చేసిన కొండవీటిరాజులు, నల్లకొండలను వెన్నతీసినంత సులువుగా పగులకొట్టిన పల్నాటిరాజుల పౌరుషం, శివుడు గంగాప్రవాహాన్ని అదుపు చేసినంత సులువుగా చెరువులకు పడ్డ గండ్లను పూడ్పించిన కాపులు, బలీయమైన శిలలతో చేసిన తలుపులను సునాయసంగా పగులకొట్టిన తెలంగాణ యోధులు. అంతటి యోధులు ఈ భూమిపై జన్మించగా, విజయకన్యక వీరతిలకం దిద్దింది. పులి కడుపున చలిచీమలు పుట్టవన్నట్లు నాటి పూర్వుల శౌర్యధైర్యాలను పుణికి పుచ్చుకొని, అలసత్వాన్ని వదిలి దేశభక్తితో జీవించవలసిందని రాయప్రోలు సూచన.

ఈ విధంగా పై పద్యాలలో రాయప్రోలు సుబ్బారావు గారు ఆంధ్రదేశాన్ని పరిపాలించిన, భిన్నరాజ్యాల రాజుల ధైర్య - శౌర్యాలను, సంగీత - సాహిత్యాల గొప్పదనాన్ని, ఆంధ్రజాతి విజ్ఞాన దక్షతను కళ్ళకు కట్టినట్లు రమణీయంగా వర్ణించారు.

అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటి పరాయి పాలనలో స్వేచ్ఛను కోరుతూ ఆనాటి కవులు దేశభక్తిని పెంపొందించేలా రచనలు చేస్తే, ఈనాటి కాలంలో విదేశీనాగరికతపై మక్కువతో, స్వదేశాన్ని తూలనాడే అల్పబుద్ధుల నవోత్తేజానికి ఈ దేశభక్తి సంబంధిత రచనలు చదవాల్సిన ఆవశ్యకత ఎంతైనా

ఉంది. మన జాతి గొప్పతనాన్ని తెలుసుకొన్న నాడు ఒకవైపు భారతీయత, ధర్మస్థాపనతో పాటు, సాహిత్య వికాసము దానంతట అదే జరుగుతుందనేది నా భావన. ఈ విధంగా అన్నివిధాలా ఉపయుక్తమైన అంశాన్ని శీర్షికగా ఇచ్చి దేశభక్తి భావాలను మళ్ళీ పాదుకొల్పడానికి ప్రయత్నిస్తున్న వారందరికీ ఈ జాతి ప్రణమిల్లుతుంది.

"ఏ పూర్వపుణ్యమో, ఏ యోగబలమో
జనియించెనాడ వీ స్వర్గఖండమున
ఏ మంచిపూవులన్ ప్రేమించినావో
నిను మోసె నా తల్లి కనకగర్భమున"
ఇదే కదా మన భారతదేశ ఔన్నత్యము.

ఆధారగ్రంథాలు :

1. ఆంధ్రావళి - రాయప్రోలు సుబ్బారావు.

❖❖❖

దేవులపల్లి కృష్ణశాస్త్రి దేశభక్తి సాహిత్యం

- జి. శ్రీదేవి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాస్ విశ్వవిద్యాలయం, చెన్నై.

దేశభక్తి అనగానే ''ఓం'' ప్రథమంగా తలచుకోవలసింది.. మన ఆదికవి..వాల్మీకి మహర్షి. ఆయన రామాయణంలో ''జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసె'' అని శ్రీరామచంద్రునితో పలికించాడు.

కన్నతల్లి, పుట్టిన గడ రెండూ..స్వర్గం కన్న మిన్న అని ఆ మహర్షి చెప్పాడు... ఎప్పటి వాల్మీకి!? ఏనాటిది ఆ రామాయణం.! 28 వేల యుగాల క్రితం నుంచి పరంపరగా వస్తున్న జన్మభూమిని, ఆరాధిస్తున్న సంస్కృతి మనది..

ఆధునికయుగంలో..మనలో ఈ దేశభక్తి ఎలా ఉదయించింది.. అన్నది ప్రశ్న.. అంతేకాదు అది దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి కలాన్ని కాహళిగా ఎలా మార్చిందన్నదో తెలియాలంటే ....నాటి సామాజిక, చారిత్రక సంఘటనలు స్థూలంగా పరిశీలించాలి...

బ్రిటిష్ వారి పాలనలో దాస్య భావనలో పడిపోయిన భారతీయులను తొలిసారిగా బ్రహ్మసమాజం స్థాపన తో మేలుకొలుపి, ఆంగ్లవిద్యతో ఛాందసదృష్టిని తొలగించిన రాజా రామ్మోహన రాయ్ గారి వల్లనే సాంస్కృతిక పునరుజ్జీవనం మొదలయిందని అంటారు.. ఆయనే తొలి వైతాళికుడు.. ఆయన బ్రహ్మ సమాజం సిద్ధాంతంతో ప్రభావితులైన కందుకూరి వీరేశలింగం రఘుపతి వెంకట రత్నం పంతులు తెలుగునాట సంఘ సంస్కరణోద్యమాన్ని సాహిత్యం, వాహికగా నిర్వహించి తెలుగువారిలో చైతన్యం కలిగించారు.

ఆ తరువాత 1905లో బెంగాల్ విభజనతో భారతీయులలో స్వదేశీ ఉద్యమ భావనలు ఉవ్వెత్తున జ్వలించాయి. వందేమాతరం నినాదం దేశీయులలో దేశభక్తి భావనను అంకురించింది. అప్పటికి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ఎనిమది ఏండ్ల బాలుడే. అప్పటికే ఆధునిక ఆంధ్ర సాహిత్య యుగకర్తలైన గురజాడ అప్పారావు పంతులు, రాయప్రోలు సుబ్బారావు గారు నవ్యసాహిత్యోద్యమాన్ని ప్రారంభించి సంచలనం సృష్టించారు.

1910లో గురజాడ వారి ముత్యాల నరములు ఆంధ్రభారతిలో ప్రచురించబడినాయి

''దేశమును ప్రేమించుమన్న
మంచి యన్నది పెంచుమన్న''

అని దేశభక్తి గురించి తొలిసారిగా చాటిచెప్పారు..

దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి నాన్నగారు కాలధర్మం చెందటంతో ఆయన విజయ నగరంలో ఉంటున్న పెదబావ వద్దకు చేరి హైస్కూలు చదువు ప్రారంభించారు... ఆరోజుల్లో

విజయనగరంలో గురజాడ వారిని తరచు దర్శించడంతో ఆయనలోని కవితాశక్తి చిగురించింది.. ఆయనలోని భావ విపంచి, దేశభక్తి రాగాలను వినిపించసాగింది. రాయప్రోలు వారి ప్రేరణ, రఘుపతి వెంకట రత్నం నాయుడు గారి ఆదరణతో తొలినాళ్ళలో సంఘ సంస్కరణ, ప్రధాన భూమికగా కవితలు రాశారు. అంతేకాదు గురజాడ వారిని మహాకవి అని తొలిసారిగా సంబోధించి ప్రస్తుతించారు.

1914 నుంచే రాయప్రోలు సుబ్బారావు గారు ''ఏదేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని'' వంటి గీతాలతో జాతీయభావాన్ని ప్రబోధించారు. ఈ గేయంలో వారు వాల్మీకి చెప్పిన జననీ జన్మభూమిశ్చ సూక్తినేప్రబోధించటం విశేషం...

గురజాడ గారి దేశమును ప్రేమించుమన్న గీతం, రాయప్రోలు వారి గీతాలు దేవులపల్లి వారికి స్ఫూర్తి నిచ్చాయి. 'గురజాడ 1915లో చనిపోయినను 1915

తరువాతే కవిగా జీవించారని "దేవులపల్లి 'పాతికసం రాల తెలుగు కవిత్వం" అనే వ్యాసంలో అని రాయడాన్ని బట్టి దేవులపల్లి వారు ప్రబోధ కవిత్వంలో గురజాడ వారి అడుగుజాడలో తన బాటను వేసుకొన్నారని తెలుస్తుంది.

దేవులపల్లి వారి కీర్తి ప్రతిష్టలకుఎవరెస్టు వారి "కృష్ణ పక్షం" అయితే, వారి దేశభక్తిగీతాల సంపుటి "మంగళ కాహళి' కూడా హిమాలయాల శ్రేణులలోని మరో గౌరీశంకర శిఖరమనే చెప్పాలి.

దేశభక్తి కవిత్వం అనగానే దేశంగురించి వర్ణించడమో, దేశ చరిత్రలోని మహనీయుల గురించో, మహోజ్వల సంస్కృతి కళల గురించో, ప్రస్తుతించే కవిత్వం రాయ డమనే భావన ఉంటుంది. అయితే భావకవితా ప్రవర్తకుడైన దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి కవిత్వం లోని దేశభక్తి మాత్రం ఒకప్రాంతానికి మాత్రమే చెందింది కాదు.

రవీంద్రనాథ టాగూరు వలె అయన విశ్వమానవతా వాది.

మంగళకాహళి సంపాదకీయంలో కృష్ణశాస్త్రి గారి గీతాలు "ఏదో ఒక ఉద్యమానికి ఉపాంగాలు కావని, సార్వకాలీనమైనవని "అని ఓ గొప్ప మాటన్నారు..ఆన్ని కాలాలో పాడుకోగలిగిన వస్తువుతో రాయడమే దేవులపల్లి వారి ప్రత్యేకత. వారి "జయజయజయ ప్రియభారత జనయిత్రీ దివ్యగాత్రి" గీతమొక్కటి చాలు. ఈ గీతం విశ్వకవి రవీంద్రుని జనగణఘణ గీతాన్ని మించినదని కవి పండితులు ముక్త కంఠం తో కొనియాడారు..అందుకే ఈ గీతం.. సార్వ జనీనమైనది సార్వకాలీనమైనది..

కృష్ణశాస్త్రి గారిది వసుధైక కుటుంబభావన..విశ్వ మానవ దృష్టి. ఆయన ఏ కాకినాడకో, కరీంనగర్‌కో పరిమితం కాలేదు..ఆయన తెలుగు రాష్ట్రాలహద్దులను, భారతదేశ సరిహద్దులను దాటి , స్వేచ్ఛకుమారుడై విశ్వ వేదికపై తన కవితా కాహళిని మ్రోగించారు. మంగళకాహళి లోని గీతాలు వివిధ సందర్భాలలో రాసినవి. వీటిలో కొన్ని "ప్రతిభ" జ్వాల మొ పత్రికలలో ప్రచురితమైనవి.కొన్ని స్వాతంత్ర్య రథం, మణికింకిణి, రాజఘట్టం,కొత్త కోవెల మొదలగు శ్రవ్య నాటికలనుంచి తీసుకొన్నవి.

ఇందులో కృష్ణశాస్త్రి గారి గీతాలను రెండు శీర్షికలలో చేర్చారు.

ఒకటి " విజయ భారతి." రెండవది " ఆంధ్ర గేహళి"..

విజయభారతి లో 37 గీతాలు,ఆంధ్ర గేహళిలో 46 గీతాలున్నాయి..అన్ని కలిపి .మొత్తం 83..జయజయ ప్రియభారతి గీతం సంస్కృతంలో ఉన్న ప్పటికి తెలుగుతనం తేనెమాధుర్యం నిండి వుండం వలన ఈ గీతం ఆబాలగోపాలాన్ని అలరిస్తుంది. ఈ గీతం ఎంతో ప్రఖ్యాతి గడించి చివరకు సినిమాలో కూడా తీసు కొన్నారు.

చాలామంది ఈ గీతాన్ని పలుసందర్భాలలో అనేక వేదికలపై ప్రార్థనా గీతంగా పాడుతుంటారు..ఈ పాట అర్థం అవగతమైతే శరీరం పులకరిస్తుంది..

జయ జయ జయ ప్రియ భారత
జనయిత్రీ దివ్యధాత్రి
జయ జయ జయ శత సహస్ర
నరనారీ హృదయనేత్రి ॥ జయ జయ జయ ॥

చరణం 1 :

జయ జయ స శ్యామల
సుశ్యామ చలచ్ఛేలాంచల
జయ వసంత కుసుమ లతా
చలిత లలిత చూర్ణకుంతల
జయ మదీయ హృదయాశయ
లాక్షారుణ పద యుగళ ॥ జయ జయ జయ ॥

చరణం 2 :

జయ దిశాంత గత శకుంత
దివ్యగాన పరితోషణ
జయ గాయక వైతాళిక
గళ విశాల పద విహరణ
జయ మదీయ మధుర గేయ
చుంబిత సుందర చరణ ॥ జయ జయ జయ ॥

సంస్కృతంలో రాసిన ఈ గీతం భావం స్థూలంగా చెప్పాలంటే

"మాకు ప్రియమైన భారతమాతా, దేవభూమీ,
నీకు జయమగు గాక
లక్షలాది స్త్రీపురుషుల హృదయాలకు
కనులవంటి దానా, నీకు జయమగు గాక...!!
శ్యామలవర్ణా, .కదలెడు ముదురు ఆకుపచ్చ చెరగు గల దానా,.. నీకు జయమగు గాక
వసంతకాలములో విరిసిన పూలను తురిమిన
అందమైన కేశములు గల దానా నీకు జయమగు గాక..
నా మనసునందలి అభిలాషలనెడి ఎర్రని లత్తుకతో అలంకరించబడిన పాదములు గలదానా నీకు జయము !
దీశాంతములకు వెళ్ళిన పక్షుల అమరగానముతో

తృప్తి బొందిన దానా, జయము..గాయకుల, కవుల కంఠములలో వెలువడుపాటలలో విహరించుదానా, జయము! నామధురగానముతో చుంబితమైన అందమైన చరణము గల దాన,నీకు జయమగు గాక..!!

ఈ గీతం భావం ఎంత హృద్యంగా ఉదాత్తంగా ఉన్నదో తెలుస్తుంది....ఇదేవిధంగా మరొక చోట "హే భారత జననీ ..స్వేచ్ఛా గగన వీధి విహారిణీ"

అని భారతమాతను దేవులపల్లి వారు ఎంతో ఉదాత్తంగా చిత్రించారు. చిరదాస్య విమోచనమయ్యాక దేశమాత స్వర్ణకాంతులతో కళకళలాడే దృశ్యాన్ని వర్ణించారు.

భరతమాత తేజోమయ రూపానికి ఎన్నో కారణాలను ఉల్లేఖించారిందులో..సంస్కృత పద ధారతో సాగిన ఈగీతం దేవులపల్లి వారి భావుకతకు నిదర్శనం.

హే భారత జననీ ..
స్వేచ్ఛా గగన వీధి విహారిణీ
స్వతంత్ర కిరణ స్వర్ణారుణ
కంకణ కటక కలాపినీ..

భారతమాతయన్నా భారత భూమి యన్నా కృష్ణశాస్త్రి మనసు కురంగమై పోతుంది..అందుకు మరో ఉదాహరణ

జయ జయ జననీ
ప్రియతమ భారత ధాత్రీ..అనే గీతం..ఇందులో అభివ్యక్తి దాదాపు జయజయ జయ ప్రియ భారతి గీతం వంటిదే..

ఉదాహరణకు ఇందులోని
జయ శ్యామల శాద్వల చేలా!
జయ సహస్ర నర నారీ కోటి మనః కుసుమమంజరీ..
మొదలగు పంక్తులు పునరావృతాలైనట్లు తెలుస్తుంది.

దేవులపల్లి వారు భరతమాతను, భారత ధాత్రిని, మాత్రమే సన్నుతించలేదు. మన తెలుగు వారి విషయానికి వచ్చేసరికి, తెలుగు నేలను భరతధాత్రి పుత్రిక గా వర్ణించి ఇక్కడి ఇక్కడి నదీనదాలు, ప్రాంతాలు, మొదలగు విషయాలను స్మరిస్తు, విశాల మానవతా సమతా సాధనమే ఆంధ్రజాతి ఆశయంగా పేర్కొన్నారు..

జయజయ మహాంధ్ర జనయిత్రీ..
జయ జయ ప్రియతమ
భారత ధాత్రీ పుత్రి,శుభదాత్రీ..

పచ్చని పైరులతో, అరటి మావి తోటల పైనుంచి వీచే మందమారుతాల స్పర్శతో తెలుగు నేల పునీతమైన దని రాశారు.

మంజీర, వంశధార : కృష్ణా గోదావరిబీశబరీ పెన్నా నదులెల్ల నీ చరిత స్మరిస్తాయని చరణాలలో వర్ణించారు.

"అటు తెలంగాణ..ఇటు కళింగాన
అట నట కోస్తా ,రాయలసీమల
ప్రత్యాంధ్ర మందిర గేహళి
సర్వదా మ్రోగు నీ మంగళ కాహళి!"

అని అద్భుతంగా వర్ణించారు. ఈ సంపుటి శీర్షిక "మంగళకాహళి" కూడా ఇందులో కనిపించడం విశేషం..

ఆంధ్రులలోని అనైక్యత దేవులపల్లివారిని విపరీతంగా బాధించింది.. ఆంధ్రులను సమైక్యపరుస్తు ప్రబోధాత్మక గీతం రాశారు.

ఓ విశాలాంధ్ర జనులారా కనరా
ఓ సారి నామాట చెవులారా వినరా..
మనజాతి మన నీతి మట్టి పాలాయె
మన చేత మన వ్రాత నగుబాటులాయె//
ఇన్నాళ్ళ స్వార్థాలు ఇకమానండి
ఎన్నెన్నో భేదాలు ఇకమరచిపొండి..
ఒకనాటి ఘనతకై ఉబ్బి పోకండి

ఇకనైన మన జాతి హితము చూడండి..ఇలా సాగుతుంది. ఇందులో.. పదవులకై పోరు వలదని, గనులలో ఖారా?నాలలో కష్టపడి పనిచేయాలని, నీతి మార్గాన నడవాలని, గుండెలన్నీ ఒకే దండగా కుచ్చండని జాగృతం చేస్తు రాశారు

జయమహాంధ్ర జననీ అన్న మకుటం కృష్ణశాస్త్రిగారికి ఎంతొ ఇష్టమైనది.ఈ పదబంధంతో రాసిన మరో గీతంలో తన జాతిని ఆంధ్రమాత ఒడిలో ఒదిగి ఎదిగిన వైనాన్ని, తామంతా పిల్లలుగా భావించి అభివర్ణించారు.ఇలా..

నీ ఒడి ఉయ్యాలలూగి
నీ నుడి నోరార నేర్చి
నిలిచిన అనుగులము.

అని అనురాగంతో ఆర్తితో విన్నవించి ''కోటి కోటి గుండెల మంగళహారతులివిగో'' అని నీరాజనమిచ్చారు. పాడితే తెనుగు వీణే పాడాలని, తెనుగు చేనే పండాలని తెలుగుతనమంతా పైరగాలివలే వ్యాపించాలని కోరుకున్న ఈ గీతం, దేవులపల్లి వారి తెలుగు నేల పైగల మమకారాన్ని సూచిస్తుంది.

జయజననీ ప్రియజననీ
జయమహాంధ్ర జననీ...

అనే పల్లవితోనే దేవులపల్లి వారి కలం నుంచి 4,5 గీతాలు పల్లవించడం విశేషం. ఈసంబోధనతో రాసిన ఒక గీతంలో ..'' మధుర గేయ పరి చుంబిత చరణా'' అని పేర్కొని ఆంధ్ర జననీ పాద యుగళిని వందల వేల తెలుగువారి గీతాలు సుకుమారంగా చుంబించాయని ఉటంకించారు..

స్వాతంత్ర్యోద్యమకాలంలో దేశభక్తి కవితల విషయంలో, జాతి ఔన్నత్యం, కీర్తి వైభవాలతోపాటు జాతీయ పతాకాన్ని కూడా సముచిత గౌరవంతో భక్తి ప్రపత్తులతో రాసేవారు.కృష్ణశాస్త్రి గారు జెండా పైన నాలుగైదు గీతాలు రాసారు.

పరువంపు మా జెండ
భారతీయుల జెండ..
గరువంపు గగనమే
ఒరసి ఆడెడు జెండ ...

అని రాసిన గీతంలో జెండా ప్రాశస్త్యాన్ని ఖండగతిలొ జెండా అనే పదం అంత్యప్రాసగా రాశారు...అలాగే..

''ముడివేయవేమి..
నీ ఎడద జెండా కొనల ''

గీతంలో మన దేశ జెండా కీర్తి ఖండఖండాంతరాలకు వ్యాపించిందన్నారు.

''ఎగరెయ్ ఎగరెయ్ ఎగరెయ్యవోయిజెండా''.. అనే గీతంలో

జెండాలోని మూడు రంగులు శాంతి, దాంతి,కాంతికి ప్రతీకలని వర్ణించారు.

''ఎత్తండి ఎత్తరేం స్వాతంత్ర్యపు జెండా
ఎత్తవోయి ఎత్తు ఆకాశం నిండా''

..అనే ఈ గీతంలో మన జెండా నింగివరకు సమున్నతమైనదని సగర్వంగా చెప్పారు..

స్వరాజ్యం వచ్చాక స్వార్థం, పెరిగిపోయింది.. డబ్బుమత్తుతో అహంకారంతో, బుద్ధిజాడ్యంతో తల్లడిల్లేరీతిన కాకుండా నిరుపేదలు, నిరంకుశులు లేని కొత్త జగంలోకి మన జెండాతో వెళ్ళాలి అని ఆశావాద దృక్పథంతొ రాశారు. దీనిపై రవీంద్రుని where the mind is without fear కవిత ప్రభావం కనిపిస్తుంది. ఆకాశవాణిలో బృందగానంగా తరచు ప్రసారమైన గీతమిది..

" నిలుపు మోయీ నీ జెండా/

నీహార శిఖర కోటీరపు తురాయిగా" ..అని మరోగీతంలో జెండాను హిమాలయశిఖరాల పై ఎంతో ఎత్తున కిరీటం వలె ఔన్నత్యంతో నిలపాలని కోరారు.

తరుణమార్తాండమండలానికెదురుగా" .. నిలపాలట.. అంతేకాదు.. నింగి అనే నందన వని లో గాలి అలలకు తూగాడే విధంగా ఉండాలని అభిలషించారు..

"మంగళకాహళి" లోని ప్రబోధగీతాలలో పేర్కొన దగింది..

అనవేరా భారతవీరా
అనవేరా నీనోరారా.
అనవేరా స్వతంత్ర భారతం నాదేశమ్మనే ..గీతం..
అలాగే..స్వాతంత్ర్యం లభించిన సమయాన..
ఎంతో ఉద్వేగంతో..రాసిన మరో గీతం..

ప్రాభాత ప్రాంగణాన
మ్రోగెను నగారా
ఈ భారత భువి పొంగేను
ముక్త జీవధార..

ప్రతి భారతీయుడిలో చైతన్యం కలిగించి, కర్తవ్యోన్ముఖుడిని చేసే విధంగా రాశారు..

నీ శీర్షం హిమ శృంగం
నీ ఎద గంగా భంగం
నీ మనస్సు సువిభాతం
నీ రక్తం జలపాతం..
నీ గతమ్మం మూలధనం
నీ భావి వసంత వనం..

అంటూ ఎంతో స్ఫూర్థివంతంగా ఉద్బోధించారు...

దేశభక్తి గీతాలలో కేవలం దేశం,రాష్ట్రం గురించే కాదు మనకుస్వాతంత్ర్యం అందించిన జాతి పిత గాంధీజి పై ఆలోచనాత్మకమైన గీతాన్ని రాశారు.

కమ్మగా బ్రతికితే గాంధీ యుగం
మనిషి కడుపు నిండా తింటె గాంధీ జగం//

గాంధీ సిద్ధాంతాలను ఎంతో వాస్తవికతంగా, తాత్వికంగా చెప్పారు...

భోగలాలసత వీడాలని/ త్యాగరథం ఎక్కాలని/ పలికారు.

చివరగా శివుడేవిధంగా హాలాహలాన్ని మింగి గంగాజలాన్ని కురిపించాడో ,అలా మనీషి శివుడవటమే గాంధీ వరమని అందరం అనుసరించాలని ఎంతో హృద్యంగా రాశారు. ఈ గీతం కూడా ఆకాశవాణిలో బృందగానంగా ప్రసారమైనది..

కృష్ణశాస్త్రి గారి భావకవితలు స్నిగ్ధ వీచికలైతే కావచ్చు కానీ, ప్రబోధ కవనంలో.. అందునా గేయ రచనలో ఆయన కలం శ్రీశ్రీ ని తలపించింది. 1941 లో స్వంతంత్ర ఉద్యమానికి ప్రేరణగా ఆవేశం అంతర్భూతంగా ఒక ప్రబోధ గీతాన్ని రాశారు.

ఆకాశము నొసట పొడుచు
అరుణారుణ తార
ఏకాకి నిశీథి నొడుచు
తరుణ కాంతి ధార..
జయ పతాక యువపతాక
వియదాపగ వెడలు నౌక..

ఇలా.. అభ్యుదయమార్గంలో సుదీర్ఘ గేయాన్ని అందించారు. అంతేకాదు తృతీయ అభ్యుదయ రచయితల మహాసభకు అధ్యక్షత వహించి.. ధనిక స్వరాజ్యం పోయి సమసమాజం రావడమే అభ్యుదయం అని సరైన రీతిలో నిర్వచించారు.

దేవులపల్లి వారి దేశభక్తి గేయాలు ఒక పరిశోధనాంశం.. ఎందుకంటే ఇవి కేవలం వర్ణనతో/ లేదా/ స్తుతి ప్రధానమైనవో కావు. వీరి గేయాలలో విశ్వశాంతి స్థాపన, ఆదర్శ సమాజం ఏర్పడాలన్న అభిలాష గోచరిస్తాయి.

జగదంతర దేశ దేశ
జనులారా వినరా
వంత లేదు చింత లేదు
శాంతి, శాంతి, శాంతి..అని (మంగళకాహళి పుట 50)కాంక్షించారు.

నారాయణనారాయణ అల్లా అల్లా

మా పాలిటీ తండ్రీ మీ పిల్లలమేమెల్లా ..వంటి గీతాలనుమించిన భగవద్గీత ఏముంటుంది?

కృష్ణశాస్త్రి గారి దేశభక్తి ని సామాన్య మానవులకుండే రాగ ద్వేషాలకు అతీతమైనది.ఆయన దృష్టి లో దేశం కేవలం భౌగోళికమైన ప్రాంతమో, పటమో కాదు..దేశం అంటే మనుషులతో పాటు, మట్టి, చెట్టు, పుట్ట, పక్షి, సమస్త వస్తుసంచయం..అందుకే ఆయన ఈ దేశంలోని నదులను, గిరులను, తరులను, వనాలను, పల్లెలను పంటచేలను సమస్తమూ వర్ణించారు.... ప్రతి భారతీయులు సగర్వంగా తలెత్తి, జీవన శంఖాన్ని పూరించాలని ప్రబోధించారు ఇలాబీ

ఒత్తండి జీవన శంఖం.
ఎత్తండి ఠీవిగ శీర్షం

ఈ ఈగీతం లో సకలనదీనదాలను, హిమగిరులను, సాగరాలను సైతం మనుషులతో భాగస్వాములను చేయడం ఆయన విశాల దృష్టికి నిదర్శనం.

ఇటు సేతువు..అటు హిమగిరి..
ఈ నడిమిదె మన స్వర్గం..
గంగదరి, యమున దరి
కృష్ణా గౌతమి సహ్యజా తటుల
కళింగ సాగర తీరములను
అరేబియాంబుధి కూలములను..
కోటి భుజములు కోటి చేతులు
గిరుల శిరముల వంచునరరె.....
ఎల్లెడల కేదారములలో
ఎల్లెడల ఆరామములలో ..
జయమని నిర్భయమని
జగతి మంగళమయమని
..ఒత్తండి జీవన శంఖం..

అని రాసారు..

వారి భావనలో ...లోకం, దేశం, రాష్ట్రం... ఇవి... చాలా చిన్నవి.. హృదయమే.. వాటిని మించిన పెద్దది..

ఈ విషయాన్నే "మంగళకాహళి" %II%లో "ఆంధ్ర గేహళి" కి ముందు కవితాత్మకంగా రాసిన మాటలలో చెప్పారు ఇలా..

నేటినుండి ఏనాటికి
వీటి తలుపు తీయకు
కోటిమంది వచ్చినా
చోటున్నది లోన..
ఎంత చిన్నదో లోకం ....
ఎం పెద్దదో హృదయం.....
ఇన్నాళ్ళూ,ఎరుగవా?...
ఈ తీయని సత్యం....!!

ఇందులో.. వీట్" అనేది తమిళ పదం.అంటే ఇల్లు అని అర్థం

చివరగా.. ఒక మాట.... దేవులపల్లి వారి అనంత కవితా వాహినిలో దేశభక్తి .. ఒక పాయ మాత్రమే..ఆ పాయలోంచి నేను విన్నవించింది ఓ చెంబెడు మాత్రమే....ఇది నా స్థాయి..

ఆ మహానుభావుని కవిత్వాన్ని లోతుగా విశ్లేషించడం... కష్టమే.. కారణం ఆయన అల్పాక్షరాలలో అనంతార్థాన్ని పొదిగిన మహాకవి..ఆయన సుందరమైన పద బంధాల గంధాలను ఆస్వాదించాక ..మరో కోణంలో ఆలోచించలేం.. వారి కవిత్వంలో ..అంత మెస్మరిజం ఉన్నది ..

కాబట్టి ఆయన గీతాలనే మననం చేసుకొంటు, అనుభూతితో గానంచేస్తేనే అందం, ఆనందము.. ధన్యవాదాలు.....నా వ్యక్తీకరణలో లోపాలుంటే అది నా

అజ్ఞానంగా భావించాలని ప్రార్థిస్తూ.. సాహిత్యంలో ఎంతో ప్రఖ్యాతి గాంచిన పండితులు, పెద్దలు, పాల్గొన్న ఈ సభలో నాకు అవకాశం ఇవ్వడం కేవలం దేవులపల్లి వారి కుటుంబసభ్యులతో నాకుగల అనుబంధమే.. వారికి నా కృతజ్ఞతలు.. మరోసారి మీ అందరికీ నమస్సులతో సెలవు..

ఆధార గ్రంథం :

1. దేవులపల్లి కృష్ణశాస్త్రి లిమంగళ కాహలిలి

గురజాడ గేయాలలో దేశభక్తి

– డా॥. కడివెండి మమత, సహాయ ఆచార్యులు, బద్రుకా వాణిజ్య మరియు కళల కళాశాల, హైదరాబాద్.

మహాకవి గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహిత్యానికి అడుగుజాడ. కథ, గేయం, నాటకం, డైరీ ... ఇలా అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ కొత్త రీతులు సృష్టించిన సృజనశీలి. ఆయన రచించిన 'దేశభక్తి' గీతం ఒక అద్భుత సందేశం. ప్రపంచంలో ఎక్కడ జీవించే మనుషులైనా ధైర్యంగా, ఇష్టంగా పాడుకోగలిగిన గేయం.

దేశమంటే ఏమిటి?

దేశభక్తి అంటే ఏమిటి?

దేశమంటే నాలుగు సరిహద్దుల మధ్య ఉండే ప్రదేశమా? కొండలూ కోనలూ, నదులూ సముద్రాలూ, కోటలూ తోటలూ నిండి ఉన్న ప్రాంతమా? దేశభక్తి అంటే వీటన్నిటినీ కీర్తించటమేనా? ప్రపంచంలో ఇవి మాత్రమే గొప్పని చంకలు గుద్దుకోవటమా?

.... ఇవేమీ కాదే కాదన్నాడు మహాకవి గురజాడ. దాదాపు నూట పదకొండేళ్ల క్రితమే .. 'దేశమంటే మట్టి కాదోరు.. దేశమంటే మనుషులోరు' అని గొంతెత్తి చాటాడు. అది ఎంత గొప్ప నిర్వచనం! మనిషిని కేంద్రంగా చేసుకొని దేశాన్ని వివరించటం అప్పటికీ ఇప్పటికీ ఒక గొప్ప అద్భుత భావన.

గురజాడ దేశభక్తి గేయంలో అర్థం కాని పదాలు ఉండవు. తాత్పర్యం చెప్పుకోవాల్సిన అంతరార్థాలు ఉండవు. వినీ వినగానే సామాన్యులకు సైతం అవగతమై పోతాయి. సూటిగా, సరళంగా, అర్థవంతంగా ఉంటాయి. 'దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా..' అని నేరుగా చక్కని ఉద్బోధతో గేయం ప్రారంభమవుతుంది. ప్రతి వాక్యమూ ఒక గొప్ప అర్థాన్నిస్తుంది. కర్తవ్యాన్ని బోధిస్తుంది. ఆ గేయ చరణాలు చదువుతుంటే- ఆచరణతో కూడిన దృశ్యాలు మన కళ్లముందు కనబడతాయి.

''దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయి''

గురజాడ తెలుగు భాషకు ఎన్నో కొత్త పదబంధాలను, నుడికారాలను సృష్టించి ఇచ్చారు. అందుకే ఆయన మార్గదర్శి అయ్యారు. మహాకవి అయ్యారు.

''వొట్టి మాటలు కట్టిపెట్టోరు
గట్టి మేల్ తల పెట్టవోరు
పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోరు!
తిండి కలిగితే కండ కలదోరు
కండ కల వాడేను మనిషోరు!''

.... పచ్చని పొలాల్లో కలిసి మెలసి పనిచేస్తున్న శ్రామికులను, పచ్చదనంతో పరవశించే మనుషుల ఔన్నత్యాన్ని చాలా చక్కగా ఆవిష్కృతం చేశారు.

దేశభక్తిని ప్రోదుచేసే గేయాలలో తొలిసారిగా తలచుకోవలసిన గేయం గురుజాడ అప్పారావుగారి దేశభక్తి గేయం. అడుగుజాడ గురజాడది అది భావికి బాట అన్నారు శ్రీశ్రీ. గురజాడ అభ్యుదయ దృక్పథం, సమాజ సంస్కరణ, మానవత్వం వంటి గొప్ప అంశాలను సులభమైన వాడుకభాషలో గుండెలకు నాటుకునేలా చక్కని గేయాలుగా మలిచారు. ఆ గేయాలలో చాలా ప్రముఖమైనది ఈ దేశభక్తి గేయం.

ఈ గేయంలో దేశంలో ఉండే ప్రజలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే ఏం చెయ్యాలో చెప్పారు గురజాడ. పలు మతాలకు, జాతులకు నెలవైన భారతదేశంలో ప్రజలందరి మధ్య సయోధ్య, సౌభ్రాత్ర భావన ఆవశ్యకతలను ఈ గేయంలో చెప్పారు. అంతే కాక కవి అనే

వాడు దేశ భక్తిని పెంపొందించే రచనలు చేయాలని తద్వారా దేశం పట్ల అభిమానం ప్రజలలో మొలకెత్తేలా చేయాలనే గొప్ప సందేశం కూడా ఇచ్చారు. అందుకే దేశ భక్తి గేయాలలో తలమానికమైనది ఈ గేయం.

1896లో అప్పారావుగారు అనందగజపతిరాజు సంస్థానంలో 'శాసన పరిశోధకుని'గా చేరారు. మద్రాసు, బెంగుళూరు, బెజవాడ, శ్రీకాకుళం వంటి పట్టణాలు తిరిగి ఎంతో చరిత్ర సేకరించాడు.

గుత్తునా ముత్యాలసరములు
కూర్చుకొని తేటైన మాటలు
కొత్త పాతల మేలు కలయిక

క్రొమ్మెరంగులు జిమ్మగా'లి అంటూ 'ముత్యాల సరాలు' నూతనఛందః సృష్టికి నాందీగీతం పాడి రసగీతాలు విన్పించారు మహాకవి గురజాడ. విశ్వమానవ సౌభ్రాతృత్వము, సంఘ సంస్కరణ ప్రియత్వము, మానవతా వాదము, ప్రేమ తత్త్వము, జాతీయ దృక్పథము, దేశభక్తి గురజాడ వారి 'ముత్యాలసరాలు'లో పుష్కలంగా వున్నాయి.

'మలినదేహుల మాల లనుచును
మలినచిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణధర్మము
ధర్మ ధర్మంబే,
మంచి చెడ్డలు మనుజులందున
చూడగా, రెండె కులములు
మంచి యన్నది, మాలయైతే,

మానే లేగుదున్!' (లవణరాజుకల) మహాత్మాగాంధీ హరిజనోద్యమం ప్రారంభం కాక ముందే రచించిన గేయమిది. ఈ గేయం ద్వారా గురజాడ సాహిత్యకారుడే కాక గొప్ప సంఘ సంస్కర్తగా కనిపిస్తాడు.

"మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పల కన్న కనిష్టం!
గానుచూస్తావేల బేలా?
దేవుడెకడో దాగెనంటూ
కొండకోనల వెతుకులాడేవేలా?
కన్ను తెరిచిన కానబడడో?
మనిషి మాత్రుడి యందు లేడో?

యెరిగి కోరిన కరిగి యీడో' - ముక్తి - చిల్లర రాళ్ళకు మొక్కుతూ, చైతన్యం కోల్పోయిన మానవుణ్ణి తట్టిలేపే రచన యిది. సాటి మనిషి హృదయంలో దేవుడున్నాడని, అతణ్ణి పూజించమని, అదే ముక్తి దాయకమని గురజాడ మనకిచ్చిన మహత్తర సందేశం.

దేశభక్తి గేయం సంకుచితమైన సరిహద్దులకు అతీతంగా ప్రపంచంలో ఏ దేశమైనా పాడుకోగలిగినంత విశాలమైన భావంతో రూపొందిందన్నారు. అందులో ప్రతి చరణంలోనూ ఒక సందేశం వుందని, నేటి దేశ పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా తయారైనాయని వివరించారు. ప్రపంచీకరణ సాంస్కృతిక దాడికి దేశీయ భాషలు, సంస్కృతులు అంతరించిపోతున్న నేటి స్థితిలో గురజాడ అడుగుజాడ నిత్యస్మరణీయం, ఆయన గేయాలు అద్భుతీయం.

అప్పారావు గారి గేయ కథలలో: కన్యక, లవణరాజు కల, పూర్ణమ్మ కథ, డామన్ - పిథియస్ ముఖ్యమైనవి.

'మేలిమి బంగరు మెలతల్లారా.
కలువల కన్నుల కన్నెల్లారా
తల్లుల గన్న పిల్లల్లారా
విన్నారమ్మా యీ కథను' -

అంటూ కథ ప్రారంభమవుతుంది.

'కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి చేరెను మేలిపసల్
హంసల చేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ'

పూర్ణమ్మ కథను గూర్చి శ్రీశ్రీ 'ఒక మహాకావ్యాన్ని చదివిన అనుభూతి పూర్ణమ్మ కథ చదివాక మనకు మిగులుతుంది' అని అంటారు. ఇది అక్షరాలా నిజం.

'బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు
బ్రీతి గూర్చునొ, వాడె ధన్యుడు' -

గురజాడ పైవాక్యాలు ఏ ఉద్దేశ్యంతో రాసినప్పటికీ, రాబోయే కాలంలో ఆయనకే అవి మరింత అన్వర్థ సార్థక మయ్యాయి.

'నాది ప్రజల ఉద్యమం. దాన్ని ఎవర్నీ సంతోష పెట్ట డానికీ వదులుకోలేను' అన్న అప్పారావుగారి మాటల్లోని ఆత్మవిశ్వాస ప్రకటనం అనంతర రచయితలకు ప్రాణ వాయువు వంటిది. గురజాడ రాసిన వ్యాసచంద్రిక'! లో అరడజను వ్యాసాలు వాడుకభాషా వైశిష్ట్యాన్ని వివరించేవే.

1889 నుండి మాత్రమే 'మహాకవి డైరీలు' మనకు లభ్యమవుతున్నాయి. రవీంద్రనాథ ఠాగూరును స్వయంగా కలుసుకొని, ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. హరప్రసాద్ శాస్త్రి, అశుతోష్ ముఖర్జీ, గురుదాస్ బెనర్జీ వంటి ప్రముఖ రచయితలతో ఆయనకు స్నేహం ఉంది. గురజాడ అప్పారావుగారిని 'గురజాడవాల్మీకి' అని కీర్తించిన ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు 'గురజాడ అప్పారావు తెలుగు సారస్వతానికి సరిహద్దు' - అన్నారు.

'కొత్త తరానికి గురువెవరంటే
గురజాడే అని నేనంటాను' అని డా॥ దాశరథి అన్నారు.

గురజాడ జీవితం సాహిత్యం మొత్తం గనుక పరిశీలిస్తే ఆయనలో మనకొక ద్రష్ట కనిపిస్తాడు. రాబోవు యుగం రూపు రేఖలూ, రాబోవు సమాజం స్వరూప స్వభావాలూ, రావాల్సిన మార్పులు, చేయాల్సిన చేర్పులూ, తెలుగు భాషను అభివృద్ధి పరచడానికి అవసరమైన చర్యలూ, ఉత్తమ మానవ విలువలుగల్గిన సమాజ స్థాపనా, మొదలైనవెన్నో ఆయన రచనల్లో, ఆయన ఊహల్లో మనకు కనబడ్డాయి. ఆనాటి ఛాందస వాతావరణం నుండి బయటపడి, ఎంతో ముందుచూపు ప్రసరించిన సాహితీ విప్లవకారుడు గురజాడ. కవితా కళకు మనం వొదిగి ఉండవలసిన వాళ్ళమే అయినా, మానవ సమాజం పట్ల మనకు మహత్తరమైన బాధ్యత ఉంది.

'జీవితంలో సమస్యలు వచ్చినపుడు వాటిని ఎదుర్కొనేందుకు కొందరికి భయం. వాటిని తప్పించుకు తిరిగినంత మాత్రాన అవి తొలగిపోవు. కష్టాలను ధైర్యంతో ఎదుర్కొన్నప్పుడు ఆనందం కలుగుతుంది'. -గురజాడ తన రచనల్లో పేర్కొన్నారు. తన రచన ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించినవారు.

తెలుగు సాహిత్యాన్ని తన గేయాలతో సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకు గురజాడ అప్పారావు గారు.

❖❖❖

తెలుగు సాహిత్యంలో దేశభక్తి రచనలు - వైవిధ్యం

- ఐ. క్ష్మధరీన, అసిస్టెంట్ ప్రొఫిసర్, తెలుగుశాఖ, గవర్నమెంటు డిగ్రీ సిటీ కాలేజ్, హైదరాబాద్.

మాతృభూమి మీద అపారమైన గౌరవంతో కూడిన ప్రేమ 'దేశభక్తి'. మానవుడి నరనరాల్లో ప్రవహించే మహోదత్త భావన దేశభక్తి. మనం పుట్టిన మట్టిని దేశంగా, దేశాన్ని మాతృ స్వరూపిణిగా భావించడం దేశభక్తి. ఈ దేశంలోని సర్వమూ మనకు పవిత్రమైనవే, ఆరాధించ దగ్గవే. అందువల్లనే దీన్ని మనం 'దేశభక్తి'గా పరిగ ణిస్తున్నాం 'దేశాభిమానం' అంటున్నాం.

''జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి''

దేశభక్తి ప్రతిజాతికి నిసర్గ సుందరమైన సహజభావన. అవసరమైనప్పుడు లావాలా విజృంభించి ప్రభంజనంలా వ్యాపించి - పగవాడి అంతు తేలుస్తుంది. ఇది దేశభక్తికున్న శక్తి. దేశభక్తి అన్న భావన నిర్వచనాలకందేది కాదు. నిత్యనూతనమైంది. తను పుట్టిన దేశంమీద నిష్కళంక మైన, నిరుపమానభక్తి-ఆచారాలమీద, సంప్రదాయాల మీద అపారమైన అభిమానం! తన జాతి శ్రేయస్సుకోసం పాటుపడాలనే తపన - ఇవీ దేశభక్తికి మూలభూతాలైన సూత్రాలు. సూర్యుడు అస్తమించని బ్రిటిషు. సామ్రాజ్యం మీద భారతీయులు సాగించిన స్వాతంత్ర్యోద్యమానికి తమ దేశం మీదున్న భక్తే కారణం. ఒక శతాబ్ది భారతీయుల మనస్సులను పూర్తిగా ఆక్రమించుకొని లక్ష్యం సాధించేటట్లు చేసిందీ దేశభక్తి. దేశభక్తి కవితల్లో కనిపించే సామాన్య లక్షణాలివి. పరపాలనా నింద - విముక్తి పోరాటం - పాలకుల నియంతృత్వ ధోరణులపై విమర్శ దేశంపై అనన్య ప్రేమ భక్తి. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, వేష భాషల ప్రశంస పురాతన వైభవాన్ని గుర్తుచేసి ఉత్సాహం కలిగించడం - నాయక ప్రశంస - నాయక స్మృతి - వీరుల ప్రశంస - సర్వమానవ సమానత్వ ప్రబోధం - ప్రపంచ శాంతి కాంక్ష మొదలైనవి.

వ్యాపార నిమిత్తం భారతదేశానికి వచ్చిన బ్రిటిషువారు ఇక్కడ రాజులు పరిస్థితులు అనుకూలించడంతో సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారు. క్రీ.శ.1757లో ప్రారంభమై వీరి సామ్రాజ్య విస్తరణ క్రీ.శ.1856కు పూర్తయింది. దేశమంతా ఈస్టిండియా కంపెనీ పాలనలా, వచ్చింది. దేశ ప్రజల్లో జాతీయతాభావం లోపించడం, నాయకుల అనైక్యత, సంకుచిత ఆ ప్రజల నిర్లక్ష్యవైఖరి ఈ అనర్థానికి ప్రధాన కారణాలు. 1857 నాటికి భారత ప్రజల్లో మార్పు వచ్చింది. బ్రిటిషువారి రాజకీయ, ఆర్థిక విధానాలన్నీ వారి సౌకర్యానికి కానీ ఇక్కడి ప్రజల కోసం కాదని క్రమంగా అనుభవం మీద తెలుసుకొన్నారు. అందరిలో పరాధీనులమై ఉన్నామన్న భావం ఎక్కువైంది. 1857లో భారత దేశంలో మొదటిసారిగా స్వాతంత్ర్యం కోసం పెద్ద యెత్తున సాయుధ పోరాటం జరిగింది. ఫలితంగా భారతీయులు సాయుధ పోరాటంలో బ్రిటిష్ వంటి సామ్రాజ్యవాదులను ఓడించడం కష్టమని గ్రహించి, అన్యమార్గాలను అన్వేషించాలని తెలుసుకున్నారు.

పాశ్చాత్య విద్య, రైల్వేలు, తంతి తపాలా సౌకర్యాలు దేశంలోని వివిధ ప్రాంతాలను ఒకటి చేశాయి. పత్రికలు జాతీయభావం నాటుకోవడానికి కృషి చేశాయి. 28 డిసెంబరు, 1885లో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ స్థాపన భారత స్వాతంత్ర్య సముపార్జనలో ప్రముఖ ఘట్టం. మొదటిసారిగా దేశాన్నంతా కలచివేసిన రాజకీయ సంఘటన బెంగాల్ విభజన. బెంగాల్లో ఉర కలు వేస్తున్న జాతీయోద్యమాన్ని బలహీనపరచడానికి 'విభజించి పాలించు' అన్న సూత్రాన్ని ఆచరణలోకి తెచ్చి 1905 జూన్, 20న వైస్రాయి కర్జన్ ప్రభువు బెంగాల్ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేశారు. ఈ చర్యతో బ్రిటిషు ప్రభుత్వం భారత ప్రజల ఆగ్రహావేశాలకు గురైంది. అంతకు మునుపు రేఖామాత్రంగా ఉన్న జాతీయోద్యమం విజృంభించింది.

ప్రపంచ చరిత్రలో ఏ రాజకీయ ఉద్యమానికైనా కవిత్వం ఊపిరి - ఉత్తేజం - ప్రోత్సాహం. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో తెలుగు సాహిత్యంలో దేశభక్తి ఉవ్వెత్తున ఎగిసింది. స్వాతంత్ర్య సంగ్రామ కవులు, రచయితలు ఉత్తేజితులై - ప్రజల్ని ఉత్తేజితుల్ని చేశారు. బంకించంద్ర చటర్జీ గారి వందేమాతరం నినాదం, బిపిన్ చంద్రపాల్ గారి ఆంధ్ర పర్యటన ప్రజల్ని మేల్కొల్పాయి. ఉత్తేజపరిచాయి. చిలకమర్తి లక్ష్మీనరసింహం, దువ్వూరి రామిరెడ్డి, బనవరాజు అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, గుఱ్ఱం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, కొడాలి ఆంజనేయులు, తుమ్మల సీతారామమూర్తి మొదలైనవారు తెలుగులో దేశభక్తి కవిత్వాన్ని వెలువ రించారు. పాటలు, పద్యాలు, నవలలు, నాటకాలు, కావ్యాలు, గేయాలు వంటి వివిధ ప్రక్రియల్లో జాతీయోద్యమ సాహిత్యం ప్రాచుర్యంలోకి వచ్చి, సంగ్రామానికి అండదండగా కాహళాలూదింది. జాతీయోద్యమ ప్రభావంతో ప్రజలను ఉత్తేజపరిచే, జాగృతం చేసే సాహిత్యం, దేశ పూర్వ వైభవాన్ని గుర్తుకు తెచ్చే సాహిత్యం, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైనవాటి ప్రభావానికి లోనై ఉధృతంగా ప్రవహించింది. ఎన్ని సాహిత్య ప్రక్రియలు వచ్చినా భావోద్వేగానికి, ప్రజా ప్రేరణకు మంచి వాహికగా కవులకు ఉపయోగపడింది గేయ కవిత్వం. ఇది పామరులను సైతం కర్తవ్యోన్ముఖులను చేస్తుందనే కవుల ఆశ ఫలించింది.

సహాయ నిరాకరణ పన్నులు నిరాకరణ ఉద్యమాల కాలంలో సాహిత్యం విరివిగా వెలువడింది. గరిమెళ్ళ సత్యనారాయణ

"అన్నలార రండీ ! - మన అమ్మనుడి వినండి ముం
దు దున్న పని కనండి - ఏమన్న జడియకండి
॥అన్న॥

.....

అన్న గేయం ఆంగ్ల ప్రభుత్వాన్ని ఎదిరించడానికి భారతీయులను సంసిద్ధం చేసింది. తెల్లదొరల పన్నుల విధానాన్ని

"ఉప్పు పన్ను, పప్పు పన్ను,
ఊరికెళితె పన్ను బాబు,
కొప్పు కాస్త దేముడికి మొక్కుకుంటే పన్ను బాబు"

అని గరిమెళ్ళ సత్యనారాయణ తూర్పారబట్టారు.

1930 ప్రాంతంలో ఉన్నవ లక్ష్మీనారాయణగారి ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహోద్యమం ప్రభావంతో శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు స్వాతంత్రంగా యోధులనుద్దీపింపచేస్తూ రాసిన గేయం

వీరగంధము తెచ్చినారము
వీరులివ్వుడీ తెల్పుడీ
పూసిపోతాము మెడను వైతము

పూలదండలు భక్తితో అనాడు ఈ గేయం తెలుగు బిడ్డల్లో ఉడుకు రక్తాన్ని ఉర్రూతలూగించిదనడంలో ఎంత మాత్రమతిశయోక్తి లేదు.

1907 ఏప్రిల్‌లో బిపిన్ చంద్రపాల్ గారి ఆంధ్ర పర్యటన సందర్భంగా వీరి ఉపన్యాసాలను తెనిగించిన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు అతని ప్రభావంతో ఆశువుగా చెప్పిన

తె. భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగ దూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి".

ఈ పద్యం భారతదేశ సౌభాగ్యాన్ని ఆంగ్లేయుల పీడనను, దోపిడీతనాన్ని చాటి చెప్పిన ఉద్యమ సాహిత్యంలో కలికితురాయి.

చిలకమర్తివారు 1907లో ఆశువుగా చెప్పిన "భరత ఖండంబు చక్కని పాడియావు" అన్న పద్యానికి ఉత్సాహమిచ్చిన రచన 1905 డిసెంబరు 15వ తేదీ కృష్ణా పత్రికలో "ది క్రై ఆఫ్ మదర్ ఇండియా" గా స్ఫురిస్తుందని డా.మద్దూరి సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

"హిందువులారా ! ఎన్నాళ్ళీ గతి

వంగ విభజన, నాయకుల ప్రబోధం ఎంత ప్రభావాన్ని చూపాయో ఆంగ్లేయులు భారతదేశ సంపదను కొల్లగొట్టిన రీతిని, దేశీయులు కర్తవ్య నిర్వహణకు అంకితం కాగలమన్న విశ్వాసాన్ని తెలియపరచిన విధానానికి గీతమే సాక్ష్యం. ఇలా ఆరంభమైన దేశ భక్తి గేయ సాహిత్యం, దేశాభిమానం, పరపాలనా నిందం జాగృతి ప్రధాన ఉద్దేశాలుగా వెల్లువెత్తింది. అంతకు ముందు అంతంత మాత్రంగా సాగిన జాతీయోద్యమం 1920 ప్రాంతంలో గాంధీ మహాత్ముడు భారత జాతీయోద్యమానికి నాయకత్వం వహించినప్పటి నుంచి ఆయన ఆశయాల కనుగుణంగా ఒక క్రమపద్ధతిలో ముందుకు సాగింది. కవులు మహాత్ముని గురించి, వారి సిద్ధాంతాలైన సత్యం, అహింస, శాంతి, దయ, శరీరశ్రమ, స్వదేశ వస్తు వినియోగం, అస్పృశ్యతా నిర్మూలన, పరమత సహనం, మానవతావాదం, సామ్యవాద సిద్ధాంతం మొదలైన వానితో మేళవించి స్వాతంత్ర్యాలిభాషను కలిగించడానికి ఉత్సాహం చూపారు.

గాంధీగారి రాకతో 1920లో సహాయ నిరాకరణ ఉద్యమం, 1922లో పన్నుల నిరాకరణోద్యమం, 1930లో ఉప్పు సత్యాగ్రహం, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన స్వాతంత్ర్యోద్యమాలు ప్రధాన ఘట్టాలయ్యాయి. వీనికనుగుణంగా సాహిత్యం ఆవిర్భవించి ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపింది. ప్రతి కవి స్వరాష్ట్ర సంబంధమైన భక్తి భావాన్ని పునాదిగా చేసుకొని జాతీయవాదాన్ని దివ్యసౌధంగా నిర్మించడానికి ప్రయత్నిస్తాడు. ఆ దివ్యసౌధంలో విశ్వమానవుల్ని నివసింప చేస్తాడు. "విశ్వశ్రేయః కావ్యమ్' అన్న ఆర్యోక్తిని అక్షర సత్యంగా నిరూపిస్తాడు. ఆంధ్ర సాహితీ నందనోద్యానంలో దేశాభిమాన కవితాపుష్పాల్ని పూయిస్తాడు. అలాంటి కోవకు చెందిన రాయప్రోలు ! సుబ్బారావు గారు ఆధునికాంధ్ర కవితా నందనోద్యానంలో వికసిత సుమధుర పుష్పం.

మనదేశాన్ని ఆంగ్ల ప్రభుత్వం రెండు వందల సంవత్సరాలు పాలించింది. బానిసత్వంలో మగ్గడం వల్ల భారతీయులలో బానిసత్వాన్ని రూపుమాపాలన్న కోరిక ప్రబలింది. ఆంగ్లేయుల ఆచారాన్ని, వంగదేశ విభజనని వ్యతిరేకించడంతో భారతీయులలో జాతీయాభిమానం మొలకెత్తింది. 'వందేమాతం' గేయ రచయిత బంకించంద్ర చటర్జీ, 'జనగణమన గేయ రచయిత రవీంద్రనాథ్ టాగూర్ ఆంధ్రకవుల్ని ఉత్తేజపరిచారు. అలా ఉత్తేజితులైన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, జాతీయాభిమానంతో ఆంగ్ల ప్రభుత్వాన్ని విమర్శించిన ప్రప్రథమ భారత జాతీయ కవిగా ప్రసిద్ధి చెందారు. చిలకమర్తి వారి ప్రభావం తరవాత తెలుగు కవుల మీద పడింది. అలాంటి మేటికవులలో రాయప్రోలు సుబ్బారావుగారిని పేర్కొనాలి. రాయప్రోలువారి దేశాభిమానం" అందులోను ఆంధ్రాభిమానం అనిర్వచనీయం.

రాయప్రోలు వారు భారతీయతను ఉపాసించారు. దేశభక్తికి సంబంధించి వీరు రాసిన కవితలు పరిమిత సంఖ్యలో ఉన్నా అవి ఆంధ్రదేశంలో కలిగించిన ప్రభావం మాత్రం మహత్తరం, అపారం. వీరికి తెలుగు తల్లి మీద ఎంత పూజ్య భావముందో, భారతమాత మీద కూడా అంతేభక్తి శ్రద్ధలు ఉన్నాయి. వీరికి భారతదేశం పరమ పుణ్యవతి అయిన భూదేవతా 'చల్లనితల్లి,

రాయప్రోలు వారి దేశాభిమానం మాతృభూమి మహనీయత, నదీప్రేమ, దేశనాయక సంస్మరణ సృతి, ఆర్థిక దుర్దశ పట్ల ఆర్తి, స్వాతంత్ర్య సమర శంఖారవం, స్వరాజ్య కాంక్ష స్వరాజ్య ప్రాప్తికై ఆవేదన, దేశరక్షణ అనే అంశాలలో ప్రస్ఫుటమవుతుంది. రాయప్రోలువారి 'జన్మభూమి', 'తమ్ముడా' కవితలు దేశాభిమానాన్ని ప్రబోధించడంతోపాటు ఆంధ్రదేశాభిమానాన్ని కూడా ప్రబోధించాయి. జాతీయోద్యమ కవిత్వంలో ఈ రెండు కవితలకు విశిష్ట స్థానం ఉంది.

సూర్యుని వెలుతురుల్ పోకునందాక

.....

మనభూమి వంటి కమ్మని భూమిలేదు"

మనదేశాన్ని 'కమ్మని భూమి' అనడంలో కవికి దేశం మీదున్న ప్రీతి వ్యక్తమవుతుంది. మనదేశాన్ని ఏ దేశంతోనూ పోల్చక 'అనంత భూతలి'లో దీనికి సాటి లేదనడంలో సమస్త భూమండలంలో భారతదేశపు ఆధిక్యాన్ని, వైశిష్ట్యాన్ని కవి ఎత్తి చూపడం జరిగింది. మనదేశం తన ప్రాశస్త్యాన్ని 'ఎంత కాలం నిలబెట్టుకోగలదు' అన్న ప్రశ్నను వేసుకొని తామే సమాధానం చెప్పారు. 'సూర్యుని వెలుతురు సోకు నందాక 'అంటే సూర్యుని వెలుతురు ఎప్పటికీ మాయం కాదు. అది శాశ్వతమైంది. అంటే అనంతకాలం మనదేశ ప్రతిష్ట భూమి మీద నిలబడు తుందని కవి అభిప్రాయం. 'ఓడల జెండాలు ఆడు నందాక - సముద్రం మీద ఓడలున్నంత కాలం జెండాలు ఎగురుతూనే ఉంటాయి. కాబట్టి చిరకాలం మనదేశం తలెత్తుకొని నిలబడగలదని కవి విశ్వాసం. ''నరుడు ప్రాణాలతో నడుచునందాక - మానవుడు ప్రాణాలతో బ్రతికి ఉండేంతవరకు అంటే అనంతకాలం మనభూమి ఘనత నిలబడి ఉంటుందని కవి అభిప్రాయపడ్డారు. రాయప్రోలు వారు భారతదేశం కీర్తి ప్రతిష్టలు ఆచంద్ర తారార్కం శోభిల్లగలవని కవితాత్మకంగా చెప్పారు.

రాయప్రోలు సుబ్బారావుగారి దేశాభిమానానికి వెలకట్టలేం. ''లేదురా ఇటువంటి భూదేవి - యెందు' అన్ని పాదాలు రాయప్రోలు వారి ఆత్మవిశ్వాసానికి, స్వాభిమానానికి మచ్చుతునకలు.

''ఏదేశమేగినా ఎందుకాలిడినా
ఏపీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండు గౌరవం' అంటూ

పాదు సుమ్మిది చెల్లెలా' అంటూ భరతభూమిని కీర్తించడంలో కర్మభూమి అయిన భారతదేశంలో జన్మించడం ఎంత పుణ్యఫలమో రాయప్రోలువారి భావాల్లో వ్యక్తమవుతుంది. భారత స్వాతంత్ర్య సమరంలో విజయుడై విజృంభించి బ్రిటిషు ప్రభుత్వాన్ని అణగ దొక్కాలని ప్రబోధించారు.

''పొంగి పొరలు నదిం గనుంగొని
క్రుంగి పోవగ నేటికో యిటు
నావపయి చుక్కాని త్రిపుర
నావికుడు నిలుచుండగన్

స్వాతంత్ర్య సమరంలో సమర్థుడైన నాయకుడు (గాంధీజీ) ఉండగా ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, నిరాశకు లోనుగానక్కర లేదనీ కవి ధైర్యం చెప్పడం ఈ పద్యపాదాల్లో కనిపిస్తుంది. భారతజాతీయ భావానికి ప్రోద్బలంగా రాయప్రోలు వారిలో ఆంధ్రాభిమానం కనిపిస్తుంది. భారతీయ జీవన స్రవంతిలో ఆంధ్రుల జీవన స్రవంతి ముడిపెట్టుకొని ఉంది.

'నాదుజాతి, నాదేశము, నాదుభాష
అను అహంకార దర్శన మందుమాంధ్ర'

అని రాయప్రోలు సుబ్బారావుగారు ప్రబోధించారు. ఈ పద్యపాదాల్లోని 'అహంకార దర్శనం'' రావేద్యమ కవిత్వానికి నాంది పలికింది. ఆంధ్రజాతి, ఆంధ్రదేశము, ఆంధ్రభాష అనే అభిమానం ప్రతి ఆంధ్రుడిలోనూ కలగాలని ఉద్బోధించారు. 'ఆంధ్ర', 'ఆంధ్రమాత', 'ప్రబోధము', 'తెనుగు మాన్యము', 'తెనుగుతల్లి' వంటి రచనల్లో రాయప్రోలు వారికి ఆంధ్రదేశం, ఆంధ్రజాతి, ఆంధ్రభాషల మీద ఉన్న అభిమానం వ్యక్తమవుతాయి.

ఇలా రాయప్రోలు సుబ్బారావు మొదలైన కవులు తమ కవితల్లో అమితమైన దేశాభిమానాన్ని ఆంధ్రాభిమానాన్ని వ్యక్తీకరించారు. వీరి కవితలు జాతీయోద్యమానికి స్ఫూర్తి నిచ్చాయి. కవిత్వానికి సొంపులు తీర్చిదిద్దాయి. వీరికవిత్వం ఆంధ్రాభిమానానికి, దేశాభిమానానికి భాసిల్లిందనడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - డా.మద్దూరి సుబ్బారెడ్డి
2. రాయప్రోలు రచనల పరిశీలన - తత్య వివేచన - ఎం.లావణ్య సరస్వతి

❖

రాయప్రోలు ఆంధ్రావళిలో దేశభక్తి

– నిదెనకళి నీరజ, అసోసియేట్ ప్రొఫెసర్ - తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్, హైదరాబాద్.

భావకవితా యుగకర్త, అమలిన శృంగార సిద్ధాంత కర్తగా పేరు పొందిన రాయప్రోలు సుబ్బారావు మార్చి 15-1892లో గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా గార్లపాడు గ్రామంలో జన్మించాడు. విశ్వకవి రవీంద్రుని శాంతి నికేతనంలో కొంతకాలం విద్యాభ్యాసం చేశాడు. 1908లో లలిత కావ్యం ద్వారా వీరి కావ్య రచన ఆరంభమైనదని చెప్పవచ్చు. తృణకంకణం కావ్యంలో అమలిన శృంగారాన్ని ప్రవేశపెట్టి తెలుగు సాహిత్యాన్ని కొత్త మలుపు తిప్పాడు. కష్టకమల, స్నేహలత, ఆంధ్రావళి, జడకుచ్చులు, తెలుగుతోట, రమ్యలోకం, మాధురీ దర్శనం మొదలైనవి వీరి ఇతర రచనలు. వీరి మిశ్రమంజరి కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. వీరు ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగుశాఖలో అధ్యాపకులుగా పనిచేశారు. వీరు 1984 జూన్ 30వ తేదీన మరణించారు.

తెలుగులో దేశభక్తి కవిత్వం :

ఆంగ్లేయుల పరిపాలన కాలంలో జాతీయోద్యమంలో భాగంగా ప్రతి కవిలో నిద్రాణమై ఉన్న జాతీయ భావం పెల్లుబికి దేశభక్తి కవిత్వంగా మారిందని చెప్పవచ్చు. చిలకమర్తి వారి ''భరత ఖండంబు చక్కని పాడియావు'' తెలుగులో దేశభక్తి కవిత్వానికి శ్రీకారం చుట్టిన మొదటి రచన, తర్వాత గురజాడ 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుష్యులోయ్' తర్వాత రాయప్రోలును పేర్కొనవచ్చు. రాయప్రోలు రచించిన - ఏ దేశమేగినా, ఎందుకాలిడిన, ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనిన, పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవం. అనే గేయం అనాటి సమాజానికి తారక మంత్రంగా పని చేసిందని చెప్పవచ్చు. రాయప్రోలు ప్రభావంతో తెలుగునాట చాలా మంది కవులు దేశభక్తి కావ్యాలను వ్రాశారు. అందులో విశ్వనాధ - ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి, పుట్టపర్తి నారాయణా చార్యుల - పెనుగొండ లక్ష్మి, దువ్వూరి రామిరెడ్డి - కొండవీడు మొదలైనవి.

ఆంధ్రావళి :

''జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'' అనే బోధన నాలో సుళ్ళు తిరిగింది. తల్లికంటే పరమామృతము లేదను నిశ్చయం పెట్టుకుని నా దేశ ప్రజలను మేల్కొలపటానికి నాలోని చేతన మేల్కొంది. ఇదే నా కవితా లక్ష్యం అని రాయప్రోలు సుబ్బారావు గారు స్వయంగా చెప్పుకున్నారు. అందుకే వారు అంత ఉదాత్తమైన దేశభక్తి కవిత్వం రాయగలిగారు. ఈ ఆంధ్రావళిలో ప్రభోధం జన్మభూమి, పుస్తకం, ఆంధ్రమాత, తమ్ముడా, ఆంధ్ర, తెనుగుతల్లి, ఆచారము, తెలుగు మాన్యము, కీలకము అను శీర్షికలతో మొత్తం 10 ఖండికలున్నాయి. ఆంధ్రావళి గ్రంథంలో ఖండిక లన్నింటిలో గత వైభవస్మరణం. వర్తమాన స్థితి పట్ల విచారం, భవిష్యత్ కర్తవ్య ఉపదేశం అనే ఈ మూడు అంశాలు ముప్పేటగా మనకు కన్పిస్తాయి.

ఈ ఆంధ్రావళిలో రాయప్రోలు వారి దేశభక్తి దేశాభిమానం, రాష్ట్రాభిమానం అనే రెండు పాయలుగా సాగుతుంది. తెలుగుతల్లి అనే పదబంధాన్ని మొట్ట మొదట ప్రయోగించినవారు రాయప్రోలు వారేనని డా॥ సి.నారాయణ రెడ్డి గారు తమ సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు. అదే విధంగా ''మా తెనుగు తల్లి మెడకిదె మల్లెదండ'' అనేది కూడా రాయప్రోలు వారే ప్రప్రథమంగా ప్రయోగించారు. వీరి ప్రభావంతో వచ్చిందే శంకరంబాడి సుందరాచార్య - మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనే గేయం.

ప్రభోదము అనే ఖండికలో అమరావతీ పట్టణమున

బౌద్ధులు విశ్వ విద్యాలయములు స్థాపించినాడు అంటూ తెలుగు వారి గత వైభవాన్ని, పౌరుషాన్ని, కళావైదుష్యాన్ని ఎలుగెత్తి చాటి తెలుగువాణి, తెలుగుకత్తి, తెలుగురేఖ, తెలుగు భూమి యొక్క గొప్పదనాన్ని వివరిస్తాడు కవి.

'జన్మభూమి' అనే ఖండికలో

ఏ దేశమేగినా, ఎందుకాలిడిన అంటూ చివరకు
అవమాన మేలరా అనుమానమేల
భారతీయుడంచు భక్తితో పాడ

అంటూ ప్రతి భారతీయుడు దేశభక్తితో హృదయం పులకరించి పాడుకునే ఈ గేయం తెలుగులో వచ్చిన దేశభక్తి కవితలన్నింటికి స్ఫూర్తి దాయకమైంది. ఈ గేయం అప్పటికి ఇప్పటికి నిత్య నూతనం అని చెప్పవచ్చు.

'తమ్ముడా' అనే ఖండికలో

శ్రీలు పొంగిన జీవగడ్డయు
పాలు పారిన భాగ్యసీమయు
వ్రాలినది ఈ భరత ఖండము
భక్తి పాడర తమ్ముడా అంటూ

మాతృమూర్తి గొప్పదనం ఒడలు పులకించేటట్లుగా వర్ణించి, నిద్రాణమైన జాతిని జాగృతం చేయడానకి గత వైభవాన్ని స్మరించాడు కవి.

ఆంధ్రావళిలో ఆంధ్ర అనే ఖండిక ప్రత్యేకమైంది. తెలుగు వారి పూర్వ వైభవాన్ని సంస్కృతికి పట్టుకొమ్మలైన నిలిచిన ఇతిహాసాలు రామాయణ, భారతాలను, తెలుగు సీమను ఏలిన ఆంధ్రరాజుల శౌర్య పరాక్రమాలను, శాతవాహనుల కాలంలో వెలువడిన హాలుని గాథా సప్తశతిని, ఆచార్య నాగార్జునుని బౌద్ధ రచనలను, కన్నడ భారతాన్ని రచించిన పంపకవిని, తర్క శాస్త్రాని అపోశన పట్టిన అన్నంభట్టును, ఆయుర్వేద వేత్తగా ప్రసిద్ధి చెందిన బసవరా జగదవేత్తను, అదే విధంగా అనపోతశర్మ శౌర్య పరాక్రమాలను గోల్కొండ తెలుగు కీర్తిస్తంభాలుగా నిలిచిన అక్కన్న మాదన్నలను సంగీతజ్ఞులుగా ప్రసిద్ధి చెందిన త్యాగరాజు, నారాయణతీర్థ, క్షేత్రయ్యలను కీర్తిస్తూ, చివరగా తెలుగు వనితల విశిష్టతను గురించి వివరిస్తాడు. ఈ విధంగా ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించిన చరిత్ర, సంస్కృతి, సంగీత సాహిత్యాలు, వాస్తు శిల్పాలు ఈ విధంగా మొత్తం ఆంధ్రరాష్ట్రానికి సంబంధించి అన్ని రంగాల యొక్క పురావైభవాన్ని వర్ణించాడు కవి.

నాదుజాతి - నా దేశము - నాదుభాష
అను అహంకార దర్శన మందు మాంధ్ర అంటూ

తెలుగు జాతి, తెలుగు భాష, తెలుగు దేశం అంటూ వాటి గొప్పతనాలను వివరిస్తూనే, వర్తమాన స్థితి పట్ల విచారం వ్యక్తం చేసి భవిష్యత్తు కర్తవ్య ఉపదేశంతో ముగిస్తాడు కవి

'తెలుగుతల్లి' అనే ఖండికలో

శ్రీకాకుళ స్వామి సిగపై సువాసించె
తెల్లని ఆంధ్రుల మల్లెపూలు
ఒడ్డెరాజుల జీవగడ్డ గ్రక్కదలంగ
కోరాడె మత్తాంధ్ర కుంజరములు

.....

గంగ తల నుండి కావేరి కాళ్ళదాక
వెలిగె దిగ్మోహనమ్ముగా తెలుగు ఠీవి
తమ్ముడా ! మాయనిత్తువే తల్లివన్నె ?
చెల్లెలా ! చిన్నబుత్తువే తల్లి చిన్నె ?

.....

ఖండ ఖండాంతరముల ప్రకాశమయ్యె
తెనుగుతల్లి లలాటికా తిలకదీప్తి అంటూ

ఆ తెలుగు తల్లి వన్నె చిన్నెలు కాపాడవలసిన బాధ్యత ఆంధ్ర సోదరులందరి మీద ఉందని బాధ్యతను గుర్తు చేస్తాడు కవి. ఈ ఖండికలో కోనసీమ, గుంటూరు సీమ, నెల్లూరి సీమ, రాయలసీమ, తెలంగాణాలను ప్రస్తుతించి విశాలాంధ్ర భావాన్ని వ్యక్తం చేశాడు కవి.

'తెలుగు మాన్యము' అనే ఖండికలో

పాటకును పద్యమునకు నబ్రముగ వొదిగి
చవికి చాతుర్యమునకు సాజముగ సాగి
పోరునకు పొత్తునకు చాలి పొంది పాసగు
మా తెనుగు తల్లి మెడకిదే మల్లెదండ అంటూ

పాటకైనా, పద్యానికైనా, పోరుకైనా, పొత్తుకైనా, దేనికైనా చక్కగా సరిపోయే భాష తెలుగుభాష అని తెలుగు భాష యొక్క తీయదనాన్ని, మాధుర్యాన్ని వర్ణిస్తూ తమ రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ప్రాచీన కవులైన, నన్నయ మొదలు భట్టుమూర్తి దాకా వారందరిని, వారి కవితా రీతులను ప్రశంసిస్తాడు కవి. అదే విధంగా సంగీతంలో ప్రముఖ వాగ్గేయకారుడు అయిన త్యాగరాజు యొక్క గొప్పతనాన్ని కీర్తిస్తాడు కవి. వీటన్నిటితో పాటు అజంతా శిల్పులను కూడా కీర్తిస్తాడు.

ఆంధ్రామాత అనే ఖండికలో ఆంధ్రా పురావైభవాన్ని కీర్తిస్తూ జాతిన దేశ గర్వమును చక్కదిద్దే పనిలో ఉన్న నీ కుమారులకు ఆశీస్సులను అందించమ్మా ఆంధ్రామాత అని వేడుకుంటాడు కవి.

జాతి చరిత్రను తరువాతి తరాలకు అందించడంలో పుస్తకం పాత్ర మరువలేనిది. జాతి నిర్మాణంలో పుస్తకం కీలకమైంది. అందుకే రాయప్రోలు పుస్తకం గురించి ఒక ఖండిక వ్రాశారు. ఈ ఖండికలో ఆంధ్ర రాజ్యాన్ని పరిపాలించిన చాళుక్యులు, కాకతీయులు, పల్నాటి రాజులు, విజయనగర రాజులు మొదలైన ఆంధ్ర వీరుల గొప్పతనాలను, శౌర్య పరాక్రమాలను, యశో చరిత్రలను, అదే విధంగా ఆంధ్రుల శిల్ప కళానైపుణ్యాన్ని, ఆంధ్రవైభవాన్ని, గౌతమి కృష్ణ నదుల గొప్పతనాన్ని ఈ ఖండికలో ప్రస్తుతించాడు కవి.

హృదయములు విన పలుకక చదువు చెప్పు
పుస్తకతపస్విని తెనుంగు పూల పాదల
నిలిచి సేవాశుకమ్ములన్ పిలిచి పిలిచి
తిరుగ పాడించు గత జాతీయ గీతి

అంటూ పుస్తకం గొప్పతనాన్ని వివరిస్తూ ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పవలసిన అవసరాన్ని ఆవశ్యకతను వివరిస్తాడు కవి.

ముగింపు :

ఈ విధంగా రాయప్రోలు తన ఆంధ్రావళిలో ఆంధ్ర దేశ చరిత్రను, పురా వైభవాన్ని, నాటి నగరాలను, ఆంధ్ర రాజులను, వీర నారీమణులను, కవులను, కవితా రీతులను, నదులను, వాగ్గేయకారులను, వాస్తు శిల్పులను స్మరించి, ప్రస్తుతించడమే కాకుండా నాటి సమాజానికి భవిష్యత్ కర్తవ్య ఉపదేశం చేయడం వల్ల తర్వాతి తరాలకు కూడా మార్గదర్శిగా నిలిచాడని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1) రాయప్రోలు సౌందర్య దర్శనం - డా.కె. యాదగిరి (సిద్ధాంత వ్యాసం)
2) రాయప్రోలు రచనల పరిశీలన - తత్త్వవివేచన (సిద్ధాంత వ్యాసం) డా. ఎం. లావణ్య సరస్వతి
3) రాయప్రోలు సుబ్బారావు - ఆంధ్రావళి
4) భారతీయ సాహిత్య నిర్మాతలు రాయప్రోలు సుబ్బారావు - విహారి
5) వివేచన - సెప్టెంబర్ 1993 (అభినవాంధ్ర కవితా మార్గదర్శి, రాయప్రోలు సుబ్బారావు)

❖❖❖

ఆధునిక తెలుగు సాహిత్యంలో - దేశభక్తి

- డా॥. పి. కమల సుధారాణి, తెలుగు విభాగం, అసిస్టెంట్ ప్రొఫెసర్, గవర్నమెంట్ సిటీ కాలేజ్, హైదరాబాద్.

ప్రపంచంలోని ఏ సాహిత్యమైనా సమాజానికి మంచిని చేయడానికే ఉపయోగపడుతుంది, పడాలి. అందుకే సాహిత్యాన్ని సమాజానికి దర్పణం వంటిది అంటారు. సమాజంలోని విషయాలే సాహిత్యంలో ప్రతిబింబిస్తుంటాయి. అందుకే సమాజ జీవనానికి నిలువుటద్దం సాహిత్యం. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రక్రియల్లో అభ్యుదయ కవిత్వం, భావకవిత్వం ముఖ్యంగా చెప్పవలసినవి. ఆధునిక తెలుగు సాహిత్యం తొలినాళ్ళలో వచ్చింది భావకవిత్వం. ఇది ఆంగ్ల సాహిత్యంలోని కాల్పనిక కవిత్వాన్ని చూసి, చదివిన తెలుగు రచయితల సృష్టి. అయినా తెలుగువారు తమ ముద్ర నిలుపుకున్నారు. అందుకే దాదాపు 3 దశాబ్దాల పాటు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ఏలింది భావకవిత్వం. భావకవిత్వంలో ఎన్నో శాఖలున్నాయి. అందులో ఒకటి దేశభక్తి కవిత్వం. భావకవికి ప్రేరణ ప్రకృతి. అయినప్పటికి ఆనాటి జాతీయ ఉద్యమంతో ప్రభావితులైన కవులు ప్రజలను చైతన్యపరచటానికి దేశభక్తి కవిత్వాన్ని పద్యాల, గేయాల రూపంలో రచించారు. ఈ దేశభక్తి పద్యాలు పండిత, పామర ప్రజానీకాల నాల్కలపై నాట్యం చేసాయి అనడంలో అతిశయోక్తి లేదు. ఆధునిక తెలుగు కవిత్వానికి యుగకర్త ఎవరూ గురజాడా? రాయప్రోలా అనే మీమాంస వచ్చినప్పుడు డా॥ సి.నా.రె. గారు ఇద్దరూ అని వివరణ ఇచ్చారు.

రాయప్రోలు సుబ్బారావుగారు ఎందరో కవుల్ని, విమర్శకుల్ని తయారుచేసి "ఆచార్యదేవోభవ" - అని పించుకున్న ధన్యజీవులు. వీరి రచనలలో ప్రజా బాహుళ్యంలో బాగా ప్రసిద్ధికెక్కింది "జన్మభూమి" గేయం. ఇందులో దేశభక్తి, జాతీయాభిమానం, భాషావైభవం ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఏదేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమిభారతిని
నిలుపరా నీ తల్లి నిండు గౌరవమును.
ఏ పూర్వ పుణ్యమో ఏయోగ బలమో
జనయించినవాడ నీ స్వర్గఖండమునౌ
ఏ మంచి పూవులను ప్రేమించినావో
నినుమోసే ఈ తల్లి కనక గర్భమున
లేదురా ఇటువంటి భూదేవి యొందు
లేదురా మనపాటి పొరులింకెందు
సూర్యుని వెలుతురుల్ సోకనందాక
ఓడల ఝుండాలు ఆడునందాక,
అందాకగల ఈ అనంత భూతల్లిని
మన భూమి వంటి చల్లని తల్లి లేదు
పాడరా నీ తెలుగు బాలగీతములు
పాడరా నీవీర భావగీతములు - అంటూ ఇంకా ఇలా అన్నారు.

అవమాన మేలరా, అనుమానమేల భారతీయుడ నంచు భక్తితే పాడు అని జాతిని జాగృతం చేశారు. ఈ గేయం ద్వారా తెలుగుజాతి గౌరవాన్ని ఎలుగెత్తి చాటారు. శ్రీలు పొంగిన జీవగడ్డయి, పాలుపారిన భాగ్యసీమయి, వ్రాలినది ఈ భరతఖండము, భక్తితోపాడరా తమ్ముడా! అంటూ జాతీయవాదాన్ని, దేశభక్తిని చాటాడు రాయప్రోలు.

ఇంతే కాకుండా తెనుగుతల్లి గేయంలో నందనోద్యాన సౌందర్యము నెగబోయి - అంటూ ఆంధ్రదేశంలోని పలు ప్రాంతాల వైభవాన్ని స్తుతించారు.

మేలుకోవోయ్ భరతపుత్ర
మేలుకోవేయ్ చిరచరిత్ర
పిలుచుచున్నది వీరభారతి
ఎలుగు వినబడనంతటన్

అని పిలుపునిస్తూ యావత్ భారతజాతికి సందేశాన్నిచ్చి, మేల్కొల్పిన వైతాళికుడు రాయప్రోలు.

దేశభక్తి గేయాల ద్వారా ఆబాలగోపాలన్నీ ఆకర్షించి, చైతన్యపరిచి, జాతీయోద్యమం వైపు అడుగులు వేయించిన గొప్ప కవి రాయప్రోలు సుబ్బారావుగారు.

గురజాడ :

ఆధునిక తెలుగు కవిత్వానికి వేగుచుక్క వంటివాడు గురజాడ. గురజాడ అప్పారావు అక్షరాల ద్రష్ట, స్రష్ట. అచ్చమైన తెలుగు కవి, మహాకవి. సిసలైన సంఘసంస్కర్త. గురజాడ అడుగుజాడలతో ఆధునిక తెలుగు కవిత్వానికి కొంగొత్త దారులు ఏర్పడ్డాయి. ముత్యాలసరాలు అనే కొత్త ఛందస్సుతో తెలుగు సాహిత్యాన్ని కొత్తబాటలు వేశారు. ముత్యాలసరాలు అనే సరళమైన కొత్త ఛందస్సుతో రాసిన కవితలు నవ్యకవిత్వానికి వెలుగుబాటలు.

గురజాడ వారి దేశభక్తి గేయంలో యావత్ మానవ జీవనానికి ఉండాల్సిన నైతికవిలువలు, బాధ్యతలు చెప్పడం ప్రశంసించదగిన విషయం.

దేశభక్తిగీతాలు :

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్ !

పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటు పడవోయ్
తిండి కలిగితె కండ కలదోయ్
కండ కలవాడేను మనిషోయ్ !

ఈసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్
జల్లుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయ్ !

అన్ని దేశాల్ క్రమ్మవలె నోయ్
దేశి సరుకులు నమ్మవెలె నోయ్
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తి సంపద లబ్బవోయ్ !

వెనుక చూసిన కార్యమేమోయ్
మంచిగతమున కొంచెమేనోయ్
మందగించక ముందు అడుగేయ్
వెనుక పడితే వెనుకేనోయ్ !

పూను స్పర్ధను విద్యలందే
వైరములు వాణిజ్యమందే
వ్యర్థకలహం పెంచబోకోయ్..
కత్తివైరం కాల్చవోయ్ !

దేశాభిమానము నాకు హద్దని
వట్టి గొప్పలు చెప్పబోకోయ్
పూని యేదైనాను, నోకమేల్
కూర్చి జనులకు చూపవోయ్ !

ఓర్వలేమి పిశాచి దేశం
మూలుగులు పీల్చేసెనోయ్
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయ్!

పరుల కలిమికి పొర్లియేడ్చే
పాపికెక్కడ సుఖం కలదోయ్
ఒకరి మేల్ తన మేలనెంచీ
నేర్పరికి మేల్ కొల్లలోయీ !

సొంత లాభం కొంత మానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషులోయ్ !

చెట్టపట్టాల్ పట్టుకుని దే
శస్తులంతా నడవవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్ !

మతం వేరైతేను యేమోయ్
మనసులొకటై మనుషులుంటే

జాతియన్నది లేచి పెరిగీ
లోకమున రాణించునోయ్ !
దేశ మనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తి వలెనోయ్
నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్ !
ఆకులందున అణగిమణగి
కవిత కోయిల పలకవలెనోయ్
పలుకులను విని దేశమందభి
మానముల మొలకెత్తవలెనోయి !

ఈ గేయంలో ఆనాడు గురజాడ చెప్పిన అన్ని అంశాలు నేడు కూడా ఆవశ్యకమే అని అంతా గుర్తించాలి. అందుకే నాడు-నేడు-రేపు కూడా ఒక దేశసౌభాగ్యం ప్రజల జీవనం మీదే ఉందని చెప్పడానికి చక్కని ఉదాహరణ ఈ గేయం. దేశమంటే మట్టి కాదు మనుషులు అన్న సామ్యవాదం, సమసమాజ లక్ష్యం ఈ గేయం ద్వారా గుర్తించవచ్చు.

మనం మనం కలిస్తే జనం

జనం జనం కలిస్తే సమాజం అని భావించి ఎన్నో దేశభక్తి గేయాలు. రచించటం ద్వారా తెలుగు భాషను, జాతిని జాగృతం చేయడం గురజాడ ప్రత్యేకత. దేశభక్తి కలిగించటంలో భాష, సంప్రదాయాల పాత్ర గుర్తించిన ఆధునిక తెలుగు కవి గురజాడ. అందుటే ఓ మహాకవి అడుగుజాడ గురజాడ అని శ్లాఘించారు. ఒక్క గేయంతో యావత్ భారతజాతిని మేల్కొల్పి, చైతన్యం కలిగించిన ద్రష్ట గురజాడ అనడంలో అతిశయోక్తి లేదు.

19వ శతాబ్దం చివర 20 శతాబ్ద ప్రారంభంలో తెలుగు సాహిత్య వికాసానికి తోడ్పడిన గొప్ప కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు. 22ఏళ్ళ వయస్సులో ఈయన చరించిన గయోపాఖ్యానం - నాటకం ప్రతులు లక్షకి పైబడి అమ్ముడుపోవటం తెలుగు సాహిత్య చరిత్రలో అరుదు. అంత గొప్ప రచనాశక్తి గల గొప్ప కవి ఈయన.

చిలకమర్తివారు భారతీయుల స్థితిని, గతిని సూచిస్తూ రచించిన ఈ పద్యం అందర్నీ ఆకర్షించింది, ఆలోచింప చేసి దేశభక్తిని పెంపొందింపచేసింది.

భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పిదుకుచున్నారు మూతులు బిగియగట్టి

పై పద్యంలో భారతీయుల స్థితిగతులు కళ్ళకు కట్టినట్లు చూపించారు చిలకమర్తివారు. ఈ పద్యం ఆనాడు అందరినోట పలకడం విశేషం. తద్వారా చైతన్య వంతులయి, దేశభక్తిని ఇనుమడింపచేయటానికి దోహద పడింది ఈ పద్యం అనడంలో సందేహం లేదు.

అదే దారిలో బంకించంద్రుల వారి వందేమాతరం - ఆ సేతు హిమాలయం నుండి మొత్తం భారతదేశాన్ని, ప్రజానీకాన్ని ఒక తాటిపైకి తెచ్చిన మహోన్నత గేయంగా చెప్పవచ్చు. అంతేకాదు ఈ నాటికీ ఇది జాతి ఔన్నత్యానికి, చైతన్యానికి ప్రతీకగా పాడటం గమనార్హం. ఇది భారతీయుల దేశభక్తికి తార్కాణంగా నిలిచిపోయింది.

శంకరంబాడి సుందరాచార్యుల గారి మా తెలుగు తల్లికి మల్లెపూదండ - పాట జాతిని జాగృతం చేసి, దేశభక్తిని పెంపొందింపచేసింది. స్వాతంత్ర్యానికి పూర్వం దేశభక్తి పద్యాలు, పాటలు, గేయాలు పాడటం నిషేధం, వ్రాస్తే శిక్షలు. అయినా ఆనాటి కవులు అన్నింటినీ సహిస్తూ ప్రజల్ని సమైక్యపరచటానికి రచనల ద్వారా కృషి చేశారు.

భావకవితాయుగకర్తగా నిలిచిన కృష్ణశాస్త్రి గారి ''జయజయ ప్రియ భారత జనయిత్రి దివ్యధాత్రి''.

ఈ పాట భారతీయుల ఆత్మని ప్రతిబింబింపచేసింది. దేశమాత సౌఖ్యాన్ని, ఉన్నతిని చాటడానికి ఇది చక్కని తార్కాణం. తద్వారా భారతీయులు తమ దేశమాత దాస్యశృంఖలాలు తెంచటానికి ఉవ్వెత్తు కెరటాల్లా విజృంభించాలనే కవి వాంఛ, ఈ పాటలో పరోక్షంగా కనిపిస్తుంది.

రవీంద్రుని జనగణమన - గేయం అనాటి యావత్ భారతప్రజలను సమైక్యం చేసి నడిపించింది. అంతేకాదు నేటికి కూడా అది దేశభక్తికి చిహ్నంగా భారతీయులు భావించటం ప్రత్యేకం. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎందరో కవులు, పండితులు ఆణిముత్యాల వంటి పద్యాలు, గేయాలు, పాటలు రచించారు. అవి నాడు - నేడు-రేపు కూడా ప్రజల్లో ఉన్న దేశభక్తిని ఇనుమడింప చేసేవిగా ఉన్నాయి. అందుకే సాహిత్యం సమాజంలోని సమస్యలను ప్రతిబింబించటమే కాదు, పరిష్కారాన్ని ఇచ్చే నేపథ్యం కలిగి ఉండనడంలో అతివయోక్తి లేదు.

❖❖❖

వేయిపడగలు నారాయణరావు నవలల్లో దేశభక్తి

– అవధానం సుజాత, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ సిటీ కళాశాల, నయాపూల్, హైదరాబాదు.

1934లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన నవలల పోటీలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ రచించిన వేయి పడగలు, అడివి బాపిరాజు రచించిన నారాయణ రావు నవలలు ప్రథమ బహుమిని అందుకొన్నాయి. ఈ రెండు నవలల్లో ఆనాటి సామాజిక పరిస్థితులు, స్వాతంత్ర్యోద్యమాలు, యువతలో దేశభక్తిని మేలుకొలిపే విధంగా అనేక అంశాలు చిత్రించబడినాయి.

శ్రీవిశ్వనాథ సత్యనారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి. కవిసమ్రాట్, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత. విశ్వనాథ రచన లన్ని భారతీయ సంప్రదాయ వైభవాన్ని చాటిచెపుతాయి. ఆంధ్ర ప్రశస్తితో జాతి వైభవాన్ని చాటారు స్వర్ణోత్సవాన్ని జరుపుకొన్న ఏకైక నవల వేయిపడగలు నవల. హిందీ, కన్నడ, సంస్కృతం మొ॥ పలు భాషలలో అనువదింప బడింది. 999 పుటలతో నిండిన బృహన్నవల. విశ్వనాథ వారు ఆశువుగా చెపుతుండే విశ్వనాథ వెంకటేశ్వర్లు రచించారు.

జాతీయోద్యమాలను, గ్రామీణ సంస్కృతిని, భారతీయ సంప్రదాయ వైభవాన్ని చిత్రించిన నవల. 1919-47 వరకు గాంధీయుగంగా చెప్పవచ్చు. ఆ కాలంలో అనేక ఉద్య మాలు జాతిని జాగృతం చేశాయి. ముఖ్యంగా సహాయ నిరాకరణోద్యమం, ఉప్పుసత్యాగ్రహం మొదలైన

ఉద్యమాలు గాంధీజీ నాయకత్వాన తీవ్రరూపం దాల్చాయి.

జాతీయోద్యమ ప్రధాన ఆశయాలు ప్రజలను సంఘటితం చేసి వారిలోని దేశభక్తిని జాగృతం చేయడం, స్వాతంత్ర్య సముపార్జన, మొదలైన ఆశయాలను ఆనాటి రచయితలు తమ రచనలలో ప్రతిఫలింపజేసారు. పాశ్చాత్య సంస్కృతి నిరసన. ప్రాంతీయ భాషలో విద్యాబోధన కులవృత్తులను ప్రోత్సహించడం జరిగాయి.

విశ్వనాథలో జాతీయోద్యమ ప్రభావం - విశ్వనాథలో జాతీయ భావం పరాకాష్ఠనందుకుంది.

జాతిని దాస్యశృంఖలాల నుండి విముక్తి చేయాలన్న భావాన్ని ప్రజలలో కలిగించి పాశ్చాత్య నాగరికతా వ్యామోహాన్ని విడనాడాలని ప్రజలను ప్రబోధిస్తూ వేయి పడగలను రచించారు. గాంధీజీ ఆశయాలైన జాతీయ కళాశాల స్థాపన, మాతృభాషలో విద్యాబోధన, కుల వృత్తుల ప్రోత్సాహం, వృత్తి విద్యలను నేర్పించడం, విదేశి వస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణోద్యమాలు మొదలైనవి వేయిపడగలలో కనిపిస్తాయి.

యువతలో దేశభక్తిని మేలుకొలిపే విధంగా పాశ్చాత్య నాగరికతను ఖండిస్తూ భారతీయ సంస్కృతి వైభవాన్ని చాటారు. వేయిపడగలలో రాఘవరావు పాత్ర ద్వారా ఆనాటి జాతీయోద్యమ వైభవాన్ని చిత్రించారు.

వేయిపడగలు నవలలో నాయకుడు ధర్మారావు. ఈ పాత్ర ప్రాచీన సంస్కృతి వైభవానికి ప్రతీక. ధర్మారావు గాంధీజీ సిద్ధాంతాలను గౌరవిస్తాడు. తన మిత్రుడు జాతియవాది అయిన రాఘవరావుకు సహకరిస్తాడు. ధర్మారావు భార్య అరుంధతి ఇంట్లో నూలు వడుకుతుంది. జాతీయ విద్యపై ఆసక్తి చూపుతాడు. కులవృత్తిని ప్రోత్సహిస్తాడు.

ధర్మారావు ఖద్దరు వస్త్రాలను పవిత్రంగా భావిస్తాడు.

"మనదేశము నందు పుట్టిన దేనికి మాపులేదు
ఖద్దరు గుడ్డకు మాపేమిటే అది మెప్పడను
పవిత్రమే ఎప్పుడు నిర్మలమే" (పుట.338)

ఈ మాటలను బట్టి ధర్మారావుకు స్వదేశీ వస్తువులపై గల అభిమానం తెలుస్తుంది. ధర్మారావు జాతీయ కళాశాలలో తెలుగు పండితునిగా పని చేస్తాడు. వృత్తి విద్యలు నేర్చుకుంటే మంచిదని అంటాడు.

"కులవిద్యలు కూడుపెట్టు ఇప్పుడు కుల
విద్యయు చెడిపోయి సంపాదించుటకు
జదువుకొనవలసి వచ్చింది" అని వాపోతాడు.
(పుట.485)

వేయిపడగలలో మరొక పాత్ర రాఘవరావు. ఇతను ధర్మారావు మిత్రుడు. గాంధీయవాది. గాంధీగారి బోధనలను ఆచరణలో పెట్టి తన సర్వస్వాన్ని దేశోద్ధరణకు ధారవోసిన త్యాగజీవి.

రాఘవరావు విద్యార్థిగా ఉన్నప్పుడే రెండేండ్లు చదువు మానేసి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొంటాడు. వివాహ సమయంలో ఖద్దరు వస్త్రాలే ధరిస్తాడు. జీవిత కాలంలో ఎన్నోసార్లు కారాగార పాలవుతాడు. సేదతీరడానికి సుబ్బన్నపేటను ఆశ్రయిస్తాడు. కొన్ని రోజులు సుబ్బన్నపేటలో ధర్మారావును వెంటబెట్టుకొని మధ్యపాన నిషేధానికి పాటుపడతాడు. రాఘవరావు భార్య చనిపోయినపుడు ఏడుస్తుంటే ధర్మారావు అతనిని ఈ విధంగా ఓదారుస్తాడు.

"దేశమునకు హితమనుకొన్నది ప్రతి నెత్తురు
బొట్టుతో ఆచరించితివి నీకు బయటకన్నా
జైలులోనే తగిన స్థలం... నీవింక హృదయము
గుదుట బఱచుకొనవలయును"!
(విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలు
పుట.600)

భార్య చనిపోయిన మరునాడే రాజకీయోద్యోగులను ఉద్యోగాలు మానేయమని పత్రాలు పంచి అరెస్టు అవుతాడు. ఈ విధంగా రాఘవరావు దేశసేవలో తన జీవితాన్ని గడిపాడు.

వేయిపడగలులో విశ్వనాథ గాంధీ మహాత్ముని ఉద్యమాన్ని వర్ణించిన తీరు అత్యద్భుతం.

"అప్పటికి మహాత్ముడైన గాంధీజి సహాయ నిరాకరణోద్యమ మారంభించి రెండేండ్లయినది. జనులు గాంధీ దేవుడై యవతరించెనన్నారు. ఆయనయే కృష్ణుడు. రాట్నము వేణువు. తన్మధుర ధ్వని వంశీ నినాదము. భారతదేశము బృందావనము. ప్రజలు గోపికలై ఆయన చెప్పినట్లే కోటకు కోట్ల జనులు గుమికూడి యవలింబింప జొచ్చిరి". (వేయిపడగలు పుట.272)

ఈ వర్ణనను బట్టి ప్రజలు గాంధీజీ ఉద్యమానికి స్పందించిన తీరు వ్యక్తమవుతున్నది. అంతేకాక ఈ నవలలో వృత్తివిద్యలకు ప్రాముఖ్యత ఇవ్వాలని, గ్రామాలు స్వయం సంపూర్ణంగా ఉన్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అని తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పునరుద్ధరణ ద్వారా ప్రజలలో దేశభక్తిని

ఉత్తేజితం చేసారు. ఈ నవలలో విశ్వనాథ గిరిక పాత్ర ద్వారా దేవదాసిలోని కృష్ణ భక్తి తత్వాన్ని తెలిపారు. పైరు పచ్చదనానికి ప్రతీకగా పసరిక పాత్రను చిత్రించారు. యోగవిద్యకు ప్రతీకగా హరప్పను పేర్కొన్నారు. ఈ పాత్రలన్నీ కూడా ప్రాచీన సంస్కృతికి మూలాలు. దాంపత్య ధర్మానికి ప్రతీకగా ధర్మారావు అరుంధతిని పేర్కొన్నారు. ప్రాచీన సంస్కృతి పరిరక్షించినపుడే దేశము సాంప్రదాయ విలువలతో కూడి ఉంటుందని విశ్వనాథ జాతికి తెలిపారు. ఈ విలువలను కాపాడడమే నిజమైన దేశభక్తి అని విశ్వనాథ ఈ నవలలో వివరించారు.

ఈ విధంగా వేయిపడగలు, దేశభక్తిని చక్కగా చిత్రించిన నవల.

అడవిబాపిరాజు వ్యక్తిత్వము: అడవిబాపిరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు సాహితీ వనానికి పూల బాటను నిర్మించాడు. గొప్ప అభ్యుదయవాది. బాపిరాజు 'బాపిబావ'గా ప్రసిద్ధులు. బాపిరాజు గొప్ప కవి, రచయిత, జర్నలిస్టు, చిత్రకారులు. అడవి బాపిరాజు ఆనాటి సమకాలీన పరిస్థితులను తమ రచనల్లో చిత్రించారు. వీరి సాహిత్యాన్ని గూర్చి జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు "బాపిరాజు ఇంటిపేరు అడివి అయినా ఆయన సాహిత్యం నందనవనం" అని అన్నారు. విశ్వనాథ సత్యనారాయణ బాపిరాజును గూర్చి 'అతడు' కవితలో

''అతడు గీసిన గీత బొమ్మై
అతడు పలికిన పలుకు పాటై
అతని హృదయములోని మెత్తన
అర్ధవత్కృతిమై''.... అని పేర్కొన్నారు.

విశ్వనాథ వలె వీరు అనేక ప్రక్రియలను చేపట్టారు. వీరు సాంఘిక, చారిత్రాత్మక నవలలను నైపుణ్యంతో రచించిన సవ్యసాచి.

సాంఘిక నవలలైన నారాయణరావు, కోనంగి, నరుడు మొదలైన వాటిలో జాతీయోద్యమాన్ని గూర్చి, స్త్రీ విద్య గూర్చి అంటరానితనం మొదలైన సాంఘిక సమస్యలను గాంధేయ సిద్ధాంతాలను చిత్రించారు.

నారాయణరావు నవలలో నాయకుడు, నారాయణ రావు. ఇతడు గాంధేయవాది. బాల్యంనుండి దేశభక్తి కలవాడు. ఎనిమిదేళ్ల వయస్సులోనే తెల్లవారిని వ్యతి రేకించాలన్న ఆలోచన వచ్చింది. ఒకరోజు ఉదయాన్నే లేచి ముఖము మీద ''వందేమాతరం'' అని వ్రాసికొని తోటి పిల్లలకు కూడా రాసి పాఠశాలకు వెళ్ళాడు. ఉపా ధ్యాయులు అది చూసి ఆశ్చర్యపోయి, రాత చెరిపేసు కొమ్మని, లేకపోతే దండన తప్పదని బెదిరించారు. దానికి నారాయణరావు బెదరక ''మీరున్ను తెల్లవాళ్ళ స్నేహితులే! మాకు స్వరాజ్యం కావాలి. అందుకని నేను చెరపను. వీళ్లెవ్వరూ చెరపరు''. (పుట.34) అని జేవురించిన మొగములో బాలకుడైన నారాయణరావు సింహము వలె గర్జించాడు. ఉపాధ్యాయుడు దండించబోగా బల్ల నుండి దూకి బెత్తము లాగి రెండుగా విరిచేసాడు.

ఈ సంఘటన ద్వారా నారాయణరావులో చిన్నతనం నుండే సాహసం, పట్టుదల, స్వాతంత్ర్యకాంక్ష, దేశభక్తి ఉన్నాయని తెలుస్తున్నది. నారాయణరావు తాను ఖద్దరు వస్త్రాలు ధరించడమే కాక, తన స్నేహితులకు ఖద్దరు వస్త్రాలు బహుకరిస్తాడు. నారాయణరావు ఒకసారి జైలుకు వెళ్లినపుడు చెల్లెలు సూర్యకాంతం కంటతడిపెడుతుంది. అపుడు నారాయణరావు చెల్లెలిని ఓదార్చి దేశభక్తిని నూరిపోస్తాడు. దేశద్రోహిలా తాను జైలు వదిలి రాలేనని, గాంధీజీ అడుగు జాడలలో నడవడమే తన లక్ష్యమని అంటాడు. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వం ఉండాలని అంటాడు.

అన్ని పార్టీలు ఐకమత్యంగా పనిచేసి దేశానికి స్వాతంత్ర్యం వచ్చే విధంగా పోరాడాలని, ఆ తరువాత ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడాలని నారాయణరావు తన మిత్రులతో అంటాడు.

ఒక సందర్భంలో మంగపతిరావు గాంధీ గారి అహింసా వ్రతం ఆడుదాని మతం అని వాదిస్తే నారాయణరావు దానిని ఖండిస్తూ శ్యామసుందరితో ఈ విధంగా అంటాడు. ''శ్రీ మహాత్ముని తత్త్వం వీళ్లకేమి తెలుసును చెల్లీ'' అంటాడు.

నారాయణరావు చిన్నతనంలోనే హరిజన బాల బాలికలను చేరదీసి విద్యాబోధన చేసాడు. నారాయణ రావు తన తోడల్లుడైన విశ్వేశ్వరరావుతో తన జైలు జీవితాన్ని ఈ విధంగా చెబుతాడు.

''ఇంటరు నెగ్గిన సంవత్సరం వేసవికాలంలో సహాయ నిరాకరణంలో జేరాను...'' జైలుకు ముందు ఆరు నెల్లు దేశమంతా తిరిగి ఉపన్యాసాలు ఇవ్వడం, ఖద్దరు అమ్మడం, మొదలైనవి ప్రచారం చేశా, ఆ తర్వాత జైలు.... (పుట.376 నారాయణరావు)

నారాయణరావు జైలుజీవితాన్ని గడిపి ఈ విధంగా దేశస్వాతంత్ర్యం కోసం పాటుపడతాడు.

గాంధీజి ఆశయాలను అనుసరిస్తూ, సమాజానికి సేవ జేస్తాడు. దానిలో భాగంగానే తన మిత్రుల సహాయంతో తన గ్రామంలో విద్యాశ్రమాన్ని స్థాపిస్తాడు. తన విద్యా సంస్థ ఆశయాలను గూర్చి యిలా అంటాడు.

''పరమాత్మారాధన, దేశారాధన ముఖ్య ఆశయాలు అని చెబుతాడు''.

నారాయణరావు తన మిత్రుడైన పరమేశ్వరునితో కలిసి

తీర్థయాత్రలకు వెళ్ళిన సందర్భాలలో వారు సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించి, గాంధీమహాత్మున్ని స్వయంగా కలుసుకొన్నారని చెబుతాడు. నారాయణరావు స్నేహితులు కూడా సహాయనిరాకరణలో పాల్గొన్నారు.

ఈవిధంగా నారాయణరావు నవలలో బాపిరాజు జాతీయోద్యమాలను, గాంధీజీ ఆశయాలను చిత్రించి, యువతలో దేశభక్తిని పెంపొందించారు.

ముగింపు :

వేయిపడగలు నారాయణరావు నవలల్లో భారతీయ సంస్కృతి, జీవనవిధానం, మానవీయ విలువల చిత్రణ, జాతీయ ఉద్యమాలు, గాంధీజీ ఆశయాల చిత్రణ ద్వారా యువతలో దేశభక్తి జాగృతమై స్వాతంత్ర్య పోరాటంలో ప్రతి ఒక్కరు పాలుపంచుకొని, మాతృదాస్య శృంఖలాలను ఛేదించారని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. వేయిపడగలు - విశ్వనాథ సత్యనారాయణ
2. నారాయణరావు - అడవి బాపిరాజు
3. సారస్వత వ్యాసములు-5 - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
4. తెలుగు నవలా సాహిత్య వికాసం - పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు
5. విశ్వనాథ సాహిత్య వ్యక్తిత్వం - కోవెల సంపత్కుమాచార్య
6. కులపతి - సంచిక

❖❖❖

అమరజీవి పొట్టి శ్రీరాములుగారి దేశభక్తి

– డా॥. యస్. బేబీరమణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, సంగారెడ్డి జిల్లా.

తెలుగు సాహిత్యంలో దేశభక్తిని గూర్చి అనంతమైన సాహిత్యం వెలువడింది.

వై.యస్.శాస్త్రిగారు అమరజీవి సమరగాథ అను పేరుతో పొట్టిశ్రీరాములుగారి జీవితచరిత్రనురచించారు. సేవాపర్వం,దీనబంధుపర్వంలోవారిసేవలనుగూర్చివివరించారు. దేశంకోసం వారుచేసిన వివిధమైన సేవలలో, కృషిలో వారి దేశభక్తి వ్యక్తమవుతుంది.

భూకంప సమయంలో శ్రీరాములుగారి సేవబీ 1933 ఆగస్టు1వ తేదీన రాస్ సత్యాగ్రహం సందర్భంలో గాంధీజీతో పాటు పొట్టి శ్రీరాములుగారు కూడా అరెస్ట్ అయినారు. 1934ఆగస్టు 23వ తేదీన విడుదల అయినారు. 1934జనవరి 15వ తేదీన బీహారులో ఘోరమైన భూకంపం సంభవించి ఎంతోమంది అభాగ్యులు నిరాశ్రితులైనారు. వారికి సేవ చేయడానికి వారు వెంటనే బీహారు రాష్ట్రానికి వెళ్ళారు. కూలిపోయిన ఇళ్ళక్రింద కొన్ని వేలమంది మరణించారు. ఎన్నో విలువైన ఆస్తులు భూమిలో ఏర్పడిన గోతులలోనికి క్రుంగి పోయాయి. శ్రీరాములు వారికందరికీ అత్యవసరమైన సేవలను సకాలంలో అందించారు. భూకంప బాధితులకు ప్రత్యేకంగా నిర్మించిన డేరాలలో వసతి కల్పించడం, అందరికీ తిండీ, బట్ట సక్రమంగా అందేటట్లు చూడడం మొదలైన విధులను నిర్వర్తించారు.

వరదల భీభత్సంలో శ్రీరాములుగారి సేవబీ ప్రపంచం అంతా ఆర్థికమాంద్యం సంభవించి అన్నిటి ధరలూ పూర్తిగా పడిపోయిన రోజులవి. దానికితోడు వర్షాలు విపరీతంగా కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ జల మయమైపోయాయి. అక్కడ చిక్కుకున్న ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు చేరవేసే బాధ్యతను శ్రీరాములు గారు స్వీకరించారు. వారికి ఆవాసం, ఆహారం సమకూర్చి వారిని ఆదుకున్నారు.

శ్రీరాములుగారి హరిజనసేవబీ అస్పృశ్యత పూర్తిగా అంతరించిపోతేనే దేశం ఏకీకృతం అవుతుందని శ్రీరాములు గారు భావించి అందుకు కృషి చేశారు. ఒక అట్టపై 'హరిజనులను దేవాలయాలలోనికి రానీయండి' అనే నినాదాన్ని రాసి ఆ అట్టను తన ముందుభాగాన తగిలించుకొని నెల్లూరు పట్టణంలో సగభాగం తిరిగాడు. ఒక పోలీను ఆయనను కాంగ్రెస్ పతాకం ఉప యోగించడం వీలుకాదని అభ్యంతరం చెప్తే శ్రీరాములు గారు తనకు ఆ అధికారం ఉందని, కాంగ్రెస్ పతాకం లేకుండా ప్రచారం సాధ్యం కాదని వాదించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆయన వాదం అంగీకరించి ఆయన హరిజన ప్రభోదం స్వేఛగా చేయవచ్చునని, అయితే ఆనాడు మాత్రం ప్రధాన వీధులను పరిహరించి, తనచుట్టూ జనం ఎక్కువగా పోగుపడకుండా చూడ వలసిందని కోరారు.

వారి ప్రయత్నం ఒక విధంగా ఫలించిందని చెప్పవచ్చు. ఆయన సలహాగాని, నాయకత్వంగాని లేకుండా కొంత మంది హరిజనులు ఒక భజన బృందంగా ఏర్పడి, భజనలు చేసుకుంటూ నెల్లూరులోని చిన్న చిన్న దేవా లయాలలో ప్రవేశించారు. కానీ హిందువులు అభ్యంతరం తెలపడంతో గొడవ జరిగి కొంతమంది గాయపడ్డారు. దానితో శ్రీరాములుగారు నెల్లూరులోని మూలపేటలో నున్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలోకి హరిజనుల ప్రవేశం సాధించడం కోసం నిరశనవ్రతం మొదలు పెట్టారు. ఆ విధంగా కొన్ని నిరశన దీక్షల తరువాత హిందూ దేవాదాయ శాఖా మంత్రి శ్రీరాములుగారికి ఒక సుదీర్ఘమైన లేఖ వ్రాశారు. హరిజన ప్రవేశానికి అనుమతించవలసినదిగా దేవాలయాల ధర్మకర్తలు రాష్ట్రప్రభుత్వ అనుమతి కోరిన అన్ని సందర్భాలలోను

తాను అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. నూతన శాసనం ప్రవేశపెట్టమని పట్టుపట్టవద్దని, వెంటనే నిరాహారదీక్ష విరమించమనీ ఆయన కోరారు.

మద్యపాన నిషేధంపై శ్రీరాములుగారి కృషిబీ 1944, 1945 ప్రాంతాలలో స్వరాజ్యం, ప్రభుత్వాధికారం కనుచూపు మేరలో కనుచూపుమేరలో కనిపించగానే కాంగ్రెస్ వాదుల దృష్టి పూర్తిగా మారిపోయింది. గాంధీజీ బోధించిన సత్యాహింసల ఆదర్శాలలోను, నిర్మాణ కార్యక్రమంలోను వారి విశ్వాసం పూర్తిగా అడుగంటి పోవడం చూసి శ్రీరాములు తల్లక్రిందులయిపోయాడు. వారు బహుముఖంగా సేవలను నిర్వర్తించారు. కార్మికులు తాము కష్టించి పొందిన సంపాదనను త్రాగుడు కోసం ఖర్చు చేస్తూ, కుటుంబ సంక్షేమాన్ని విస్మరించి, ఆరోగ్యం నాశనం చేసుకోవడాన్నిచూసి గాంధీజీ చలించి, మద్యపాన నిషేధాన్ని అమలుచేయాలని కోరుకున్నారు. గాంధీజీ దృష్టిలో సంపద సంఘంయొక్క సమిష్టి సేవలనుండి ఉద్భవిస్తుంది. అందువల్ల ధనికులు విలాస జీవనం గడుపుతూ, పేదలు పేదరికంతో అల్లాడుతుండడం గాంధీజీని కలచివేసింది. అందువల్ల ధనికులు, విద్యావంతులు అందరూ మద్యపానాన్ని మానాలని గాంధీజీ కోరారు.

పొట్టి శ్రీరాములు గారు మారెళ్ళ గ్రామంలో మామగారి అంత్యక్రియలకు హాజరై ఏడునెలలపాటు ఆ గ్రామంలోనే సంఘసేవ చేస్తూ గడిపారు. ఆ గ్రామంలో కార్మిక వర్గాలకు చెందిన ప్రజలు త్రాగుడుకు బానిసలై నిత్యం దారిద్ర్యంతో, తగువులాటలతో బాధపడుతూ ఉండడం చూసి శ్రీరాములుగారు చలించి, మద్యపానం మానవలసిన అవసరం గూర్చి వారికి హితబోధ చేశాడు. కానీ ఎంత హితబోధ చేసినప్పటికీ వారిలో మార్పు కనిపించలేదు. దానితో వారు నిరశన వ్రతానికి పూనుకొన్నారు. రెండు రోజుల తరువాత ప్రజలలో మార్పు కనిపించింది. ఇంక తాము జీవితాంతం మద్యం ముట్టమని, నిరశనవ్రతం మానవలసినదని ప్రజలు కోరారు.

ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలు చేయడంలో ఎన్నో లోపాలు శ్రీరాములుగారికి కనిపించాయి. వాటిని ఎత్తి చూపడానికి శ్రీరాములుగారు వెనుకాడలేదు. ప్రభుత్వం దానిని అమలుచేయడంలో ప్రజాధనాన్ని ఎందుకు ఖర్చు చేయాలని వారు ప్రశ్నించారు. ధనవంతులు మరింత ధనవంతులు కావడానికి వీలుగా సారా అమ్మకాలకు ప్రభుత్వం లైసెన్సులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. వైద్యబృందాలు, స్త్రీలు, విద్యార్థులు మద్యపాన నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేయగలరని వారు భావించారు. స్త్రీలు, విద్యార్థులూ త్రాగుడుకు బానిసలైనవారిని ప్రేమతో పరిచర్యలు చేసి వారి ప్రేమను సంపాదించి క్రమంగా వారు ఆ అలవాటును వదులుకునేట్లుగా చేయవచని, కార్మికులకు సాయంత్రాలు అల్పాహారాలు అందజేసి ఆరోగ్యవంతమైన క్రీడలతో కాలం గడిపేందుకు వీలుగ రెక్రియేషన్ క్లబ్బులను ఏర్పాటు చేసి వారిని మెల్లగా ఆ అలవాటు నుండి దూరం చేయాలని తెలిపారు.

నెల్లూరు జిల్లాలో మద్యపాన నిషేధం అమలుబీ శ్రీరాములుగారు నెల్లూరు జిల్లా కలెక్టరు ఆర్.ఎస్.మలయప్పన్ ఆ జిల్లా అంతటా మద్యపాన నిషేధం కట్టుదిట్టంగా అమలు జరపడానికి ఎలా అంకితభావంతో కృషి చేసిందీ ఒక వ్యాసంలో వివరించాడు. నెల్లూరు సమీపంలోని కటారిపాలెం అనే హరిజన గ్రామం సారా దుకాణాలకు ప్రసిద్ధి. మద్యపాన నిషేధ చట్టాన్ని ఖాతరు చేయకుండా అక్కడ కొందరు సారా వ్యాపారం కొనసాగిస్తూనే ఉన్నారు. కలెక్టరుగారు శ్రీరాములు మొదలైన సంఘసేవకుల ఫిర్యాదులను మన్నించి ఆకస్మికంగా కటారిపాలెం సందర్శించి అక్కడ అక్రమంగా సారా వ్యాపారం చేస్తున్న వారందరికీ తీవ్రమైన శిక్షలు విధించాడు.

హిందూ సంఘ సంస్కరణ సమితి ఆవిర్భావంబీ శ్రీరాములుగారి నిజాయితీతో కూడిన సంఘసంస్కరణ దృష్టిన గుర్తించిన కొందరు మిత్రులు, అభిమానులు శ్రీరాములుగారికి లౌకికమైన వివేకం లేదని గ్రహించారు.

శ్రీరాములుగారు ఎంతటి నిజాయితీపరుడైనా ఒంటరిగా ఫలప్రదమైన సేవను కొనసాగించలేడని వారు గ్రహించారు. అతనికి అండగా ఏదైనా ఒక సంస్థను ఏర్పరచడం మంచిదని 'హిందూ సంఘసంస్కరణ సమితి' అనే ఒక సంస్థను స్థాపించారు. ఈ సంస్థలో పొట్టి శ్రీరాములను కేవలం సంయుక్త కార్యదర్శిగా ఉంచి, కార్యదక్షులైన ఇతరులు కార్యనిర్వాహక వర్గంలో ప్రధాన బాధ్యతలు స్వీకరించి, నెల్లూరులో శ్రీరాముల సంఘసేవా కార్యక్రమాలకు అండగా నిలిచారు.

సంఘసంస్కరణ సమితి లక్ష్యాలు :

- అస్పృశ్యతను తొలగించడం
- హరిజన దేవాలయ ప్రవేశమునకు ప్రయత్నించుట
- హరిజనులతోను, ఇతర నిమ్న జాతులతోను సహపంక్తి భోజనములు జరుపుట, నిమ్నజాతుల ఆర్థిక, విద్యావిషయక, తదితర సర్వతోముఖ అభివృద్ధికై పాటుపడుట.
- శారదా చట్టము చక్కగా పనిచేయునట్లు గమనించుట
- రజస్వలానంతర వివాహము, వితంతు వివాహము, వర్ణాంతర వివాహము, ఇత్యాది సంస్కరణ వివాహాలను ప్రోత్సహించుట
- ప్రేత, అనాథ సంస్కారములు జరిపించుట.

ఖాదీ ప్రచారంబీ కాంగ్రెస్ వాదులలో ఖాదీమీదా, స్వదేశీ వస్తువుల మీదా పూర్తిగా నమ్మకం తగ్గిపోయింది. మొక్కుబడిగా కాంగ్రెస్ సంస్థలో పదవులలో ఉన్నవారు మాత్రమే ఖాదీ ధరిస్తు ఉండేవారు. కానీ శ్రీరాములు మాత్రం పట్టు విడువకుండా తన మిత్రులందరి ఇళ్ళల్లో చరఖాలు నెలకొల్పాడు. ప్రతిరోజూ అందరి ఇళ్ళు సందర్శించి ఆ చరఖాలకు చిన్న చిన్న మరమ్మతులు ఉంటే తనే బాగుచేస్తూ ఉండేవాడు. ఆయన భుజానికి ఎప్పుడూ ఒక సంచి వేలాడుతూ ఉండేది. ఆ సంచిలో చరఖాల మరమ్మత్తులకు అవసరమైన పరికరాలూ, విడిభాగాలు ఉండేవి. ఖాదీ ప్రచారగీతాలను గానం చేస్తూ శ్రీరాములు గృహిణులను, పిల్లలను నూలు వడకడం నేర్చుకోమని ప్రోత్సహించేవాడు.

"వడికిన నూలు కరెన్సీగా వాడి ఖాదీపట్ల ప్రజలకు ఆసక్తి కలిగించండి" అనే శీర్షికతో మద్రాసు ప్రభుత్వం వారికి శ్రీరాములుగారు ఒక లేఖను పంపారు.

ముగింపు :

ఈ విధంగా శ్రీరాములుగారు అనేక విధములైన సంఘసేవలతో తన అద్వితీయమైన దేశభక్తిని ప్రకటించారు.

ఆధార గ్రంథాలు :

అమరజీవి సమరగాథబీ వై.యస్.శాస్త్రి

❖❖❖

అమరజీవి పొట్టి శ్రీరాములుగారి దేశభక్తి

– డా॥. టి. మోహనశ్రీ, ప్రధానాచార్యులు, శ్రీ కన్యకా పరమేశ్వరీ మహిళా కళాశాల, మద్రాసు.

పుణ్యభూమి నాదేశం ..... నమోనమామీ.....
ధన్యభూమి నాదేశం ..... సదా స్మరామీ.....
పుణ్యభూమి నాదేశం ..... నమోనమామీ.....
ధన్యభూమి నాదేశం ..... సదా స్మరామీ.....
మహామహుల కన్నతల్లి ..... నాదేశం
మహోజ్వలిత చరిత కన్న భాగ్యోదయ దేశం ..... నా దేశం.

(మేజర్ చంద్రకాంత్ ... సినిమా లోనిది)

సంఘాన్ని నడిపించే కవిలో దేశభక్తి అధికారికంగా ఉండడం అసహజం కాదు. తను పుట్టిన జాతికి మేలు చేకూర్చాలనే ఉదాత్త రచనల ద్వారా మార్గాన్ని సూచిస్తూ పోతాడు కవి.

ప్రసార మాధ్యమాలు ఏలుతున్న ఈ కాలంలో రారాజుగా సినిమా ఈ ప్రపంచాన్ని ఏలుతుంది.అనాదిగా మానవ సమాజంలో పుట్టి సామాన్యుల నుండి మాన్యుల వరకు అందరిని ఆనందినంచేసే కళా ప్రక్రియలన్నింటిని తనలో కలుపుకొని తిరుగులేని ప్రసార సాధనంగా స్థిరపడిన సమాహార కళ , ఏకైక కళ సినిమా.

ఏ దేశ వాఙ్మయ చరిత్ర చూసినా పద్యాల కంటే ముందు పాటలే పుట్టినట్లు గ్రహించవచ్చు. ప్రకృతిలో ప్రకృతిగా పెరుగుతున్న ఆదిమానవుడి నోటివెంట అప్రయత్నంగా వచ్చేది పాటే.

వ్యవహారంలో పదం, గీతం, కీర్తన ఈ మూడు 'పాట'కు పర్యాయ పదాలు గానే ప్రయోగించబడ తాయి. పదం ఎత్తుకో, గీతం అందుకో, కీర్తన పాడు, అని అంటే పాట పాడు అనే అడిగేవాళ్ళ అభిప్రాయం. వీటికి నిఘంటువులు కూడా ఇదే అర్థాన్నిస్తున్నాయి.

సాహిత్యాన్ని సామాన్యుడి దగ్గరకు తీసుకువెళ్ళిన ఘనత సినిమా పాటలదే. పల్లెల్లో పనులుచేసుకునే వాళ్ళు కూడా జానపదగేయాలను మరిచిపోయి సినిమా పాటలే వింటున్నారు, పాడుకుంటున్నారు. ప్రజా సాహిత్యం పేరుతో వస్తున్న సాహిత్యమే ప్రజల దగ్గరకు వెళ్ళగలుగుతుంది. అంతేకాదు వాళ్ళ నోళ్ళల్లో నాన గలుగుతుంది. కాబట్టి ఈనాడు జానపద సాహిత్యం, ప్రజాసాహిత్యం అనే మాటలకు సినిమా సాహిత్యమే అన్ని విధాల సరిపోతుంది.

సినిమా కవుల గేయాలను బాగా పరిశీలించి పరి శోధనా దృష్టితో చూస్తే, ప్రణయగీతాలు,విషాదగీతాలు, విప్లవగీతాలు, దేశభక్తిగీతాలు, శ్రామిక గీతాలు, బాంధవ్య విలువల గీతాలు, పిల్లల గీతాలు, ప్రబోధ గీతాలు, సందేశాత్మక గీతాలు, ప్రకృతి గీతాలు, ఇతరా లంటూ చెప్పవచ్చు.

మానవుడు స్వాతంత్ర్యాభిలాషి. అది అతని జీవం. అతని జన్మహక్కు. ఆ స్వాతంత్ర్యానికి, క్షతి కలిగినప్పుడు అతని ప్రాణం విలవిలలాడి పోతుంది. స్వర్గసుఖాలు సమక్షాన నిలిపినా సమాదరించడు. స్వేచ్ఛలేని స్వర్గం కంటే నరకమే మేలని మిల్టన్ మహాశయుడు చెప్పడంలోని పరమార్థమదే. విప్లవమూర్తి వీర సవార్కర్ కూడా The forest of Independence is better than the cage, though made of gold" అంటాడు. చివరకు నోరులేని పక్షి కూడా స్వేచ్ఛగా రెక్కలల్లారుస్తూ వినువీధిలో విహ రించాలనుకుంటుందే గాని బంగారు పంజరాన్ని కోరదు.

జనరంజక శక్తి పాటకుంది కాబట్టి కొత్తగా వచ్చే ప్రతి ప్రక్రియ లోనూ పాట చోటుచేసుకొంటుంది. ఎంతటి విస్తృతమైన కథనైనా మూడు గంటల్లో సినిమా చెప్ప గలిగితే, ఆ విషయాన్ని మూడు నిమిషాల్లో చెప్పిన రసస్ఫూర్తిని కలిగించడానికి పాట ఎంతో ఉపకరించింది. పాట సినిమాల్లో భాగమైంది. పాటలేనిదే సినిమా

లేదన్నంతగా పాట తన స్థానాన్ని పెంచుకొంది. అనాటి సముద్రాల గానీ, ఈ నాడు వేటూరి గానీ సినిమా పాటలు రాయడం వల్లనే ప్రసిద్ధి పొందలేనిది అంద రెరిగిన సత్యమే.

ఉదాహరణకు

నవోదయం - శుభోదయం
నవయుగ శోభా - మహోదయం
ఆడునదిగో - అరుణ పతాకం
పాడునదిగో - నవయువలోకం
స్వతంత్ర జీవన - ప్రభాతగీతం, ప్రబోధ గీతం
జవరాలి మేలి - చెంగావి మోవి
నవరాగ రేఖ - లవిగో

(బాలరాజు , సీనియర్ సముద్రాల, 1948)

అభ్యుదయ భావాలతో కూర్చిన నవరాగ గీతమిది. జానపద చిత్రాలలో ఇలాంటి గీతాలుచోటు చేసుకోవడం అరుదు. భారతమాత పరద్యాస శృంఖలాల నుండి విముక్తమైన అనంద వర్షంలో (1947) సముద్రాల వారి అంతరంగంలో ఉదయించిన అరుణాఅరుణ గీతంగా అభివర్ణించవచ్చు.

మదాలస (1948) పౌరాణిక చిత్రంలో మదాలస చెలికత్తె అయిన కుండల పాతాళ లోకంలో బంధింప బడిన సన్నివేశం ఆధారంగా రాయించిన -

స్వాతంత్ర్యము కన్న స్వర్గలోకము లేదు
పారతంత్ర్యమ కన్న నరకంబు మరిలేదు
పరునియింట భుజియించు పాయసాన్నము కన్న
తన యింటనే యింత గంజియైనను మేలు

స్వాతంత్ర్యం ఔన్నత్యాన్ని , అవశ్యకతనూ తెలియజేసే పాట.

స్వాతంత్ర్యానికి జాతీయతా భావాన్ని ప్రబోధించడమే.

సినిమా కవులు రచించిన దేశభక్తి గీతాలన్నీ స్వాతంత్ర్యేచ్ఛ, మానవత్వం కలిగి శాశ్వతత్వాన్ని సంత రించుకొన్నవే. సాంఘిక ప్రయోజన దృష్టితో చూచినా, శిల్ప దృష్టితో చూసినా, సార్వజనీన, సార్వకాలిక స్థిరత్వ దృష్టితో చూసినా ఈ సినీ దేశభక్తి గీతాల మీద ఎంతో గౌరవంకలుగుతుంది. ఆనాటి జాతీయోద్యమం సీనీకవుల కలాలను కరవాలాలుగా చేసిందనడంలో అతిశయోక్తి లేదు.

దేశభక్తి ని ప్రబోధిస్తూ సినిమా కవులు ముఖ్యంగా శ్రీ శ్రీ, ఆరుద్ర. సినారే రాసిన గీతాలు ఎంతో ప్రజాదరణ పొంది ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశాయి అనడం అతి శయోక్తికము.

1) పాడవోయి భారతీయుడా
ఆడి పాడవోయి విజయ గీతిక
స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి
సంబర పడగానే సరిపోదోయి.
అవినీతి, బంధుప్రీతి, చీకటిబజారు
అలుముకున్న ఈ దేశం ఎటుదాగజారు
స్వార్థమే అనర్థదాయకం అది చంపుకొనుట
లాభదాయకం

॥ పాడవోయి ॥

(వెలుగు నీడలు, శ్రీ శ్రీ)

2) గాంధి పుట్టిన దేశమా ఇది
నెహ్రూ కోరిన సంఘమా ఇది
సామ్యవాదం రామరాజ్యం సంభవించేకాలమా
గాంధి పుట్టిన దేశమా....
సస్యశ్యామలదేశం అయినా నిత్యం క్షామం (2)
ఉప్పొంగే నదుల జీవ జలాల ఉప్పు సముద్రం పాలు
యువకుల శక్తికి భవితవ్యానికి ఇక్కడ తిలోదకాలు
ఉన్నది మనకూ ఓటు బ్రతుకు తెరువుకే లోటు

॥ గాంధి ॥

(పవిత్రబంధం ఆరుద్ర)

3) నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరువద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే
మరవద్దు

సత్యం కోసం సతినే అమ్మినదెవరు - హరిశ్చంద్రుడు
తండ్రిమాటకై కానలకేగినదెవరు- శ్రీరామచంద్రుడు
అన్న సేవకే అంకితమైనది ఎవరన్నా - లక్ష్మన్నా
పతియె దైవమని తరించిపోయినదెవరమ్మా - సీతమ్మా
ఆ పుణ్యమూర్తులు చూపిన మార్గం అనుసరించుటే ధర్మం
అనుసరించుటే నీ ధర్మం నీ ధర్మం మరువద్దు
॥ జాతిని ॥

(కోడలు దిద్దిన కాపురం, సినారె)

మహనీయుల జీవితగాథల్ని పిల్లలకు సైతం అర్థమయ్యే రీతిలో ఒక గీతంలో సినారె వ్యాఖ్యానించడం అద్భుతం.

తెలుగు జాతి మనది - నిండుగ వెలుగు జాతి మనది
తెలంగాణానాది - రాయలసీమ నాది
సర్కారు నాది - నెల్లూరు నాది
అన్నీ కలసిన తెలుగునాడు మనదే మనదే ॥తెలుగు॥

(తల్లా ! పెళ్ళామా !)

రాష్ట్ర సమైక్యతకు సినారె రాసిన దేశభక్తి గీతమిది. ఆనాడు మూడుకోట్ల ఆంధ్రుల జేజేలుఅందుకున్న గీతమిది. ఆ నాటికి ఈ నాటికి తెలుగు ప్రజలందరు సమైక్యంగా ఉండాలనే కోరుకొనే గీతమిది.

భారతమాతకు జేజేలు వంటి పాటలు సభల్లో ప్రార్థనా గీతాలుగానూ, గాంధీ పుట్టిన దేశం వంటివి దేశభక్తి గీతాలుగానూ మారిపోయాయి.

సి.నారాయణ రెడ్డి గారు బంగారు మనిషి కోసం నా దేశం భగవద్గీత, నాదేశం అగ్ని పునీత సీత నా దేశం సంస్కార గంగ, నా దేశం కరుణాంతరంగ వంటివి ఎన్నో మరెన్నో

తెలుగు వీర లేవరా
దీక్షబూని సాగరా
దేశమాత స్వేచ్ఛకోరి
తిరుగు బాట చేయరా

(అల్లూరి సీతారామరాజు, రచన. శ్రీశ్రీ , గాయకులు. ఘంటశాల, రామకృష్ణ, సంగీతం దర్శకత్వం. శ్రీ ఆది నారాయణ)

స్వాతంత్ర్యోద్యమ కాలంలో రాయబడిన గరిమెళ్ళ సత్యనారాయణ గేయం ప్రజల్ని ఎంతగానో ఉద్రేక పరిచింది.

"మా కొద్దీ తెల్లదొరతనము దేవ
మా కొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించె ॥ మా కొద్దీ ॥

పన్నెండు దేశాలు - పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమండి
ఉప్పు ముట్టుకుంటే దోషమండి
నోట మట్టికొట్టి పోతాడండి ॥ మా కొద్దీ ॥

నూటనలుబది నాల్గు
నోటికి తగిలించి మాటలాడ వద్దంటాడు
మమ్ము పాట పాడవద్దంటాడు
తనను దాటి వెళ్ళ వద్దంటాడు
అయ్యో చేటు తెచ్చుకొమ్ము
చెడిపోమంటాడు " ॥ మా కొద్దీ ॥

అనే విధంగా నూట ఇరవై పంక్తుల్లో ఈ గేయం రచించబడింది. ఇందులో ఆంగ్లేయుల అరాచకత్వాలను, వాటివల్ల భారతీయులు అనుభవించిన బాధలను కవి మన కళ్ళకు కట్టినట్లుగాతెలిపాడు. ఈ పాటలోని కొన్ని ఖండికల్ని " కాలచక్రం " (1938) చిత్రంలో ఉప యోగించుకున్నారు. జాతీయోద్యమ, దేశభక్తి గీతాల్లో, సాధారణ లక్షణాలను బట్టి ఈ కింది విధంగా విభజించి విశ్లేషించడం జరిగింది. అవి

1. మాతృభూమిని స్తుతించడం
2. నాటి పరిపలకులను నిందించడం
3. పూర్వవైభవ స్మరణం

4. స్వాతంత్ర్య తత్వం, ప్రజల్ని స్వాతంత్ర్యోద్యమ భాగస్వాములు చేయడం, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలు మొ॥వి - విశ్లేషణ
5. జాతీయ పతాకం, రాట్నం మొదలగు వాటిని కీర్తించడం
6. భారతీయ నాయక స్తుతి

పదండి ముందుకు అనే చిత్రంలో శ్రీ శ్రీ రచించిన పాట

పదండి ముందుకు పదండి తోసుకు
కదం తొక్కుతూ కదలండీ
స్వరాజ్యమే మన జన్మ హక్కనీ
సమస్త జగతికి చాటండీ !
భారత వీర ప్రజలారా ! భారత వీర ప్రజలారా !
స్వరాజ్యవాదీ ధరించు ఖాదీ - పరాయి సరుకులు మనకేలా
రాటమున వడకే వారే, పోరాటంలో వడకరులు
॥ పదండి ॥

అహింసయే మన ఆయుధమూ - సత్యాగ్రహమే సాధనమూ,
త్రివర్ణ సుందర పతాకము - భారత దాస్య విమోచనము
ప్రేమా శాంతి ధర్మం నిండిన - రామరాజ్యమే ఆశయమూ
॥ పదండి ॥

కల్లు మానండోయ్ బాబయ్య
కళ్ళు తెరచి సాగిరారయ్యా బాబయ్య
కాపురాలను కూల్చు రాకాశిరా - కన్నీళ్ళు కష్టాలు కొని తెచ్చురా
మంచితనమే చంపి - మమతలే తెగ తెంపి
మనల పశువుల చేయు మహమ్మారిరా
తేనెల తేటల మాటలతో
మన దేశమాతనే కొలిచెదమా

భావం భాగ్యం చూచుకుని
ఇక జీవనయానం చేయుదమా
ఎందరో వీరుల త్యాగఫలం
మన నేటి స్వేచ్ఛకే మూలబలం
వారందరిని తలచుకుని
మన మానస వీధిని నిలుపుకుని ॥ తేనెల ॥

ఈ పుస్తకంలో ప్రధానంగా తెలుగు సినిమాల్లో వచ్చిన దేశభక్తి గీతాల గురించే తరువాత అధ్యాయాల్లో విస్తృతంగా చర్చించబడింది. అందువల్లనే ఇక్కడ రేఖామాత్రంగా నాలుగు దేశభక్తి గీతాలు మాత్రమే ఉదహరించడం జరిగింది.

ఆనాటి 'సముద్రాల'గానీ ఈనాడు 'వేటూరి' గానీ సినిమా పాటలు రాయడం వల్లనే ప్రసిద్ధి పొందారనేది అందరెరిగిన సత్యమే. జనరంజక శక్తి పాటకుంది కాబట్టే కొత్తగా వచ్చే ప్రతి ప్రక్రియలోనూ ఇది చోటు చేసుకుంటుంది. నాటక సంప్రదాయం వల్లనే పాటలు సినిమాల్లో చేరివుంటాయి. నాటకాల్లోకంటే సినిమాల్లో పాటలకు మంచి గుర్తింపు లభించింది. మూడు కాదు మూడు వందల సంవత్సరాల్లో జరిగిన కథనైనా మూడు గంటల్లో ముగించాల్సిన అవసరం సినిమాకేర్పడింది. మూడు గంటల్లో ముగించాల్సిన అవసరం సినిమా కేర్పడింది. మూడుగంటల్లో చెప్పదలచుకొన్న విషయాన్ని మూడు నిమిషాల్లో చెప్పి రసస్ఫూర్తిని కలిగించడానికి పాట ఎంతో ఉపకరించింది. పాట సినిమాల్లో భాగమైంది. పాట లేనిదే సినిమాలేదన్నంతగా 'పాట' తన స్థానాన్ని పెంచుకొంది.

❖❖❖

తెలుగు సాహిత్యంలో స్వాతంత్ర్య ఉద్యమం - దేశభక్తి

- డా॥. వేదాంతం రాజగోపాలచక్రవర్తి, పూర్వసంచాలకులు, అర్చకట్రైనింగ్ అకాడమి,
ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విజయవాడ.

వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర - సంస్కృతి కలిగిన భారతదేశం ప్రపంచ దేశాలలో ఒక విశిష్టమైన గుర్తింపుతో ప్రఖ్యాతిని పొందింది. అదే భారతీయ ఆధ్యాత్మిక తత్త్వం. ఈ తత్త్వానికి తోడుగా సాంస్కృతిక వైవిధ్యం, వివిధ జీవన వృత్తులలో నైపుణ్యం భారతదేశానికి కీర్తిసంపదలను ఆర్జించటంలో ముఖ్యపాత్రను వహించాయి. అయితే కాలపరిణామ క్రమంలో అనేక వందల సంవత్సరాలపాటు విదేశీ మతస్తుల పాలనలో అణగారిపోయిన భారతీయ సంస్కృతిలో అనేక మార్పులు చేర్పులు అనివార్యంగా జరిగిపోయాయి. ఎక్కువ భాగం భారతీయతను నాశనం చేశాయి. ఇటువంటి దశలో నిస్సహాయస్థితిలో అనేక రాజకీయ సాంఘిక ఆర్థిక పరిణామాల దుస్థితిలో ఆంగ్లేయుల కాలంలో స్వాతంత్ర్య సంగ్రామం జరగటం నిజంగా ఒక చారిత్రాత్మక ఘట్టం.

1885 సంవత్సరంలో జాతీయ కాంగ్రెస్ ఏర్పడటం, వివిధ పోరాటాల అనంతరం 1947 ఆగష్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించటం చిరస్మరణీయమైన అంశం. చరిత్రను పరిశీలిస్తే సైనికుల యుద్ధాలలో జయాపజయాలు సాంఘిక చరిత్రకు మూలాలుగా నిలిచాయి. భారతావనిలో స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలంతా సైనికులుగా మారి ఆంగ్లేయుల మీద వివిధ ఉద్యమాలు నడిపి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పోరాటం అపూర్వమైన విషయం. అనేక మంది నాయకులు ఈ జాతీయోద్యమాన్ని నడిపినా, గాంధీజీ స్వాతంత్ర్య ఫలసిద్ధికి కారకుడు అన్న విషయం మనం గమనించాలి.

ఈ నేపథ్యంలో ఒక విషయం గమనించాలి. భారత దేశంలో అనేక యుద్ధాలు జరిగాయి. అనేక రాజవంశాలు వారు పరిపాలించారు. ఆయా సందర్భాలలో వాటి అంశాలకు సంబంధించి కొన్ని ప్రస్తావనలు, మరికొన్ని చోట్ల కార్యాలు వచ్చాయి. అయితే భారతదేశ స్వాతంత్ర్య సమయంలో దేశమంతటా ప్రాచుర్యం పొందిన భాషలలో స్వాతంత్ర్య ఉద్యమ సంఘటనలన్నీ సాహిత్యంలో ప్రతిబింబించటం ఒక అరుదైన అంశం. భారతీయ స్వాతంత్ర్య సంగ్రామానికి ఒక ఉత్తేజాన్ని చైతన్యాన్ని, ప్రాణ వాయువును ఊదిన ఉద్యమగీతం వందేమాతరం.

బంకిం చంద్ర చటర్జీ ఆనందమఠంలో వ్రాసిన "వందేమాతరం - సుజాలం సుఫలాం మలయజశీతాలమ్, సస్యశ్యామలాం మాతరమ్" అనే గీతాన్ని ఉద్యమకారులకు జాతీయగీతంగా భావించారు. 1905 జులూ7వ తేదీన లార్ట్‌కర్టన్ బెంగాల్ విభజించినప్పుడు ఈ సంఘటనకు వ్యతిరేకంగా భారతీయులు పోరాటం చేసినప్పుడు "వందేమాతరం" భారతదేశమంతా ప్రతిధ్వనించింది. దేశభక్తి ఉప్పొంగింది! బ్రిటీష్ అహంకారాన్ని పంకిలాన్ని కడిగి వేసింది.

ఇక్కడే దేశభక్తి గురించి కొంత చెప్పుకోవాలి. దేశభక్తి అనే పదబంధం ఆధునిక కాలంలో చక్కని ప్రాచుర్యాన్ని పొందింది. ప్రాచీన, మధ్యయుగాలలో ఇప్పుడు మనం ఏ భావనలో ఈ పదబంధాన్ని ప్రయోగిస్తున్నామో, అదే భావన లేకపోయినా, ఈ దేశము, ప్రజలు ఒక్కటే! ఇక్కడ ఉన్న నదులు, పర్వాతాలు, అరణ్యాలు, ప్రజలు, సంస్కృతి, వీటి మీద చూపించే అభిమానం, ఈ దేశాన్ని రక్షించుకోవటానికి చేసే ప్రయత్నాలు. ఇవన్నీ దేశభక్తి అనే భావనలో ఉన్నట్లు భారతీయ సాహిత్యాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. జాతీయ భావం - దేశభక్తి అనేవి స్వాతంత్ర్య సంగ్రామంలో మనకు అందివచ్చిన అద్భుతమైన పదబంధాలు. ప్రజలలో ఐక్యతను పెంపొందించటానికి ఉపకరించిన అక్షర బంధాలు ఇవి.

బిపిన్ చంద్రపాల్ బెంగాల్ విభజన నేపథ్యంలో ఆంధ్రదేశంలో పర్యటించాడు. 1907 ఏప్రియల్ 19 నుంచి 24వరకు రాజమండ్రిలో ఉండి ఉత్తేజకరమైన ఉపన్యాసాలు ఇచ్చాడు. ఆ సభలలో చిలకమర్తివారు చెప్పిన ఈ పద్యం ఆంధ్రదేశంలో స్వాతంత్ర్య ఉద్యమానికి క్రొత్తశక్తిని ఇచ్చింది.

భరతఖండంబు చక్కనిపాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరిగొల్లవారు
పితుకు చున్నారు మూతులు బిగియగట్టి
(చిలకమర్తి - 1907)

ఇందులో నిబిడీకృతమైన దేశభక్తిని గమనించండి. అయితే దీనికి ముందుగానే 1905లో కృష్ణపత్రికలో 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా'' అనే పేరులో ఒక అజ్ఞాత కవి రచించిన ఈ గీతాన్ని చూడండి.''హిందువులారా! ఎన్నాళ్ళీగతి, మందమతులరై మాటికి జెడదరా'' అనే ఈ గీతం మొదటి ప్రబోధ గీతంగా పండితులు భావిస్తున్నారని ముప్పల సుబ్బరామయ్యగారు తన ''సాహిత్య తరంగాలు'' (2017) అనే గ్రంథంలో తెలియజేశారు. ఇక గురజాడ అప్పారావు గారి 'దేశభక్తి' గేయం జగత్ప్రసిద్ధం. దేశభక్తి గురించి విలువైన వివరణను అందిస్తుంది ఈ గేయం. ''దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా, వొట్టి మాటలు కట్టి పెట్టోయ్, గట్టి మేల్ తలపెట్టవోయ్'' (1910)

స్వాతంత్ర్య ఉద్యమానికి ఎప్పటికప్పుడు కవులు తమ కవితాశక్తిని ధారపోస్తూనే ఉన్నారు. స్వాతంత్ర్య సంగ్రామ యజ్ఞానికి కవితా సమిధలు అందిస్తూనే ఉన్నారు.

వీరగంధము దెచ్చి నారము - వీరుడెవ్వడో తెల్పుడీ
పూసిపోదుము - మెడను వైతుము
పూలదండలు భక్తితో (త్రిపురనేని)

ఏ దేశమేగినా, ఎందుగాలిడిన, ఏ పీఠ
మెక్కినా, యెవరెదురయిన పొగడరా, నీ తల్లి
భూమిభారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవమ్ము
(రాయప్రోలు)

మా కొద్దీ తెల్లదొరతనము, దేవ
మా కొద్దీ తెల్లదొరతనము (గరిమెళ్ళ)

దండాలు, దండాలు భారతమాత
అవి అందుకొని దీవించు భారతమాత (అజ్ఞాతకవి)

ఈ విధంగా అనేక గేయాలు దేశభక్తి స్ఫోరకమై ప్రజలను ఉద్యమం వైపు నడిపించాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమంలోని వివిధ సంఘటనలు కవులకు ప్రేరణ కలిగించినా, కవుల గీతాలు, కావ్యాలు, ఖండ కావ్యాలు ప్రజలను సమరోన్ముఖులుగా చేసాయి. స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యాన్ని రెండు భాగాలుగా మనం చూడవచ్చును. 1.స్వాతంత్ర్య ఉద్యమం గురించి 2.గాంధీజీ గురించి. స్వాతంత్ర్య ఉద్యమం సాహిత్యంతో పాటు సమానంగా గాంధీజీ మీద వివిధ భాషలలో వచ్చిన సాహిత్యం మరొక మహనీయుడైన వ్యక్తి మీద రాలేదన్న విషయం అతిశయోక్తి కాదు. ఎన్ని విమర్శలు, ప్రతి విమర్శలు ఉన్నా, గాంధీజీ యుగాన్ని, గాంధీజీ మీద వచ్చిన సాహిత్యాన్ని కాదనలేము.

ఇక్కడొక విషయాన్ని ప్రస్తావించాలి. ప్రజలలోకి చొచ్చుకు వెళ్ళిన ఉద్యమ సాహిత్యాన్ని పరిశీలిస్తే ఒక విషయం ప్రస్ఫుటమవుతుంది. ఉద్యమ కావ్యాలకన్నా, ఉద్యమ గేయాలు ప్రజాహృదయాలను కదిలించాయి. గేయ సాహిత్యం స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకపాత్రను పోషించింది. ఇక్కడే మరొక అంశము కావిటంటే గేయాలు కలిగించే ప్రయోజనాలు కంటె మిన్నగా నినాదాలు ప్రజలను ఉద్యమవైపు నడిపించాయి. వందేమాతరం, స్వరాజ్యం నాజన్మ హక్కు, జైహింద్, డు ఆర్ టై, క్విట్ ఇండియా, సైమన్ గోబ్యాక్ మొదలైనవి. కావ్యాలు, గేయాలు, నినాదాలు దేశమంతా నిండిపోయాయి. ఇదంతా ఒక ఎత్తు! మన త్రివర్ణ పతాకం ఒక ఎత్తు!! పింగళి వెంకయ్య రూపొందించిన మూడు రంగుల జెండా

మన భారతీయతకు చిహ్నం! స్వాతంత్ర్య సంగ్రామ ఆకాంక్షలకు ప్రతిరూపం!! మొత్తం దేశభక్తి సాహిత్యం రగిలించిన విప్లవాగ్ని కన్నా, ఒక్క త్రివర్ణ పతాకం అందించిన ఆత్మవిశ్వాసం, ధైర్యం, జాతీయతా భావం మిన్న'' మనజెండా లేనిదే భారతీయ స్వాతంత్ర్య సంగ్రామమే లేదు. త్రివర్ణ పతాకం వచ్చిన తర్వాత ఉద్యమం ఉవ్వెత్తున సాగింది.

భారతీయ భాషలలో వచ్చిన దేశభక్తి సాహిత్యాన్ని పరిశీలిస్తే తెలుగు భాషలో వచ్చిన దేశభక్తి సాహిత్యం విస్తృతమైనది. భారతీయ వారసత్వ సంపదకు, జాతీయ భావనకు, ఉద్యమవైభవానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది!!

కాశ్మీరు నుంచి కన్యాకుమారి దాకా ఈ దేశం ఒక్కటే! ఉత్తర దిశ హిమాలయాలు దక్షిణ దిశ సముద్రం హద్దులుగా కలిగిన ఈ దేశం ఒక్కటే! వివిధ ప్రాంతాలు, వివిధ భాషలు, వివిధ మతాలు, వివిధ కులాలు, వివిధ వృత్తులు, వివిధ అంతరువులు కలిగినా ఈ దేశం ఒక్కటే! ''భిన్నత్వంలో ఏకత్వం'' - భారతీయ జీవన సంస్కృతికి మూలం - ఇదే ప్రాణం!! ఆధునిక రవాణా సౌకర్యాలు లేని కాలంలో, ఒక చోట జరిగిన సంఘటన దేశమంతా తెలియటానికి చాలా సమయం పట్టే కాలంలో కూడా దేశభక్తి భావన ఉండేది. ఆలయాలు, తీర్థయాత్రలు, దండయాత్రలు, నదీపుష్కరాలు, కుంభమేళాలు, వలసలు, వివిధ రాజవంశాల పాలన, సాహిత్య - సంగీతాలు, జానపద అంశాలు, ఆచార వ్యవహారాలు, మత విధానాలు, ప్రధాన రహదారులు, దేశీయ సాహిత్యం, సముద్ర వర్తకం, ఇతర దేశాలతో సంబంధ బాంధవ్యాలు మొదలైనవి వాటివలన జాతీయాత భావన, దేశభక్తి భావన ఉండేవి. ఆధునిక యుగంలో స్వాతంత్ర్య సంగ్రామం వలన ఈ రెండు భావనలు దేశమంతా వ్యాపించాయి. మరింత పటిష్టంగా భారతీయులు ఐక్యంగా ఉండటానికి దోహదపడ్డాయి. దీనికిగాను, ఆధునిక రవాణా సౌకర్యాలు, ముద్రణా సౌకర్యాలు, పత్రికలు, ఆధునిక సాంస్కృతిక పునరుజ్జీవన అంశాలు, కొన్ని పరిపాలనా అంశాలు కూడా దోహదపడ్డాయి.

చివరగా ఒక మాట. తరతరాల మానవ జీవనాన్ని ప్రతిఫలింపచేసే ఉన్నతమైన ప్రక్రియ సాహిత్యం. సాహిత్యం వలన దేశచరిత్ర - సంస్కృతి కలకాలం నిలుస్తుంది. గతాన్ని మర్చిపోకుండా, వర్తమానంలో ప్రగతిని సాధిస్తూ, భవిష్యత్తు క్రాంతిని ఆవిష్కరిస్తుంది సాహిత్యం!! ఇటువంటి సాహిత్యాన్ని కవులను మనసారా స్మరిస్తూ, ఆనాటి స్వాతంత్ర్య సమరయోధు లకు నమస్కృతులు సమర్పిస్తున్నాను.

శ్రీకన్యకాపరమేశ్వరీ కళ & విజ్ఞాన మహిళా కళాశాల ఐక్యూఐసి, తెలుగు భాషా మండలి, మాడభూషి సాహిత్య కళా పరిషత్, చెన్నై సంయుక్తంగా నిర్వహించిన ''తెలుగు సాహిత్యం - దేశభక్తి'' అంతర్జాల అంతర్జాతీయ సదస్సుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. భారతదేశ స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ సదస్సు చారిత్రాత్మకమైనది. ఈనాటి తరానికి ఉత్తేజకరమైనది. నిర్వహణలో పాలుపంచుకొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

❖❖❖

గురజాడ కవిత్వం - దేశభక్తి

- డా॥. కె. లక్ష్మణ

ఆధునిక సాహిత్యానికి అడుగుజాడ అయినటువంటి మన గురజాడ వేంకట అప్పారావుగారు సెప్టెంబర్ 21,1862వ సంవత్సరం విశాఖపట్నం జిల్లా ఎలమంచిలి తాలుకా రాయవరం గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు కౌసల్యమ్మ, వెంకటరామదాను. అప్పారావు గారు బి.ఎ. వరకు చదువుకున్నప్పటికి కొద్ది రోజులు కళాశాలలో, మరికొద్ది రోజులు డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్ గుమస్తాగా పనిచేశారు. మరికొద్ది రోజులు అసిస్టెంట్ లెక్చరర్‌గా తమ వృత్తిని కొనసాగించారు. మొట్టమొదట భారతదేశంలో నెలకొల్పిన మూడు విశ్వ విద్యాలయంలో ఒకటైన మద్రాసు విశ్వవిద్యాలయంలో ఫెలోగా పనిచేశారు. మన గురజాడ వేంకట అప్పారావు గారు ఆధునిక యుగానికి వేగుచుక్క లాంటి వాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వీరి కలం నుండి జాలువారిన నాటకంలో 'కన్యాశుల్కం'. కథానికలో 'దిద్దుబాటు' అత్యంత ప్రజాదరణ పొందిన రచనలు. ఇవేకాకుండా వీరి రచనలు : మాటల మబ్బులు, మెరుపులు, సుభద్ర, ఋతుశతకము, పుష్పలావికలు, బిల్హణీయం, కాసులు, లవణరాజుకల, కన్యక, దించు లంగరు, ముత్యాలనరాలు, కొండుభట్టీయము, సారంగధర మొదలైనవి. వీరి రచనా విధానం సులభ శైలిలో ఉండడం గురజాడ అప్పారావు గారి కవిత్వానికి ఉన్న ప్రత్యేకత. గురజాడ అప్పారావు గారి భాష ఆధునిక భావాలను అలుముకున్నటువంటి ఒక నూతన విధానంలో, నైపుణ్యత గల కవిత్వాన్ని ప్రజలకు అందించిన ఘనత ఆధునిక కవి గురజాడ అప్పారావుగారికి మాత్రమే సాధ్యమవుతుంది. అలాంటి గురజాడ అప్పారావుగారు నవంబర్ 30, 1915వ సంవత్సరంలో మరణించారు.

దేశభక్తి :

''బ్రిటిష్ పరిపాలనకు నిరసనగా బయలుదేరిన స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్ని భాగస్వాముల్ని చెయ్యడానికి పుట్టిన కవిత్వం దేశభక్తి కవిత్వం. ప్రజలకు తన జాతి ఔన్నత్యాన్ని గురించి, తమ దేశం గొప్పతనాన్ని గురించి, పరాయి పాలకుల చేతుల్లో అవి నాశనమవుతున్న తీరును గురించి వివరించి ప్రజల్ని స్వాతంత్ర్యోన్ముఖుల్ని చేయడానికి దేశభక్తి కవిత్వం ప్రారంభమయింది. దేశభక్తి కవిత్వం తెలుగుదేశంలో రెండు రకాలుగా రూపుదిద్దుకొంది. ఒకటి భారతదేశ భక్తి కవిత్వం, మరొకటి ఆంధ్రదేశ భక్తి కవిత్వం. రెండోదాన్ని కొంతమంది రాష్ట్రభక్తి కవిత్వంగా పరిగణించారు. దీనికి కారణం తెలుగువాళ్ళు భారతదేశ విముక్తితోపాటు, ఆంధ్రదేశ విముక్తిని కూడా కోరుకోవడమే. ఆంధ్రదేశ భక్తి కవిత్వంలో కేవలం ఆంధ్రదేశ విముక్తే ధ్యేయం కాదు. ఆంధ్రుల పౌరుషాన్ని చాటి చెప్పడం ద్వారా భారతదేశ స్వాతంత్ర్యానికి పురికొల్పడం కూడా ఇమిడి ఉంది. దేశభక్తి కవిత్వంలో మకుటాయమానంగా నిలిచేది గురజాడ వేంకట అప్పారావు గారి 'దేశభక్తి' గేయం. ప్రపంచంలోని ఏ దేశానికయినా సరిపోయే దేశభక్తి గేయం.''(ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలు, ధోరణులు (వ్యాసం) - మాడభూషి సంపత్‌కుమార్, పుట.42)

గురజాడ అప్పారావుగారి 'దేశభక్తి' గేయంలోని దేశ భక్తిని గురించి పరిశీలించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం. గేయం ప్రారంభంలోనే-

దేశం :

''దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా!

వొట్టి మాటలు కట్టిపెట్టోయి
గట్టిమేల్ తలపెట్టవోయి''

(గురజాడలు, ఎమెస్కో, పుట.77)

'దేశభక్తి' గేయంలో గురజాడ అప్పారావుగారు దేశాన్ని ప్రేమించమన్నారు. అలాగే మంచితనాన్ని పెంచమన్నారు. పనికి రాని మాటలను కట్టిపెట్టి, సమాజానికి పనికొచ్చే మాటలు మాట్లాడి, గట్టివేలు తలపెట్టాలని తెలియజేశారు.

పాడిపంటలు :

''పాడిపంట పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయి;
తిండి కలిగితె కండ కలదోయి
కండ కలవాడేను మనిషోయి!''

(గురజాడలు, ఎమెస్కో, పుట.77)

మనుషులు బలహీనులుగా ఉంటారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని పై కవితా పాదాలను వెలువ రించారు. పాడిపంటలు పొంగిపొర్లే విధంగా మనుషులు కష్టపడాలి. అలాగే తిండి బాగా తింటే మనిషి పుష్టిగా ఉంటాడు. అలాంటి వారి శరీరం కూడా దృఢంగా ఉం టుంది. అలాంటి వారిని మనుషులుగా గుర్తించారు.

మనుషులు :

''యీసురోమని మనుషులుంటే
దేశమే గతి బాగుపడునోయి?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయి.''

(గురజాడలు, ఎమెస్కో, పుట.77)

మనుషులు నిరసంగా ఉంటే ప్రయోజనం లేదన్నారు. అలాంటి మనుషులు ఉన్న రోజులు దేశం బాగుపడ దన్నారు. మన సరుకులు అమ్మడానికి కూడా మనుషులు బలవంతులుగా ఉండాలన్నారు. కాబట్టి దేశంలోని ఉన్న మనుషులందరూ కూడా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు.

కీర్తి సంపదలు :

''అన్ని దేశాల్ క్రమ్మవలె నోయి,
దేశి సరుకుల నమ్మవలెనోయి!
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తి సంపద లబ్బవోయి.''

(గురజాడలు, ఎమెస్కో, పుట.77)

గురజాడ అప్పారావు అన్ని దేశాలతో సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండాలన్నారు. అలాగే దేశంలోని సరుకులను కూడా నమ్మాలన్నారు. డబ్బు లేనిటువంటి మానవులకు కీర్తిప్రతిష్టలు లభించదనే భావనను వ్యక్తం చేశారు.

మంచితనం :

''వెనక చూసిన కార్యమేమోయి?
మంచి గతమున కొంచెమేనోయి
మందగించక ముందు అడుగేయి
వెనకపడితే వెనకే నోయి!''

(గురజాడలు, ఎమెస్కో, పుట.78)

పల్లెటూరిలోని రైతు దగ్గర నుండి పట్టణంలోని వ్యాపారస్థుల వరకు ముందుకు వెళ్ళాలనే అనుకొంటారు. అలాంటిది గురజాడ అప్పారావుగారు మనుషులు చేసే పనులను గురించి తెలియజేశారు. అంటే మనుషులు మంచి తనంతో మెలగాలి. అలాగే మనుషులు మందగస్థ లుగా ఉండరాదు. అలా ఉంటే ఏ పనిలో కూడా ముందుకు రాలేరన్నారు.

విద్య :

''పూను స్పర్ధను విద్యలందే
వైరములు వాణిజ్యమందే,
వ్యర్థ కలహం పెంచబోకోయి
కత్తి వైరం కాల్చవోయి!''

(గురజాడలు, ఎమెస్కో, పుట.78)

'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నట్లుగా నీవు విద్యలందు స్పర్ధతో, స్ఫూర్తితో ఉండాలన్నారు. వాణిజ్యమందు వైరం

ఉండవచ్చే ఏమో! కానీ కలహాన్ని పెంచుకోవద్దన్నారు. కత్తి లాంటి గొడవలను అంతమొందించాలి. అప్పుడు గానీ సమాజంలోని మనుషులు ప్రశాంత జీవితాన్ని కొన సాగిస్తారు.

దేశాభిమానం :

"దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయి;
పూని యేదైనాను వొకమేల్
కూర్చి జనులకు చూపవోయి!"

(గురజాడలు, ఎమెస్కో, పుట.78)

కొంతమంది మనుషులు దేశం నాకేమీ చేస్తుం దంటారు. అలాంటి వారి గురించి తెలియజేశారు గురజాడ అప్పారావుగారు. దేశాభిమానం నాకు వద్దని గొప్పలు చెప్పవద్దు. నువ్వు ప్రారంభించే పని ఏదైనా సమాజానికి మంచి చేసే విధంగా ఉండాలన్నదే గురజాడ అప్పారావుగారి ఆకాంక్ష.

ఐకమత్యం :

"ఓర్వలేమిపిశాచి దేశం
మూలుగులు పీల్చేసెనోయి,
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయి!"

(గురజాడలు, ఎమెస్కో, పుట.78)

ఒక మనిషి గొప్పగా ఉంటే ఓర్వలేని ఈ దేశంలో గురజాడ అప్పారావు 'ఓర్వలేమిపిశాచి దేశం' అని దేశాన్ని కొనియాడారు. ఇతరులకు మేలు చేసి, ఐక్యమత్యాన్ని నేర్పించాలి. అప్పుడే సమాజంలోని మనుషుల్లో కూడా ఓర్పు, సహనం ఉంటుందనే విషయాన్ని పై గేయ పాదాల్లో వ్యక్తపరిచారు.

సుఖం :

"పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపి కెక్కడ సుఖం కద్దోయి?
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయి!"

(గురజాడలు, ఎమెస్కో, పుట.78)

ఇతరుల సంపద కోసం పొర్లి పొర్లి ఏడ్చే మనుషులకు ఎక్కడ సుఖం ఉండదన్నారు. అలాగే ఇతరులకు మనం చేసే మేలు, మనకు ఏనాటికైనా మేలే జరుగుతుందని పరోక్షంగా గురజాడ అప్పారావు పై కవితా పాదాల్లో తెలియజేశారు.

మట్టి :

"స్వంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడపడువోయి,
దేశమంటే మట్టి కాదోయి,
దేశమంటే మనుషులోయి!"

(గురజాడలు, ఎమెస్కో, పుట.79)

మనిషికి పుట్టుక చావు సహజం. అలాంటి మనిషి తన జీవితంలో కొంత వరకైన ఎదుటి వ్యక్తికి సహాయం చేయాలన్నారు. దేశమంటే మట్టి కాదు, దేశమంటే మనుషులని - ఒక పక్క దేశాన్ని గురించి, మనం నడుస్తున్న మట్టిని గురించి, మట్టిపైన నడుస్తున్న మనుషుల గురించి తెలియజేశారు.

మతం :

"చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడవవలెనోయి,
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి."

(గురజాడలు, ఎమెస్కో, పుట.79)

కుల, మత, భేదాలు లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరు కూడా మెలగాలన్నారు. మనుషులందరూ కలసి మెలసి రెండు చేతులు జోడించుకొని నడవాలన్నారు. అలా నడిచే విధానం కూడా అన్నదమ్ములు లాగా ఉండాలన్నారు.

మనసు :

"మతం వేరైతేను యేమోయి?

మనసు లొకటై మనుషులుంటే
జాతమన్నది లేచి పెరిగి
లోకమున రాణించునోయి!"

(గురజాడలు, ఎమెస్కో, పుట.79)

మనసులు ఒకటైనప్పుడు మతంతో పనిలేదని గురజాడ అప్పారావు తెలియజేశారు. అన్ని జాతుల వారు పెరిగిపెద్దైన తరువాత లోకమంతటా రాణిస్తారనే విషయాన్ని పై కవితా పాదాల్లో అప్పారావు కవిత్వీకరించారు.

ధనం :

"దేశమనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయి,
నరుల చమటను తడిసి మూలం,
ధనం పంటలు పండవలెనోయి!"

(గురజాడలు, ఎమెస్కో, పుట.79)

గురజాడ అప్పారావు దేశాన్ని ఒక పెద్ద వృక్షంతో పోల్చారు. ఆ వృక్షంలో పూసే పూలులాగా ప్రేమాభిమానంతో మెలగాలన్నారు. మనిషి శరీరం నుండి వచ్చే ప్రతి చెమట చుక్క, ధనం పంటలు పండాలనే విషయాన్ని గురించి ప్రస్తావించారు.

కవిత్వం :

ఆకులందున అణగిమణగీ
కవిత కోయిల పలకవలెనోయి
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయి!

(గురజాడలు, ఎమెస్కో, పుట.79)

ఆధునిక కవిత్వానికి దిశానిర్దేశం చేసిన గురజాడ అప్పారావు గారు కవిత్వం విన్నవెంటనే దేశమందభిమానములు మొలకెత్తవలెనోయి అన్నాడు. అప్పటి వరకు దేశాన్ని గురించి, సమాజాన్ని గురించి పట్టించుకొన్నవారు లేరు. అందుకనే గురజాడ అప్పారావుగారు దేశం గురించి చెప్పాల్సి వచ్చింది.

ముగింపు :

దేశమంటే ప్రజలు. కాబట్టి ప్రజలు గురించి రాయాలన్నారు అప్పారావుగారు. కవిత్వమన్న మాటతో పాటు ప్రజలు స్ఫురణకు రావాలన్నారు. ప్రజలమీద అభిమానం కలగాలన్నారు. వాళ్ళ కష్టనష్టాలు గుర్తుకు రావాలన్నారు. వాటికి పరిష్కారాలు గుర్తుకు రావాలన్నారు. ఇలా ఈ రెండు వాక్యాల్లో అనేక అంశాలను పొందుపరచి ఆయన కోకిల్లా ఆకులమధ్య ఉండి కవుల్ని ఆధునికతవైపు నడిపించాలన్నారు. కాబట్టే ఆధునిక తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావుగారి 'దేశభక్తి' గేయం మకుటాయమానంగా నిలబడిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. బహుజనపల్లి సీతారామాచార్యులు 1827-1892 - శ్రీ: శబ్దరత్నాకరము సంపూర్ణనిఘంటువు మరియు అనుబంధం, విక్టోరియా పబ్లిషర్స్, సింగరాజువారి వీధి, కొత్తపేట, విజయవాడ-01, మూడవ ముద్రణ: సెప్టెంబర్ 2007
2. తెలుగు పాఠ్యగ్రంథం, గద్యభాగం,(బి.ఎ.,బి.ఎస్సీ.,ఇతర డిగ్రీ తరగతులు) - మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై,2003-2004
3. తెలుగు పాఠ్యగ్రంథం, కవితావిభాగం సంప్రదాయ, ఆధునిక కవిత్వాలు (బి.ఎ.,బి.ఎస్సీ.,ఇతర డిగ్రీ తరగతులు) - సంపాదకులు : ఆచార్య జి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, 2002

4. తెలుగు కవుల కవితా దృక్పథం - డా॥ కె.లక్ష్మణ, ద్రావిడ విశ్వవిద్యాలయం, శ్రీనివాసవనం, కుప్పం, మొదటి ముద్రణ: 2016

5. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, ప్రగతి పబ్లిషర్స్, 3-11-275/1,శ్రీశంకర్ కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500 074, పరివర్ధిత చతుర్థ ముద్రణ : జూన్, 2008.

❖❖❖

"తెలంగాణ కవులు - దేశభక్తి కవిత్వం"

- డా॥. కొండపల్లి నీహారిణి, కవయిత్రి, రచయిత్రి, సాహిత్య విమర్శకులు, వక్త, "మయూఖ", "తరుణి" అంతర్జాల పత్రికల సంపాదకులు.

దేశభక్తి మనిషికి ప్రాణవాయువు వంటిది. ఆత్మాభిమానం, స్వేచ్ఛ దక్కనీయకుంటే ఎదురొడ్డి సాధించుకోవాలి. సాధించుకుతీరుతారు అని మన దేశ స్వాతంత్ర్య పోరాటాలు నిరూపించాయి. నాటి జాతీయోద్యమంలో భాగంగా తెలంగాణా కవులు కలాలను ఝళిపించారు.

స్వాతంత్ర్య కాంక్షతో కవులు ఆవేదన ఆక్రోశం వెలిబుచ్చారు.

కవిత్వం గర్భితత్వంగా , రసాత్మకంగా దృశ్యమానం చేయాలి. " మాభాగ్య నగరాన / మా పూర్వపుణ్యాన / మేమెన్నిసోయేండ్లు/ చూడంగ చూడంది / ... యీనాటికి వ్వచ్చె/ మా కోర్కలీడేరె/....."అంటూ ఓ దండకాన్ని వింతైన తీరులో రాసారు సురవరం ప్రతాపరెడ్డి గారు . సామాజిక రాజకీయ చైతన్యం రగల్చడానికోసం ఈ ప్రక్రియను తమ కవిత్వ సాధనంగా వాడుకున్నారు . సురవరం గారంటేనే అస్తిత్వ పతాక! స్వాతంత్ర్యం కోసం కవిగా ఎలా నిలిచారో ఆత్మాభిమానం కోసమూ నిలిచారు.

1934లో దీపావళి సంచికగా గోలకొండ కవుల సంచికను 354 మంది కవుల కవితలను 11 విభాగాలుగా చేసి 1418 పద్యాలను ప్రచురించారు సురవరం ప్రతాపరెడ్డి గారు. తెలంగాణ కవులకు మాగాణ! ఇది బుజువు చేసారు . ఆత్మకూరు, గద్వాల సంస్థలు వంటి ప్రసిద్ధి గాంచినవి. దేశ దేశాల నుంచి వచ్చే కవులకు సత్కారాలు చేసేవి, నగదు బహుమతులు ఇచ్చేవి.

'గ్రంథాలయోద్యమం' అనే పుస్తకాన్ని రచించిన సురవరం ప్రతాపరెడ్డి గారు తెలుగు భాష కోసం ఎంత కృషి చేసారో, దేశం కోసమూ, ప్రాంతం కోసమూ అంతే కృషి చేసారు. 'గోలకొండ' పత్రిక వీరి అమోఘమైన భాషా నైపుణ్యానికీ, భావ ప్రదీప్తులకు నిలువెత్తు నిదర్శనం.

దాశరథి కృష్ణమాచార్య మహాకవి.

"ఓ పరాధీన మానవ !
ఓపరాని దాస్యము విదల్చలేని శాంతమ్ము మాని
తలపును ముష్టి బంధన కలచివైచి
చొచ్చుకొని పొమ్ము స్వాతంత్ర్య పురపురమ్ము"అన్నారు

1944లో హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో వరంగల్లులో సురవరం ప్రతాపరెడ్డిగారి అధ్యక్షతలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలో పాల్గొన్నప్పుటి గేయం ఇది. తర్వాత దాశరథి గారిని జైలులో నిర్బంధించారు. అప్పుడాయన

"ఓ నిజాము పిశాచమా! కానరాడు/ నిన్ను బోలిన రాజు మాకెన్నడేని
తీగెలను తెంపి అగ్నిలో దింపినావు/ నా తెలంగాణ కోటి రత్నాల వీణ!"

అని నిజామాబాద్ జైల్ గోడలపై బొగ్గుతో పద్యం రాయగా దాన్ని పోలీసులు చెరిపేస్తే వట్టికోట ఆళ్వారు స్వామి మళ్ళీ రాసినపెట్టేవారు. అనాటి ఆ ఖైదీలకు ఈ పద్యం కంఠస్థమై పోయింది.

విశాల భావాల దాశరథి గారు

"జెండా ఒక్కటి మూడు వన్నెలది దేశంబొక్కటే భరతా
ఖండా సేతు హిమాచలోర్వర,
కవిట్కాండమ్ములోనన్ రవీంద్రుడొ
క్కండె కవీంద్రుడూ ర్జిత జగద్యుద్ధాలతో శాంతి
కో దండోద్య ద్విజయుండు
గాంధి ఒకడే, తల్లీ ! మహా భారతీ !" అని సన్నుతించాడు!

"ఆ చల్లని సముద్రగర్భ / దాచిన బడ బానలమెంతో
ఆ నల్లని ఆకాశంలో / కానరాని భాస్కురులెందరో...."

అని గొప్ప పాటను రచించిన దాశరథి అభిప్రాయంలో

"తెల్ల కాగితం మీద నల్లక్షరాలు వ్రాస్తుంది సాదాలేఖిని
నల్లని చీకట్ల మీద నవకాంతి కవితలు వ్రాస్తున్నది జ్వాలాలేఖిని" కవివాణి శక్తివంతమైనదైతే ప్రజలకు తొందరగా చేరువౌవుతుంది.

వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామం నుండి ఒద్దిరాజు సోదరులు మహాకవులు. ' తెనుగు' పత్రిక స్థాపకులు, సంపాదకులు సీతారామ చంద్రరావు, రాఘవ రంగారావు గార్లు భారతదేశ స్వతంత్ర సంగ్రామానికి తమదైన రీతిలో కవిత్వ రచన చేసారు. మహాత్మా గాంధీ, జాతీ యోద్యమంలో పాల్గొన్న సందర్భంగా నూ, మువ్వన్నెల జెండా రెపరెపలు చూడాలన్న కోరిక ఉందని రాసారు." జాగేలాచరింప జూచెదరు? కింజాతాది శంకల్ విప ద్యోగంబిపుడులెన్స?...." అని చెప్తూ, వారు రచించిన 'అనాథ బాల ' కావ్యంలో ఓ సందర్భంలో, "వారి కృషి ఫలంబు భాతి బాలస్తబ్ద దేశ చలితో జాతీయ మాడ్కి" అంటూ భారతదేశం స్వతంత్రత లేకుండా ఉన్నప్పుడు జాతీయ సంస్థలు, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం ఉద్భ వించిన సంస్థలు స్తబ్దత తో ఉన్నట్లు ఆ అనాథ బాల కూడా అని పోలిక చెప్పారు. రజాకార్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు కవులుగా కవిత్వం తో ముందుకొచ్చారు . ఇలా ఎందరో కవులు రచయితలు కవితలు రాశారు. దేశ భక్తి గీతాలు బుర్రకథ లు పాటలు గేయాలు ఎత్తుకొని స్వాతంత్ర్యం కోసం పూనుకున్నారు.

హీరాలాల్ మోరియా

"బానిసలుగా బ్రతుకలేము / స్వాతంత్ర్యముగ పోరాడి
మా దేశపు మృత్తికలో / మృత్తిగా నిదురిస్తాం !" అని దేశ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నిలిపాడు.

పల్లెబాణిలో అల్లిన గీతాలలో సుద్దాల హనుమంతు గారు (నేటి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తండ్రి) సజీవులై ఉన్నాడు.

"వెయ్ వెయ్ వేయదెబ్బ
దెబ్బకు దెబ్బ / వెయ్ వెయ్
ఎక్కడి సైనికులెక్కడి రజాకార్లెందుకు ఇక్కడ
ఎందుకు దోపిళ్ళెందుకు కాల్పులు / ఎందుకు హత్యలు, ఎవడా నైజామ్
ముక్కోటులలో ఒక్కడు మిగిలిన / దుఃఖము లేదుర" అనే గేయంలో ఉరకలెత్తించేలా రాసారు.

"తూరుపులు నీవేరా / పడమరలు నీవేరా / దిక్కుదిక్కులు గెలిచి/ రిక్కలై వెలుగరా ! అని అన్నారు సుద్దాల.

కేశవపతుల నరసింహశాస్త్రి మహబూబ్ నగర్ జిల్లా (పాలమూర్) కవి పండితులు, శతకాలు, ఖండకావ్యాలు, సాహిత్య విమర్శక వ్యాసాలు, గ్రంథాలు రచించిన వీరు ఆనాటి ఆకాశవాణి శ్రోతలకు సుపరిచితులు. 'అమర వాణి' పేరుతో ఆకాశవాణి సంస్కృత పరిచయ కార్యకర్తగా వీరు పన్నెండేళ్ళు పని చేసారు. "కేయురాణి నభూషయంతి పురుషం.."అనే భర్తృహరి సుభాషిత శ్లోకంతో మొదలయ్యే గీర్వాణవాణి కార్యక్రమంలో శాస్త్రి గారు ప్రతిరోజు విద్యార్థులకు ఒక శ్లోకం చెప్పి, అర్థ తాత్పర్యాలు చెప్పేవారు. ఎన్నో పద్య కావ్యాలు రాసారు. వీరభాషితం - 9వ పద్యం మచ్చుకు వీరి పద్యమొకటి.

మ? ఇతి హాసంబు నెఱుంగవో ! అమర సాహిత్యంబు కాశ్మీర భా
రతి విశ్వంబున భారతీయుల సమగ్ర ప్రౌఢి వర్ణించు నీ
మతికిన్ దోపవు పూర్వ వృత్తములు, సామ ప్రక్రియన్ గర్వ సం
గతి సాధింపగ జాల వేటికిక ధిక్కారంబు ! గర్వాంధుడా !"

అంటూ రాసిందెంత సత్యమో ఇప్పుడు సభ్యసమాజం ఆలోచించాలి. మన దేశ ఖ్యాతిని మరిచే నిర్లక్ష్యాన్ని కవిగారు గట్టిగా ఖండించారు.

గంగుల శాయిరెడ్డి

సీ॥ భారత వృక్షంబు వేరులే సేద్యంబు / క్రయ విక్రయములు ప్రకాండమయ్యె
కొమ్మ రెమ్మలు కోటానుకోటులు / వివిధ వృత్తుల చేత వృద్ధి పొందె
సద్విద్య పువ్వులై చక్కగా రాజిల్ల/ కాయకష్టము నిండ కాయలయ్యె
పక్వమౌ ఫలములు బంగారుగా మార / రంగు వాసన రుచి రమణగాంచి

గీ॥ అన్ని యాసల కేతెంచె నాకసమున
పండ్లనన్నిటి గొనిపోవు పక్షితులు
మంచి చెడ్డల జూడగా మంచె యెక్కి
కర్షకా యొడిసెల బూని గారవించు''

భారతదేశాన్ని వృక్షంతో ఉపమిస్తూ రాసిన ఈ పద్యంలో భారతదేశమనే వృక్షానికి వేళ్ళు లోకానికి తిండి పెట్టే వ్యవసాయమేనని చెప్పడం అద్భుతంగా ఉన్నది.

దూపాటి వెంకటరమణాచార్యులు శేషాద్రి రమణ కవులుగా ప్రసిద్ధిగాంచిన కవులలో ఒకరు.తెలుగు ప్రాంతాన్ని ఏకచత్రాధిపత్యంగా పాలించిన మహాప్రతాపశాలిని మహారాణి రాణీరుద్రమదేవిని గురించి

''కఱు కుదనంబు నిబ్బరము గల్గని స్త్రీజనమందొకర్వవై
కణి కఱియందు బురుషులు గాదని నిస్తుల రాజ్యభారమున్
నెఱిపితి వెల్ల భూవిభులు నిన్ జయవెట్టగా బ్రూహా మహీ

పరులకు నీకు నెందు గనుపట్టనె భేదము రుద్ర మాంబికా'' అంటూ ఆమె ధైర్య సాహసాలను వర్ణిస్తూ, రుద్రమదేవిని రెండు చేతుల ధనుర్బాణాలు ధరించి శత్రువులను పారద్రోలే సమయంలో ఆంధ్ర లక్ష్మిగానో, భారతమాతగానో, లేక కాళీ దేవతగానో నే కాకుండా సత్యభామనా అన్నట్లు కనిపిస్తుందని కవిత్వం రాసిన దూపాటి గారు ఒక పద్యంలో..

''భారత వర్షమంతటికి బల్లెలె యాయువు పట్టు దేశ సే
వారతులై ప్రజావిహిత వర్తనులై తగు కష్టజీవుల
వ్యారిగ నందు నుండ్రు భగవంతుడు సోమరులై ధనాఢ్యులే
వారల రక్షణంబునకె పల్లెల గురిచె నుంచు తోచెడిన్''

అనీ పల్లెలను, పల్లీయులనూ, రైతులను కీర్తించారు.

''పండించు ప్రాణాలు పస్తుపడ్డాక
పాడురాజ్యాన్ని కాపాడకుంటేమి
రక్షించువారలే భక్షించినాక
విష్ణు వని రేవు సేవించకుంటేమి?''

1942 క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంలో కాళోజీ రాసిన కవితిది.బ్రిటిష్ పాలకుల దమన నీతిని ఖండిస్తూ రాసారు.

స్వాతంత్ర్య ఒక్కటే కోరిక గా కాళోజీ

''లాఠీ దెబ్బల లక్ష్యమేమీ
కఠిన శిక్ష యే కాదు కాదు
చావుకైనను జంకనీయదు
మాతృదేశము మాతృదేశమె'' అని ఘర్జించాడు ప్రజాకవి కాళోజీ.

దేవులపల్లి రామానుజరావు 'పచ్చ తోరణం' ఖండకావ్యంలో

''ఇంకెన్నాళ్ళు భరింతుమీ విదేశ
పాలనము బుద్ధి వచ్చె చాలునింక
చెంపలనుగొట్టుకొని చెంతజేరినాము.....అంటూనే
భారతీయుల దుస్థితి బాపు కొఱకు
అరేయ్ స్వాతంత్ర్య మొక్కటే ఔషధాన్ని ....
తెల్లవారల రాజ్యంబు తెల్లవారుదనుక
ఆకలిదప్పుల దలపలేము''

అని వారి రాజ్యాన్ని తృణీకరించారు .

అలాగే నెల్లూరు కేశవదాసు, సామల సదాశివ, కపిలవాయి లింగమూర్తి, బూర్గుల రామకృష్ణారావు వంటి

కవులూ గళమెత్తారు.బిరుదు రామరాజు, పేర్వారం జగన్నాథం, కోవెల సంపత్కుమారాచార్యులు, సుప్రసన్నా చార్యులు, పాకాల యశోధారెడ్డి, ముదిగంటి సుజాతా రెడ్డి వంటి ఆ తరం కవులంతా ఉద్యుక్తులయ్యారు.

ఇక దాశరథి సోదరుడు, వేదాన్ని జీవనవాదాలుగా నిర్వచించి పరిష్కరించిన కవి దాశరథి రంగాచార్య ప్రముఖ కవి, రచయిత. వీరి నవలలు చాలా ప్రసిద్ధి చెందాయి. తెలుగు, ఉర్దూ సాహిత్యాలు, సంస్కృతం బాగా తెలిసిన కవి.

"శాంతి / సౌఖ్యం / ఒకే పక్షి / రెండు రెక్కలు
ఒకటి విరిగితే /రెండవది గిలగిల కొట్టుకుంటుంది / పక్షి" అంటూ రాసిన కవితను ఉదహరిస్తే వీరి 'జనరంగం' కవిత్వం ఎంత నైతిక విలువలను ప్రోది చేసిందో తెలుస్తుంది.

పల్లా దుర్గయ్యగారి 'గీతావళి' ప్రౌఢ గంభీరంగా, సుమధరు సుమ సుందరంగా సాగిన గేయావళి. దేశభక్తి నరనరాన జీర్ణించుకున్న కవులు ఆ తరం కవులంతా ఇంతటి గొప్ప రచనలు చేసారు.వీరు ,

"రాటమే మీకు నారాటమును మాన్పు / కదురు
మీ రోగముల కుదురు కొనజేయు
నూలుచే సంపదలు నూలుకొను మీకు / కండలే
మీకు తామండయె నిలిచి" అంటూ స్వాతంత్ర్య

కాంక్షను బలంగా ఎత్తిచూపిన విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో రాట్నం ఎంత బలోపేతమైన ఉప మానమైందో అందరికీ తెలిసిందే. వీరి 'గంగిరెద్దు' చాలా ప్రసిద్ధి పొందిన కావ్యం. 'పాలవెల్లి' అనే వీరి ఖండ కావ్యంలోని కవిత్వాన్ని "భాష, శబ్దార్థ పయోధుల మధించి తీసిన వెన్న ముద్దలుగా" ఇతర కవులు వర్ణించారు.

ఇంకా అడ్లూరి అయోధ్య రామయ్యగారు, మారేపల్లి మాధవరావు గారు, ధవళా శ్రీనివాస రావు గారు, పాములపర్తి సదాశివరావు గారు, నరసింహారావు సోదర కవులు, కోదాటి రామకృష్ణ రావు, ఠంయ్యాల లక్ష్మీ నరసింహాచార్యులు, గవ్వా మురహరిరెడ్డి, ఆచ్చి నరసింహా చార్యులు, మామిడిపల్లి సాంబయ్యగారు, నెల్లుట్ల రామకృష్ణమాత్యులు, మందా రామిరెడ్డి, మాదిరాజు రంగారావు, భోగి నారాయణమూర్తి, గడియారం రామకృష్ణశర్మ, అందె వెంకటరాజం గారు వంటి కవు లెందరో తెలంగాణ మాగాణంలో కవిత్వపు పంటలు పండించారు.

వానమామలై వరదాచార్యులు

"నేను కవిని - కవిత్వం వ్రాస్తాను
నేను భువిని - అన్నిటినీ నాలోపలే సృష్టిస్తాను
నేను రవిని - ఆర్పరాని అగ్నినై చూస్తాను
నేను రవిచ్ఛవిని - లోకపు కన్నుదమ్ముల వికసింప జేస్తాను
నేను హంసను - పరమహంసను / దౌర్జన్యంపై దాడివెడలిన అహింసను
నేను మానస సరోవరంలో విహరిస్తాను"

"కూలిపోయే కొమ్మ" వానమామలై గారి గొప్ప కవితా సంపుటి.

పల్లవి : మనది మానవజాతిరా సోదరా !
మనది ఒకటే నీతిరా!

చరణం: కుల మతమ్ముల కుళ్ళు - ప్రగతి పథముల ముళ్ళు
దేశమే ఒక ఇల్లు - తెరచి చూడుము కళ్ళు
స్వార్థ చింతన వద్దురా సోదరా ! సంఘభావము ముద్దురా...???మనది మానవ??

మనుజులంతా మనవాళ్ళే - నవలలో (1977 సెప్టెం బర్) (అసంపూర్తి నవల) ఇది రాసారు. నవలా కాలం 1945 నుండి 1969 మధ్యకాలాన్ని తీసుకొని రాసినది. 'రైతుబిడ్డ' బుఱ్ఱకథల సంపుటిలో ఒక గీతం

"అరుణోదయము వచ్చె సరసిజము పలువిచ్చె / పరువెత్తు చీకటుల పరిహసింపగ జొచ్చె
ధర సుప్రభాత సుందర కళాతతి గూడె / భరత పుత్రుడు శాంతి భావగీతము బాడె"

బాపూజీ గ్రామ స్వరాజ్యం పల్లె ప్రజలకు అర్థమయ్యే రీతిలో సాగింది ఈ గేయం.

'జయధ్వజం' కావ్యం నుంచి

"జయ భారతావనీ జయలోక పావనీ!
శాంతి సుఖదాయినీ ! జననీ! నమస్తే! ? 2 ?
సకల సంపతనీ సస్య నందనవనీ
ఆసేతు సీతన హటకావని జనని !
చత్వారింశత్కోటి ప్రజా జయ ఘంటికా ధ్వనీ !
సాశీతి కోటి భుజబల మహావాహినీ ! జయ భారతా?అని రాసారు.

తెలంగాణ ప్రాంతం పరతంత్రంలో పడిన కష్టాలను కవిత్వీకరిస్తూ

"రక్కసి చేష్టలు జేసిరి - రజ్వో నీవోగాని- ఒక్కొక్కటి
దలచికొనిన ఒళ్ళంతా ముండ్లు దేలు
అరిగిన మానాల కెఱుక తరిగిన ప్రాణాలకెఱుక - కాలుగాలు

పిల్లివోలె కష్టబడిన మాకెఱుక" అని ధిక్కార స్వరంతో ఆనాటి దుష్టపాలన, రజాకార్లపై వ్రాసారు జయధ్వజం - మేలుకో అనే కవితలో

"పల్లె గుడిసెల పాడిపంటలు చల్లగా నున్నంతసేపే - పుల్ల ముఖుడై భరతవీరుడు
పోరగలడోయీ, విజయము పొందగలడోయీ"
అంటూ రైతు పక్షాన కలమెత్తిన వానమామలై గారు మహాకవి, మన కవి.

'ఖబర్దార్' అనే గేయంలో

"ఖబర్దార్ పాక్ భాయ్ - కాశ్మీరు మాదేనోయ్
పర ధన వనితా చోరల భారతము సహించదోయి"
అంటూ గళమెత్తినా,

"ఎవ్వడ లేడిల పగవాడు మేమెవ్వరికిని దలపము కీడు
మా జోలికి నెవ్వడు రాబోడు మరి వచ్చిన ప్రాణంతో పోడు" అంటూ ఎలుగెత్తినా,

"భారత వీరకుమారా ప్రపంచమత రణధీరా
మరల వైరి తలయెత్తని మాడ్కి బుద్ధి చెప్పుమురా"
అని సైనికులకు ఉద్బోధ చేసినా,

"గతము గొప్పలు కట్టిపెట్టి మతము మాటలు మూటగట్టి
అంటరాని తనమ్ము నావలకు గెంటవలెనోయి
అది యొక కంటకమ్మోయీ" అని అభ్యుదయ భావాలతో వ్రాసిన వానమామలై వరదాచారి గారి మంచితనమూ, జాతి శ్రేయోభావమూ ఇట్టే తెలిసి పోతుంది.

"పండితాః సమదర్శనః" అన్నదే వీరి పరమ లక్ష్యం!
"కవులున్నారు కవి ప్రకాండులకు
సత్కారమ్ము కల్పించు భూ
దవులున్నారు ఫణీశ
గౌతమ కణదే వ్యాసముఖ్యోక్త - శా
స్త్ర విచారమ్ముల వైరి గెల్చేటి
బుధేంద్ర స్వాములున్నారు - త
క్కువ యేమున్నది మాకు..."

అంటూ కేశవ పంతుల వెంకట నరసింహశాస్త్రి గారు, అలంపురం, మహబూబ్ నగర్ ఆశువుగా చెప్పిన ఈ పద్యం తెలంగాణ సాహితీమూర్తుల రూపాన్ని చిత్రిక కట్టింది.

సినారె :

"పరుల కోసం పాటుపడని నరుని ఎతకు దేనికని
మూగనేలకు నీరందివ్వని వాగు పరుగు దేనికని !"

నేలకు మానవధర్మాన్ని ఆరోపణ చేసి, వాగుకు ప్రాణి ధర్మారోపణ చేసి మూగతనంతో అధిక్షేపణ చేసి జీవన తాత్వికతకు మానవ ప్రకృతికి ముడిపెట్టి రాసిన ఈ గజల్ మహాకవి సినారె గారిది. చైనా దురాక్రమణ సందర్భంలో సినారె గారు

"ఎవడురా నా తల్లి హిమగిరి కిరీటమ్ముపై / చేయిసాచగా నంకించినాడు.
ఎవడురా నా తల్లి పువ్వుటెడదలో / నిప్పురవ్వలు రాల్చగా సాహసించెన్..." అంటూనే

నా తల్లి సహనానికి ఏలిక / సమరానికి కాళిక" అని ముగించారు.

గవ్వా అమ్మతెడ్డి

తే॥గీ॥ ఆంధ్రులమొ కామో ! మనమీ యనంత భూమి
ఆంధ్ర దేశంబోని యను సంశయంబు సొడము
తమ్ముఉడా! నిన్ను జూచిన తరుణమందుఉ గారణంబేమొ యూహింపగలిగినావె? అని రాయడాన్ని గమనిస్తాం.

నీలకంఠ చంద్రమౌళీశ్వర కవులు గోల్కొండ కవుల సంచికలో రెండు సీస పద్యాలు ప్రబోధము

విభాగంలో 'జీవకళ' అనే శీర్షికతో రాసారు అందులోని ఒకటి

గీ॥. నహహ భారతదేశ ధర్మానుసరణ /మెటిహీనత గాంచెడి గుట్టు తొలగి
భావగర్భితమైనట్టి ప్రాజ్ఞులార / మేలుకొని జీవకళనింక చాలగనుఉడి"

అని రాయడాన్నీ చూస్తాం. దేశభక్తి కవితలు కవయిత్రులు కూడా ఆనాడు రాసారు.

భో॥. ఆండాళ కుట్టి గారు భారతమాత గురించి

గీ॥ ఆజ్ఞ సముదయోజ్జీవనా భోజ్య సహజ / మంగళకర కరుణా సమాతిరిగి తులును
నైన శంకర రామానుచార్య సముల / దొరయు పుత్రుల గననేమి భరతమాత.
సమాజ శ్రేయో వాంచితులు, పరమనిష్మా గరిష్టులు"

మహాపరాక్రమవంతులైన బిడ్డల్ని గన్న భరతమాత ఇప్పుడు కూడా అట్లాగే ఉండేలా వుంటదని అంటూ రాసారు.

వి. లక్ష్మీదేవమ్మ 'దేశమాత' అని సీస పద్యాలు రాసారు.అందులో

గీ॥ వీరధర్మంబు దివికేగి విశ్రమించె
బ్రహ్మ తేజంబుడస్సి విశ్రాంతి గనియె
భారతీయులు దౌర్భాగ్య పరత గనిరి
తిరిగి మమ్ముద్ధరింపుమో దేశమాత!"అన్నారు. రూపా?న్ పేట రత్నమ్మ, పులిగోటి ఆనందమాంబ, రాణీ వేంకటాయమ్మ సర్ దేశాయి వంటి కవయిత్రులు కూడా ఆనాడు రాసారు.

'పారతంత్రము'అనే కవితలో గవ్వా జానకి రామిరెడ్డి

"ధర స్వాతంత్ర్యమే స్వర్గతుల్యమను తత్త్వతాన లేశంబులో
నరయన్ జాలని మంద బుద్ధులిడు లాహా ! మాధవుల్"అన్నారు.

"రా,యీ శిథిలాలపైన స్వాతంత్ర్య పతాక యెత్తు/ రా, యీ శిథిలాలపైన రక్తపతాకమ్ము ఎత్తు" అంటూ మగ్దఊమ్ మొయినుద్దీన్ కలమెత్తినాడు.

పెండ్యాల రాఘవరావు

'నా దేశంరా నా దేశం
నా దేశం నా భారత దేశం" గేయం అనేక ప్రశంసలందుకున్న గేయం.

"వడివడిగా రాట్నమా/ నూలును వడుకుము రాట్నమా
భారతజాతి భాగ్యవిధాతవు / గిరగిర దిరుగుము రాట్నమా ?వడిగా?"అని

ప్రజలకు నూలు బట్టల విలువను చెప్పినా,

"కట్టుమా - స్వాతంత్ర్య సౌధం ! ఏతుమా మన ఎర్రజెండా

వీరవనితల వీరపత్నుల హృదయములలో ఉదరములలో మర్చిపోము ఏనాటికైనా "అంటూ ఉత్తేజ పరిచిన గేయం రాఘవరావుగారి దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం.

సి.ఇ. ఆండ్రూస్ గారు

'తెలంగానా' కవితలో

గీ॥ వెలయుచున్నది దేశభాషలకు మిన్న /
యాంధ్రభాషామతల్లి ప్రయాసమనక
ప్రబలుచున్నది తెనుఉగు కబ్బము చెలంగి /
నివురుగప్పిన యవలమై కవుల మదిని !"

నిజాం ప్రాంతమంతా తెలుగు మాట్లాడేవారేఅన్న పాలకులు అన్య భాషావలయుకులని చెప్పు. రాష్ట్రమాత, నైజాము రాష్ట్రమాత, నిజాం రాష్ట్రము భాగ్యసంపూత నిజాం రాష్ట్ర ప్రశంస రాష్ట్రాధిక్యత వంటి శీర్షికలతో చాలామంది కవులు రాసారు.

వడగం రాజేశ్వరరావు" ఆంధ్ర

స్వీయదేశమునందుండి చిద్విలాస /మెసఉగు
వస్త్రముల్ వీడి వేర్వ్యసనమునమ్
జీతులన్ జూచుటెంతయు సిగ్గటంచు నరయలేకున్న
బ్రతుకేల ఆంధ్రపుత్ర !
'జీతులు' అంటే మనసు రుచులు అనే అర్థం
ఉపయోగించే పదం.

పాట మనసును హత్తుకుంటుంది. గేయం శ్రవణా నందకరమై హృదయానందాన్నిస్తుంది. ఆలోచనల్లో పడేస్తుంది. తగిన దారులలో నడిపిస్తుంది.

"బండెనుక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి
ఏ బండ్ల పోతవు కొడుకో నైజాము సర్కరోడా
నాజీల మించినవురో నైజాము సర్కరోడా"

యాదగిరి రచించిన ఈ పాట తెలంగాణ తొలి ఉద్యమంలో వెలుగు రవ్వల్ని విరజిమ్మిన పాట. "అంబ రావే భారతాంబ రావే / అమరయోధుడు దొడ్డి కొమురయ్యను గన్న

వీరమాతవో తెల్గు భారతీ రావే !" అన్నారు. ఇటువంటి పాటలు ఎన్నో జనవాణి హృదయ గళాన ఉద్రూత లూగాయి.

అట్లాగే

"కోటిన్నర నోటి వెంట పాటలుగా / మాటలుగా దిగిపొమ్మని దిగిపొమ్మని...." అంటూ దాశరథి రాసిన పాట గానీ ఆనాటి తెలంగాణ పోరాట పటిమకు అనంతమైన ధైర్యాన్నిచ్చినవి ! పైడిపాటి సుబ్బరామశాస్త్రి 'జాతీయ భారతి', 'జయభారతి' వంటి గేయ కవితా సంపుటాలు వచ్చాయి. దాశరథి, సినారె, ముకురాల రామారెడ్డి, నీలా జంగయ్య, జె. బాపురెడ్డి వంటి కవులెందరో దేశభక్తి గేయాలు రాసారు. డా? వడ్డేపల్లి కృష్ణ గారి ఎన్నో గీతాలు ఆకాశవాణి, దూరదర్శన్లలో ప్రదర్శించారు. సుద్దాల అశోక్ తేజ గీతాలు కూడా వచ్చాయి.

పులిజాల గోపాలరావు, కాళోజీ రవీందర్ రావు, బూర్గుల రంగనాథరావు, బోయినపల్లి

రంగారావు, విక్రాల నరసింహా చార్యులు, గార్లపాటి రాఘవరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, పొట్లపర్తి రామారావు, వేముగంటి నరసింహాచార్యులు, చిల్లర భావనారాయణ, వెల్దుర్తి మాణిక్యరావు, పల్లా నర్సయ్య, తిరుమల శ్రీనివాసాచార్య వంటి వారెందరో గేయ మాలికలల్లారు.

Art mount be national in form and socialistic in content అన్నాడు స్టాలిన్. కళలనేవి జాతికి జీవ నాళికలు. జనపద గీతికలు. మాండలికపు నుడి కారంతో గేయాలు అలరిస్తాయి. అంతే ఎన్నో విప్లవ కవిత్వ ప్రబోధాత్మక గేయాలు అనాడు ప్రసిద్ధి పొందాయి. గద్దర్ రాసిన తెలంగాణ విప్లవ గీతాల్లో జానపద హృదయం భాష సమ్మిళితమైన గీతం

"హెూళీ హెూళీ ల రంగ హెూళీ / శెమ్మ కేలీల హెూలీ
ఏడ బుట్టె ఏడ బెరిగె వోళి శెమ్మ కేలీల వోలి
ఏడి కొచ్చె ఏడ సచ్చెవోళి శెమ్మ కేలిల వోలి....
సుక్కలల్లో కలిశెరమ్మ వోలి శెమ్మ కేలిల వోలి" అంటూ పల్లె ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వీరులకు గిరిజన బాణీల్లో నివాళులిచ్చారు.

వరవరరావు రచించిన స్వేచ్ఛ గేయం, వంగపండు ప్రసాదరావు రాసిన పాలికేక, ఏరువాక వంటి గేయాలు విప్లవ భావాలతో దేశభక్తి ప్రేరితంగా ఉన్న గేయాలు.

తెలుగు కవిత్వంలో గేయం, పద్యం, వచన గేయం రూప ప్రాధాన్యతల్లో మార్పులు ఉన్నా నవీన భావాలతో హృదయాలకు చేరువయ్యాయి.

గురజాడ ముత్యాల సరాల్లో -

''దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్'' అనే గేయం సామాజిక స్పృహను కల్గించిన గేయం.

1. 'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి గలవోడా', 2. 'వీరగంధం తెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడీ', 3. 'మరో ప్రపంచం పిలిచింది పదండి ముందుకు పదండి తోసుకు', 4. 'మాకొద్దీ తెల్లదొర తనమ్ము', 5. 'మనది మానవ జాతి రా సోదరా' 6. నాదేశం రా నాదేశం 7.బండెనుకబండిగట్టీ...'', 8. ఏ దేశమేగినా ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అన్నట్టే ఈ గేయాలు దేశభక్తి ప్రస్ఫుటిస్తున్నాయి !

దేశభక్తి కవిత్వంలో -

1. గత వైభవం, 2. గతవైభవ పునరుద్ధరణ, 3. సాహస ప్రియత్వం ప్రముఖంగా కనిపిస్తాయి. ఈ అంశాలతో విరివిగా ఎప్పుడూ దేశ భక్తి గేయాలు వస్తూ ఉండాలి.

సంగీత రత్నాకరంలో శార్గ దేవుడు చెప్పినట్టు --

''గీతం నాదాత్మకం వాద్యం నాద వ్యక్త్యా ప్రకాశ్యతే... అంటూ

నాదాధీన మతో జగత్'' అన్నట్టు పాటల రూపంలో ప్రజల దగ్గరికి దేశభక్తి త్వరితగతంగా చేర్చింది.

''శ్రీలు పొంగిన జీవగడ్డయి / పాలు పాఱిన భాగ్య సీమయి

వ్రాలినది ఈ భరత ఖండము / భక్తి పాడర తమ్ముడా" రాయప్రోలు

సుబ్బారావు గారి ప్రబోధాత్మక గేయాన్ని, వానమామలై వరదాచార్యుల ''జయభారతావనీ జయలోక పావనీ'' గేయాన్ని నిత్యం స్మరించుకుంటూ ఉండాలి.కవిత్వం హిమనమూహాలనూ వర్ణించాలి, నిప్పు రవ్వలనూ వర్ణించాలి. శాంతి కపోతాల స్వచ్ఛ స్వేచ్ఛా యానాలనూ, అందులో చూపించాలి. దేశభక్తి జీవం. జీవం!!

❖❖❖

మనిషి మట్టి - నిఖిలేశ్వర్

- సి. కె. నందిని, బి.కాం. రెండవ సంవత్సరం, శ్రీకన్యకా పరమేశ్వరీ మహిళా కళాశాల, చెన్నై.

బర్కి టవున్‌లో యుద్ధం జరుగుతుంది. భారత సైనికులు పాకిస్తాన్ వాళ్ళ మీదకు అనుబాంబులు వేసారు. ఒకే సారి బర్కి టవున్ మొత్తం నిశ్శబ్దం అయి పోయింది. అక్కడున్న పాకిస్తాన్ ప్రజలు ఇంకా ఇక్కడ ఉంటే ప్రాణాలు మిగలవు అని అక్కడ నుండి వాళ్ళ దగ్గర ఉన్న ఆయుధాలతో తప్పించుకోవాలి అని బయలు దేరాడు. ఉండగా దారిలో ఒక మసీదు దగ్గర ఉన్న గుడ్డి వాడైన ఉస్మాన్ దాదా తన చెల్లి ఖైరునిసా వీళ్ళిద్దరూ అక్కడ నుండి తప్పించుకోవాలా లేదా అని ఆలోచనలో పడిపోతారు. తన చెల్లి ఖైరునిసా వాళ్ళ అన్నని ఇలా అడుగుతుంది. ''అన్నా మనం తప్పించుకోవాలా లేదా ఇక్కడే చావాలా అనే భయంతో వాళ్ళ అన్నను ప్రశ్నిస్తుంది. గుడ్డి వాడైనా ఉస్మాన్ దాదా ఈ గుడ్డి శరీరాన్ని దేని కోసం తప్పించాలి. నీకైనా ప్రాణభయం ఉంటే వెంటనే లాహర్‌కి ప్రయాణమవ్వు. నా గురించి ఏం భయపడకు, నీ భర్త పోయాక గుడ్డి అన్నకు సేవలు చేశావు. ఇంకనైన నీ గురించి చూసుకొని ప్రాణాన్ని కాపాడుకో అని తన చెల్లెలితో అన్నాడు. వెంటనే తన చెల్లి మనసులో ''అన్నా ఇన్ని రోజులు అడుక్కొని నా కడుపు నింపావు అని అను కుంటుంది. అన్నా ఉంటే ఇద్దరం బ్రతుకుదాం లేదా వాళ్ళ చేతిలో బలి అవుదాం. కాని నేను నిన్ను మాత్రం వదలి వెళ్ళాను అని అంటుంది. అక్కడున్న పాకిస్తాన్ ప్రజలందరిని భారతీయులను అంతం చేసి గుడారాన్ని స్థాపించారు. భారతీయుల నాయకులైన మహేందర్ తన సైనికులతో ఇక్కడ ఎవరైనా ఉంటే వెతికి చంపమని ఆజ్ఞాపిస్తాడు. సైనికులు మసీదు దగ్గరికి వచ్చి ఎవరు ఇక్కడ అని అరుస్తువుండగా ఉస్మాన్ దాదా తన చెల్లిని చంవద్దని ప్రార్థిస్తారు.

అప్పుడు నాయకుడు అక్కడికి వచ్చి వాళ్ళతో అందరు తప్పించుకొన్నారు, మీరు మాత్రం ఎందుకు వాళ్ళతో తప్పించుకోలేదని అడిగాడు. అప్పుడు ఉస్మాన్ మాకు మా ప్రాణం మీద ఆశలేదు. అందుకే ఇక్కడ ఉండి పోయాం. అయినా మీరు ఎందుకు మా మీద యుద్ధానికి వచ్చారు. ''అయ్యా మీకు ఏమైంది మీకు ఎందుకు మా బర్కి టవున్ మీద ఇంత కోపం మీకు''. అప్పుడు మహేందర్ నాయకుడు ఇలా అంటాడు మరి మీ వాళ్ళు మా జమ్ము, కాశ్మీర్ మీద యుద్ధానికి వచ్చి మా అమాయకుల ప్రజలను చంపేశారు. అందుకే మేము మీ మీదకు యుద్ధానికి వచ్చాం. అప్పుడు ఉస్మాన్ దాదా ''అవును లే అయ్యా మీరు మాత్రం ఎన్ని రోజులు మౌనంగా ఉంటారు. మీకు ఎన్ని రోజులు అని సహనం ఉంటుంది. అప్పుడు నాయకుడు ఇలా అంటాడు. మీకు ఎలా ఇంత ధైర్యంగా పారిపోకుండా ఉన్నారు. అప్పుడు దాదా, ధైర్యం ఏమి లేదయ్య అల్లా మీద బారం వేసి ప్రాణాలు మీద భయంతో భయపడుతూ ఉన్నాం. మీరు చల్లగా ఉండాలి, మమ్మల్ని చంపలేదు మీది చాలా జాలి గుణం అలా మాట్లాడుతూ ఉండగా సాయంత్రం వేళ అవుతుంది. అందరు విశ్రాంతి తీసుకుందాం అని అనుకుంటారు. అప్పుడు ఉస్మాన్ దాదా ఉన్న మసీదు పేలిపోతుంది. ఇంకా ధీరునిస్సా ఏడ్చుకుంటూ మా అన్న లేని జీవితం నాకు అవసరం లేదు. నేను మా అన్నతో చనిపోతా అంటూ కేకలు పెడుతూ ఏడుస్తుంది.అప్పుడు మహేందర్ నాయకుడు ఖైరునిసాను ఆపి ఓదార్చి మాతో రమ్మని తీసుకొని వెళ్తూ ఉండగా ఖైరునిస్సా వెనకాల నుండి ''అయ్యా అని అరుస్తుంది'' మహేందర్ మీదకు రావలసిన బుల్లెట్ గుండు ఖైరునిసా మీదకు బాంబులు వేసి కాలుస్తారు. మహేందర్ కన్నీళ్ళు పెట్టి ఏడుస్తూ ఖైరునిసాను భుజం మీదకు వేసుకొని పరిగెడుతాడు. మహేందర్ మీదకు రావలసిన బుల్లెట్ గుండు ఖైరునిసా

మీదకు బాంబులు వేసి కాలుస్తాడు. మహేందర్, ఎన్నో సైనికులు మరణించారు. కానీ ఆయన కన్నీళ్ళు పెట్టలేదు. ఖైరునిసా తన ప్రాణాలు కాపాడేసరికి ఆయనకు కన్నీళ్ళు ఆగలేదు. నాయకుడు ఖైరునిసాకు కృతజ్ఞతు లైయ్యాడు. తమ దేశం వారిని కోల్పోయాము అన్న బాధను తట్టుకోలేని భారతీయులు పాకిస్థానుల పైన యుద్ధానికి వెళ్ళారు. అలా వారు తమ దేశభక్తిని చాటారు. అదే విధంగా ఎవరివైపు నిజాయితీ ఉందో అని తెలిసిన ఉస్మాన్ దాదా భారతీయులు చేసిందే మంచి పని అని ఒప్పుకొని న్యాయం వైపు నిలబడ్డాడు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 8, August 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఎం. వెంకటేశ్వరరావు 'జెండా' - దేశభక్తి

– ఋ. నిఖిత, బి.కాం. రెండవ సంవత్సరం, శ్రీకన్యకాపరమేశ్వరీ మహిళా కళాశాల, చెన్నై

ఆగష్టు15న నవ్యభారతి అనే పాఠశాల ముందు ఒక కారు ఆగింది. అందులో నుంచి ఒక అతిథి కారు దిగారు. అతని పేరు సుందర్. ఆయన ఒక రచయిత. అతను ఎటు చూసినా పిల్లలు, అద్దం లాంటి అమాయకత్వంతో, నడిచే కవిత్వంలా, కల్మషం లేని ఆ పసిడి మొహాల్ని చూస్తుంటే ఆయన గుండెలమీద అమృతం చిలకరించినంత హాయిగా అనిపించింది. యూనిఫాం దుస్తుల్లో బాలురుతీరి బాలసైనికులా నిలబడిన ఆ భావిభారత ఆశాదీపాల్ని చూస్తుంటే ఆయనలోని రచయితకి భావోద్వేగం కలిగింది. ఆగష్టు 15న వారు స్కూలు వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా, జెండా ఎగురవేసి, ఉపన్యసించవలసిందిగా తన మిత్రుడు మురళి ఆహ్వానిస్తాడు. "రాజకీయ నాయకులకు బదులు ఒక రచయిత జెండా ఎగురవేయడమేమిటి? అని సుందర్ ప్రశ్నిస్తాడు."

"విద్యార్థులకు రాజకీయాలు అనవసరం కాబట్టి" అని సుందర్ జవాబు ఇస్తారు. జెండా ఎగరేసే కార్యక్రమం మొదలైంది. జెండా మొదటిసారి ఎగురువేస్తున్న సుందర్‌కు ఒంట్లో దేశభక్తి పరవళ్ళు తొక్కుతున్నట్టనిపించింది. సుందర్ తన చిన్నప్పటినుంచి వింటున్న దేశం గురించి, దేశభక్తి గురించి, దేశం కోసం ప్రాణాలర్పించిన నేతల గురించి తన మాటల్లో విద్యార్థులతో పంచుకుంటాడు. ఆ కార్యక్రమం ముగుస్తుంది. ఆ తర్వాత ఇద్దరు కలిసి ఆ ఆఫీసు రూంలో కూర్చుని, పాఠశాల ప్రారంభించినప్పటినుంచి జరిగిన వేడుకల గురించి మాట్లాడుకుంటూ వాటి తాలుకు ఫోటోలున్న ఆల్బమ్స్ మురళి తన స్నేహితుడికి చూపిస్తాడు.

ఆల్బం పేజీ తిప్పబోతుంటే మురళి కళ్ళు అక్కడే ఆగిపోయింది. పోయిన సంవత్సరం జెండా ఎగరేసిన వృద్ధురాలని చూసి తన కళ్ళు ఆమె మీద ఫ్రీజయ్యాయి. సుందర్ దాన్ని చూసి ఎవరీమె? అని అడుగుతాడు.

"ఈవిడా? జెండా కిష్టమ్మ ఈ పాఠశాలలోనే పనిచేసేది అని మురళి జవాబిస్తాడు.

పేరు జెండా కిష్టమ్మేంటి? చిత్రంగా ఉందే! ఇంటి పేరా? అని సుందర్ అడుగుతాడు. నీకు వినే సమయం ఉంటే చెప్తాను అంటాడు మురళి. రచయితగా గుర్తింపు పొందుతున్న తనకు సమయం ముఖ్యమే అయినా వినడానికి సిద్ధపడతాడు. వింటాను చెప్పు అంటాడు.

మురళి పిహెచ్.డి. చేస్తున్న విషయం సుందర్‌కు తెలిసిన విషయమే. మురళి స్వాతంత్రోద్యమంలో పాల్గొని వెలుగులోకి రానివాళ్ళ గురించి పరిశోధనాపత్రం రాస్తున్నాడు. ఆ కార్యక్రమంలో భాగంగా ఒకరోజు దగ్గరగా వేస్తున్న పాతకాలపు తలుపుని తట్టాడు. లోపల నుంచి దగ్గుతూ బయటికి వస్తుంది ఆ వృద్ధురాలు.

"నమస్కారమమ్మా! నా పేరు మురళి జెండా కిష్టమ్మ గారిని కలవడానికి వచ్చాను అని అంటాడు. నేనే జెండా కిష్టమ్మని లోపలికి రండి అని పిలుస్తుంది. ఇంట్లో చెప్పుకోదగ్గ వస్తువు ఒక్కటీ కనిపించదు. దుమ్ము కొట్టుకుని, తుప్పు పట్టిన వస్తువులే కనిపిస్తాయి.

"మీరెవరో బాబూ! కూర్చోడానికి పాత చాప తప్ప నా దగ్గరేం లేదు" అంటుంది. పర్లేదమ్మా! అని చాప మీద కూర్చుంటాడు.

అమ్మా! జెండా కిష్టయ్యగారి గురించి విన్నాను. ఈ ప్రాంతంలో స్వాతంత్రోద్యమంలో పాల్గొని, వెలుగులోకి రానివాళ్ళలో ఆయన ఒకరని తెలిసింది. అలాంటి వారి మీద పుస్తకం రాయాలని సంకల్పించాను అని అంటాడు.

ఇప్పుడు మీరెలా జీవిస్తున్నారు. ఏం చెప్పమంటావు బాబూ! ఎన్నో ఏళ్ళ ఒంటరితనం మొన్నటి వరకు ఇళ్ళల్లో

పాచి పనులు చేసే కిష్టమ్మని, కారణాలు వెతికి మరీ పనిలోనుంచి తీసేస్తారు.

మరి ఇంకెక్కడైనా పని దొరికిందా అంటే ఆ వయసులో తనకి పని ఎవరూ ఇచ్చేవారు కాదు. ఇంక మురళి జెండా కిష్టయ్య గారి గురించి ఆయన భార్యను అడుగుతాడు.

ఆయన బట్టలు కుట్టేవారు, స్వాతంత్ర్యం రాబోతున్న రోజులవి. ఆయనకి గాంధీగారంటే వల్లమాలిన అభిమానం. ఎక్కడ మీటింగ్ జరిగినా జెండాలు కుట్టి తీసుకెళ్ళి వాటిని మీటింగ్ జరిగే ప్రదేశంలో కట్టేవారు. సొంత డబ్బుతో బట్టకొని మరీ జెండాలు కుట్టేవాడు. ఆ జెండాలు, ఎగురుతుంటే తెగ సంబరపడిపోయేవాడు.

"కష్టపడి సంపాదించిన డబ్బెందుకిలా తగలేస్తావ్" అని కిష్టమ్మ అడిగితే జెండా అంటే ఏంటనుకున్నావు? రాబోయే కాలంలో మన స్వేచ్ఛని తెలిపే గుర్తు. దీనికోసం ఎంతోమంది ప్రాణాల్ని అర్పించారు అని కిష్టయ్య చెపుతారు.

మీకు పిల్లలెంతమంది? అని మురళ అడుగుతాడు. "పిల్లలేరు, వద్దన్నాడు, స్వాతంత్ర్యం వచ్చాక కందాం" అనేవాడు. స్వతంత్రం వచ్చాక జెండాలు కుట్టి, మద్రాసులో సమావేశానికి వెళ్ళొస్తానని వెళ్ళిరా కిష్టయ్య మళ్ళీ తిరిగి రాలేదు. జెండాలమూట నెత్తిన పెట్టుకుని రైలెక్కబోయి తోపులాటలో జారి, ముటతో సహ రైలు కిందపడి చచ్చిపోయాడని నెలరోజుల తర్వాత కబురొచ్చింది. అప్పటి నుంచి ఆమెను "జెండా కిష్టమ్మ" అని పిలవడం మొదలెట్టారు.

అప్పటికి ఆయన ఈ పాఠశాల ప్రారంభించి ఆమెకు ఏదైనా ఉపాధి కల్పించాలని నిర్ణయించుకున్న మురళి ఆ పాఠశాలలో ఆయాగా పని ఇచ్చి, ఆమెకు బస, భోజనం ఏర్పాటుచేస్తాడు. ఉదయాన్నే స్కూలు ఆవరణ చిమ్మి శుభ్రం చేసేది. ఆగష్టు 15కి జెండా ఎగుర వెయ్యాలని ఆమెతో చెప్తాడు.

మురళి ఎన్నో వందల జెండాలు కుట్టిన తన భర్తకు దక్కని గౌరవం, అదృష్టం ఇన్నేళ్ళకి, ఈ వయసులో ఆయన వలన ఆమెకి దాచుకున్న తన భర్త కుట్టిన జెండా ఎగురువేస్తానని కోరింది.

ఆగష్టు 15న కిష్టమ్మ జెండా ఎగరవేసే దృశ్యాన్ని చూడటానికి ఊరు ఊరంతా కదిలొచ్చారు. కంప్యూటర్లో భద్రపరచిన కిష్టమ్మ, ఎగరేసిన జెండా దృశ్యాల్ని సుందర్‌కి మురళి చూపించాడు.

ఇప్పుడామె ఈ పాఠశాలలో ఉందా! ఆమెని చూడాలన్న ఉత్కంఠతతో మురళిని అడుగుతాడు సుందర్. లేదు ఆమె జెండా ఎగరేసిన సాయంత్రం, భర్త చెప్పిన స్వేచ్ఛా చిహ్నం తను ఎగరేసిన మువ్వన్నెల త్రివర్ణ పతాకం గాలిలో స్వేచ్ఛగా ఎగురుతుంటే, భర్తని తల్చుకుంటూ స్కూలు వరండాలో కూర్చుంది కిష్టమ్మ "ఇన్నేళ్ళకి తన మొగుడు చెప్పి వెళ్ళిన స్వేచ్ఛ తనకు స్వయంగా చూపిస్తాడు మురళి.

ఎప్పుడో మరణించిన జెండా కిష్టయ్య పునర్వైభవాన్ని, దేశభక్తిని చూసి తట్టుకోలేని కొన్ని దుష్టశక్తులు పక్క ఊళ్ళో కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థుల్ని రెచ్చగొట్టారు.

వాచ్‌మన్ ఇంటికెళ్ళడం చూసి, వాళ్ళు పెద్దపెద్దగా అరుస్తు పాఠశాల ఆవరణలో ఎగురుతున్న జాతీయ పతాకాన్ని నిప్పు అంటిస్తుంటే వరండాలో అక్కడే ఉన్న కిష్టమ్మ చూసి పెద్దగా అరవడంతో వాళ్ళు పారిపోతారు.

ఆ జెండాని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూ జెండాని గుండెలకు అద్దుకుని తన భర్తని కాపాడుతున్నంత ఉద్వేగానికి లోనైంది. మన జాతీయ జెండాని కాపాడగలిగింది. కానీ అప్పటికే ఆమె శరీరం 80 శాతం పైగా కాలిపోయింది. మూడు రోజులు ప్రాణాలతో పోరాడి కన్ను మూసింది. జెండా కాలి మసికాకుండా మట్టిని తాకకుండా కాపాడి తను మట్టి పాలైంది కిష్టమ్మ.

మురళి తను భద్రపరిచిన సగం కాలిపోయిన జాతీయ జెండాని సుందర్‌కు చూపించాడు. ఇద్దరి కళ్ళు

తడయ్యాయి కిష్టమ్మ, కిష్టయ్య ఇద్దరు చేసిన వాటిని చూస్తుంటే దీన్ని త్యాగం అనాలో, దేశభక్తి అనాలో అర్థం కాలేని పరిస్థితి, మురళి దగ్గర సెలవు తీసుకుని బయటికి వస్తున్న సుందర్ ఆ రోజు తాను ఎగరేసిన జాతీయ జెండా గాల్లో ఎగురుతుంటుంది. ఆ జెండా స్వేచ్ఛగా గాలిలో ఎగరడం వెనక నాటినుండి నేటి కిష్టమ్మ వరకు ఎందరో త్యాగధనుల 'త్యాగం' దాగుంది. కిష్టమ్మ దేశభక్తికి సుందర్ తన మనసులో గుడికట్టి స్వేచ్ఛగా ఎగురుతున్న త్రివర్ణ పతాకానికి మరోసారి మనస్ఫూర్తిగా సెల్యూట్ చేసి కారువైపు అడుగులు వేశాడు.

❖❖❖

శమంతకమణి 'భారతీ నీ సేవకై' - దేశభక్తి

– **ఐ. ప్రాజిత,** బి.కాం. రెండవ సంవత్సరం, శ్రీకన్యకాపరమేశ్వరీ మహిళా కళాశాల, చెన్నై.

రఘురామ్ అనే వ్యక్తికి దేశం అంటే యనలేని భక్తి. అతను తన వయసు మల్లిన కూడా లేహ్‌లడక్‌లో జరిగిన దుర్ఘటన వల్ల ఎందరో ఇబ్బందులు పడుతున్నారని తను కూడ సహాయం చేద్దామని చెన్నైలో నుంచి లేహ్‌లడక్‌కు బయలుదేరారు. అప్పుడు కొన్ని సంఘటనలు జ్ఞప్తికి వస్తాయి.

అందులో తన తండ్రి గారితో కలిసి స్వాతం త్రోద్యమంలో పాల్గొనేందుకు విజయవాడకు వెళ్లారు. అక్కడ రఘురామ్ తన తండ్రిని నాన్నా! గాంధీగారికి చొక్కా లేదా! ఎండకీ, వానకీ ఇబ్బంది కదా! మన కండువా ఇద్దామా!

అమాయకంగా అడుగుతున్న కొడుకుకి గాంధీజీ సామాన్య జీవితాన్ని ఖద్దరు నెసే విధానాన్ని వివరించాడు తండ్రి.

అటుపిమ్మట తన తల్లి జ్ఞాపకం వచ్చింది. యువకు డైన రఘురామ్ భారత సైనిక దళంలో చేరాలని నిర్ణయించుకున్నాడు. ఒక్కగానొక్క కొడుకువి. నా మాట విను మామయ్య కూతురిని పెళ్ళి చేసుకుని ఇక్కడే ఉండేపోరా.

అమ్మా! నీ మాట వింటాను కానీ అది రమను పెళ్ళి చేసుకోవటం వరకే! దేశ సేవలో తరించిన జన్మ వృథా అయిన అందరూ సుఖంగా ఇంటి పట్టున ఉండాలంటే దేశరక్షణ ఎవరు చేస్తారమ్మా? మాతృభూమి సేవలోనే నాకు ఆనందం.

తండ్రి ప్రోత్సాహం ఉండటం వల్ల సైన్యంలో చేరాడు. ఆ తర్వాత ఓ సంవత్సరానికి వివాహం అయింది వాళ్ళకు భరత్. స్వరాజ్యలక్ష్మి అనే ఇద్దరు జన్మించారు. కుటుంబా నికి దూరంగా ఉన్న బాధకన్నా తనలాంటి జవాన్ల వల్ల దేశంలో అందరూ సురక్షితంగా ఉన్నారన్న భావన ఎంతో సంతృప్తినిచ్చేది.

సైనికుడిగా ఉద్యోగం రాజీనామా చేసి ఓ బ్యాంక్‌లో ఉద్యోగంలో చేరాడు. జీవితం సాఫీగానే సాగుతోంది. ఇంతలో భరత్‌కు ఎన్.డి.ఏలో సీటు వచ్చింది. కానీ అందులో చేరుటకు తన తల్లి ఒప్పుకోలేదు. రఘురామ్ తన భార్యకి తన కొడుకు నిర్ణయాన్ని అభ్యంతరం పెట్టవద్దు అని సలహాలను ఇచ్చాడు రఘురామ్.

సైన్యంలో చేరిన నాలుగేళ్ళు బాగానే గడిచింది. ఒక రోజు యుద్ధంలో పాల్గొన్న భరత్ ఆచూకీ తెలియలేదన్న వార్త వచ్చింది. రికార్డుల్లో మిస్సింగ్ కేసుగా నమోదైంది. కొడుకుపై బెంగతో కూతురి వివాహం చూడకుండానే కన్ను ముసింది రఘురామ్ భార్య.

ఎప్పటికైనా కొడుకు తిరిగి వస్తాడన్న ఓ ఆశ మినకు మినుకుమంటునే ఉంది. ఉద్యోగానికి రాజీనామా చేసిన తరువాత పూర్తిగా తన కాలాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించింది. ఒంటరితనాన్ని మరచిపోయే ప్రయత్నం చేశాడు రఘురామ్.

80 ఏళ్ళ వయస్సు రావడం కొడుకు ఆచూకీ తెలియడం ఒక్కసారే జరిగాయి. వార్త విన్న రఘురామ్ మనస్సు కొయ్య బారిపోయింది. దేశ సరిహద్దుల్లో మరణించిన భరత్ పార్థివదేహం హిమాలయాల్లోని మంచుకొండల్లో ఇరుక్కోవడం వల్ల ఏ మాత్రం పాడవలేదని, ఇంటికి పంపుతున్నామని సైనికాధికారుల నుంచి సమాచారం వచ్చింది.

భగవంతుడా! ఈ వయస్సులోనూ నన్ను పరీక్షిస్తు న్నావా? అనాలనుకున్న రఘురామ్ అనలేకపోయాడు. కారణం 40 సంవత్సరాల సైనికీ దళాల నిబద్ధత!

ఊహ తెలిసిన నాటి నుంచి భారతీ సేవలోనే ఉన్నాను. బతికుంటే మరికొంతకాలం దేశసేవలో ఉంటాను. లేకుంటే ఈ సేవలోనే... ఆర్థోక్తిగా ఆపేశాడు రఘురామ్.

"వ్యక్తి కన్నా, వ్యవస్థ,
దేహం కన్నా దేశం ముఖ్యమంటూ
సాగుతున్న రఘురామ్' జీవితం

మనకి చిన్న దెబ్బ తగలితే అమ్మ తల్లడిల్లిపోతుంది. అలాంటిది యుద్ధంలో మరణిస్తాడని తెలిసి కూడా తన బిడ్డని సైన్యంలో సేవ చేయడానికి పంపిస్తున్న తల్లికి నా వందనాలు.

❖❖❖

పవని నిర్మల ప్రభావతి "జననీ జన్మభూమి" - దేశభక్తి

- రూపశ్రీ మేరుకు, బి.బి.ఎ., మూడవ సంవత్సరం, శ్రీకన్యకాపరమేశ్వరీ మహిళా కళాశాల, చెన్నై

"రావుగారు - పద్మజరావు - సుధీర్"

ఒకరోజు అప్పుడే ఇంటికి వచ్చిన సుధీర్! వాళ్ళ అమ్మకి ఒక విషయం చెప్పాడు. "ఏమిట్రా సుధీర్ నువ్వం టున్నది? "కంగారుగా తలెత్తి చూసి అంది తల్లి పద్మజ రావ్. తనకోసం డ్రైనింగ్ టేబుల్ మీద మూతపెట్టి ఉన్న గాజు ప్లేటు తన దగ్గరగా జరుపుకుంటూ సంపాదిగా అన్నాడు సుధీర్. "రేపు కలెక్టర్ ఆఫీసు దగ్గర సైన్యంలో చేరాలి అని అనుకున్న యువకుల్ని రిక్రూట్ చేస్తారం టమ్మా! నేను చేరతాను" ఇంకోసారి అర్థం అయ్యేలా తల్లికి చెప్పి, ప్లేటులో అన్నం పెట్టుకున్నాడు సుధీర్. క్షణకాలం సుధీర్ వైపు అయోమయంగా చూసింది పద్మజరావ్. అప్పుడప్పుడు వీడికోసం వచ్చే శర్మ, జాన్ వాళ్ళ దుర్బోధ కాదు కదా ఇది! అన్న అయోమయం ఆమె అంతరాయాల్లో మెరిసి మాయమైంది.

"నీకేమైనా మతిపోయిందా సుధీర్? అలాంటి కర్మ నీకేం పట్టింది?" అని తల్లి సుధీర్‌ని అడిగింది. సుధీర్ ఆశ్చర్యంగా తల్లివైపు చూశాడు. "అది ఖర్మా అమ్మా? ఖర్మా ఇన్ని మహిళా మండలాలు స్థాపించావే! మరెన్నో సంస్థలకు గౌరవనీయ కార్యదర్శిగా వున్నావు. ఎంతో ఉ త్తేజంగా ఉపన్యాసాలు ఇస్తావు. ఎం.ఎ.పాస్ అయిన నువ్వేనా అమ్మా! ఇలా మాట్లాడుతున్నది? అని అన్నాడు సుధీర్.

అతగాడి ఎర్రని ముఖం చిరుకోపంతో మరికాస్త ఎరుపుకు తిరగటం చూచి లోలోపల మురిసిపోయింది పద్మజరావ్. "నా కొడుకు చాలా అందగాడు. అవును మరి నేనెంత అందంగా లేను ఈ వయస్సులోనైనా" అని మనసులో గర్వంగా అనుకుంటుంది.

"ఏమిటమ్మా పలకావు? మరి నా పేరు ఎందుకు సుధీర్ అని పెట్టావు?" అని కోపంగా అరిచాడు సుధీర్. ఫక్కున నవ్వింది తల్లి. అసలు రణధీర్ అని పెడదాం అన్నారు. మీ నాన్నగారు నాలుగు అక్షరాల పేరు నాకు ఇష్టం లేకపోయింది. ఆ విషయాన్ని ఆ వాతావరణాన్ని, సహజంగా మార్చాలనుకున్న ధోరణిలో నవ్వుతూనే ఉంది పద్మజరావ్. "ఇప్పుడు తమాషాలు కాదమ్మా! నేను రేపు వెళ్ళి చేరతాను. తాటిచెట్టులా ఇంత పొడుగు పెరిగాను. నా కండరాలు చూడు ఎలా వున్నాయో.... తప్పక నన్ను సెలెక్టు చేసుకుంటారు..... నాన్నగారు కూడా ఏమీ అనరు. అంటూ కంచంలో చెయ్యి కడుక్కుంటా దృఢంగా అన్నాడు సుధీర్. పద్మజరావ్ తెల్లబోయింది. కొడుకు చాలా పట్టుదలగా ఉన్నాడని బోధపడింది.

అతగాడి వెనకాలే, గదిలోకి నడిచింది. మంచం మీద కూర్చున్నాడు సుధీర్. కుర్చీలో సుధీర్‌కి దగ్గరగా కూర్చొని మెల్లగా సుధీర్‌ని చూస్తూ "చూడు నాన్నా! మాకు ఉన్నది నువ్వొక్కడివే. మనకు ఎంత ఆస్తి ఉందో నీకు తెలుసుకదా! మీ నాన్నగారు విదేశాలలో వున్నాడు కదా? ఆయన రాగానే ఇక వ్యాపారమంతా నీకు అప్పగించా లనుకుంటున్నారు. నువ్వు ఇలా సైన్యంలోకి వెళ్ళిపోతే ఇదంతా మేమేం చేసుకోవాలి" అంటూ తల్లి పద్మజరావ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కలవరపడ్డాడు సుధీర్. "అదేంటమ్మా" అతగాడి మాటలకి పద్మజరావు అడ్డొస్తూ అంది "ఈ వయస్సులో నీ ఆవేశం ఇలానే ఉంటుంది నాన్నా! కానీ వెళ్ళిపోతున్న వయస్సులో మా ఆవేదన కాస్త అర్థం చేస్కో".

"మరి దేశం...?"

పద్మజారావు కన్నీళ్ళు తుడుచుకుంటూ నవ్వింది. దేశం ఏమి కాదు. దాని కోసం చాలామంది వున్నారులే. ప్రభుత్వాలు మారవచ్చు. మళ్ళీ సర్దుకోవచ్చు. కానీ ఒక్కసారి ఆస్తి, అంతస్తూ పోగొట్టుకుంటే తిరిగి అవి

సంపాదించుకోలేం. నాన్నా! ఇవన్నీ ఉన్నంత వరకే మనం పదిమందిలో గౌరవంగా బ్రతగ్గలం. సుధీర్ నా మాట విను. ఇప్పటి వరకు నిన్ను ఏ విషయంలోనూ నొప్పించ లేదు! ఈ విషయంలో నన్ను మీ నాన్నగారిని నొప్పించకు. నీకు అంతగా ఎక్కడికైన తిరిగి రావాలను కుంటే రేపే ఎక్కడికైనా వెళ్ళు. అలా అలా తిరిగిరా'' అని చెప్పి లేచి తన గదిలోకి వచ్చేసింది పద్మజరావ్.

మౌనంగా పడుకున్నాడు సుధీర్..

రోశయ్య - చంద్రమ్మ - వీరాయి

అదే ఊరిలో ఉన్న వీరాయి కూడా ఉత్సాహంగా ఇంటికి వచ్చి ''నేను కూడా రేపు సైన్యంలో చేరి పోతానమ్మా! తిండీ, బట్టా ఇచ్చి మంచి మంచి జీతాలు ఇస్తారంట'' అని చెప్తారు. తల్లి చంద్రమ్మ కళ్ళలో ఎంతో వెలుగుతో ''నిజం, నిజమేనటా?'' అంది అవునమ్మా! నిజంగానే ఇప్పుడే ఆ అధికారికి దగ్గరికి వెళ్ళి మాట్లాడి వచ్చాను. వివరాలన్నీ చెప్పాడు. రేపు చాలామందిని తీసుకుంటారట. వచ్చే నెల నుంచి జీతం వస్తుంది. జీతం రాగానే ఇంటికి పంపేస్తారు. నవ్వు చీర కొనుక్కో తమ్ముళ్ళకి, చెల్లెలకి మంచి బట్టలు, కడుపునిండుగా తిండి పెట్టు. అక్కడ నాకు తిండీ, బట్ట గడిచిపోతుంది. ఆఖరికి దోమ తెరలూ స్వెటర్లు అవే చలికి తొడుక్కునేవి ఇస్తారట కూడాను'' ఇవన్నీ సంతోషంగా చెబుతుంటే చంద్రమ్మ మనసు ఆనందంతో తేలికైపోయింది క్షణకాలం. చంద్రమ్మ చుట్టూరా చిమ్మచీకటి, రోజు మార్చి రోజు పస్తులు తండ్రి రోశయ్య ఒక్కడి రెక్కల కష్టం చంద్రమ్మ కూలీ నాలీకి వెళ్తోంది. అయినా కడుపులు నిండడం లేదు. పెద్ద తమ్ముడికి పద్నాలుగేళ్ళు వస్తున్నాయో ఏమో వాడిని కూలీకి పంపిస్తున్నాము. వాడు ఆ బస్తాలు మొయ్యలేక మొయ్యలేక నరాలు తెంచుకుంటూ ఉంటే ఈ తల్లి పేగు తెంచేసినట్టే అవు తుంది.

వీళ్ళలో ఒకరు ఒకరోజు పనికి వెళ్ళకపోతే తర్వాత రోజు పస్తులతో ఉండాల్సిందేగా మరి. మానెడు గింజలు రెండు రూపాయలు. పూటకు మానేడు గింజలు చాలక పోయెను. అంతలోపు చంద్రమ్మ గుండెలు పిండివేసే ఒక ఆలోచన ఆమె ఎదలో ముల్లుల్లా కదలాడింది. ''సైన్యంలో చేరితే యుద్ధం వస్తే తన బిడ్డ ఆ మాటే మెల్లగా అంది. ఈ మాటవిని వీరాయి ఫక్కున నవ్వాడు.

''యుద్ధంలో గాక ఇక్కడ మాత్రం చావ కూడదా ఏమిట అమ్మా? పస్తులుండి చచ్చెకంటే బ్రతికిన నాలుగు రోజులైన నేను హాయిగా తిండి తింటాను. నీకు, నాన్నకి, తమ్ముళ్ళకు, చెల్లెలికి ఇంత తిండి పెడతాను. అలాంటి మంచి చావు చస్తే మాత్రం ఏం?'' అని నిర్లక్ష్యంగా గుడిసె నుండి బయటికి వెళ్ళిపోయాడు వీరాయి.

కొడుకు అన్న మాటలు తండ్రి రోశయ్యకు చెప్పింది. చంద్రమ్మ రోశయ్య మీసం మెలేస్తూ గర్వంగా నవ్వాడు. ''ఆడు! ఆడు నా కొడుకే చంద్రీ గుండె ధైర్యం అదినాది రాతిలా ఉన్న తన ఛాతిమీద గర్వంగా చేత్తో చరుచు కున్నాడు రోశయ్య.

తర్వాత చంద్రమ్మకు ఆనందం, దు:ఖం రెండూ కలిగాయి. తెల్లారి లేసే సరికి ఆమెకు ఏ బాధా మిగల్లేదు. కారణం తన చుట్టుపక్కల గుడిసెల్లో చాలామంది కుర్రవాళ్ళు వీరాయితో పాటు సైన్యంలో చేరటానికి సిద్ధమై వెళ్ళున్నారు. అక్కడ ఉన్న కుర్రాళ్ళు అందరూ వీరాయిలానే మాట్లాడుతున్నారు.

పదేళ్ళు గిర్రున తిరిగి వచ్చాయి. చరిత్ర పుటల్లో కూడా చిత్రవిచిత్రాలు దొర్లుతున్నాయి. దేశం మారిపోయింది. మనుషులు మారిపోయారు. సామాన్యులు మరీ సామాన్యులుగా మారిపోతున్నారు. గొప్పవాళ్ళు మరీ గొప్పవాళ్ళుగా మారిపోతున్నారు. మధ్యతరగతి కుటుం బాలు మాత్రం గానుగెద్దుల్లా ఒకే పరిధిలో గిరిగిర తిరుగుతున్నాయి.

సుధీర్ ఇప్పుడు వ్యాపారంలో మెళకువలన్నీ తెలుసు కున్నాడు. తండ్రి ఇచ్చిన ఆస్తిని రెట్టింపు చేశాడు. త్వరలో రాబోయే ఎలక్షన్స్‌లో సమితి ప్రెసిడెంటుగా పోటీ

చేయబోతున్నాడు. కొన్ని రోజులకు పెళ్ళి చేసుకున్నాడు. రావుగారు, పద్మజారావ్.... చాలా సభలకూ, సమావేశాలకూ గౌరవాధ్యక్షులుగా, వక్తలుగా వెళ్తూ కాలం సరదాగానే గడిపాడు. ఆనాడు మూర్ఖపు పట్టు వదిలి సుధీర్ ఇలా హాయిగా వున్నందుకు వాళ్ళిద్దరూ ఆనందించని క్షణం లేదు.

వీరాయి కూడా చాలా మారిపోయాడు వీరరావుగా మారాడు. హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, బెంగాలీ, కన్నడం, తమిళం ఒకటేమిటి ఏడెనిమిది భాషల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నాడు. మంచి మంచి బట్టలు, మంచి తిండి ఎంతో ఆనందంగా ఉంటున్నాడు. సెలవులకు ఇంటికి వస్తే అందరికీ మిఠాయిలూ, బట్టలుపట్టుకొస్తాడు. వీరాయి వచ్చిన ఆ పది రోజులు పండుగలా ఉండేది ఇల్లంతా.. తాను తెచ్చిన, పంపించిన డబ్బుతో గుడిసె పీకించి ఈ మధ్యే చిన్న పెంకుటిల్లు కట్టించారు వీరాయి. పెద్ద తమ్ముడు కూడా ''నేనూ నీతోనే సైన్యంలో చేరతా అన్నా'' అని అంటే ''అలాగేరా మంచిది చేరుదుగానీ'' అంటాడు వీరాయి నవ్వుతూ. ఆ సమయం అతగాడి అంతరాంతరాల్లో మాత్రం ''నువ్వు నిండు నూరేళ్ళు బ్రతకాలిరా తమ్ముడూ'' అని నిట్టూర్పు రేగి చప్పున చల్లారిపోతుంది. రోశయ్య, చంద్రమ్మ కొడుకుని చూసుకొని గర్వపడని క్షణంలేదు. ''నా తండ్రి ఎక్కివచ్చాడు. మాకింకా దిగులుల్లేదు అనుకుంటారు. తల్లిదండ్రులు అందరూ నిద్ర పోయాకా అర్ధరాత్రి ఒక్కసారిగా అలా ఆకాశంకేసి చూస్తుంటాడు వీరాయి. ఆ సమయంలో అతగాడి మనసులో చిత్ర విచిత్రాలైన భావ పరంపరలు మొదలైయ్యాయి. ''నా వాళ్ళంతా హాయిగా వున్నారు. కడుపు నిండా తిండి, ఒంటినిండా బట్ట, కంటినిండా నిద్ర ఇవ్వగలిగాను. చాలు నాతల్లి, తండ్రి తోబుట్టువులకు నా ఋణం తీర్చుకుంటున్నాను. ఇదెంత హాయిగా వుంది! ఈ సంతోషం, ఈ సంతృప్తి ముందు మరణ మన్నది ఎంత? చస్తే మాత్రం ఏం?''.

ఆ సంతృప్తితో గుండెలపై చెయ్యి వేసుకొని హాయిగా నిద్రపోతాడు. తర్వాత మూడో రోజుకి కమాండర్ దగ్గర నుంచి యుద్ధం ప్రారంభం కాబోతుంది అని ఉన్న పళాన రాయాలని టెలిగ్రాం వచ్చింది. దిగులుపడిన చంద్రమ్మకు ధైర్యం చెప్పాడు. తండ్రికి కన్నీళ్ళతో వీడ్కోలు చెప్పాడు. తర్వాత నవ్వుతూ రైలు ఎక్కాడు.

మళ్ళీ తిరిగిరాలేదు.

యుద్ధం ముగిసింది. చాలామంది మిలట్రీ ఆఫీసర్లకు, పైలట్లకు, నౌకా దళాధిపతులకు, బ్రతికి ఉన్న వాళ్ళకు, చనిపోయినవారికి వారు ప్రదర్శించిన ధైర్య సాహసాలకు గుర్తింపుగా పతాకాలు అందజేయబడుతున్నాయి. ఆ రోజు అంతా దేశమంతటా చనిపోయిన వీర జవానులకు శ్రద్ధాంజలి సమర్పించే సభలు జరుగుతున్నాయి. ఆ సభలో సుధీర్ పేరుతో సైనిక కుటుంబాల సహాయార్థం నిధి వసూలు చేస్తాననీ, మొదటి విరాళంగా వెయ్యి రూపాయిలు ఇస్తానని ప్రకటించాడు.

పద్మజారావు కూడా అవే సభలకు హాజరైంది. అధ్యక్షోపన్యాసం అయ్యేంతవరకూ అలసటగా ఉన్న పద్మజారావు కుర్చీలో వెనక్కు తలదాల్చి విశ్రాంతి తీసుకొంది.

ముందు రోజు ఆమె చాలా శ్రమపడింది. రోశయ్య, చంద్రమ్మల ఇంటికి స్వయంగా కారులో వెళ్ళింది. ఇద్దరినీ చాలా వివరాలు అడిగి తెలుసుకుంది. వీరాయి పుట్టిన తేది కూడా వాళ్ళకి తెలియదు. వాళ్ళిద్దరూ ఏడుస్తూ చనిపోయిన తమ కొడుకుని వర్ణిస్తుంటే జాగ్రత్తగా అతడి ఆకారాన్ని మనసులో గుర్తుంచుకొంది. చంద్రమ్మ పేరు, సైన్యంలో చేరటానికి వెళ్ళేముందు ఆ తల్లీ కొడుకుల సంభాషణ అంతా జాగ్రత్తగా ఏకసంధాగ్రాహిలా మనసులోనే నోట్ చేసుకుంది.

ఇంటికి వచ్చాక... చరిత్ర పుటలో మరుగుపడి ఉన్న వీరమాతల పేర్లూ, మరికొన్ని పిట్టకథలూ అన్ని క్రోడీకరించుకుంది. రాత్రంతా కూర్చొని చాలా భావోద్వేగమైన ప్రసంగాన్ని తయారు చేసుకొంది. పాయింట్లు నోట్ చేసుకుంది. తెల్లారుజామున ఒక్కసారి మనసులోనే

రిహార్సల్స్ వేసుకుంటుంటే, మెలకువ వచ్చిన రావుగారు ఆశ్చర్యంగా భార్యకేసి చూశారు. ఇంకా నిద్రపోలేదా పద్మా?" అన్నారు. కంగారుగా "లేదు అండీ! స్పీచ్ ప్రిపేర్ చేసుకున్నాను" అని ఆవలిస్తూ చెప్పింది పద్మజారావ్. "ఆయన నిద్రమత్తులో "అబ్బా! ఏదో నాలుగు ముక్కలు చెబితే పోయేదానికి, ఇంతగా హైరానాపడాలా?" అన్నారు. "లేదు అండీ! నాలుగు ముక్కలు యెవరైనా?" చెబుతారు. నా ప్రసంగం భావోద్వేగంగా అందరిని ఆకర్షించుకునేలా ఉండాలి. ఇలాంటి అవకాశం ఎప్పుడో గానీ రాదు. పత్రికా విలేఖరులు కూడా చాలామంది వస్తారని విన్నాను" అలసట పారద్రోలటానికి ఒక కప్పు టీ తాగి తెల్లవార బోతుండగా పడుకొంది. అందువలనే సభ సమయంలో నిద్ర ముంచుకొస్తుంది. ఈ రెండు గంటలు కాస్త ఓపికపడితే ఇంటికి వెళ్ళి హాయిగా నిద్రపోవాలి. కళ్ళు మూసుకొని అనుకుంటుందామె.

"శ్రీమతి పద్మజారావ్ మాట్లాడతారు" అని అధ్యక్షుని గొంతు వినిపించింది. పద్మజారావు మెల్లగా లేచి మైకు ముందుకు వచ్చింది. ఆమెలో ఉన్న సహజమైన అలసట, ఆ సన్నివేశంలో ఆమె ముఖంలో శోకరసాన్ని కూడా ప్రతిబింబించేలా చేసింది.

"మన వీరాయి..... వీరారావు..... సైన్యంలో చేరిన మరునాడు నా దగ్గరికి వచ్చి "అమ్మగారూ! ఇలా చేరాను" అని చెప్పినప్పుడు నేను భుజం తట్టాను. ఈ గడ్డమీద పుట్టిన ఆ బిడ్డ గొప్పవాడవుతాడనీ, దేశాన్ని రక్షించి పవిత్ర కార్యక్రమంలో తను అమరుడౌతాడనీ ఏనాడు నేను కలలో కూడా అనుకోలేదు. తల్లిగాని నాకే ఈనాడు గుండె పగిలిపోతుంది. మరి చిన్న దెబ్బ తగిలితే అమ్మ తల్లడిల్లి పోతుంది. అలాంటిది యుద్ధంలో మరణిస్తాడని తెలిసి కూడా తన బిడ్డని సైన్యంలో సేవ చేయడానికి పంపిస్తున్న తల్లికి సెల్యూట్. మరి తల్లి చంద్రమ్మ ఎలా భరిస్తుందో ఈ రంపపు కోత! అయితే ఆమె వీరమాత. జిజియాబాయి లాంటి మహాతల్లి ఆ తల్లికన్న ఈ బిడ్డ మన జిల్లాకే కాదు. రాష్ట్రానికి ఒక మణిపూస. నా కొడుకు సుధీర్ చేరతా నన్నాడు. తీరా ఆ రాత్రి వాళ్ళ నాన్నగారికి భాగోలేదు అని తెలిసి ఫారిన్ వెళ్ళాల్సి వచ్చింది. వచ్చాక ప్రజాసేవ చేసి తీరాలంటూ పెద్దలు పట్టుపట్టారు. అందుచేత మా సుధీర్‌కు "రణధీర్" అయ్యే అవకాశం లేకపోయింది. నాకు వీరమాత అనిపించుకొనే అర్హత లేకపోయింది.

"ఆ గౌరవం ఆ అర్హత శ్రీమతి చంద్రమ్మకు దక్కాయి. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అన్నారు పెద్దలు. జన్మభూమి ఋణం తీర్చుకున్న వీరరావు అజరుడు, అమరుడు".

ఇలా గంగా ప్రవాహంలో గంటసేపు సాగిందామె ఉపన్యాసం. మధ్య మధ్యలో వీరారావుతో తన సాన్ని హిత్యం, సంభాషణలు, నిన్న రాత్రి అందంగా ఊహలతో తయారు చేసుకున్నవన్నీ సమయోచితంగా ఉదహరించింది. ఆమె ఇచ్చిన ప్రసంగానికి జనం చాలా ఆకర్షితులైయ్యారు. ఆ తర్వాత చాలా మంది పెద్దలు వీరారావును పొగిడారు. చివరిగా చంద్రమ్మను వేదిక మీదకి పిలిచి వెయ్యి రూపాయల చెక్కును అందించారు.

ఆ రాత్రి.... అర్ధరాత్రి.... గాఢాంధకారం.

సుధీర్ వాళ్ళ భార్యతో సంతోషంగా ఉన్నాడు.

ఆ చిమ్మ చీకటిలో ఆ చిన్న పెంకుటింట్లో రోశయ్య నులక మంచంమీద కాళ్లు కిందకు వేసి కూర్చుని వున్నాడు. అతగాడి కాళ్ళమీద తలపెట్టి చంద్రమ్మ ఏడుస్తోంది. ఆమె వెచ్చటి కన్నీళ్ళు అతగాడి మోకాళ్ళ మీద బరువుగా పడుతున్నాయి. అతగాడి రాతిలాంటి ఛాతీ కరిగి నీరౌతుంది.

"చంద్రీ! ఈ ఇల్లు వాడే కట్టించాడు కదే. మన కడుపున పుట్టె, మన గుడిసెలో పుట్టి మన బిడ్డ ఎంతో గొప్పవాడైయ్యాడో చూశావా? పెద్ద పెద్దోళ్ళంతా వాడిని ఎలా మెచ్చుకున్నారో చూశావా? ఎంత పుణ్యం చేసుకున్నామో, అంత పాపమా చేసుకున్నాం. మనోడు మనకు దక్కలేదు" అన్నాడు రోశయ్య.

అతగాడి కంఠస్వరం పూడుకుపోయింది.

చంద్రమ్మ వెక్కిళ్లు పెడుతూ అంది. "ఆ పెద్దోల్లు

అన్న మాటలేవి నాకు అర్థం కాలేదు కానీ .... నా బిడ్డ బతికిన నాలుగు రోజులు మన ఋణం తీర్చుకున్నారు. చనిపోయిన తర్వాత కూడా 1000 రూపాయిలు ఒక సంవత్సరం తిండి మన కోసం ఇచ్చిపోయాడు'' అంటూ ఆమె గుండె ఎగసి ఎగసి పడుతుంది. ఆమె మాతృప్రేమ వరదలై పారుతోంది.

దేశం అంటే ఏమిటో, దేశభక్తి అంటే ఏమిటో అప్పటి క్షణం వరకు ఆమెకు తెలియలేదు. తెలిసిందల్లా ఆకలీ, దానిక్రింద కప్పివేయబడి ఉన్న మాతృప్రేమ మమత, ఆ క్షణంలో ఆకలి పారతొలగి మమత ఒక్కటే దహించి వేస్తోంది.

తరువాత రోశయ్య ''ఏడవడానికి ఇది సమయం కాదు. మనం సంతోషించాలి'' చంద్రీ! మన బాబు, మన దేశపు భూత, వర్తమాన, భవిష్యత్తులను నరకాలని వచ్చిన రాక్షసుల్ని ఎదిరించిన వేలాది వీరుల్లో ఒక్కడయ్యాడు. అలాంటి వీరుణ్ణి కన్న తల్లిదండ్రులుగా మనం గర్వించాలి చంద్రీ! మన బిడ్డ, మన జన్మభూమి చరిత్రలో భాగం అయ్యాడు అంటూ ఇద్దరూ నిద్రపోయారు.

ఇందులో దేశం మనకేం చేస్తుందా అన్నది కాదు. మనం దేశానికేం చేయగలం అని ప్రశ్నించుకోవాలి అన్న సూక్తికి దేశభక్తులు ఆదర్శంగా గ్రహించాలి.

దేశభక్తితో మాతృభూమి కోసం తమ ధన, మాన ప్రాణాలను త్యాగం చేసిన ఎందరో మహానుభావులకు జైహింద్.

❖❖❖

బలభద్ర పాత్రుని రమణి - చీకటి నుండి వెలుగు వైపు

- పి. శృతి, బి.కాం. రెండవ సంవత్సరం, శ్రీకన్యకాపరమేశ్వరీ మహిళా కళాశాల, చెన్నై.

తాతయ్య ఆ రోజు అరుగుమీద కూర్చుని జపం చేసుకొని స్నానం చేసి పెట్లోంచి కొత్త ధోవతి తీసి కట్టుకున్నాడు. కాశీ తవ్వాలు బదులు పైన చొక్కా వేశాడు.

"విశాలక్షీ....." అంటూ వంటింటి గుమ్మంలో నిలబడి కేకేశాడు. అమ్మ కొంగు నిండా కప్పుకుంటూ బయటకొచ్చి కాఫీ ఇచ్చి "మామయ్యా" ఈ రోజు మన సౌభాగ్యాన్ని బడిలో చేర్చాలి అని చెప్పారుగా.

"అవును అమ్మ నిన్ననే హెడ్ మాస్టర్‌గారితో మాట్లాడాను. ఈ రోజు ఉదయం 10 గంటలకు రమ్మన్నారు" అని తాతయ్య అమ్మతో చెప్పారు.

అమ్మ నన్ను త్వరగా వెళ్ళి రెడీ అవ్వమని చెప్పింది. నేను వెళ్ళి వోని మార్చుకొని తాతయ్యతో కలిసి వెళ్ళాను. మధ్యాహ్నం నేను తాతయ్య ఇంటికి వచ్చే సరికి అమ్మ ఎవ్వరో తిన్న కంచం కడుగుతుంది.

"విశాలక్షీ....." తాతయ్య పిలిచాడు.

అమ్మ చేయి కడుక్కుని వస్తూ "గోపన్న అని" మీ ఇంట్లో పని చేసేవాడట. వాళ్ళ అబ్బాయి వచ్చి వెళ్ళాడు" అంది.

తాతయ్య చెక్క కుర్చీలో కూలబడుతూ "నారాయణ? వచ్చి వెళ్ళాడా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవునా బాగా కష్టాల్లో వున్నట్టున్నాడు పాపం చిరిగిన బట్టలతో వచ్చాడు. అయ్యగారు లేరా ఒక్కసారి చూడాలి అన్నాడు. నేను ఇప్పుడే బయటికి వెళ్ళారు" అని చెప్పాను.

"ఆకలేస్తోంది అని నోరు తెరచి అడిగాడు అన్నం పెట్టాను ఇప్పుడే ఆర్జంటు పని వుందంటూ వెళ్ళాడు! అంది అమ్మ.

తాతయ్య బాధగా "వాడ్ని ఈ చేతుల్తోనే పెంచాను. స్కూల్ ఫైనల్ దాకా చదివించాను. కాలేజిలో తండ్రి చేర్పించనంటే నా దగ్గరకు వచ్చి ఏడ్చాడు. మీ అత్తగారు నన్ను లోపలికి పిలిచి వెండి కంచం ఇచ్చి తాకట్టు పెట్టి వాడికిమ్మంది. నిక్షేపంగా చదువుతున్నవాడల్లా హఠాత్తుగా ఏవో ఉద్యమలంటూ చదువు ఆపేసి అడవుల్లోకి వెళ్ళిపోయాడు. ఇక మళ్ళీ కనిపించలేదు. వీడి బెంగతోనే గోపన్న కన్నుమూశాడు. మా రామం. వీడూ ఒక్క ప్రాణంలా మెసిలేవారు! బాగుపడాల్సినవాడు. ఇలా పాడయిపోయాడు. జీవితం నాశనం చేసుకున్నాడు"! అని తలపట్టుకున్నారు.

"అయ్యగారు" అన్న పిలుపుకి అందరం గుమ్మం వైపు చూశాం. "ఒరే నారిగా తాతయ్య లేచి ఆప్యాయంగా అతని చేతిని పట్టుకున్నారు.

నారాయణ కళ్ళ నిండా నీళ్ళు పెట్టుకొని తాతయ్య కాళ్ళ మీద పడ్డాడు. ఏంటి రా ఇది ఇలా ఉన్నావు. ఏవో ఉద్యమాలు అంటూ అడవులోకి వెళ్ళావు. మళ్ళీ కనపడడం లేదు. జీవితం పాడు చేసుకున్నావు. బుద్ధిగా చదువుకొని ఉంటే బాగుపడే వాడివని తాతయ్య చాలా కోపంగా అన్నారు.

నిజం మీరు చెప్పిండి బాగా చదువుకొని ఉంటే మంచి ఉద్యోగం వచ్చేది. నేను నా కుటుంబం సంతోషంగా ఉండే వాళ్ళం. ఈ భూమి మీద పుట్టిన ప్రతి ఒక్కరు అలానే తను తన కుటుంబం అని ఉన్నారు. నేను అలానే చేస్తే చివరికి నా జీవితంలో మిగిలేది పుట్టడం, బ్రతకడం, చావు అంతే. అప్పుడు నా జీవితానికి అర్థం ఏముంది. ఎక్కడ లేని విధంగా మనం మాత్రం భూదేవిని మన భారతమాతని మాతృమూర్తి, జన్మభూమి అని మన తల్లికి ఇచ్చే గౌరవం ఈ భూమి పైన పుట్టినందుకు గర్వంగా చెప్పుకుంటాం. అలాంటిది ఒక మనిషిగా పుట్టినా దేశానికి ఋణం తీర్చుకోవాలిగా అప్పుడే నా జన్మకి పూర్తి అర్థం ఉంటుంది.

ఆ మాటలు విన్న తాతయ్యకి కోపం వచ్చి ఈ భూమి మీద ఏంతో మంది ఉండగా ఎవరికి లేని బాధ్యత నీకు మాత్రం ఎందుకు అని ఆయన పైన అరిచారు. అవును అయ్యా ఈ భూమి పైన చాలా మంది ఉన్నారు. వాళ్ళు ఎవరు కూడా నాలాగా అనుకోరు. అలానే అందరు అనుకుంటే ఇక మనకి స్వాతంత్ర వచ్చేదా. గాంధీ లాంటి ఏంతో మంది మహానుభావులు మనకోసం వాళ్ళ ప్రాణాలను కూడా అర్పించారు. మనిషిగా పుట్టడం గొప్ప వరం అంటారు. అలాంటిది మనిషికి జన్మనిచ్చిన దేశానికి రుణం తీర్చుకోవాలి.

కన్న తల్లి తొమ్మిది నెలలు తన కడుపులో మోస్తుంది. కాని నా మాతృభూమి నేను నా తల్లి గర్భం నుంచి బయటికి వచ్చిన క్షణం నుంచి నన్ను మోస్తుంది. చివరికి నేను ప్రాణాలు వదిలాకా కూడా నన్ను తన గర్భంలో దాచుకుంటుంది. అనాడు గాంధీ లాంటివాళ్ళు బయట దేశం వారితో పోరాటాలు చేశారు. కాని మేము ఇప్పుడు మన దేశంలో పుట్టి ఒకే తల్లి అయిన ఈ భూమిపైన ఉంటూ ఉన్నవాడు లేనివాణ్ని బలవంతుడు బాల హీనుల్ని, వాడి కష్టాల్ని దోచుకుంటున్నాడు. అలాంటి మనిషి రూపంలో పుట్టి జంతువులుగా ఉన్న మనుషుల పైన మా పోరాటం. ఒక తల్లి కడుపులో పుడితేనే అన్న దమ్ములు అంటే భూమి మీద ఉన్న మనమందరం ఒకరికిఒకరు కలసిమెలసి ఉండాలి. ఇటుగా ఇటుగా చేరిస్తేనే ఇల్లు కడుతామన్నట్లు అలానే అందరు కలిస్తేనే మంచి జరుగుతుంది. ఒక దేశభక్తునిగా నా దేశం పైన ఉన్న దేశభక్తిని చాటుకుంటున్నాను'' అని నారాయణ గారు చెప్పారు.

ఆ మాటలు విన్న తాతయ్య నారాయణ చేతులు పట్టుకొని ''నీకు ఉన్న దేశభక్తి నాకు ఇంత వయస్సు వచ్చినా రాలేదు అని సిగ్గు పడుతున్నాను. నువ్వు ఒక దేశభక్తుడివిరా. చీకటి లోకం లాంటి ఈ లోకంలో నుంచి బయటికి వచ్చి మనిషిగా దేశభక్తునిగా మారావు. అందరు నిన్ను ఆదర్శంగా తీసుకోవాలి.

❖❖❖

August 2022

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Arts, Literary, Culture & Language Study
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1
Journal under Arts and Humanities Category

తెలుగు సాహిత్యం - దేశభక్తి

అంతర్జాల అంతర్జాతీయ సదస్సు తేదీలు: 4, 5 & 6 ఆగష్టు 2022



శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల

SKPC
ESTD. 1999
ISO 9001 : 2015
NAAC
Accredited

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.